
ఉపనిషత్తులు

# ఈశావాస్య ఉపనిషత్



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
శంకరాచార్య మధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓం నమో భగవతే శ్రీరమణాయ - శ్రీభారతీ దేవ్యైనమః

# ఈశావాస్యోపనిషత్తు

ఆంధ్ర-పద్యానువాద, పదవిభాగ, ప్రతిపదార్థ, తాత్పర్య,
త్రిమత సంబంధి-వివిధ-భాష్యార్థ, తద్విమర్శన సమ్మిశ్రిత,
స్వాభిప్రాయ, సమన్వితము.

★


సాహిత్య-విద్యాప్రవీణ, ఉభయభాషాప్రవీణ,
క వి శే ఖ ర
పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి
శ్రీ మహారాజ సంస్కృత కళాశాలా పండితుఁడు
విజయనగరము.

ఓం నమో భగవతే శ్రీరమణాయ.

## : ఈశోపనిషత్ కృతి ప్రచురణకర్తృ వం[illegible]క్రమణిక :

"శృంగవరంపుకోట"విలసిల్లు, మనోజ్ఞ "విశాఖ"శృంగికిన్
శృంగమవంగ; అందుఁబ్రవహించును "గోస్తని"-గోస్తనీ అనత్
స్వాంగ-పయస్తరంగ-నది; తత్తటమందు వెలుంగు గ్రామపం
క్తిం గుణవిద్ధమై, "విజినిగి"ర్యభిఖం బెసఁగున్ ప్రసిద్ధమై॥

శ్రీమద్వాజసనేయులై సితయజుర్వేదీయులౌ కాణ్వులా
గ్రామంబందు-అనంత,బాణ,శశి (150) సంఖ్యాప్రాంతవర్షంబులన్
ప్రాముఖ్యంబు గడించి భాసిలిరి "రావ"ర్త్యన్వయుల్, వారిలో
ధీమంతుండగు "కన్నయార్యుఁడు" సముద్దీపించె విఖ్యాతుఁడై॥

ఆకన్నయ్యకు ఏకపుత్త్రుఁడగు "పేరప్పాఖ్యు"ఁడౌ "పంతులు"
ర్వీకల్యాణపథానురక్తుఁడు, యశశ్శ్రీసక్తుఁ, డశ్రాంత ధ
ర్మైత్ర కాలంబనయుక్తుఁ, డక్షరపద వ్యాసక్తుఁడై, భక్తుఁడై,
లోకామోద విశేషపాత్రుఁడయి, వెల్గున్ నాటికిన్ నేటికిన్॥

శ్రీసింహాచల నికట ధ
రా సంస్థిత వేంకటాపురస్థ నృసింహో
ర్వీసురుఁడు-చేపె, సుతు, గుణ
రాశిని "దాకూరి"కులుని "రావర్తి" కులున్॥

రక్తిన్ దత్తకుమారునింబడసి "శ్రీరావర్తి పేరప్ప" సం
సక్తిన్ వానికి "రామమూర్తి"యను నామంబిచ్చి, చౌలాది వే
దోక్తంబుల్ నెరవేర్చ; నాబుడుత-సద్యోనీతి, విద్యా, కళా
యుక్తుండై-జనరంజకుండన సముద్ద్యోతించె హృద్యాత్ముఁడై॥

భాకలితుండు, "శ్రీపయిడివాడను"తోలేటి" వంశుఁడౌ గుణా
స్తోకుఁడు "పెద్దిరాజు", తనతో భుజియించుచు "బావగారు! నా
వాకను చిత్తగింపుఁడు భవత్ సుతమౌళికి "రామమూర్తికిన్"
జేకొని నాకొమార్తయగు "సీతమ"నీయఁదలంపు గల్గెడిన్॥

సీతారామయు, రామమూర్తియుననన్ జెల్వొందు ఈ బిడ్డలా
సీతారాములఁబోలి వర్తిల సమీక్షింపంగ మావాంఛ, నా
భీతిప్రీతి మహాద్భుతాత్ముఁడగుచున్ "పేరప్ప" బావా! భళీ!
నాతో హాస్యములాడఁగోరితివె యన్నన్ "పెద్దిరాజి"ట్లనున్॥

"ఇవి-హాస్యోక్తులుకావు వియ్యమునకీరీ వెంటనే సమ్మతిం
పవలెన్, శీఘ్రముగా వివాహము నొనర్పంబూని యున్నాను" నా
నవధానంబున కార్య నిశ్చయము పేరార్యుండొనర్చెన్, వివా
హవిధుల్ వర్తిలె పైడివాడ; ప్రియకల్యాణంబు తానాగునే?

పేరప్పంతులు-పెద్దిరాజుల హితుల్, విఖ్యాతులౌ నాయకుల్
శ్రీరామ ప్రభుభక్తియుక్తులు, కృతుల్, శ్రీగొత్తి పాట్యన్వయుల్
ధూరుల్ శ్రీపెదయెఱ్ఱునాయఁడును, శ్రీసూర్యాఖ్యుఁడౌ నాయఁడున్
శ్రీరాపర్తి కులంపుభూపతి ఋణార్తింబాపిరార్ద్రాత్ములై॥

శ్రద్ధాయుక్తి-పరీక్షలందు జయమున్ పందింప "సర్వేయరై"
ఉద్దైవంబు-విధుల్ఘటింపఁగ, రెవిన్యూశాఖ "విన్స్పెక్టరై"
పెద్దల్ మేలన పొచిపెంటఁ,బిదపన్ వేపాడ, వర్తిల్లుచున్
సద్దారాన్విత రామమూర్తి వెలసెన్ "సాక్షి స్వరూపం"బనన్॥

గణపతి కుంద్రశ్రీముల్ దొరకె; గౌరికి నాలయముల్ లభించె; నద్
గణనకు నెక్కుడౌచు మధు ధారలతావులు బావు లేర్పడెన్;
"గుణనిధి,రామమూర్తి,యనఘుండు","కృపానిధి-సీతమాంబ"అన్
ప్రణుతులు విస్తరిల్లె; విభవంబు, సుఖంబు, యశంబు, భాసిలెన్॥

సూనుల్ గల్గిరి వారికిద్దరు సుతేజుల్ -సూర్యనారాయణ
శ్రీనామున్ గొనె సీతమక్కయగు శ్రీచిట్టెమ్మ; జ్యేష్ఠున్, బహిః
ప్రాణంబైన తనూజకన్నయను -స్వప్రాణేశునిన్ బాసి, హా
తానాయమ్మ గతించె శ్రీకనక సీతారామ-దైవోద్ధతిన్॥

శ్రీముక్త్యాన్వయ భక్తరాడ్ "తిరుపతి" శ్రీమత్ కవిష్ఠాత్మజన్
సౌముఖ్య ప్రణయాబ్జకాంత, శివకాంతన్ గోరి పెండ్లాడి, వి
ద్యా, మాంగళ్య, సుపీతి, ధుర్యుఁడగు "కన్నార్యుండు" సల్లీలకుం
డై మర్యాద గడించె; ధర్మవిరతుండై సజ్జనుల్ మెచ్చఁగన్॥

"అజునటమంచి, వాణీ-జగదంబ, శ్రుతి, స్మృతి, సూక్తి, సత్కథా,
భజన, పురాణ, కావ్యముల, పాటల, నాటలఁ, బొద్దుపుచ్చుచున్
వాణీగిరిన్ వసించు; రసవిన్నయుఁడౌ, మనకన్నయార్యుఁడే
ట్టి జపమొనర్చెనో" అనిఘటింత్రు ప్రశంస, ప్రజల్, ప్రమోదులై॥

కమనీయంబని భోగమున్ గొనక, త్యాగంబూని లోకోప కా
రము నర్థించి-వరించి-వెల్వరిచె మా రాపర్తి కన్నయ్య-ధ
ర్మ మహోత్సాహ విశేషవంతుఁడు, రసాధ్రిస్వాంతుఁ, డాత్మీయమి
త్రము, "శ్రీవాజసనేయ"మౌ "ఉపనిషద్"రత్నమ్ము చిత్రమ్ముగన్॥

శ్రీ రాపర్తి కులంబు, తత్ప్రియహిత శ్రీగోత్తె పాట్యాన్వయాం
భోరాశిన్, జనిఁగన్న ధర్మనిధి, శ్రీ బుచ్చప్పరాయున్, పెద
ప్పారాయాదుల, కన్నయార్యుని, మమున్, భవ్యాయు, రారోగ్య,వి
ద్యా, రమ్యాత్మరవ ప్రసాదమున సర్వాత్ముండు రక్షించుతన్॥

# ఆ శీ స్సు

శ్రీశ్రీశ్రీ త్రివిక్రమ రామానంద భారతీ స్వామివారు
శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతి—కుర్తాళము.

వేద శిరోరత్నములగు_ఉపనిషత్తులు వేదాంతములని చెప్పఁబడును. అనఁగా తానెవరో చెప్పఁగలిగినవి ఉపనిషత్తులే. ఈశావాస్యోపనిషత్తు దశోపనిషత్తులలో ప్రప్రథమమున చెప్పఁబడినది. ఉపనిషత్తు-చిన్నదైనను గభీరమగు విజ్ఞాన సంపదచేతను, సర్వ విషయములను, సమగ్రమముగా సూచించుటచేతను, సర్వమతాచార్యులచేతను, పరమప్రమాణమగు శ్రుతి గ్రంథముగా పరిగణింపఁబడినది.

చిరంజీవి "కవిశేఖర" పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారు రచించిన వ్యాఖ్యతో కూడిన ఈ ఈశావాస్యోపనిషత్తును మేము పరిశీలించితిమి. వీరు దీనిని ఆంధ్రపద్యరూపమున అనువదించియున్నారు. ఆ అనువాదము మూలమునకించుకైన వేరుగాక మంత్రార్థమును స్పష్టీకరించుచూ స్వతంత్రరచన వలెనే యున్నది. మూలమంత్రములకు పదవిభాగ ప్రతిపదార్థ తాత్పర్యములను వెలయించుటచేత ఆంధ్రులకు ఉపనిషద్ అర్థజ్ఞానమును సులభముగా సంపాదించుకొనుటకు మంచి అవకాశమును కలుగఁజేయుచున్నది. శ్రీ శంకరభగవత్పాదుల భాష్యతాత్పర్యమును సముచితమగు శైలితో ఆంధ్రలోకమునకు విశదీకరించుట ప్రశంసార్హమై యున్నది.

"తత్త్వార్థప్రదర్శిని"యందు ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతాచార్యుల భాష్యార్థములను కూడ సులభశైలిలో ననువదించి అందలి పూర్వపక్ష సిద్ధాంతములను ప్రశ్నోత్తరరూపమున విశదీకరించుటవలన దర్శనవిశేషముల నెఱుగఁగోరిన చదువరులకెంతయో లాభదాయకముగ నుండును.

ఆయా మతములందుఁ గల సూక్ష్మభేదములను స్పష్టీకరించుచూ నిర్వచింపబడిన గ్రంథకర్తయొక్క స్వాభిప్రాయము ప్రశంసార్హము. కర్మజ్ఞాన సముచ్చయ వాదమును చక్కగ పరిష్కరించిరి. ఆంధ్రలోకమునకు సమర్పించిన ఈ గ్రంథములోని పోకడలు నూతనమనియే చెప్పవచ్చును. దీనికి శ్రీభారతీతీర్థ సంస్థవారు ఆంగ్లీకరణము గూడ చేయఁదలచుట ముదావహము.

ఈ గ్రంథమును అనువదించిన కృతికర్తకు, వెలయించిన ప్రచురణకర్తకు, ప్రోత్సహించిన మిత్రులకు ఇవియే నారాయణ స్మరణ పూర్వకములగు మా ఆశీస్సులు.

1—10—1953,
కుర్తాళము,
తిరునల్వేలి జిల్లా.

శ్రీ త్రివిక్రమ రామానంద భారతీస్వామి,
శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతి.

## పరిచయము

[వ్యాకరణ శిరోమణి, P. O. L. శ్రీమత్ కోయిలకందాడై వెంకట రామాచార్యులవారిచే ప్రసాదితము.]

బ్రహ్మశ్రీ పంతుల లక్ష్మీనారాయణ శాస్త్రిగారు శ్రీశ్రీశ్రీ విజయనగర మహారాజావారి సంస్కృత కళాశాలలోనే ఆంధ్ర గీర్వాణములను చక్కగా నభ్యసించిరి. వీరచట ప్రవేశించుటకు పూర్వమునుండియు నేనచట పండిత పదవిలో పనిచేయుచుండుట వలన వీరిని నాకు బాగుగా తెలియును. ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వీరికి విద్యాప్రవీణ, ఉభయ భాషాప్రవీణ, బిరుదముల నొసంగి గౌరవించినది.

శ్రీ శాస్త్రిగారి కవితాసామర్థ్యము మిక్కిలి ప్రశంసనీయము. "వర్డ్స్‌వర్తు" (Wordsworth) అను ఆంగ్లమహాకవి "అవితీర్ణకవి. సంవిహితకవి" అనువారిలో అవతీర్ణకవియే "కవి" అని వక్కాణించెను. శ్రీశాస్త్రిగారు అవతీర్ణకవియని చాలమంది తెలుపు నభిప్రాయముతో నేనతి సంతోషముగ నేకీభవించుచున్నాను.

శ్రీశాస్త్రిగారు చాలకాలమునుండియు తత్త్వజ్ఞానాభిలాషులై వేదాంతగ్రంథములను పరిశీలించుచున్నారు. దాని ఫలితముగ ప్రస్తుతము మతకర్తలందరును మూర్ధాభిషిక్తప్రమాణముగ నంగీకరించిన దశోపనిషత్తులలోను మొదటిదగు ఈశావాస్యోపనిషత్తుకు గల అన్ని వ్యాఖ్యానములను గూడ ఆంధ్రభాషలో నిర్దుష్టమగు రీతితో అందరికిని విశదమగునట్లు వ్రాసియున్నారు. ఈగ్రంథము నా కెంతయు ముదావహమైనది. ప్రకృత కాలపు తత్త్వజ్ఞానాభిలాషులలో మతపక్షపాతము లేనివారికి ఈగ్రంథమెంత ఉపకారకమో చెప్పశక్యము గాదు. అన్ని మతముల స్వరూపమును గూడ సులభముగ ప్రదర్శించుచున్న ఈ గ్రంథము వలన వాని స్వరూపమును ఆంధ్రపాఠకులు సుకరముగ తెలిసికొనఁగలరు. వీరికి శ్రద్ధ దినదినాభివృద్ధిగా నుండి ఉపనిషత్తులన్నింటికిని ఈ విధముగ ఆంధ్రానువాదమును ప్రదర్శించుటవలన లోకారాధనము చేయుటకై వీరు ఆయురారోగ్యైశ్వర్యములతో తులతూగ ననుగ్రహింపుమని శ్రియఃపతిని ప్రార్థించుచున్నాను.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

కోయిలకందాడై వేంకట రామాచార్యుడు,
P. O. L.
RETIRED, ప్రధాన సంస్కృతాధ్యాపకుడు,
శ్రీమహారాజ సంస్కృత కళాశాల, విజయనగరము.

23—9—1953,
వాణీ సద్మము,
విజయనగరము.

## ప్రశంస

నానాశాస్త్ర విదుత్తమోదిత సదానంద స్వరూపాను సం
ధానాధ్వమ్మును జూపుచున్ జగదసత్య బ్రహ్మసత్యత్వ సు
జ్ఞానోద్బోధకలైన వ్యాఖ్యల సమీక్షన్ తెల్గునం గూర్చు లక్ష్మీ
నారాయణశాస్త్రి పండితజనాళిః పాత్రుడై వెల్గుతన్।

శాంతము, సత్యమ్ము, సనా
ద్యంతమునగు వస్తువెదియొ అద్దానిని దా
సొంతముగఁ దెలిసి,-తెలిపిన
పంతుల వంశజుఁడు, సుకవి శ్లాఘ్యుఁడగుఁగదా!

వేద్యంబగు భాష్యత్రిఁయ
సద్యతనాంధ్రులకు, నాంధ్రమందుఁ దెలుపు-మా
విద్యాపరిపీఠుఁడాంధ్రుల
సద్యశమును బాటు కృతుల సమకూర్చు తటిః

విద్వత్కవి. ఆకుండి వెంకటశాస్త్రి,
Retired, ప్రధానాంధ్రాధ్యాపకులు
M. R. సంస్కృత కళాశాల,
విజయనగరము.

## పత్రికాభిప్రాయము

శ్రీ శ్రీ శ్రీ మలయాళ స్వాములవారు.
వ్యాసాశ్రమము.
ఏర్పేడు.

ఈశావాస్యోపనిషత్తు విషయమై ఇంత విస్తృతమైన గ్రంథమును ఇదివఱలో ఎవరున్నూ ప్రచురించియుండలేదు.

ద్వైతాద్వైత విశిష్టాద్వైత భాష్యములేగాక తదనుయాయు లగు వారి అభిప్రాయములు కూడ చాల గలవు. మూలమునకు సరియైన తెలుగు పద్యములు కూడా చేర్చియున్నారు.

"విద్యాంచావిద్యాంచ" అను మంత్రివాక్యములకు స్పష్టార్థము దీనియందు కనందగును.

విజయ, భాద్రపదము. యథార్థ భారతి.

ఓం నమోభగవతే రమణాయ

## కృతి సమీక్ష:

By Chevalier : కాండ్రేగుల సూర్యనారాయణమూర్తి
గౌ॥ కార్యదర్శి : ఆంధ్రభారతీ తీర్థ (A. R. U.)
విజయనగరము.

బ్రహ్మశ్రీ కవిశేఖర పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారు ఆత్మప్రేరణచే వేదాంత,యోగ దర్శన వ్యాసంగ మొనర్చిన ముఖ్యులలో నొకరు. శ్రీ విజయనగర మహారాజ సంస్కృత కళాశాల యందు విద్యనభ్యసించు దినములలోనే సాహిత్యము లన్నిటిలోను వేదాంతమే ముఖ్యమన్న విషయము గమనించిరి. కఠోపనిషత్తు, వేదాంతడిండిమము, అధ్యాత్మోపనిషత్తు, పైంగలోపనిషత్తు, అమృత నాదోపనిషత్తు, పద్య గద్య వివరణ సమన్వితముగ వెలువరించిరి. వీరు నాటినుండి నేటివరకు ఆత్మసాక్షాత్కారము కొరకు నిత్యమును ప్రయత్నించుచు బ్రహ్మసూత్రభాష్య వ్యాఖ్యాతలలో ముఖ్యులయిన "వాచస్పతి"భవ్యుల ప్రతిబింబించుకొనుచు స్వతంత్రముగ"భామతి"

అను కావ్యమును రచించి యున్నారు. దీనివలన వీరి జీవితము ప్రతిబింబించి నారేమో అనిపించును.

ఇట్టి పుణ్యపురుషుల స్నేహము ఆంధ్రభారతీతీర్థ సేవలో లక్ష్యమయి వారితోడి అనన్యమైత్రి ఏర్పడి వారియొద్ద ఉపనిషత్తులు వ్యాసంగ మొనర్చు అవకాశము కలిగినది. ప్రపంచ సారస్వతము లందు, ఆంగ్లేయ, ఫ్రెంచి, ఆంధ్రాది, భాషలలో ఉపనిషత్ సార సంగ్రహములు వెలువడినను, అయ్యవి మూలమాత్రమును- ప్రత్యేకమతదృష్టితోఁగూడిన స్వాభిప్రాయములతో వెలువరించినవి మాత్రమే కాని, ప్రాచీన ప్రామాణిక వివిధమత భాష్య వ్యాఖ్య లను క్రోడీకరించి నిష్పాక్షికముగా విమర్శించి, ఏకత్వమును వైలక్షణ్యమును, ప్రదర్శించుచు స్వాభిప్రాయమును ప్రదర్శించినవి కావు.

సర్వప్రపంచమునకు సంబంధించిన విశాలమగు పూర్ణమైన భారతీయ ఉపనిషద్ విజ్ఞానమునందు పాశ్చాత్యులకు గల అత్యా సక్తిని, వారి కృతులగు Viz. La Vajasaneyopanishad La Mandukya-Upanishad-Collana Di studi orientali A Cura Di E. G. Carpani–of Bologna (Italia) మొదలగునవి చూపి-అట్టి సంపూర్ణ విజ్ఞాన సాధన-శ్రీ భారతీతీర్థ మూలమున సంఘటింపవలసిన ఆవశ్యకతను కృతి కర్తలకు తెలిపి యుంటిని. ఈయభిప్రాయము నామోదించి వీరు ఈగ్రంథమందు 1. శాంకరభాష్యము, 2. ఆనందగిరిటీక, 3. ఉవటాచార్యభాష్యము 4. బ్రహ్మానందకృత-ఈశావాస్య రహస్యమను పద్య వివరణము, 5. శంకరానందకృత "ఈశావాస్యదీపిక", 6. రామచంద్ర పండిత కృత "ఈశావాస్య రహస్యవివృతి", 7. ఆనందభట్టోపాధ్యాయకృత "ఈశావాస్య భాష్యము" 8. అనంతాచార్య కృతభాష్యము, 9, ఆత్మ పురాణము, 10. అద్వైతానందతీర్థ విరచిత అద్వైతానందలహరి, అను అద్వైత దర్శనములను, 1. శ్రీవేదాంతదేశిక, 2 కూర

నారాయణముని 3. శ్రీరంగాచార్య భాష్యములను విశిష్టాద్వైత దర్శనములను; 1. శ్రీ మధ్వాచార్య, 2. జయతీర్థభిక్షు, 3. రఘునాథ తీర్థ భాష్యములను ద్వైత దర్శనములను, క్రోడీకరించి విస్పష్టికముగ విమర్శించుచు ఏకత్వ వైలక్షణ్యములను (Comparative and Critical Study) ప్రదర్శించి స్వాభిప్రాయము నొసంగియున్నారు. కావున ఈ రచనయందు అపూర్వమగు విశిష్టత కలదనుట అతిశయోక్తి కానేరదు.

శ్రీ జగద్గురు కుర్తాళ పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ 108 త్రివిక్రమ రామానంద భారతీ స్వాములవారు ఈసత్ప్రయత్నమును ఆమోదించి, ఆశీర్వదించి యున్నారు. విశాల ప్రపంచమున కత్యావశ్యకమగు ఈ విశిష్ట విజ్ఞానము అంతర్జాతీయమగు నాంగ్లేయభాషయందు కూడ వెలువరచుట ముఖ్యమను నభిప్రాయమున ఆంధ్రమునందు రచింపబడిన దీనిని ఆంగ్లభాషయందు అనువదింపఁదలచి,ప్రారంభించి కారణాంతరములవలన దీనితోపాటు వెలువరింపఁజాలనైతిని. ప్రియమిత్రులు శ్రీరామభక్తులు శ్రీ రాఘర్తి కన్నయ్యవంతులుగారు, ఈ ఆంధ్రీకరణమును వెలువరించుట కుత్సహించి, ఇట్లు ప్రచురించుట నా కెంతయు ముదావహమయినది.

"సత్సఙ్గత్వే నిస్సఙ్గత్వమ్" అనుసూక్తి ననుసరించి విజ్ఞుల సాంగత్య వాసనచేత, కించిద్జ్ఞుడనయినను ఈ సమీక్షకు సాహసించి కృతికర్తల నిరూపణ సరణివించుక ప్రదర్శింతును.

"సూక్ష్మమగు దేవతామూర్తి నుపాసించువారు శాంకరాభిప్రాయమున విద్యోపాసకులయి యున్నారు. (పేజీ 92—93) "అంధంతమః" (పేజీ 159).

ఈశావాస్యమిదంసర్వమ్ అను ఇందలి ప్రథమమంత్రము నందుగల విజ్ఞాన రూపుడగు అనుభూతిగల బ్రహ్మవేత్త కుపాస్య

యగు దేవతలేదు. శాంకర మతమున విద్యోపాసకులు వివిధము లగు సిద్ధులను, విరాట్పురుషాదుల లోకములను అధిగమించువారు మాత్రమే అగుచున్నారు. విశ్వాపదమునకు బ్రహ్మవిద్యయే అర్థముగా చెప్పఁబడినను అవిద్యోపాసకులు కూడ నాయా పవిత్ర లోకములే పొందువారయి యున్నారు" ఈ విధమున నీకృతియందు ఆయా మంత్రార్థముల నిర్వచించు దర్శనములకుఁగల ఏకత్వవైలక్షణ్యములు నిరూపింపఁబడినవి.

159వ పేజీలో నీవిషయమున కృతికర్త స్వాభిప్రాయము విశ్లేషించి యున్నారు:-"ఉపాసకుడు-ఉపాస్యము-ఉపాసనము........ ..........అనుభూతియేయగు నాత్మకు ప్రార్థింపదగిన వస్తువు లేదు" ఆత్మశబ్దము ప్రత్యగాత్మను పరమాత్మను గూడ బోధించు నను నంశమును వ్యాఖ్యాతలందరు నంగీకరింతురు. కావున ఈశావాస్యములోని 8వ మంత్రమును 78వ పేజీలో"అతండాత్మ స్వయంభువై..........నిత్యవర్షముల కర్థంబుల్ సమర్పించెడిన్" అని పద్యరూపముగ చెప్పుచూ 86వ పేజీలో ఆత్మశబ్దము ప్రత్యగాత్మను-పరమాత్మనుగూడ బోధించునను నంశమును వ్యాఖ్యాతలందఱును గూడ నంగీకరింతురు. కావున "ఇందు తెలుపఁబడినది ఆత్మ లక్షణము" అను నంత మాత్రమునే చెప్పివిరమింతును అని సమన్వయించుట కృతికర్తనైపుణ్యమును ప్రదర్శించుచున్నది.

"హిరణ్మయేన" అను 15వ మంత్రమునుండి"అగ్నేనయ" అను 18 వరకునుగల మంత్రములు మార్గయాచనము నొనర్చు ప్రార్థన మంత్రములను నంశమును వ్యాఖ్యాతలందఱు నంగీకరించి యున్నారు. కాని ఈ గమ్యము శంకరమతమున ప్రధాన గమ్యము కాకున్నను క్రమముక్తికి హేతువగును. తదితర దర్శనములందు సాలోక్యాది రూపమగు ఈగమ్యము ప్రధానమే యగును. ఉపాసకులగు భక్తులు మరణకాలమునందు మీది మంత్రములైదింటిని అర్థ

యుక్తములుగా భావించి, ధ్యానింపవలయును. (పే158, 159లు). ఫలాభిసంధి రహితమగు కర్మయొక్కయు, ఈశావాస్యజ్ఞానము యొక్కయు సముచ్చయముకూడ, శాంకర దర్శనమునకు భిన్నము కాదను సంశమును నిరూపించి యున్నారు. (పే 37, 38, 39 లు) ఈ యంశము పాఠకులు ముఖ్యముగా పరిశీలింపఁగోరెదను.

ఈ సందర్భమున భగవాన్ శ్రీ రమణమహర్షుల వారి "ఉన్నది నలువది"లో 11వ సంఖ్యగల

శ్లో॥ బోద్ధారమాత్మాన మజానతో యో
బోధః సకింస్యాత్పర మార్థ బోధః?
బోధస్య బోధ్యస్యచ సంశ్రియం స్వం
విజానత స్తద్ద్వితయం వినశ్యేత్॥ (గణపతి మునికృతము)

తే॥గీ॥ ఎఱుఁగు తన్నెఱుఁగ కితరమెఱుఁగు జ్ఞాన
మెఱుగమిని జేఁనేగావి, యెఱుకయగునె?
జ్ఞాన తదితరములకను స్థానమైన
తన్నెఱుంగగ నవి రెండు తామె పోవు॥

అను శ్లోకము, అనువాదము-ఈసందర్భమున స్మరణీయము :—

ఇట్లు ఈశ్వరాత్మయగు బ్రహ్మమును ఆత్మయందు తెలిసి కొనుటకన్న కర్తవ్యమన్యములేదు. "Know thyself అను Biblical సూక్తి కూడ సనాతన మతధర్మమునే అవలంబించినది. మిత్రులు శ్రీశాస్త్రిగారి పరిశ్రమను పొగడుట నాకిష్టములేదు. సత్వరమే ముఖ్యమగు దశోపనిషత్తులను, ఇటులనే వెలువరించెదరని నమ్ముచున్నాము. ఆంధ్రరాష్ట్రావతరణపు తొలిరోజులలో నిట్టి వేద సాహిత్యము ఆంధ్రములో వెలువరించుటచేత శ్రీ శాస్త్రిగారు ఆంధ్రలోకమునకు ఆంధ్రభాషకు మహోపకారము చేసిన వారైనారు.

ఆంగ్లభాషను భారతీయులందఱునుగూడ క్రమేణ విసర్జింప వలయుననుపాశ్చాత్యులభిప్రాయమును నేనంగీకరింపఁజాలను. కాని సంస్కృత జ్ఞానమునకును, జాతీయ భాషలకును ఈయవలసిన ప్రాముఖ్యప్రయత్నములు వెనుకఁబడవలయునని నా అభిప్రాయముకాదు. కనుక దీనికి ఆంగ్లానువాదమును, సర్వదర్శన శాఖాకార్యదర్శులు బ్రహ్మశ్రీ వసంతరావు బ్రహ్మజీరావుపంతులుగారి యొక్కయు, స్థానిక శాఖాధ్యక్షులు అం॥ సోమశేఖరరావుగారి యొక్కయు,సహాయముతో భారతీ కృప వలన త్వరలో వెలువరించి శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారి అమూల్యరచనను ఆంధ్రభాషయందు పరిచయము లేనివారికి కూడ నందీయగలనని విశ్వసించుచున్నాను.

ఈ గ్రంథము విశ్వవిద్యాలయములలో వేదాంతశాఖలో పఠనీయ గ్రంథముగ కూడ నుండిన విద్యార్థులకు విశాలమగు జీవిత ధర్మమును ప్రబోధించుచు భారతీయులకు సముజ్వలమగు భవిష్యత్తును నెలకొల్పునని నమ్ముచున్నాను.

ఇట్లు విధేయుడు,
కాండ్రేగుల సూర్యనారాయణమూర్తి.

ఓంనమో భగవతే శ్రీరమణాయ.

## సంక్షిప్త నివేదనము.

౧

అమూల్యమగు ఆశీర్వాణిని పవిత్రహృదయముతో ప్రసాదించిన, శ్రీసిద్ధేశ్వరీ పీఠాధిపతులు,పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ త్రివిక్రమ రామానంద భారతీ స్వాములవారికిని, పీఠికను ప్రసాదించిన సాహితీ సమితి-అధ్యక్షుల-సహృదయమహాశయులు స్వామి శివ శంకరులకును శ్రీ న్యాయమూర్తులు B. T. M. రాఘవాచారి గారికిని కృతజ్ఞతా పూర్వకములగు నమోవాకములు సమర్పింతును. మఱియు దీనిని పరిశీలించి విమర్శించిన గురు-బుధ-మిత్ర

మహాశయులకు వినమ్రమగు సాంజలిబంధమును ఘటింతును. ఏతద్ గ్రంథమును నిర్దుష్టముగా ముద్రించిన శ్రీ వేద వ్యాస ముద్రణాలయము నభినందింతును. ఏతద్ గ్రంథమునకు సంబంధించిన ప్రశంసలకు-ధీప్రేరకుఁడును, భారతీస్వరూపుఁడును అగు పరమేశ్వరుఁడే సమర్హుఁడు, కాని మూఢుఁడనగు నేనుకానని మనవిచేయుదును. ప్రియభక్త మిత్రవరేణ్యులు-శ్రీరాపర్తి కన్నయ్యా వంతులుగారి భక్తిగౌరవాదర విశేషమును, ప్రియ మిత్రులు మహాజరాశ్రీ కాండ్రేగుల సూర్యనారాయణమూర్తిగారి అభిమాన ప్రోత్సాహములను, విస్మరింపరానివని తలంతును.

గ్రంథరచనకు సంబంధించిన క్రిందివిషయములను ప్రియ పాఠకులు గుర్తింపఁగోరెదను.

ఇందు ఆనందగిరిటీకతోఁగూడిన శ్రీశంకర భగవత్పాద భాష్యమును, శ్రీ కూర నారాయణముని వ్యాఖ్యతోఁగూడిన శ్రీ వేదాంత దేశికాచార్య భాష్యమును, శ్రీ మధ్వాచార్యులగు ఆనంద తీర్థుల భాష్యమును, సమగ్రముగా ననువదింపఁబడినవి. తదితరము లగు తదనుయాయి మహాశయుల భాష్యములలోను వ్యాఖ్యలలోను, ఎచట వైచిత్రి విశేషములు గోచరించునో అచటి యభిప్రాయములు మాత్రమే-అవశ్యకమగు నంతవఱకును గ్రహింపఁబడినవి. స్వాభిప్రాయమునందు, మొదట-త్రిమతములందునుగల దర్శన భేదములు ప్రదర్శింపఁబడినవి. తరువాత-వానియందుఁగల ఏకత్వ-భిన్నత్వములు ప్రదర్శింపఁబడినవి. తదుపరి-స్వాభిమతము శ్రుతి ప్రమాణావిరుద్ధముగా నిరూపింపఁబడినది. తత్త్వజ్ఞులు నా పరిశ్రమయొక్క సాఫల్య వైఫల్యములను గుర్తించి తెలుపఁ గోరెదను.

ఈశోపనిషత్తునకు సంబంధించినవియు, ముఖ్యముగా తెలియఁదగినవియు, అగు విశేషములను ప్రదర్శించుట ఆవశ్యక మను తలంపున బృహదారణ్యక ఛాందోగ్యాదులగు నుపనిషత్తు లందున్న కర్మ-జ్ఞాననిష్ఠావిషయకములును, పంచాగ్ని విద్యాది విషయకములును, అగు సిద్ధాంతములను పరిశోధించి-తత్ఫలితము లగు విశేషములను పే 160, పే 183 టీలయందు రెండుపట్టికలుగా ప్రకటించి యున్నాను. ప్రియపాఠకులు వానిని ముఖ్యముగా పరిశీలింపఁగోరెదను. విజ్ఞులగు మహాశయులు-పరికించి-ఇందలి దోషములను దెలిసిన యెడల ద్వితీయ ముద్రణమున సవరించు కొందును.

ఈ గ్రంథమునిట్లు వెలువడునట్లు-అనుగ్రహించిన సద్గురు భగవంతుఁడు రమణమహర్షిని స్మరించుచు-క్రింది పద్యములతో ఈ నివేదనమును ముగించుచున్నాను.

వినిరి శ్రుతుల్ యతుల్ ఋషులు, వేదమహాక్షరమున్ లిఖింపఁగా
ననువగునయ్య! మీరును రతాత్మ యతాత్మ కృతాత్ములైతిరా
వినఁగల రిప్పుడున్, మనసువిప్పి గుహాంధతమోఽంతర ప్రకా
శసనవమున్ పురాణపురుషుంగని తర్కము విష్క్రమింపఁగన్॥

నాస్తికవాది నాస్తియగు, ఆస్తికుఁ డస్తిగ నుండు, సజ్జనుల్
నాస్తికదర్శనంబు విడనాడి, సుభక్తి-విరక్తి-యుక్తులై
ఆస్తిక దర్శనంబు నెది యైన వరించి, గ్రహించి, కాంచినన్
స్వస్తి గడింత్రు స్వస్థితి విరక్త విమోహ విశోక వృత్తులై॥

“మేవినే” నేనుగ నెఱింగి; నేనె బ్రహ్మ
మని తలంచుట పెద్దవేదాంత మగును
తానయిన ప్రత్యగాత్మగా “నేను” నెఱిఁగి
అది పరాత్మగఁ గనుట తత్త్వార్థ సరణి

"అణువౌ ప్రాణివి కా"వణీయ మగు ప్రత్యక్ష్మాత్మ", "వా నీవు-కారణ మాయా ప్రకృతి ప్రకల్పితచందద్బ్రహ్మాండమై యుండు-పూరణ కార్యేతరమైన నిశ్చల పరబ్రహ్మంబ"వంటున్న చిన్మణి-ఈశోపనిషత్తు,విన్నెఱుంగుమన్నా! దీని సాయంబునన్॥

నిత్యము గానిది దేహము
నిత్యుఁడు జీవుండు, తత్త్వనిష్ఠుఁడతండై
సత్యమ్మగు ప్రత్యక్కగు
ప్రత్యక్కగు నాత్మయును పరము నొకటె యగున్॥

ఆ పరాత్మయే యీశ్వరుఁ, డతఁడె ప్రత్య
గాత్మ, ఇదియెల్ల తన్మాత్ర మనెడి దర్శ
నమ్మె దర్శన,మది లేని నరుఁడు జడుఁడు
బ్రహ్మనిష్ఠుఁడె ధన్యుఁడీ ప్రకృతియందు॥

కర్మికి కర్మయు, విద్యా
కర్మసముచ్చయ,ము పాసక వరేణ్యునకున్
ధర్మములు; జ్ఞానికి ధర్మా
ధర్మమ్ములులే, వకర్తృతత్త్వము కమకన్॥

సత్తై తానె స్వరూప మిచ్చి ప్రకృతిన్ సన్మూర్తిఁ గావించియున్
చిత్తై తానె స్వదృష్టి నిచ్చి వికృతిన్ చిన్మూర్తి భావించియున్
ముత్తై తానె స్వతుష్టి నిచ్చి స్వకృతిన్ ముమ్మూర్తి సేవించియున్
తత్తై గాని పరంబు కాని పరమాత్మన్ స్వాత్మ దర్శింపుఁడీ॥

శ్రీ విజయనామ సంవత్సర
అశ్వయుజ శుద్ధ దశమి,
విజయనగరము.

ఇట్లు విద్వత్, సజ్జన, భక్తవిధేయుఁడు,
పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి,
శ్రీ కౌముది పరిషత్ సభ్యుఁడు,
ఆంధ్రభారతీ తీర్థ సాహిత్యశాఖాకార్యదర్శి,
శ్రీ సాహితీ సమితి సభ్యుఁడు.

# —· విషయ సూచిక ·—

మంత్రము, మంత్రమునందలి ముఖ్యాంశము-విశేష విషయములు.


| మంత్రము | విశేష విషయములు | పేజీనుండి—వఱకు |
| --- | --- | --- |
| | 1) శ్రీశాంకర భాష్యావతారిక :— ఇందలి మంత్రములు-కర్మాంగములు కావు. | 1- 6 |
| (౧) ఈశా | 2) ఈశావాస్య శబ్దార్థములు,ఆత్మనిష్ఠ, త్యాగము, ధనతృష్ణానిషేధము. | 7- 18 |
| (౨) కుర్వన్ | 3) కర్మనిష్ఠ, నిష్కామకర్మయోగికి కర్మలేపము కలుగదు. | 19- 30 |
| ,, | 4) స్వాభిప్రాయమున జ్ఞాన-కర్మ-సముచ్చయ నిరూపణము. | 30- 40 |
| (౩) అసుర్యా | 5) ఆత్మనెఱుఁగనివారికి కలుగు హాని-తన్నెఱుఁగమియే హింస | 41- 48 |
| | స్వాభిప్రాయమున, శాంకర భాష్యార్థమునకు శ్రేష్ఠత్వ నిరూపణము. | 46- 48 |
| (౪) అనేజత్ | 6) ఆత్మలక్షణము,ఆత్మ, మనస్సుకంటె జవీయము, ఇంద్రియాగోచరము. | 48- 58 |
| (౫) తదేజతి | 7) చలించును, చలింపదు, దూరవర్తి, సమీపవర్తి, సర్వగతము. | 58- 64 |
| (౬) యస్తు | 8) జీవన్ముక్తానుభవము, సర్వభూతాత్మదర్శికి (విచికిత్స) విజుగుప్స కలుగదు. | 65- 72 |
| (౭) యస్మిన్ | 9) ,, సర్వమును బ్రహ్మాత్మకమగు వానికి శోకమోహములుకలుగవు. | 72- 77 |

(౮) సపర్యగాత్ 10) ఆత్మలక్షణము, స్థూల, సూక్ష్మ, శరీరాదిరహితుఁడు, కవి, కర్త. 78- 86

,, 11) శ్రీశంకర సింహావలోకనము, కర్మనిష్ఠా, జ్ఞాన నిష్ఠల వివేచనము. 86- 92

(౯) అన్ధమ్ 12) విద్యా(ఉపాసనా)కర్మ ప్రత్యేకాచరణ నింద, అంధతమఃప్రాప్తి. 92- 97

(౧౦) అన్యదేవ 13) విద్యా-కర్మ-ప్రత్యేకాచరణములకు గలుగు ఫలభేదము, విద్యార్థము. 98-102

(౧౧) విద్యామ్ 14) విద్యా, కర్మ, సముచ్చయకర్తకు లభించుఫలము-అమృతశబ్దార్థము. 102-108

(౧౨) అన్ధమ్ 15) సంభూతి - అసంభూత్యుపాసనలను ప్రత్యేకించుటచేనగు లోపము. 109-116

నవ్యులు పరిశీలింపఁదగిన నాస్తిక చార్వాక సిద్ధాంతము. 112

(౧౩) అన్యత్ 16) మీఁది యుపాసనలను ప్రత్యేకించుటవలన కలుగుఫలభేదము. 118-120

(౧౪) సమ్భూతిమ్ 17) సంభూత్యసంభూతి సముచ్చయకర్తకు కలుగు ఫలాధిక్యము. 121-127

18) స్వాభిప్రాయము-ఉపాసన ఫలములయందు ప్రకృతిలయము శ్రేష్ఠము. 127-129

(౧౫) హిరణ్ 19) ప్రార్థన మంత్రము-సూర్య (తన్మండలాంతర్యామి) ప్రార్థనము-మార్గయాచనము. 130-136

ఈవిషయమున స్వాభిప్రాయము. 137-139

| | | |
|---|---|---|
| (౧౬) పూషన్ | 20) కల్యాణపురుష సందర్శనాసక్తి "వాఁడే-నేను" అనుదర్శనము. | 139-144 |
| (౧౭) వాయుః | 21) నివేదనము-ఓంకారధ్యానము సమర్పణము. | 144-149 |
| (౧౮) అగ్నే | 22) శోభనమార్గయాచనము-అగ్ని (పరమాత్మ) కొఱకు నమోవాకము. శాంకరభాష్యమున విద్యా-అమృత-శబ్దార్థవిచారము ప్రశ్నోత్తరములు. | 150-158 |
| | 23) స్వాభిప్రాయము-ఇచటత్రిమతములకునుగల-ఏకత్వ-వైలక్షణ్యములు. | 158-159 |
| | 24) పరిశిష్టము-ధూమార్చిరాదిమార్గనిరూపణము. | 160-163 |
| | 25) వేదమార్గపాంథుల-స్వరూప-ఆచరణ-గమన-ఫలములు. | 163-167 |
| | సవరణలు-తప్పు-ఒప్పు-పేజీ-పంక్తి | 168- |


విజ్ఞప్తి :—

పాఠక మహాశయులు 168వ పేజీయందుఁగల సవరణలను-గ్రంథమునందు సవరించుకొని పఠింపఁగోరెదను.

ఇట్లు,
కృతికర్త.

ఓం నమో భగవతే శ్రీరమణాయ

శ్రీ భారతీ దేవ్యై నమః.

# ఈశావాస్యోపనిషత్తు

శ్రీ శాంకర భాష్యావతారిక :— (ఆనందగిరిటీక)

శ్లో॥ యేనాత్మనా పరేణేశావాస్యం విశ్వమశేషతః
సోఽహం దేహద్వయాపాతీ వర్తితో దేహతద్గుణైః॥

"ఈశావాస్యమ్" ఇత్యాది మంత్రములను భాష్యరూపమున వ్యాఖ్యానింపఁ గోరిన భాష్యకారుఁడు—భగవంతుఁడగు శ్రీ శంకర భగవత్పాదాచార్యుఁడు. ఈ మంత్రములు కర్మశేషములు (కర్మాంగములు) అను శంకను నిరాకరించుచున్నారు.

కర్మ జడులగు కొందఱు 'ఇషేత్వా' ఇత్యాది మంత్రములవలె 'ఈశావాస్యమ్' ఇత్యాదులగు నీయుపనిషత్తునందున్న మంత్రములుగూడ మంత్రములే యగుటవలన కర్మశేషములే యగునని తలంచుచు వేరొక ప్రయోజన మేమియు లేకుండుటవలన ఈ మంత్రములు వ్యాఖ్యానింపఁదగినవే కావనియు వేదమంతయు గూడ కర్మ బోధకమే యగుచుండుట వలన ఈ మంత్రములు గూడ కర్మ శేష పరములే యగుననియు చెప్పుచున్నారు. కావున వారి యభిప్రాయమును ఖండించుటకు శంకరులు క్రింది యవతారికను ప్రదర్శించుచున్నారు.

(శాంకర భాష్యావతారిక)

"ఈశావాస్యమ్" ఇత్యాదులగు మంత్రములు-కర్మలయందు వినియోగ పడునవికావు.

(ఆ న ం ద గి రి)

"'ఇషేత్వా' ఇతి శాఖాంఛినత్తి" 'ఇషేత్వా' అను మంత్రమును పఠించి శాఖాశాఖను ఛేదింప వలయును. అని 'ఇషేత్వా' ఇత్యాది మంత్రములకు వలె "ఈశావాస్యమ్" ఇత్యాది మంత్రములకు కర్మలయందు వినియోగము చెప్పఁబడుట లేదు. అంతియేకాక యీ మంత్రములు-శుక్ల యజుర్వేద సంహితయందు చివరి ప్రకరణమున (50వ అధ్యాయమున) పఠింపఁబడి యున్నవి. కావున ఈమంత్రములు కర్మలయందు వినియోగింపఁబడునవి కానేరవు.

(శాంకర భాష్యావతారిక)

"ఈశావాస్యమ్" ఇత్యాదులగు నిందలి మంత్రములు-కర్మశేషము కాని-ఆత్మయొక్క యాథాత్మ్యమును అనగా ఆత్మతత్త్వమును బోధించుచున్నవి. కావున నివి కర్మలయందు వినియోగపడునవి కావు.

(ఆనందగిరి)

శుద్ధుడు-అపాప విద్ధుడు-ఇత్యాది విశేషణసంగతం ఆత్మ-కర్మాంగమగుటయందు ప్రమాణము లేకుండుట వలన-ఆత్మతత్త్వము-కర్మయందుపయోగింపకుండుటయేకాక కర్మకు విరోధికూడ నగుచున్నారు.

(శాంకర భాష్యావతారిక)

ఆత్మయొక్క-యాథాత్మ్యము (తత్త్వము) శుద్ధము-అపాప విద్ధము-ఏకము-నిత్యము-అశరీరము-సర్వగతము ఇత్యాది విశేషణములచేత ముందు చెప్పబడును. అట్టియాత్మ తత్త్వము-కర్మతో విరోధించును. కావున ఆత్మ యాథాత్మ్యప్రకాశకములగు నిందలి మంత్రములకు కర్మయందు వినియోగములేకుండుట యుక్తమే యగును.

(ఆనందగిరి)

"నేను స్వభావముచేతనే శుద్ధుడను, ఆగంతుకమగు పాపముతోగూడ సంబంధముగలవాడనుకాను, శరీరములేని వాడనగు నేను ఆకాశమువలె అంతటను ఒక్కడనై యున్నాను." అని అనుభవముచేత తెలిసికొనిన పురుషుడు కర్మను కటాక్షము చేతనైనను గూడ చూడడు. ఈదృశమగు ఆత్మ ప్రవృత్తి కూడ కర్మప్రవృత్తిని విరోధింపక మానదు.

మఱియు-కర్మచేతసృష్టింపదగిన పురోడాశము మొదలగునది లోకమునందు కర్మకంగముగా జూడబడుచుండును. అట్లే కర్మచేత మార్పు నొందింపదగిన ఆవహనము మొదలగునదియు, పొందదగిన మంత్రములు మొదలగునదియు, సంస్కరింపదగిన వ్రీహి (ధాన్యము) మొదలగునదియు కర్మశేషము కావచ్చును.

కర్మ శేషముగా నున్నప్పుడు ఉండఁదగిన వ్యాపకమగు ఉత్పాద్యత్వాదిలక్షణము ఆత్మ తత్త్వమునకు లేకుండుటవలన ఆత్మయాథాత్మ్యము కర్మశేషము కానేరదు. ఇంతేగాక నాకిది సాధనము, నేను దీనిచేత కర్మ చేయవలయునను అహంకారముతోఁగూడి యుండిన యెడల ఆత్మ కర్తకావచ్చును. ఆత్మయొక్క పారమార్థిక స్వరూపము కర్తయు భోక్తయుఁగూడ కానిదగుచున్నది. కావున నది కర్మయందుపయోగింపదగినది కాదని చెప్పుచున్నారు.

(శాంకర భాష్యావతారిక)

ఏవం లక్షణమగు (శుద్ధత్వాదిలక్షణమగు) ఆత్మయొక్క యాథాత్మ్యము ఉత్పాద్యముగాని, వికార్యముగాని, ఆప్యముగాని, సంస్కార్యముగాని, కర్తృ భోక్తృరూపముగాని కాదు గదా! కావున అట్టి స్వరూపము కర్మశేష మెట్లగును?

[ఆత్మతత్త్వము పుట్టింపఁదగినదిగాని, మార్పఁదగినదిగాని, పొందదగినదిగాని, సంస్కరింపఁదగినదిగాని అగునెడల నది కర్మకు అంగము కావచ్చును. కాని ఆత్మస్వరూపము పుట్టుకలేనిదియు మార్పులేనిదియు తనయొక్క స్వరూపమే యగుటవలన పొందరానిదియు, శుద్ధమైనదియు అగుచున్నది. కావున నది కర్మశేషము కానేరదని భావము.]

(శాంకర భాష్యావతరణిక)

ఈశావాస్యోపనిషత్తు మాత్రమేకాక సర్వోపనిషత్తులును గూడ ఆత్మయాథాత్మ్యమునే నిరూపించి ఉపసంహరింపఁబడు చున్నవి. కావున ఆత్మస్వరూపనిరూపణమే ఉపనిషత్తాత్పర్యము.

(ఆనందగిరి)

దీనియందు "ఈశావాస్యమ్" అని ఉపక్రమించి "[illegible]" అని ఉపసంహారము కావింపఁబడినది. ఈమంత్రములు [illegible] అట్లే "అనేజదేకమ్" "తదన్తరస్య సర్వస్య" అని అధ్యాయముచేతను "[illegible]

అన్మైవన్'' అని, అపూర్వతా సంకీర్తనముచేతను ''కో మోహః కః శోక ఏకత్వమను పశ్యతః'' అని ఫలవత్తను కీర్తించుట చేతను ''కుర్వన్నేవేహ'' అని, జీవితేచ్ఛగల మనుష్యునకు కర్మకరణము ననువదించి, ''అసుర్యానామ'' అని అజ్ఞాని నిందచేత జ్ఞానాత్మ్యదర్శనమును స్తుతించుటచేతను ''తస్మిన్నపో మాతరిశ్వాదధాతి'' అని ఉపపత్తి (యుక్తి) చేతను ఈ యుపనిషత్తునకు ''ఆత్మయొక్కటియే అనునంశమును బోధించుటయే'' తాత్పర్యమను నభిప్రాయము తెలియుచున్నది.

ఇట్లే దీనికంటె భిన్నములగు ఉపనిషత్తులన్నిటియందునుగూడ 1 ఉపక్రమ 2 ఉప సంహార 3 అభ్యాస 4 అపూర్వతా 5 ఫలవత్తా 6 అర్థవాద 7 యుక్తులను తాత్పర్యలింగములను ''తత్త్వాలోక''మను గ్రంథమునందు మేము ప్రదర్శించి యుండుటవలన నిచట విస్తరించువారలముకాము. మరియు ఉపనిషత్తులకు ఆత్మ యాథాత్మ్యనిరూపణము నందే తాత్పర్యమను గలదను నంశమును నిరూపించుటకు తదితరములగు గీతాదులయందున్న ప్రత్యయ సంవాదము (జ్ఞానము నందలి పోలిక) కూడ ప్రసిద్ధమగు కారణమని చెప్పుచున్నారు.

ఉపనిషత్తులు తెలుపుచున్న అర్థమునే భగవద్గీతయు మోక్ష శాస్త్రములును గూడ తెలుపుచున్నవి. కావున ఆత్మయొక్క ఏకత్వమును నిరూపించుటకు వేరొక ప్రమాణములేదని కల్పించుటకు వీలు కలుగనేరదని చెప్పుచున్నారు.

(శాంకర భాష్యావతరణిక)

గీతలును మోక్షధర్మములును గూడ ఆత్మ యాథాత్మ్యమునే ప్రధానముగా నిరూపించుచున్నవి. కావున వీట్లు ఆత్మయాథాత్మ్య ప్రతిపాదకములగు ఉపనిషన్మంత్రములు కర్మశేషములు కానేరవు.

(ఆనందగిరి)

''సమం సర్వేషు భూతేషు తిష్ఠన్తం పరమేశ్వరమ్
వినశ్యత్స్వవినశ్యన్తం యః పశ్యతి స పశ్యతి''

ప్రాణులన్నిటియందును ఏకరూపముతో నుండి అవి నశించుచున్నను నశింపని పరమేశ్వరుని జూచుచున్నవాడే చూచుచున్నవాడు, ఇత్యాది గీతలను.

''ఏక ఏవ హి భూతాత్మా భూతే భూతే వ్యవస్థితః
ఏకధా బహుధా చైవ దృశ్యతే జలచన్ద్రవత్''

''ప్రాణులన్నింటి యందునుగూడ ఆత్మయొక్కడే యగుచున్నను జలములందు ప్రతిబింబించిన చంద్రునివలె అనేకుడుగా కనబడుచున్నాడు''

ఇత్యాది మోక్షశాస్త్రములయందుగూడ ఆత్మయొక్క ఏకత్వమునే బోధించుట యందు తాత్పర్యము గలిగియుండుటవలన సంవాదము కాపాడుచునే యున్నది. కావుననుఆత్మైకత్వ ప్రతిపాదకములగు "ఈశావాస్యమ్" ఇత్యాది మంత్రములు కర్మాంగములు కానేరవు.

ఆత్మ ఒక్కడే యగునెడల కర్మాధికారి లేకుండుటవలన వేదోక్తమగు కర్మ కాండము ఉపేక్షింపఁబడునని శంకింప నక్కరలేదని చెప్పుచున్నారు.

శాంకర భాష్యావతారిక:—

కావున ఆత్మలు భిన్నులు. కర్తలు భోక్తలు. అపరిశుద్ధులు పాపవిద్ధులు అను నజ్ఞానముగల కర్మపరాయణుల నుద్దేశించి లోకబుద్ధి సిద్ధములగు కర్మలు విధింపఁబడినవి.

(ఆనందగిరి)

ప్రాణులను హింసింపఁగూడదను శాస్త్రార్థమునందు నిశ్చయముగలవానికి శ్యేనాది విధిప్రమాణము కానట్లు నిరవశేషమగు ఆత్మయాథాత్మ్య విజ్ఞానముగల పురుషునకు కర్మకాండము ప్రమాణము కాకున్నను శివప్రోక్తము చేత ఆక్రమింపఁబడిన మనస్సుగలవానికి శ్యేనాదివిధి ప్రమాణమగునట్లు మిథ్యాశక్తి దన్మయుఁగు పురుషునకు కర్మాది ప్రమాణమేయగునని భావము.

ఈ విషయమున త్రైవిధ ప్రత్యక్షములుఁగల నమ్మతిని చెప్పుచున్నారు.

(శాంకర భాష్యావతారిక)

దృష్టమగు బ్రహ్మవర్చస్సు మొదలగునదియు అదృష్టమగు స్వర్గము మొదలగు నదియు అగు కర్మ ఫలమును గోరుచున్న వాఁడను "నేను ద్విజుడను-కర్మచేయుటకు తగని కొట్టవాఁడను గాని గ్రుడ్డివాఁడనుగాని కాను". అని తన్నెఱిఁగిన కర్మవేత్తయగు పురుషుఁడు-కర్మ నొనర్చుటకు అధికారి యగుచున్నాఁడు" అని-కర్మాధికారవేత్తలు చెప్పుచున్నారు గదా!

(ఆనందగిరి)

కోరికగలవానికి కర్మయందధికారముగల దను నంశము (పూర్వమీంమాంసలో) షష్ఠాధ్యాయమునందు ప్రతిష్ఠాపితము-మిథ్యాజ్ఞానము లేనిదే కోరిక కలుగదు. ఆత్మ స్వయానిష్ఠునకు-భోగ్యవిషయముల యందభిలాషయు-శరీరేంద్రియ సామర్థ్యము చేత నేను సమర్థుఁడనను నభిమానమును, కలుగదు గదా! కావున ఆత్మ తత్త్వ ప్రకాశకములగు మంత్రములు-కర్మవిధి శేషభూతములను ప్రమాణాంకర విరుద్ధములును కావు, కావున-అయ్యవి ప్రయోజన మాత్రముల గూడ నగు నమునంశమును చెప్పుచున్నారు.

(శాంకర భాష్యావతారిక)

ఈ మంత్రములు-ఆత్మతత్త్వమును ప్రకాశింపఁజేయుటవలన స్వాభావికమగు అజ్ఞానమును (ఆత్మను తెలియకుండుట-అను ఆత్మాజ్ఞానమును) నివర్తింపఁజేయుచు-శోక-మోహాది సంసారధర్మములను తొలఁగించుటకు సాధనమగు-ఆత్మైకత్వాది విజ్ఞానమును గలిగించుచున్నవి.

ఈయవతరణిక వలన-ఏతదుపనిషత్తునకు సంబంధించిన-అధికారి-విషయము-సంబంధము-ప్రయోజనము-అను - అనుబంధ చతుష్టయము తెలుపఁబడినది. ఇంక మంత్రములను సంక్షేపముగా వ్యాఖ్యానించెదము.

[అధికారి-నిత్యానిత్యవివేకాదిసాధన చతుష్టయ సంపన్నుఁడు విషయము-ఆత్మతత్త్వము-సంబంధము-అధికారియగు ముముక్షువునకును విషయమగు ఆత్మతత్త్వమునకును గల జ్ఞాతృ-జ్ఞేయరూపమగు సంబంధము, ప్రయోజనము-ఆత్మతత్త్వజ్ఞానముచేత సమూలమగు శోక మోహాదికమును నివర్తించుకొనుటచేత కలుగు స్వస్వరూపానందావిర్భావము].

ఓం నమో భగవతే శ్రీరమణాయ

శ్రీ భారతీ దేవ్యైనమః.

# వాజసనేయ సంహితోపనిషత్తు

(అను నామాంతరము గల)

# ఈశావాస్యోపనిషత్తు

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే॥
ఓం శాన్తిః శ్శాన్తిః శ్శాన్తిః.

ఓం ఈశావాస్య మిదగ్ంసర్వం।యత్కిఞ్చ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుఞ్జీథా।మాగృధః కస్యస్విద్ధనమ్॥

కందము :—

"ఈశావాస్యము" జగమున
నౌ సకల జగమ్ము, దానిత్యజియించి ధృతిన్
నీ సదాత్మపము(గె కొను;
మాన(గొనకు మెవని ధనము నందును, సుమతీ!

పదచ్ఛేదము :—

ఈశా-వాస్యమ్-ఇదమ్-సర్వమ్-యత్-కిఞ్చ - జగత్యామ్-జగత్-తేన-త్యక్తేన-భుఞ్జీథాః-మా-గృధః-కస్య-స్విత్-ధనమ్.

టీ :— జగత్యామ్ = ఈ బ్రహ్మాండభూమియందు యత్కిఞ్చ = ఏదేదిగలదో, ఇదంసర్వంజగత్ = నశ్వరమగు ఈలోక మంతయు ఈశా = ఈశ్వరునిచేత,వాస్యమ్ = ఆచ్ఛాదింప(దగియున్నది తేన = అటువంటి (ఇదియీశ్వర స్వరూపమే అనునట్టి) త్యక్తేన = త్యాగముచేత, భుఞ్జీథాః = ఆత్మనుపాలించు కొనుము-కస్యస్విత్ = ఎవ్వని యొక్కయు, ధనమ్ = ధనమును, మాగృధః = కోరకుము.

శాంకర భాష్యము:— ఈష్టఇతి ఈట్. తేన = ఈశా-అను పదివ్యుత్పత్తి. శాసించువాడు "ఈట్" అని చెప్పబడును. అతనిచేత ఆచ్ఛాదింప(దగిన లోకము "ఈశావాస్యమ్". అని చెప్ప(బడును,

ఈ భూమియందు అనగా లోకములన్నిటియందును చరాచరమును నశ్వరమును అగు ఏయేవస్తువుకలదో అవి అంతయును గూడ పరబ్రహ్మ స్వరూపమును మాయోపాధివలన శాసనకర్తృత్వముగల ఈశ్వర స్వరూపమును, అగు పరమేశ్వరునిచేత ఆచ్ఛాదింపఁడగియున్నది. ఆపరమేశ్వరుఁడే నిజరూపముచేత సచ్చిదానందరూపమును, నిర్గుణమును, నిష్క్రియమును, అవిక్రియమును, భేదరహితమును, ఏకమునుఅగు పరమాత్మయై యున్నను, మాయోపాధియను స్వశక్తితోడి సంబంధమువలన సర్వేశ్వరుఁడై సర్వలోకములకును, సర్వ జంతువులకును, ఆత్మయై (స్వరూపమై) అనఁగా ఆజంతువుల యందుగల దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధి అవిద్యలకుఘటాదులకు పృథివివలె స్వరూపమై యున్నను వాని లోపల వానికంటె భిన్నమై వానిని ప్రకాశింపఁజేయు నదియగు ప్రత్యగాత్మయై (దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులకంటె వేరయి దానియందు వ్యాపించుచు) ఉండి శాసించుచున్నాఁడు. ఒకానొక చక్రవర్తివలె గాక ఈశ్వరుఁడు ఈ దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులకు సాక్షియైయుండి ఈ జంతువులనన్నిటిని గూడ ప్రేరణ చేయుచున్నవాఁడువలె ఉండుటవలన ప్రతివ్యక్తినిగూడ శాసించుచున్నాఁడని తెలియునది.

కావున ఈలోకములకును, ఈదేహాదులకునుగూడ ఈశ్వరుఁడే స్వరూపమనియు, అవిద్యాకల్పితమగు భ్రాంతి చేత ఇవి యన్నియు అనీశ్వరరూపముగా (ఈశ్వరునికంటె వేరైన) నామరూపక్రియాత్మక లోకదేహాది రూపముగా గ్రహింపఁబడి యున్నవనియు, ఇదియంతయు ఈశ్వరుఁడేలేక ఈశ్వర స్వరూపమాత్రమగు ఆత్మయేఅనియు' అనుభవముచేత నెఱుంగుటయే ఆచ్ఛాదించుటయనియు తెలియునది.

ఇట్లు సర్వాత్మకుఁడగు ఈశ్వరుఁడు "నేనే" యని "నేను" కంటె భిన్నమగు ఆత్మను తెలిసికొనవలయునని ఛాందోగ్యోపనిషత్

ఈ భూమియందు అనగా లోకములన్నిటియందును చరాచరమును నశ్వరమును అగు ఏయేవస్తువుకలదో అది అంతయును గూడ పరబ్రహ్మ స్వరూపమును మాయోపాధివలన ఈశనకర్తృత్వముగల ఈశ్వర స్వరూపమును, అగు పరమేశ్వరునిచేత ఆచ్ఛాదింపఁబడియున్నది. ఆపరమేశ్వరుఁడే నిజరూపముచేత సచ్చిదానందరూపమును, నిర్గుణమును, నిష్క్రియమును, అవిక్రియమును, భేదరహితమును, ఏకమునుఅగు పరమాత్మయై యున్నను, మాయోపాధియను స్వశక్తితోడి సంబంధమువలన సర్వేశ్వరుఁడై సర్వలోకములకును, సర్వ జంతువులకును, ఆత్మయై (స్వరూపమై) అనఁగా ఆజంతువుల యందుగల దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధి అవిద్యలకుఘటాదులకు పృథివివలె స్వరూపమై యున్నను వాని లోపల వానికంటె భిన్నమై వానిని ప్రకాశింపఁజేయు నదియగు ప్రత్యగాత్మయై (దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులకంటె వేరయి దానియందు వ్యాపించుచు) ఉండి శాసించుచున్నాఁడు. ఒకానొక చక్రవర్తివలె గాక ఈశ్వరుఁడు ఈ దేహేంద్రియ ప్రాణమనోబుద్ధులకు సాక్షియైయుండి ఈ జంతువులనన్నిటిని గూడ ప్రేరణ చేయుచున్నవాఁడువలె ఉండుటవలన ప్రతివ్యక్తినిగూడ శాసించుచున్నాఁడని తెలియునది.

కావున ఈలోకములకును, ఈదేహాదులకునుగూడ ఈశ్వరుఁడే స్వరూపమనియు, అవిద్యాకల్పితమగు భ్రాంతి చేత ఇవి యన్నియు అనీశ్వరరూపముగా (ఈశ్వరునికంటె వేరైన) నామరూపక్రియాత్మక లోకదేహాది రూపముగా గ్రహింపఁబడి యున్నవనియు, ఇదియంతయు ఈశ్వరుఁడేలేక ఈశ్వర స్వరూపమాత్రమగు ఆత్మయేఅనియు' అనుభవముచేత నెఱుంగుటయే ఆచ్ఛాదించుటయనియు తెలియునది.

ఇట్లు సర్వాత్మకుఁడగు ఈశ్వరుడు "నేనే" యని "నేను" కంటె భిన్నమగు ఆత్మను తెలిసికొనవలయునని ఛాందోగ్యోపనిషత్

రగనుగా సమర్పించుటయే ఆచ్ఛాదించుట యను అర్థమును తె
లియును. ఈ విధమగు ఆచ్ఛాదనముచేత కర్తృత్వభోక్తృత్వ
లక్షణమును, నామరూప కర్మాత్మకమును, ద్వైతరూపమును,
వికార జాత మంతయుఁగూడ (మాయామయమగు వ్యవహా
మంతయుకూడ) పరమార్థసత్యమగు ఆత్మయేయను భావము
త్యజింపఁబడును. ఇట్లు విడుచుటయే త్యాగము. "ఆత్యాగముచే
ఆత్మను రక్షించుకొనుము" అని చెప్పఁబడినది. కావున ఏవంవిధ
ఈశ్వర భావనాయుక్తునకు పుత్రాద్యేషణాత్రయ సన్యాసమున
అధికారముగాని కర్మలయందుఁగాదు. [ఇచటత్యాగశబ్దమునకు మా
నసికమును శారీరకమును అగు సన్యాసమే అర్థమగును] త్యాగము
చేత (అట్టి సన్యాసముచేత) నిష్క్రియమగు ఆత్మస్వరూపమునం
దుండుటకు అనుకూల్యము కలుగును. సర్వమును ఈశ్వరాత్మకమే
యను భావనచేనియెడల విడువఁబడిన పుత్రాదులుగాని మరణించిన
పుత్రాదులుగాని-ఆత్మసంబంధులు కాకుండుటవలన ఆత్మనురక్షింప
జాలరు. కావున ఇట్లు భావనారూపమగు జగద్దృష్టి త్యాగముచే
జ్ఞాని, 'ధనేషణ-దారేషణ-పుత్రేషణ' అను ఈషణలను విడువవలయు
నని చెప్పుటచే ధనవిషయమగు కాంక్షను విడువవలయునని-మాన
సికమగు త్యాగము [సన్యాసము] ఉపదేశింపబడినది అట్టి సన్యాసికి
శరీరమునందు ధరించుట కుపయుక్తమగు కౌపీన ఆచ్ఛాదన భిక్షా
పాత్రమాత్రము సముచితమేయగును. అయినను వానికంతే
స్వాతిరిక్తములగు ద్రవ్యములను గూడ సంగ్రహించుటకు ఒకప్పుడు
రాగముకలుగవచ్చునని అన్నిరోజములందు ప్రయత్నము చే
దగునను తదితరాలియమున "ఏ యొక్క ధనమునుగాని, ఇతరుల
యొక్క ధనమునుగాని కోరకుము" అని నియమము చెప్పఁబడి
నది. ఈ లోకమునందున్న వస్తుజాతమంతయుఁగూడ పరమేశ్వరు
నకు సంబంధించినదియే-అను భావనచేతగాని - పరమేశ్వర స్వరూ
పమే-అను భావనచేతగాని ధర్మము త్యజించిన పిమ్మట మిథ్యావిషయ
మగు కోరిక కలిగియుండరాదు అనునదియే అభిప్రాయమనది.

శాంకరభాష్యవ్యాఖ్యాతయగు ఆనందగిరి యిట్లు చెప్పుచున్నారు. మీది మంత్రమునందలి ప్రథమ ద్వితీయ పాదములచేత శిష్యోపదేశము కావింపఁబడినది. తృతీయ పాదముచేత అనాత్మజ్ఞానుఁడగు ముముక్షువునకు సన్న్యాసవిధి చెప్పఁబడినది. చతుర్థపాదముచేత ఆసన్న్యాసికి ఈషణాత్రయ త్యాగరూపమగు నియమవిధి చెప్పఁబడినది.

శ్రీ విద్యారణ్యభగవత్పాదులకు గురువులగు శ్రీ శంకరానంద సరస్వతీ భగవత్పాదులచే రచియింపఁబడిన "ఆత్మపురాణము"నందు మీదిమంత్రముయొక్క అర్థము క్రింది రీతిన వివరింపఁబడినది. "చరాచరమగు ఈ లోకమంతయుఁగూడ ఉపాదాన కారణమును, నిమిత్త కారణమును, గూడ తానే యగుచున్న ఈశ్వరునిచేత వాసితమై, వ్యాప్తమై, ఆచ్ఛాదితమై, యున్నది.

నామరూప కర్మాత్మకమగు ఈజగత్తు ఈశ్వరునిచేత ఎట్లు వ్యాపింపఁబడినదియు శ్రుతిచేత చెప్పఁబడుచున్నది.

(1) ఉపాదాన కారణమగు మట్టిచేత కుండ, బానమొదలగు ఆకార వికారములు వ్యాపింపఁబడినట్లు ఈశ్వరునిచేత బ్రహ్మాండమంతయు వ్యాపింపఁబడినది.

(2) నిమిత్త కారణమగు ప్రభువుచేత లోచన ద్వారమున రాజనగరము వ్యాపింపఁబడినట్లు చూచువాఁడగు ఈశ్వరునిచేత ప్రపంచమంతయు వ్యాపింపఁబడినది.

(3) వెలుపలనున్న వస్త్రముచేత మానవశరీరము వ్యాపింపఁబడినట్లు వెలుపలనున్న ఈశ్వరునిచేత బ్రహ్మాండమంతయు వ్యాపింపఁబడియున్నది.

(4) లోపలనున్న పరిమళయుక్తమగు పుష్పములచేత సుశీతలజలము వ్యాపింపఁబడినట్లు లోపలనున్న ఈశ్వరునిచేత బ్రహ్మాండమంతయు వ్యాపింపఁబడియున్నది.

(5) ప్రవృత్తిహేతువులగు వాసనలచేత ప్రాణులయొక్క సంకల్పాది రూపమగు మనస్సు వ్యాపింపఁబడినట్లు అంతర్యామియగు ఈశ్వరునిచేత ప్రపంచమంతయు వ్యాపింపఁబడియున్నది.

ఆకాశమునందు భ్రాంతిచేత కనఁబడుచున్న గంధర్వ నగరాదికము ఆకాశస్వరూపముకంటె వేఱుగాక ఆకాశమే యగునట్లు స్త్రీపుత్త్రధనాదిరూపమగు బ్రహ్మాండమంతయుఁగూడ పరమేశ్వర స్వరూపముకంటె వేఱుకాకుండుట వలన పరమేశ్వర స్వరూప మాత్రమే యని తెలిసి వానియందేర్పడిన స్త్రీ పుత్త్రధనాది దృష్టిని త్యజించునది లేక ఇవి యంతయు ఈశ్వరునిదే యనియు, తనది కాదనియు, వాని నన్నిటిని త్యజించునది.

"ఆత్మపురాణ" కర్తయగు శ్రీ శంకరానంద భగవత్పాదులచేఁ జేసిన వ్యాఖ్యానమగు ఈశావాస్య దీపిక ఇట్లు చెప్పుచున్నది :— "జగత్తునంతను ఈశ్వర స్వభావమాత్రముగా గ్రహించి ఈశ్వర తత్త్వ సాక్షాత్కార లక్షణమగు భోజనము నొనరింపుము."

శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యులును, శ్రీ మత్పూర్ణానంద తీర్థ శిష్యులును అగు అద్వైతానందతీర్థులు "అద్వైతానందలహరి" అను గ్రంథమున ఈ మంత్రము నిట్లు వ్యాఖ్యానించెను. శాస్త్రము తల్లివలె హితమునే శాసించును. వేద మాత పుట్టినది మొదలు అజ్ఞుఁడగు అవివేకి పురుషుని అనర్థహేతువగు స్వభావ ప్రవృత్తినుండి నివారించి పూర్వభాగమున ఆయావస్థలందును, ఆయా ఆశ్రమములకును, సముచితములగు కర్మలను విధించుచున్నది. వేదోక్తములగు సత్ కర్మాచరణముచేత చిత్తశుద్ధి కలుగును. అప్పుడే వేదమాత-చిత్తశుద్ధిగల పురుషునకు ఉపాసనలను (విద్యలను) విధించి, వానిచేత ఏకాగ్రతయు, దానిచేత వైరాగ్యమును, దానిచేత వానికి మోక్షము నందభిలాషయు, కలుగునప్పుడు వేదాంతములగు ఉపనిషత్తులచేత వానికి అద్వైతతత్త్వజ్ఞానమును బోధించుటకు ప్రవర్తించును. కావున అత్యుత్తమాధికారికి ఇప్పుడు ఈశావాస్యోపనిషత్తు నందలి "ఈశావాస్యమ్" అను మంత్రముచేత ఆత్మైకమాత్ర-తత్త్వము నుపదేశించుచున్నది. ఈ లోకమునందు కనఁబడుచున్నదియు, మహదాది భూత భౌతికాత్మకమును, కార్యరూపమును అగు జగత్తు అంతయుఁగూడ 1) సచ్చిదానంద కూటస్థ రూపుఁడును, 2) సర్వరూపుఁడును (విరాడ్రూపుఁడును) అగు పరమేశ్వరుఁడే యని చూడవలయును"అని.

దీనివలన పరమేశ్వరునకు (1) సచ్చిదానందైకరసమును, నిర్వికారమును అనంతమును అగు స్వస్వరూపము (2) పురుషసూక్తమునందును, భగవద్గీతయందును చెప్పఁబడిన సహస్రశీర్షాది విశిష్టమయిన విరాడ్రూపమును, దివ్యదృష్టిచేత చూడఁదగినదియు,నగు విశ్వరూపము (3) అజ్ఞులందరిచేతను ప్రత్యక్షముగా చూడఁబడుచున్నదియు, మాయా కల్పితమును అగు ప్రపంచరూపము, అను రూపత్రయమున్నదని తెలియుచున్నది. ప్రపంచరూపముకంటె తేజోమయమగు విశ్వరూపము, సూక్ష్మమును, వ్యాపకమును, నిత్యమును, శ్రేష్ఠమును అగుచున్నదనియు, దానికంటె సచ్చిదానందరూపమగు బ్రహ్మస్వరూపము, సూక్ష్మమును, వ్యాపకమును, నిత్యమును, శ్రేష్ఠమును, అగుచున్నదనియు తెలియుచున్నది.

విశిష్టాద్వైతపరములగు వేదాంతదేశికాదుల వ్యాఖ్యలయందు ఈ మంత్రార్థమిట్లు తెలుపఁబడినది.

"ఈశ్వరుఁడనగా విష్ణువు. ఆ యీశ్వరుని కంటె భిన్నమై చిద్రూపమగు జీవుఁడు అచిద్రూపమగు జడ పదార్థము అగు ప్రపంచమంతయు, సర్వ నియంతయు, పురుషోత్తముఁడును, విష్ణుస్వరూపుఁడును అగు ఈశ్వరునిచేతనే వ్యాప్తమైయున్నది. స్వరూపముచేతను, ధర్మముచేతను, మార్పునొందిన భోగ్యభోక్తృరూపమగు వస్తు జాతము పరమేశ్వరునిచేత వ్యాప్యమును, ధార్యమును ఆయి యుండుటవలన వాసుదేవ రూపముగాని వస్తువులేదు" అని ఇట్లు త్యజింపఁబడిన జగత్తుచేత దేహధారణ మాత్రోపయోగియగు భోగ్యపదార్థవర్గముననుభవింపుము. లేక క్రింద తెలుపఁబడిన త్రివిధమగు త్యాగముచేత పదార్థజాతముననుభవింపుము.

1) "ఇదినాపనికాదు" పరమేశ్వరుని పనియే" అని కర్మయందలి మమత్వమును విడుచుట కర్మవిషయమగు త్యాగము.

2) ఈకర్మయొక్క ఫలమునాదికాదు; పరమేశ్వరునివియే. అని ఫలమును త్యజించుట ఫలవిషయమగు త్యాగము.

3) "ఈపని చేయువాడు పరమేశ్వరుడే కాని నేనుకాను" అని కర్తృత్వమును విడుచుట కర్తృత్వవిషయమగు త్యాగము.

ఇట్లు త్రివిధమగు త్యాగముచేతను భగవద్భోగమునందు అంతర్గతమగు స్వభోగముగలవాఁడవై పదార్థములననుభవింపుము. బంధుమిత్రులయొక్కగాని, తదితరులయొక్కగాని, ధనము ను కోరకుము. పరమేశ్వరేచ్ఛచేత లభించిన స్వవస్తువునే మీద చెప్పఁబడిన త్యాగముచేత భుజింపుము. ఇందు చెప్పఁబడిన ఈశ్వరుఁడు రుద్రుఁడుకాఁడు.

"ఏషసర్వభూతాంతరాత్మా అపహత పాప్మా, దివ్యో దేవ ఏకో, నారాయణః" అని సర్వాంతర్యామిగా ప్రసిద్ధుఁడైన నారాయణుఁడే యగును.

శ్రీమదానందతీర్థవిరచితమగు ద్వైతమత భాష్యార్థ సంగ్రహము ఇటున్నది — అస్వతంత్రమగు ప్రపంచమంతయుగూడ ఆత్మయొక్క ప్రవృత్తికొఱకు ఈశ్వరునకు ఆవాసయోగ్యమగుచున్నది కావున స్వతంత్రుఁడును, పరమకారణమును అగు ఈశ్వరునిచే (విష్ణుచేత) త్యక్తమైనదియు; అనగా ఈయఁబడినదియు యదృచ్ఛాలబ్ధమును, అగు విత్తమున్నంత భోగము నొనరింపుము ఈశ్వరునికంటె ఇతరులను, అస్వతంత్రులను (పరాధీనులును) అగు రాజాదుల వలన ధనమును కోరకుము.

## స్వాభిప్రాయము.

జగత్తు - జీవుఁడు - ఈశ్వరుఁడు - అనువాని లక్షణములను ఆస్తికమతములన్నియుఁగూడ నిరూపించుచున్నవి. వానియందు భిన్నాభిప్రాయములు కాన్పించుచున్నవి. అయినను ఆయాసిద్ధాంతములు—ఆయామత కర్తల జ్ఞాన పరిపాక భేదము ననుసరించి ప్రవర్తిల్లుచున్నవి. ఈసిద్ధాంతముల నన్నిటిని ఆయాసాధనదశయందంగీకరించుచు, భేదరహితమగు అద్వితీయ తత్త్వస్వరూపము వివరించునదియగు యోగవాసిష్ఠాది ప్రాచీన గ్రంథములందు నిరూపింపఁబడినదియు, శ్రీ శంకర భగవత్పాదుల వారిచే పునరుద్ధరించి సిద్ధాంతీకరింపఁబడినదియు, అగు అద్వైతమతము జగత్ప్రశంసాపాత్రమును, సర్వోత్కృష్టమును నై వెలయుచున్నది కాఁగా-అద్వైతము శంకర కల్పితము కాదు. అందలి అభిప్రాయము ననుసరించి క్రింది విషయమును ప్రదర్శించుచున్నాము. అవ్యక్తమను మాయతోఁగూడిన నిర్గుణపరబ్రహ్మమునకు ఈశ్వరుఁడను పేరు గలిగెను. జగద్రూపమగు జడపదార్థమును, చేతనమని చెప్పఁబడుచున్న జీవపదార్థమును గూడ నిజ స్వరూపముచేత సచ్చిదానంద అద్వితీయస్వరూపుఁడును-మాయోపాధిచేత ఈశ్వరస్వరూపుఁడును, అగు పరమాత్మచేతనే వ్యాపింపఁబడియున్నవి, మాయోపాధికుఁడగు

ఈశ్వరునియందే జీవజగత్తులు కలిగినట్లున్నవి. నేను మనుష్యుఁడను యువకుఁడను-సుందరుఁడను-చక్రవర్తిని-భోగయుక్తుఁడను" అను విశిష్ట తలంపులకు ఉపాధియే నేనను భ్రాంతియే కారణమై యున్నది. ఈశ్వరుఁడు నిజమాయాశక్తిచేత అవిద్యగాను, బుద్ధిగాను, మనస్సుగాను, ప్రాణముగాను, ఇంద్రియములుగాను, స్థూలదేహముగాను, లోచుచు-జీవులహృదయదేశములయందు ఈ దేహాదులకంటె భిన్నమగు ప్రత్యగాత్మస్వరూపమున నిజరూపముతోఁగూడ వెలయుచున్నాఁడు. పరమార్థదృష్టియందు మాయారూపము-నిజరూపము అను భేదములేక ఏకమే యగుచున్నాడు. బహుజన్మార్జితమగు పుణ్యపరిపాకముచేత చిత్తశుద్ధి కలిగి, దానివలన విషయములయందు దోషదృష్టి యేర్పడి, వానియందలి విరసన భావమువలన విరక్తి కలిగినప్పుడు ముముక్షువగు జీవునకు గురుప్రసాదలబ్ధమగు పంచకోశ వివేకమువలన ప్రత్యగాత్మ స్వరూపసాక్షాత్కారము కలుగుచున్నవి. ఈశ్వరుఁడే ప్రత్యగాత్మ స్వరూపముచేత ప్రాణులహృదయదేశ మందుండుటవలనను ప్రత్యగాత్మ ఈశ్వరునికంటె వేఱుకాకుండుటవలనను ఆత్మదర్శనము ఈశ్వరదర్శనమే యగుచున్నది, ఎప్పుడు మనుష్యునకు అనాది అవిద్యాప్రాప్తమగు జీవత్వభ్రాంతి తొలఁగునో అప్పుడతఁడు ఆరూఢుఁడగును. అతనికి "ఇదియంతయుఁగూడ ఈశ్వర స్వరూపమాత్రమే" అను జ్ఞానము కలుగును. సాధనదశయందు అతఁడు కర్మను, కర్తృత్వమును, కర్మఫలమును, గూడ పరమేశ్వరునియందే సమర్పించును. "అనిశనవిశా"నని ఈ కర్మాదులను 1 మనస్సుచేతగాని 2 మనశ్శరీరముల రెంటిచేతనుగాని త్యజించును. కర్మలయందు ఆసక్తి విడిచి కర్మలనొనర్చువాఁడగు మొదటివాఁడు కర్మయోగిగాను, మనస్సుచేతనేగాక శరీరముచేతఁగూడ కర్మలను విడిచిన రెండవవాఁడు జ్ఞానయోగి (సన్యాసి) గాను చెప్పఁబడుచున్నారు. ఆరూఢస్థితియందున్న జ్ఞాని జీవజగత్తులు మాయాకల్పితములగుటవలన వాని యందుఁగల నామరూపములు అనృతములు-అను

పారమార్థికదృష్టి నాశ్రయించి-వానిని తిరస్కరించి - పరమా చూచును. అట్టి జ్ఞానికి మాయారూపములందును, వానిలోపలను, వెలుపలను పరమాత్మ తానే యగుచున్నాడు. ఇట్లు సర్వమును బ్రహ్మముగాఁ జూచుటవలన జగద్దృష్టిని త్యజించిన సాధకుఁ కూడ సత్యస్వరూపానుభూతినే పొందును. ఈ సాధకునకు ప్రారధీనమగు దేహాత్మదృష్టినుద్దేశించి "ఎవ్వనిధనమును కోరకు" మను నియమవిధి చెప్పఁబడినది. ఈనియమము ఆరూఢునకు లేదు. ఆరూఢునకు దేహము నందాత్మదృష్టి కలుగదు. కావున వానికి నియమము లేదు. ఈయంశ మంతయు ఈశావాస్యమ్ అను ఈ మంత్రమునందు సంగ్రహింపఁబడినదని విజ్ఞులగు త్రింతురుగా

[స్వాభిప్రాయము ననుసరించి నిరూపింపఁబడిన-మతములందలి భిన్నవిషయముల విమర్శ.]

జగత్తుకంటె జీవుఁడును-జీవునికంటె-ఈశ్వరుఁడును భిన్నులై యున్నారు. జీవజగత్తుల యందీశ్వరుఁడు అంతర్యామియై వ్యాపించి యుండుటవలన నవి ఈశావాస్యములగుచున్నవి. ఈ "జీవజగత్తులుసత్యములే" అనిద్వైతము చెప్పుచున్నది. వ్యావహారికదృష్టియందు-జీవ-జగత్తులు సత్యములనియు దాని యందీశ్వరుఁడు అంతర్యామియై వ్యాపించియున్నాఁడనియు, అంగీకరించి, పారమార్థికదృష్టియందు జీవ-జగత్తులు మాయాకల్పితము లగుటవలనను వానికి బ్రహ్మసత్తకంటె భిన్నమగు సత్తలేకుండుటవలనను అవి బ్రహ్మమాత్రమే అని అద్వైతమునిరూపించుచున్నది.

"అవి బ్రహ్మ మాత్రమే" అనుట వలన జీవ-జగత్తుల యందగు నామరూపభేదమసత్యమని సిద్ధించుచున్నది.

శ్రీశంకర భగవత్పాదుల వారు స్వాత్మనిరూపణమునందిట్లు చెప్పియున్నారు.

"విశ్వమనునదియేది? దీనికి రూపమేది? ఇదియెట్లుకలిగినది? దీనికి కారణమేమి?" అని బుద్ధిమంతుఁడేనాఁడును చింతింపఁదగదు. ఇది "మాయ" అనియే విచారించునది.

"కఱ్ఱచేత చేయఁబడిన ఏనుఁగునందు బాలునకు కఱ్ఱ కనఁబడకున్నది. అది "కఱ్ఱ" యని తెలిసిన విమర్శకునకు ఏనుఁగు కనఁబడకున్నది".

"అజ్ఞునకు జగత్తునందు పరమాత్మ కనఁబడకున్నాఁడు విజ్ఞునకు పరమాత్మయందు జగత్తుకనఁబడకున్నది. కావున నిట్లు సర్వమును బ్రహ్మమాత్రముగాఁ జూచుచు జగద్రూపమును త్యజించి యాత్మను పరిపాలించుకొనుము" అను నర్థమును గ్రహించునది.

మాయోపాధికుఁడగు నీశ్వరుఁడు బ్రహ్మ-విష్ణు-రుద్ర (మహేశ్వర) నామములచేత సగుణ సాకార స్వరూపుఁడై యున్నాఁడు.

కావున వ్యావహారిక దృష్టిచేత విచారించు నెడల ఈ త్రిమూర్తులు ముగ్గురును గూడ "ఈశావాస్యమ్" అని ఇందుచెప్పఁబడిన ఈశ్వరునికంటె భిన్నులేయగుదురు. ఏకోరుద్రః" ఇత్యాది శ్రుతులయందును "దివ్యోదేవ ఏకోనారాయణః" ఇత్యాది శ్రుతుల యందును వినఁబడిన రుద్ర-నారాయణాది శబ్దములు-మీది మంత్రమున చెప్పఁబడిన పరమాత్మయగు ఈశ్వరునే తెలుపును కాని వీరిని తెలుపవు. పరమార్ధ దృష్టిచేత వీరుగూడ బ్రహ్మమే యగుచున్నారు. "మీది మంత్రమునఁజెప్పబడిన ఈశ్వరుఁడు-రుద్రుఁడు కాఁడు. నారాయణుఁడే యగును." అని చెప్పుటకుఁగాని "మీది మంత్రమున జెప్పఁబడిన ఈశ్వరుఁడు నారాయణుఁడుకాఁడు; ఈశ్వరుఁడను ప్రసిద్ధనామముగల రుద్రుఁడేయగును." అని చెప్పుటకుఁ గాని కారణము స్వమతాభినివేశమేయగును. శివుఁడును విష్ణువును భిన్నులుకారు.

"శివాయ విష్ణురూపాయ
శివ రూపాయ విష్ణవే"

ఇత్యాదులిందులకు ప్రమాణములై యున్నవి.

పురాణాదులయందు ప్రసిద్ధినొందిన బ్రహ్మ-విష్ణు-మహేశ్వరులుకూడ ఉపాధిభేదము చేతనే భిన్నులగుచున్నారు. కాని ఔపాధిక దృష్టిత్యాగముచేత వారికిఁగూడ ఏకత్వమే సిద్ధించునని విజ్ఞులు గుర్తింతురుగాక !

ఇట్లు (1) జగద్రూపము (2) జీవరూపము (3) బ్రహ్మాది దేవతారూపము (4) విశ్వరూపము అనుసర్వమును గూడ నిర్గుణము, సచ్చిదానందమును అగు ఈశ్వరుని చేతనే ఆచ్ఛాదింపఁబడియున్నది. అనగా ఈశ్వరస్వరూప మాత్రమని చూడఁబడియున్నది. కావుననే "ఈశావాస్యమిదంసర్వమ్" అని చెప్పఁబడినది.

(శ్రీ శాంకర భాష్యావతారిక)

ఆత్మజ్ఞానముగలవాఁడు పుత్రాదీషణాత్రయమును నవపించి-ఆ యాత్మజ్ఞాన నిష్ఠచేత-జనన-రోగ-జరా-మరణరూపమగు సంసార ప్రవాహమునుండి ఆత్మను (తనను) రక్షించుకొనఁదగు నను వేదార్థము ప్రథమ మంత్రమునందిట్లు నిరూపించి-

ఆత్మనెఱుఁగనివాఁడు-స్వాత్మగ్రహణమునందు శక్తుఁడు కానేరఁడు. కావున విస్పష్టాయజ్ఞానికొఱకు క్రింది మంత్రముచేత పీయుంశముపదేశింపఁబడుచున్నది.

కుర్వన్నేవేహ కర్మాణి
జిజీవిషేచ్ఛతగ్ం సమాః
ఏవంత్వయినాఽన్యథేతోఽస్తి
నకర్మ లిప్యతేనరే॥

కర్మలనొనర్చుచునె యీజగమ్మునందు
బ్రతుకఁగోరుము శతవత్సరములు వత్స!
మానవుఁడవైన నీకిట్లుమనుటకంటె
పంథ మఱిలేదు దీనపాపంబుకాదు.

పద :— కుర్వన్-ఏవ-ఇహ-కర్మాణి-జిజీవిషేత్-శతగ్ం-సమాః - ఏవమ్ - త్వయి-న-అన్యథా-ఇతః-అస్తి-న-కర్మ-లిప్యతే-నరే॥.

ప్రతిపదార్థము :— ఇహ = ఇక్కడ-కర్మాణి = అగ్నిహోత్రాదులగు కర్మలను-కుర్వన్ + ఏవ = కుర్వన్నేవ = చేయుచునే శతంసమాః = నూరు సంవత్సరములను-జిజీవిషేత్ = జీవింపఁగోరవలయును-ఏవమ్ = ఈప్రకారముగా జీవింపఁగోరుచున్న-నరే = మనుష్యుఁడనను అభిమానముఁగల త్వయి = నీవిషయమున-ఇతః = ఈయగ్నిహోత్రాది కర్మలనొనర్చువిధికంటె-అన్యథా = మఱియొక విధము నాస్తి = లేదు (దీనిచేత) కర్మ = అశుభకర్మ-నలిప్యతే = (నిన్ను) బంధించునదికాదు. (ఇందు "శతమ్" అను పదమునకు నూటయిరువది వత్సరములు. అని యొక వ్యాఖ్యయందున్నట్లు-శ్రీగాంధి మహాత్ముఁడు ప్రవచించియుండెను).

(శాంకర భాష్యార్థము)

(అజ్ఞుఁడవగు గృహస్థుఁడా!) అగ్నిహోత్రము మున్నగు కర్మలను చేయుచునే పురుషాయువుగా నిరూపింపఁబడిన నూరు

సత్సరములనుగూడ జీవింపఁగోరుము. మనుష్యమాత్రుఁడన అభిమానము గలవాఁడవును, జీవితేచ్ఛగల వాఁడవును అగు నీ శాస్త్రోక్త కర్మ నిర్వహణముకంటె భిన్నమగు (వేరొక) మార్గము లేదు. ఇట్లు చేయుటవలన నీకు పాపముకలుగదు.

ప్రశ్న :— పూర్వోక్తమగు ప్రథమమంత్రముచేత సన్యాసికి జ్ఞాననిష్ఠయు—ద్వితీయ మంత్రముచేత :— జ్ఞాన నిష్ఠయందు శక్తిలేనివానికి కర్మనిష్ఠయు చెప్పఁబడినవను సంశయముమీఁది మంత్రములవలన తెలియఁబడునా ?

ఉత్తరము :— జ్ఞానమునకును,-కర్మకునుగల విరోధము పర్వతమువలె చలింపదను సంశయము, పూర్వోక్తమగు సవతారిక యందు తెలుపఁబడినది. దానిని విస్మరించితివా ?

మీఁది మంత్రములయందుఁగూడ "తేనత్యక్తేనభుఞ్జీథాః మాగృధః కస్యస్విద్ ధనమ్".

"జగద్ దృష్టిని త్యజించి ఆత్మను రక్షించుకొనుము. ఎవ్వని ధనమును (నీధనమును, పరధనమును) గూడ కోరకుము".

"కుర్వన్నేవజిజీవిషేత్" "కర్మచేయుచునే జీవింపఁగోరవలయును." అనువాక్యములచేత జ్ఞానమునకును; కర్మకునుగల విరోధము స్పుటీకరింపఁబడినదిగదా ?

"ఈశావాస్యమ్" అను నిందలి ప్రథమ మంత్రమేగాక "నజీవితే, మరణే, వాగృధింకుర్వీత, అరణ్యమియాత్, తతో నపునరియాత్". బ్రతుకునందుఁగాని; మృతియందుఁగాని కోరిక వలదు, అరణ్యమునకుపొమ్ము. అక్కడనుండి తిరుగరాకుము", ఇత్యాది శ్రుతిసమూహముగూడ-జిజీవిషాదులు (కోరికలు)లేనివానికి సన్యాసమునే శాసించుచున్నదిగదా ;

ఆనందగిరి కృతమగు శాంకర భాష్యటీకయందు మీఁది యభిప్రాయమిట్లు వివరింపఁబడినది.

ప్రశ్న :— ప్రథమ మంత్రముచేత—ఎవనికి జ్ఞానముపదేశింపఁబడినదో, వానికే ద్వితీయమంత్రముచేత కర్మవిధింపఁబడినది. కావున నీమంత్రములు రెండింటికిని జ్ఞానకర్మసముచ్చయము నొనర్చుటయందే తాత్పర్యము. కావున ఒకే యధికారి క్రమముగా వాని నాచరింపవచ్చును. కావున కర్మ-జ్ఞానములేక కర్తృకములు కాఁగూడదా ?

ఉ :— కర్మస్వరూపమును, జ్ఞానస్వరూపమును భిన్నములైయున్నవి. కావున వాని యధికారులుగూడ భిన్నులే యగుదురు. కావున కర్మజ్ఞానములేక కర్తృకములు కాఁగూడదు.

ప్రశ్న :— జ్ఞానమును, కర్మమునుగూడ వేదమునందు విహితములై (విధింపఁబడినవై) యున్నవి. కావున నీరెండును గూడ సమానమగు ఉద్దిగంపేమగును. కావున వానికెట్లు విరోధము కలుగును.

ఉ :— ఇట్లనినయెడల - బహుకాలగమనమును-త్రిదండి ధర్మమును-గూడ వేదవిహితములగుటవలన విరోధము లేదని కావలసివచ్చును.

ప్రశ్న :— ఇవి వేదవిహితములే అయినను-భిన్నాధికారులకు విధింపఁబడినవిగదా ?

ఉ :— అట్లే-కర్మ-జ్ఞానములుగూడ ఒకే యధికారికి విధింపఁబడినవి కానేరవు.

"బహుకాలగామియగు పురుషుఁడు త్రిదండి (సన్యాసి) కాఁగూడదు" అను నిషేధముండుటవలన బహుగమన - త్రిదండి ధర్మములకు సముచ్చయము (కలయిక) కలుగదు. అట్లే "కర్మచేతఁగాని: సంతానముచేతఁగాని: ధనముచేతఁగాని అమృతత్వము (మోక్షము) కలుగదనియు, జ్ఞానదాయకములుగాని అనేకములగు కష్టములను ధ్యానింపకు" మనియు నిషేధముండుటవలన. కర్మ-జ్ఞానములకు సముచ్చయము కలుగదు.

ప్రశ్న :— కేవలమగు (వేదోక్తముకాని) కర్మకును, జ్ఞానమునకును, మాత్రమే సముచ్చయము వేదమునందు నిషేధింపఁబడినది. కావున వేదోక్తమగు కర్మకును-జ్ఞానమునకును సముచ్చయము ఏల తగదు ?

ఉ :— 'నకర్మణా' అను మంత్రమునందుఁ జెప్పఁబడిన నిషేధము కేవలకర్మవిషయమే కాని వైదిక కర్మవిషయము కాదనుటకు ప్రమాణము కాన్పింపదు. కేవలకర్మయు వైదికకర్మయుఁగూడ కర్మయే యగును. కావున జ్ఞాన-కర్మలకు సముచ్చయము సముచితము కానేరదు.

దేహకర్తృత్వ-అను అధ్యాసమునకు (భ్రాంతికి) ఆశ్రయమైన కర్మ (అను) బద్ధుఁడు అకర్త అను జ్ఞానముచేత బాధింపఁబడును. అని శాంకర భాష్య తంత్రికయందలి సంబంధ గ్రంథమునఁజెప్పఁబడిన యంశమును స్మరింపవ లయును. ఈ యంశమును నెఱింగిన మొదట-కర్తృత్వ-అను భ్రాంతితోఁగూడిన కర్మయు, ఆ బద్ధుఁడు, అకర్త అను జ్ఞానముతోఁగూడిన జ్ఞానమును, గూడ ఒకే అధికారియందు సంభవించునవి కావనియు, కనుకనే కర్మ-జ్ఞానసముచ్చయము సిద్ధాంతము కాదనియు మీకు స్పష్టపడఁగలదు.

ఇందలి ద్వితీయ మంత్రముచేత-జీవితేచ్ఛగలవానికి-కర్మయు; తృతీయ మంత్రముచేత "సర్వమును గూడ ఈశ్వరుఁడే" అను విజ్ఞానముగల జ్ఞానికి-జ్ఞానము విధింపఁబడుటవలన కర్మాధికారియు, జ్ఞానాధికారియు భిన్నులనుట స్పష్టమగుచున్నది. మఱియు ధనసంపన్నునకే కర్మసంపదధికారము చెప్పఁబడినను ప్రథమ మంత్రమునఁజెప్పఁబడిన అధికారికి ధనాకాంక్ష నిషేధింపఁబడినది. కావున కర్మ-జ్ఞానాధికారులు భిన్నులే యగుదురు.

"నతిష్ఠతే, మరణే, వా, స్వధింకుర్వీతాంబర్యామియాత్" అని జీవితేచ్ఛ వాఁడు శ్రీ జన సంకీర్ణము కాని యాశ్రమమునకేగ వలయుననియు, కర్మయందు శ్రద్ధచేత-తిరుగరాఁగూడదనియు, తెలుపునట్టి యుపనిషద్ శ్రుతి కూడ, జ్ఞానాధికారి కర్మాధికారికంటె భిన్నుఁడని తెలుపుచున్నది.

శాంకర భాష్యము:—

ఈ యుపనిషత్తునందేమందు "ఏకత్వము నెఱిఁగినవానికి శోకమోహములు కలుగ"వని జ్ఞానమునకు ఫలము చెప్పఁబడును. కర్మాధికారికి దేశాంతర ప్రాప్తి వంటిదగు స్వర్గాదిప్రాప్తియు. ఉపాసనాధికారికి హిరణ్యగర్భాది లోకప్రాప్తియు, కలుగునని చెప్పఁబడును. కావున కర్మ-ఉపాసనా-జ్ఞానములకు-ఫలమువలనఁగూడ భేదముగలదని తెలియుచున్నది. సృష్టికాలమున మొదట ప్రాణులు సృజింపఁబడిరి. వారినమసరించి రెండుమార్గములు బయలు వెడలినవి. అందు మొదట కర్మ (ప్రవృత్తి) మార్గముకలిగినది. తరువాత జ్ఞాన (నివృత్తి) మార్గము కలిగినది. ఈనివృత్తి మార్గమునందే ఏషణాత్రయత్యాగము చెప్పఁబడినది. నివృత్తి మార్గము ననుసరించినవారు సన్యాసులు. ఈమార్గములందు సన్యాసమే శ్రేష్ఠము.

మహానారాయణోపనిషద్ వాక్యము కర్మ-జ్ఞానములు-భిన్నము లనుటకు ప్రమాణమగుచున్నది. వీనియందు రెండవదగు సన్న్యాసమే శ్రేష్ఠమను నంశము. "న్యాసఏవాత్యరేచయత్"— అను తైత్తిరీయశ్రుతిచేఁగూడ స్పష్టీకరింపఁబడినది.

వేదాచార్యుఁడును భగవంతుఁడును అగు వ్యాసుఁడుకూడ చక్కఁగా విచారించి, నిశ్చయించి "ద్వావిమావథ పన్థానౌయత్ర వేదాః ప్రతిష్ఠితాః। ప్రవృత్తి లక్షణోధర్మో నివృత్తిశ్చవిభావితః".

"వేదప్రతిపాదితములగు మార్గములు రెండున్నవి. అందు ధర్మము-ప్రవృత్తి మార్గము-జ్ఞానము-నివృత్తి మార్గము" అని ప్రవృత్తి (కర్మ) నివృత్తి (జ్ఞానము) అనువానికిఁగల భిన్నత్వమును స్వపుత్రునికి బోధించెను.

కర్మ-జ్ఞానములకుఁగల యీవిభాగమును తిరుగముందుఁగూడ ప్రవచింతుము.

ఈశావాస్య రహస్యము "ఇట్లు" చెప్పుచున్నది.

"ఈశ్వరార్పణబుద్ధిచేత నొనర్పఁబడిన లౌకికవైదిక కర్మల వలన కర్మబంధము కలుగదు".

ఉవటాచార్యకృతమగు ఈశావాస్యభాష్యమిట్లనుచున్నది.

"ఈశావాస్య మంత్రజ్ఞానముచేత నిస్పృహుఁడగు యోగి కూడ ముక్తికి హేతువులగు కర్మముల నొనర్చుచునే జీవింప వలయును. ముక్తినిచ్చుటవలన కర్మకుగల శక్తి క్షీణించును. కావున ముక్తికొఱకు గావింపఁబడిన కర్మ-బంధించునది కానేరదు. ఎంత కాలము-ఇచ్ఛప్రవర్తించునో అంతవఱకును కర్మయందధికార ముండును."

ఈశావాస్య దీపిక "ఇట్లు" చెప్పుచున్నది.

మోక్షమునందిచ్చలేనివానికి త్యాగమునందధికారములేదు. కావున దయాకలితయగు మాతవలె శ్రుతి-వాని నీమంత్రముచేత బోధించుచున్నది.

సన్న్యాసమునందు అనధికారివగు నీవు స్వవర్ణాశ్రమోచితమగు కర్మాధికమును త్యజింపకుము. అట్లుకర్మను త్యజించినయెడల నీకు పాపము నశింపకుండుటయేగాక మోక్షముగూడ లభింపదు.

ఈశావాస్య రహస్య వివృతి ఇట్లు చెప్పుచున్నది.

చిత్తము శుద్ధముకానియెడల ఏషణాత్రయమును త్యజించుటకు వీలుకలుగదు. కావున చిత్తశుద్ధి కొఱకు ఫలాకాంక్షనువిడిచి, విధ్యుక్తములగు కర్మలను చేయవలయును. కోరికలేకుండ చేయఁబడిన కర్మవలన-కర్మఫలముతోడి సంబంధము కలుగదు. దాని వలన చిత్తశుద్ధి కలుగును.

ఆనందభట్టోపాధ్యాయ కృతమగు ఈశావాస్యభాష్య మిట్లు చెప్పుచున్నది.

"సాంఖ్యులకు (సన్న్యాసులకు) జ్ఞానయోగము-కర్ములకు కర్మయోగము-అను రెండువిధములను నేను పూర్వముచెప్పియున్నాను" అని శ్రీకృష్ణభగవాముఁడర్జునునకు చెప్పెను. కావున కర్మాధికారి-జ్ఞానాధికారులు, భిన్నులేయగుదురు. (అనంతాచార్య కృతమగు ఈశావాస్యభాష్యమిట్లుచెప్పుచున్నది.) బ్రహ్మార్పణబుద్ధిచేత నొనర్పఁబడిన కర్మచేత చిత్తశుద్ధి కలిగిన వానికి ముక్తికలుగును. అకర్మ తనను బంధింపదు. అకర్మయే ముక్తికి హేతువగు చిత్తశుద్ధిని కలిగించును. అంతటితో నీకర్మకుఁగల శక్తిక్షీణించును.

అద్వైతానందలహరి-ఇట్లు నిరూపించుచున్నది.

ఈశావాస్యమను మంత్రమునందుపదేశింపఁబడిన సర్వ త్యాగము-మనస్సుచేత కావింపఁబడిన దృష్టిమాత్రమే. కాని క్రియా రూపముకాదు. అనగా ప్రపంచమునందున్న వస్తువులనన్నిటిని గూడ మానసికమగు పరమార్థ జ్ఞానముచేత పరమాత్మ మాత్రి

ముగాఁజూచుటయే సర్వత్యాగము గాని శరీరముచేత నావస్తువులను విడిచిపెట్టుట సర్వత్యాగముకాదు. కర్మను త్యజించినయెడల దేహ యాత్రియు కూడ సిద్ధించునదికాదు. అట్లు త్యజించుట శక్యము కూడ కానేరదు. కావున భావనారూపమగు త్యాగమే సర్వత్యాగ మని గ్రహింపవలెను.

శ్లో॥ "అపిపుష్పావదళనాదపి నేత్రనిమీలనాత్
సర్వత్యాగ విలాసేన సులభస్తత్త్వ నిశ్చయః॥"

"మనస్సుచేత సర్వమునుగూడ త్యజించుట వలన పూవును త్రెంపుట కంటెను కన్నుమూయుట కంటెను గూడ తత్త్వనిశ్చ యము అనగా ఆత్మసాక్షాత్కారము, మిక్కిలి సులభమైయుండును.

"మనసైవేదమాప్తవ్యం. నేహనానాఽస్తికిఞ్చన" తః మాత్మమనస్సుచేతనే పొందఁదగినది. పరమాత్మయందు "భేద రూపమగు జగత్తు కొంచెమైనను లేదు."

ఇత్యాది శ్రుతులచేత మానసికమగు జగద్దృష్టి త్యాగమే తెలుపఁబడినది. కాని కాయికమగు క్రియాత్యాగము తెలుపఁబడుట లేదు. కావున దేహయాత్రియు, విహిత కర్మపాలనమును గూడ మానసికమగు సర్వత్యాగము గలవానికి జ్ఞానసిద్ధికలుగుటకు పూర్వ ముకంటె అధికముగనే సిద్ధించును.

కావున ప్రథమమంత్రముచేత మానసికమగు సర్వత్యాగము గలవానికే-ఈ ద్వితీయమంత్రము-కర్మనువిధించుచున్నదని చెప్ప వచ్చును. ఆత్మజ్ఞుఁడు-కర్మనొనర్చినను, కర్మనొనర్పకున్నను గూడ నతనికెట్టి ప్రయోజనమును లేదు. అయినను లోకసంగ్రహము కొఱ కును, శిష్టులచేత నిందింపఁబడకుండుటకును కర్మనొనర్చుచునే జీవింపఁగోరుట-యుక్తమేయగును. ఆత్మజ్ఞుఁడగు మనుష్యుని కర్మ బంధించునదికానేరదు "ఈపనికి నేను కర్తనుగాను, ఈ కర్మఫల మున్నాదికాదు." అను జ్ఞానముచేత కర్తృత్వము, ఫలసంబంధము,

నివర్తించుటవలన జ్ఞానికి కర్మబంధముకలుగనేరదు, "కర్మణ్య యః పశ్యేత్" అను గీతా శ్లోకమునందు చెప్పఁబడిన చంద అతఁడు కర్మయందకర్మను, అకర్మయందు కర్మను జూచువాఁడ వలన నతఁడే మనుష్యులలోపల బుద్ధిమంతుఁడును, యుక్తుఁడు సర్వకర్మకర్తయు నగుచుండును. అనియు, "యోగః కర్మసు లమ్" "కర్మములయందలి కౌశలమే అనగా, ఫలాసక్తి నివిడి కర్మలనొనర్చుటయే యోగము" అనియు, భగవంతుఁడర్జు కొనర్చిన యుపదేశము వివరణననుసంధించునది.

ప్రశ్న :— అయ్యా! మీరీ మంత్రమును చిత్రము వ్యాఖ్యానించుచున్నారు. భగవంతుఁడును, భాష్యకర్తయును, అ శంకరుఁడు ప్రథమమంత్రమును సన్యాసివిషయముగను, ద్వితీ మంత్రమును అజ్ఞానివిషయముగను, ఏలవ్యాఖ్యానించెనో తెలు గోరెదను. సన్యాసికి కర్మఉచితమా?

ఉ :— "కర్మల నొనర్చుచునే జీవింపఁగోర వలయును" "అను నీద్వితీయ మంత్రమునే ప్రమాణీకరించుచు కొందఱు "యావజ్జీవమును కర్మనే చేయవలయును" అనియు, "సన్యాసమే కూడ"దనియు నాక్షేపించిరి. మఱియు జ్ఞానకర్మలకు సముచ్చయమేకాని విభాగము నంగీకరింపక - సన్యాసము నంగీకరింపరైరి. వారి వాదములను నిరసించి, శ్రుతి-స్మృతి-విహితమగు సన్యాసమును పునరుద్ధరింపటకు శ్రీ శంకర భగవత్పాదులిట్లు వ్యాఖ్యానింప వలసివచ్చినది. 1 కేవలగృహస్థ ధర్మమునకును 2 సన్యాసమునకును 3 త్యాగమునకును గొప్పభేదముకలదు.

1 గార్హస్థ్యము - అగ్నిహోత్రాదికర్మరూపము -ఫలాసక్తియుక్తము. 2 సన్యాసము-శిఖాయజ్ఞోపవీతాది త్యాగక్రియారూపము, ఈసన్యాసము-బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, అను నాశ్రమములు మూఁటికంటెను ఉత్తమమయినది, సన్యాసికి అగ్నిహోత్రాది కర్మలేకున్నను నివృత్తిరూపమగు కొంత కర్మయున్నది.

దండధారణము, తర్పణము, అయుతప్రణవజపము, (పది వేల ఓంకారములను జరిపించుట) మొదలగునదియు - శ్రవణ-మనన-ధ్యానరూపమయినదియు, అగుకర్మ-సన్న్యాసమునందు గూడ విహితమేగదా! ఈసన్న్యాసముగూడ ద్వివిధముగా నున్నది.

1 వివిదిషాసన్న్యాసము 2 విద్వత్ సన్న్యాసము అని. వివిదిష-అనగా తెలిసికొనవలయునను కోరిక. వివిదిషా సన్న్యాసికి-కర్మ త్యాగమును, వేదాంతశ్రవణమును విధింపబడినవి.

అతనికి బ్రహ్మలోకప్రాప్తి కలుగును. సామాన్యముగా జీవన్ముక్తి కలుగదు.

విద్వత్సన్న్యాసము :—— పూర్ణజ్ఞానముచేత సహజమై లభించునది. అది విధింపబడునదికాదు. విద్వత్సన్న్యాసులు-శాస్త్రవిధులకు వశ్యులుకారు. వారికి జీవన్ముక్తి కలుగును.

యాజ్ఞవల్క్యాదులు జీవన్ముక్తులు.

సర్వత్యాగము :—— ప్రపంచగతమగు నామరూప క్రియా దృష్టిని త్యజించి, వానియందు బ్రహ్మమాత్రమగు దృష్టినిగ్రహించుట. ఇదియే ఈశావాస్యమను ప్రథమ మంత్రముచేత నుపదేశింపబడినది.

జనకుడు-వైవస్వతుడు-ఇక్ష్వాకుడు-రైక్వుడు మొదలగువారు రాజ్యాధిపతులైన గృహస్థులైననుగూడ సర్వత్యాగముగల పరతత్త్వదృష్టులై యుండిరి. మిథిల-దహింపబడుచున్నదనిభటులు విన్నవింపగా, "నాకు సంబంధించిన దేదియు దహింపబడలేదు గదా!" అని జనకుడు చెప్పెనుగదా!-ఇదియే త్యాగము.

ఇట్టి సర్వత్యాగులకు-ఆశ్రమచతుష్టయాభిమాన ముండదు. శ్రీ శంకర భగవత్పాదులు-"నవర్ణా, నవర్ణా శ్రమాచార ధర్మా, నమేధారణా, ధ్యానయోగాదయోఽపి" నాకు వర్ణములులేవు. వర్ణాశ్రమాచారధర్మములులేవు, ధారణా-ధ్యాన-సమాధులు గూడలేవు. అని సర్వత్యాగమును కీర్తించియున్నారు.

ఆహా! సాక్షాజ్జీవన్ముక్తిరూపమగు సర్వత్యాగవైభవమాశ్చర్యకరముగదా!

ఈ మంత్రార్థమంతయు-ఆత్మపురాణమున శ్లోకరూపమున నిట్లు వివరింపబడినది :— ఉపాసనచేత లభింపఁదగిన సగుణ బ్రహ్మ విజ్ఞానమునందుఁగాని, జ్ఞానముచేత లభింపఁదగిన నిర్గుణ బ్రహ్మ విజ్ఞానమునందుఁగాని, మీకధికారము (అర్హత) లేనియెడల "కర్మఫలభూతములగు లోకములు, స్త్రీలు, ధనాదికము మొదలగు ఫలములు ఈశ్వరుఁడవేగాని నాకిక్కా"నని ఫలాపేక్షను విడిచి ఆశ్రమోచితమగు కర్మను యావజ్జీవమును గూడ మనోవాక్కాయకర్మలచేత నొనరింపుఁడు.

ఇట్లు నిష్కామకర్మనాచరించుటవలన-ఈజన్మమునందుఁగాని తరువాతి జన్మమునందుఁగాని, మీపాపములు నశించుటవలన మీరు చిత్తశుద్ధికలవారై, అవ్వల మీరు బ్రహ్మజ్ఞానద్వారమున దుఃఖములేనివారలు కాఁగలుగుదురు. కోరికలేకుండ, విధింపఁబడిన కర్మనాచరించు కర్మయోగులకు-పాపనాశము, చిత్తశుద్ధి, బ్రహ్మజ్ఞానము, శోకనివృత్తి, అను ఫలములు క్రమముగా లభింపఁగలవు.

స్వర్గాదిప్రాప్తికి మూఁడుమార్గములున్నవి.

ఇష్టాపూర్తాది కర్మలనొనర్చు వారికి పితృయాణమను, ధూమాదిమార్గమును, సగుణ బ్రహ్మము నుపాసించువారికి దేవయానమార్గమను అర్చిరాది మార్గమును, శుద్ధచిత్తులగు విరక్తులకు (ఆత్మనిష్ఠులకు) బ్రహ్మజ్ఞానమను మార్గమును గలవు. ఇంతకంటె సుఖప్రదములగు మార్గములు మఱిలేవు. ఈ మూఁడు మార్గములను పొందఁజాలనివారికి, దుష్కర్మబంధమును దాఁటవలను నరక దుఃఖానుభవము కలుగక మానదు.

ఈ మార్గములయందుఁగూడ బ్రహ్మజ్ఞానము శ్రేష్ఠము. బ్రహ్మజ్ఞానులకు సంపూర్ణ దుఃఖనివృత్తి కలుగును. ధూమాదిమార్గగాములకును, అర్చిరాది మార్గగాములకునుగూడ, సంపూర్ణమగు దుఃఖముయొక్క నివృత్తి కలుగదు.

విశిష్టాద్వైతపరమగు వేదాంతదేశికాదులభాష్యము నందీ మంత్రము ఇట్లు వ్యాఖ్యానింపఁబడినది.

ఇట్లు విరక్తుఁడగు విద్వాంసునకు 1 ఫలసంగము 2 కర్మయందలి మమత 3 కర్తృత్వాదికము, మొదలగు వానియొక్క త్యాగముతోఁగూడిన నిత్యనైమిత్తిక రూపమగు కర్మము-ప్రథమ మంత్రోక్తమగు జ్ఞానమునకు అంగముగా, యావజ్జీవితమును చేయవలయునని ద్వితీయ మంత్రము విధించుచున్నది.

విద్వాంసుఁడగు నరుఁడుకూడ నిత్యనైమిత్తికములగు కర్మలను చేయుచునే జీవింపఁగోరవలయును. విద్యపరిపూర్ణమగు నంతవఱకును దేహమును ధరించియుండుట విద్వాంసునకుఁగూడ యావశ్యకమేయగును.

కావున విద్వాంసునకుఁగూడ జీవితేచ్ఛ - విరుద్ధముకాదు' కావున జీవితేచ్ఛయున్నంత మాత్రమున ఈద్వితీయమంత్రము- "అజ్ఞానికొఱకు కర్మను బోధించు"నని తెలుపునదియగు శాంకర భాష్యము యుక్తము కానేరదు.

"నరమత ఇతినరః" అనువ్యుత్పత్తిచేత విద్యావిరుద్ధములగు కర్మఫలములయందు రమింపనివాఁడు(ఆసక్తిలేనివాఁడు)నరుఁడని చెప్పఁబడును

ఇట్లు బ్రహ్మవేత్తయగు నరునికి-విద్యాంగముగా. అనఁగా, జ్ఞానమున కంగముగా విధింపఁబడిన కర్మయోగము-స్వర్గాదిహేతు వగు బంధమును కలిగింపకుండుటయేగాక, జ్ఞానయోగ ద్వారమునఁ గాని, సాక్షత్తుగాఁగాని మొదట పరిశుద్ధ జీవాత్మవిషయకమగు యోగమును పుట్టించి పిదప భక్తియోగమున కంగభూతమగు పరమాత్మసాక్షాత్కారమునే కలిగించునని తెలియునది.

ఈమంత్రార్థము బ్రహ్మవేత్తకు సంబంధించినదికాదనియు, జ్ఞానాగ్నిచేత కర్మాధికారమును దహించిన బ్రహ్మవిదుఁడు విధి నిషేధములకు వశ్యుఁడుకాఁడనియు, తెలుపునదియగు శాంకర భాష్యము ప్రకరణ విరుద్ధమగుటయేగాక "విద్యాంచా విద్యాంచ" అని ఈయుపనిషత్తునందే ముందు చెప్పబడునదియగు వేదోక్త విధికిఁగూడ విరుద్ధమగుట వలన వేదవిత్సమ్మతము కానేరదు,

ద్వైత భాష్యమిట్లు చెప్పుచున్నది.

పూర్వమంత్రోక్తమగు జ్ఞానము నర్జించు నరునకు కర్మా ష్ఠానముగూడ నావశ్యకమని "కుర్వన్నేవ" అను 2వమంత్రము చెప్పుచున్నది.

ఈమానుషాది జన్మమునందు జీవింపఁగోరినయెడల మర పర్యంతమునుగూడ భగవత్పూజాత్మకములును, ఫలసంకల్ప రహి తములును, ఆశ్రమోచితములును, అగుకర్మలను చేయుచునే యుండవలెను. ఇట్లు కర్మలను చేయుచున్న మనుష్యమాత్రుఁ వయినను గూడ నీయందు పాపలేపము కలుగదు.

స్వాభిప్రాయము :—

వేదమునందు-సామాన్యముగా బ్రహ్మచారికి-వేదాధ్యయన మును, ఆత్మజ్ఞానరహితుఁడగు గృహస్థునకు-నిత్య-నైమిత్తిక- కామ్యకర్మాచరణమును, వానప్రస్థునకు-విద్యయని చెప్పఁబడునది యగు ఉపాసనయు, సన్యాసికి-ఉపనిషత్ప్రోక్తమగు తత్త్వజ్ఞాన మును, విధింపఁబడినవి. శ్రుత్యర్థమును స్మరించునవియగు స్మృతుల యందుఁగూడ నీయంశమే నిశ్చయింపఁబడినది.

అయినను కొన్నివిశేషవిధులచేత-అధికారము ననుసరించి యీ నిర్ణయముకూడ భేదించుచున్నది.

శ్రుతి-స్మృతులకు ఆచార్య శంకరులు అద్వైతపరముగను, శ్రీరామానుజాచార్యులు విశిష్టాద్వైతపరముగను, శ్రీమాదానంద తీర్థులను మధ్వాచార్యులు ద్వైతపరముగను భాష్యములను రచించి యున్నారు. ఆయామతముల ననుసరించిన విద్వాంసులలో కొం దఱు ఆ భాష్యముల ననుసరించిన టీకలను స్వతంత్రములగు వ్యాఖ్య లను గూడఁగావించియున్నారు. వీనియందనేక భాష్యములును, వ్యాఖ్యలునుగూడ ఆంధ్రులకు పరిచితములు కాకున్నవి,

కావున నవియన్నియుఁగూడ విద్వాంసులచేత నాంధ్రీకరిం పఁబడఁదగియున్నవి. ఈశావాస్యమునందలి ప్రథమ ద్వితీయమంత్ర

ములయభిప్రాయములను ఆయావ్యాఖ్యాతలు తెలిపిన విధము నను సరించి సంగ్రహముగా మీఁదఁబ్రదర్శించియున్నాను.

ప్రథమ మంత్రముచేత ఉపదేశింపఁబడిన జ్ఞానము (త్యాగము) ద్వితీయ మంత్రముచేత ప్రతిపాదింపఁబడిన కర్మ అను రెండును ఒకే అధికారికా? భిన్నాధికారులకా? విధింపఁబడినవి? అను సంశయమును విమర్శింతుము. శ్రీ శంకరులు-ఇవి భిన్నాధికారుల కని తెలిపిరి. తదితరులొకనికేయని తెలిపిరి.

శ్రీభగవత్ పాదులవారు - కర్మ జ్ఞానముల కలయికచేత, అమృతత్వము సిద్ధించునని యంగీకరింపకుండుటకు కారణమును మొదట తెలుపుదును. తదుపరి-స్వాభిప్రాయమును శాస్త్రవిరుద్ధము కాని విధమున తెలుపుదును. ప్రియపాఠకులు శ్రద్ధతో పరిశీలింపఁ గోరెదను. దీనివలన శ్రీశంకరులు కర్మజ్ఞానసముచ్చయము మోక్ష సాధనముకాదని తెలిపియున్నారు, కాని తత్త్వవేత్తయందు ఎప్పటను గూడ కర్మ జ్ఞాన సముచ్చయము సంభవింపదని తెలుపుట లేదను సంశయమును పాఠకులు దృఢముగా గ్రహింపఁగలరనియే నానమ్మిక.

## —। కర్మచేత—ఆత్మలభించునా ? ।—

ఈ లోకమునందు కర్మచేత సాధింపఁదగిన ఫలము చతుర్విధమైనది.

1 కర్మచేత ఏదైనవస్తువు పుట్టింపఁబడును. 2 పొందింపఁబడును. 3 మాలిన్యాదులను తొలఁగించుటచేత సంస్కరింపఁబడును. 4 ఒకానొక కర్మవిశేషముచేత మార్పునొందింపఁబడును.

ఆత్మస్వరూపము పుట్టుకలేనిది, కావున కర్మచేత గృహాదుల వలె పుట్టింపఁబడునది కాదు. ఆత్మను పొందఁగోరినజీవుని నిజ రూపము ఆత్మయే అగుచున్నది. కావున స్వరూపమగు ఆత్మ పొందింపఁదగినదికాదు. మురికి మొదలగు దోషములతోఁగూడిన "అద్దము" మొదలగు వస్తువులు సంస్కారము నొందింపఁదగిన

వగుచుండును, ఆకాశమువలె నిత్యశుద్ధుఁడగు ఆత్మ సంస్కరింపఁదగినవాఁడుకాఁడు. అనియములతోఁ గూడినదియు, మార్పునొందినదియు, అగు క్షీరము మొదలగునది మార్పునొందింపఁబడును. నిరవయవుఁడును, నిష్క్రియుఁడును అగు ఆత్మ మార్పునొందింపఁదగినవాఁడుకాఁడు.

కావున కర్మచేత నిజస్వరూపుఁడగు ఆత్మలభింపువాఁడు కాఁడు. మరియు కర్మచేత సాధింపఁదగిన వస్తువు నిత్యముకాదు. ఆత్మ నిత్యము. పుణ్యకర్మచేత సాధింపఁదగిన స్వర్గాదిలోకములు గూడ నిత్యములుకావు. కావుననే "కర్మచేతగాని, సంతానము గాని, ధనముచేతగాని, నిత్యమగు అమృతత్వము (మోక్షము) కలుగునదికాదు. త్యాగముచేతనే మోక్షము కలుగును" అని శ్రుతియందు ఉగ్గడింపఁబడినది.

"నేను కర్తనుగాను" అను ఆత్మస్వరూపజ్ఞానమును "నేను కర్తను" అనుజ్ఞానముతో గూడిన కర్మయు-ఒకేవ్యక్తియందు సంభవించునవి కానేరవు. కావున "ఈశావాస్యమ్" అను ప్రథమ మంత్రముచేత ఉపదేశింపఁబడిన జ్ఞానము- సర్వకర్మలను, తత్ఫలములను, తత్కర్తృత్వమును గూడ శరీరముచేతను, మనస్సుచేతను గూడ త్యజించిన సన్న్యాసికే విధింపఁబడినదనియు, "కుర్వన్నేవేహ" అను ద్వితీయమంత్రముచేత చెప్పఁబడిన కర్మాచరణము-అజ్ఞుఁడగు గృహస్థునికే విధింపఁబడినదనియు, కర్మజ్ఞానములకు సముచ్చయము విధింపఁబడుటలేదనియు, శ్రీ శంకర భగవత్పాదుల చేత నిర్ణయింపఁబడినది. కావున ప్రథమ మంత్రమునందు చెప్పఁబడిన త్యాగము, ద్వితీయ మంత్రమునందు చెప్పఁబడినకర్మ, అను వానియొక్క స్వరూప సంబంధములనిచట విమర్శించుచున్నాను.

త్యాగము అనగా "విడుచుట" అనునది సామాన్యఅర్థము అయినను ఇచ్చట త్యాగశబ్దమునకు (1) సన్న్యాసము 2) కర్మఫలత్యాగము (3) మానసికమగు 1 కర్మఫల, 2 కర్మ, 3 కర్తృత్వ-త్రయ

త్యాగము అను మూడర్థములు చెప్పఁబడుచున్నవి. "అవ్యక్తమగు నామరూపములతోఁ గూడిన ఈ సమస్త ప్రపంచమును గూడ-ఈశ్వర మాత్రమే" అను జ్ఞానముచేత-ఈ ప్రపంచమును, కర్తృత్వమును కర్మఫలమును, కర్మనుగూడ నామ-రూప-కర్మ రహితబ్రహ్మమగు ఈశ్వర స్వరూపమునందు త్యజించి [సచ్చిదానంద మాత్రముగా గ్రహించి] బ్రహ్మస్వరూపమగు ఆత్మస్వరూపము నెఱిఁగిన జ్ఞానికి విధినిషేధములు లేకుండుటవలన బాహ్యములగు సర్వకర్మలను గూడ త్యజించుటయందే-అనగా సన్యసించుట యందే-అధికారము" అని శ్రీ శంకరులచే సిద్ధాంతీకరింపఁబడినది. కావుననే ప్రథమ మంత్రమునందు చెప్పఁబడిన జ్ఞానము-సన్న్యాసి నుద్దేశించి యుపదేశింపఁబడినదనియు, ద్వితీయమంత్రమునందుపదేశింపఁబడిన అభిప్రాయము అజ్ఞానియగు గృహస్థునుద్దేశించి చెప్పఁబడినదనియు, శంకరమతానుయాయులగు విద్వాంసు లనేకులు వ్యాఖ్యానించి యున్నారు. ద్వైతవిశిష్టాద్వైత బోధకములగు వ్యాఖ్యలయందు ప్రథమమంత్రముచేత చెప్పఁబడిన జ్ఞానముగల వానికే ద్వితీయ మంత్రమునందలి కర్మవిధికూడ విధింపఁబడుటవలన కర్మజ్ఞాన సముచ్చయము అంగీకరింపఁబడినది. శంకరమతానుయాయులగు కొందఱు వ్యాఖ్యాతలుగూడ-ప్రథమ మంత్రోక్తమగు జ్ఞానము మానసికమగు సర్వత్యాగమే యగును కావున ద్వితీయ మంత్రమునందు చెప్పఁబడిన కర్మనిష్ఠగూడ మానసిక సర్వత్యాగియగు బ్రహ్మవేత్తకు జనకాదులకువలె సముచితమే అగునని నిశ్చయించిరి. కాని, వారి యభిప్రాయముకూడ శంకరుల యభిప్రాయమునకు విరుద్ధముకానేరదు, కర్మ-జ్ఞాన-సముచ్చయము-మోక్షసిద్ధికి హేతువను సంశయమును వారుగూడ నంగీకరింపరు. మోక్షము-జ్ఞానము వలననే కలుగును. అయినను లోకసంగ్రహము కొఱకు-అధికారికత్వాదిప్రారబ్ధమువలన-కర్మ-జ్ఞాన సముచ్చయముకూడ జ్ఞానులయందు విరుద్ధముకాకుండునను నదియేవారి యాశయము.

ఈ అంశములను పరిశీలించి శ్రుతి స్మృతి విరుద్ధముకాని విధమున స్వాభిప్రాయమును సంగ్రహముగ ప్రదర్శించెదను.

"లోకేఽస్మిన్ ద్వివిధానిష్ఠా పురాప్రోక్తా మయానఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానామ్ కర్మయోగేన యోగినామ్॥"

దోషరహితుఁడవయిన ఓ అర్జునా! బ్రహ్మచర్యాశ్రమము నుండియే సన్యసించినవారును, ఆత్మానాత్మ విషయక వివేక విజ్ఞానవంతులును, బ్రహ్మమునందే నివసించియున్నవారును, అగు పరమహంస పరివ్రాజకులకు-జ్ఞానయోగము, కర్మనిష్ఠులకు-కర్మయోగము అను రెండు నిష్ఠలను నేను తెలిపియున్నాను" అని భగవద్గీతయందు శ్రీకృష్ణభగవానుఁడు అర్జునునకుపదేశించియున్నాఁడు. దీని వలన కేవలకర్మలంపటులు-వేదోక్తమగు సర్వకర్మలను, ముముక్షువులగు కర్మఠులు-కర్మయోగమును, బ్రహ్మనిష్ఠులగు సన్న్యాసులు-జ్ఞానయోగమును, ఆశ్రయింపఁదగునను అర్థముగ్రహింపఁదగియున్నది. కర్మయోగానుష్ఠానముచేత సత్త్వగుణము శుద్ధమగును. శుద్ధసత్త్వమగు చిత్తము-శుద్ధచిత్తమగును. పిమ్మట శుద్ధచిత్తులగు మనుష్యులు వైరాగ్యమునొంది, కర్మలను తత్ఫలములను సన్యసించి, జ్ఞానయోగముచేత మోక్షమునొందుదురను నంశము సామాన్యముగా శ్రుతి-స్మృతి - ప్రతిపాదితమగుచున్నది. కాని కొన్ని శ్రుతులచేత "మానసికమగు సర్వత్యాగముతోఁగూడిన, ఆత్మజ్ఞానముగల విద్వాంసులు-కర్మఠులైయున్నను, పరతత్త్వదర్శులగు వారొనరించిన కర్మ-వారికి మోక్ష సిద్ధియందు విరోధికాఁజాలదు" అని స్పష్టపడుచున్నది. "కర్మచేత-మోక్షముసిద్ధింపదు. జ్ఞాన-కర్మ-సముచ్చయముచేత [అనఁగా:కర్మకంగమగు జ్ఞానముచేతఁగాని, జ్ఞానమునకంగమగు కర్మచేతఁగాని] కూడ-మోక్షము లభింపదు." అను శ్రీ శంకరుల అభిప్రాయము-శ్రుతి-స్మృతి-యుక్తి-అనుభవములచేత పరీక్షింపనెడల-మిక్కిలి సమంజసమగు చున్నది.

ఏల యనిన :—

కర్మలైన గృహస్థులకైనను - అకర్ములైన సన్యాసులకైనను గూడ - పారిశ్యమగు మోక్షము - జ్ఞానము వలననే - కలుగును. కాని కర్మవలనఁగాని, కర్మ - జ్ఞానసముచ్చయము వలనఁగాని కలుగనేరదు. జ్ఞానులు - కర్మయోగులుగానుండఁగూడదా ?

జ్ఞానసిద్ధినొంది - ఆత్మారాములు - ఆత్మతృప్తులు - ఆత్మసంతుష్టులు - అయియున్న ఆరూఢులకు చేయఁదగిన కార్యములేకున్నను - అట్టి జీవన్ముక్తులగు మహాత్ములుగూడ - కొందఱు - జనకుఁడు - రైక్వుఁడు - ఇక్ష్వాకుఁడు - శ్రీకృష్ణుఁడు మొదలగువారు - ప్రారబ్ధకర్మబలముచేత లోకసంగ్రహము కొఱకు - కర్మరంగము (కర్మయోగము) నందు విహరించి యున్నారు. కావున తత్త్వవిదులగు జీవన్ముక్తులుగూడ నిష్కామ కర్మ యోగనిష్ఠులుందున్నారను ఈ అభిప్రాయమును శ్రీశంకరులు గూడ "కర్మణైవహిసంసిద్ధి మాస్థితా జనకాదయః" ఇత్యాది గీతా శ్లోకములను వ్యాఖ్యానించు నపుడు స్పష్టముగా నంగీకరించియే యున్నారు. కావున ఆత్మసాక్షాత్కారులగు జీవన్ముక్తులకుఁగూడ లోకసంగ్రహము కొఱకగు కర్మప్రవృత్తి శ్రీశంకరులకుఁగూడ నభిమతమే యగుచున్నది. అయినను ద్వితీయ మంత్రార్థమును అనుసరించి - తత్త్వవేత్తలుగూడ యావజ్జీవమును కర్మనే చేయవలయునని ప్రమాణీకరించుచు "సన్యాసమే కూడ" దనువాదులను నిరసించుటకై శ్రీశంకరులు - వేదోక్తమగు నిష్ఠాద్వయమును విభజించుచు ఇట్లు వ్యాఖ్యానించిరని చెప్పనగును. ఆత్మజ్ఞుఁడు విధినిషేధములకు వశ్యుఁడు కాఁడు.

కర్మనొనర్చుటవలనగాని, కర్మనొనర్పకుండుటవలనఁగాని, ఆతనికెట్టి ప్రయోజనమునులేదు. జనకుఁడు, శ్రీకృష్ణుఁడు మొదలగువారు అట్టివారే యగుచున్నారు. అయినను వారు లోక సంగ్రహముకొఱకు సజ్జనాభినందితమగు సత్కర్మ నాచరించియే యున్నారు. కావున ఇందలి ప్రథమమంత్రోక్తమగు సర్వత్యాగ దృష్టిగల తత్త్వవేత్తలుకాని, ముముక్షువులుగాని, కామ్యనిషిద్ధ కర్మలను విడిచి వేదోక్తమును, స్వాశ్రమోచితమును అగు కర్మను ఆచ

రించుట అసంగతము కానేరదని తలంచుచున్నాను. ఇందుకు యోగవాసిష్ఠాదిస్మృతి ప్రామాణ్యమున్నది. అయినను ప్రారబ్ధ వలన తత్త్వవిదులగు విద్వాంసులలో కొందఱు జీవన్ముక్తిసు-కాలమున గృహస్థాశ్రమమును విడిచి విద్వత్సన్న్యాసమును గ్రహించట్లును, కొందఱు యావజ్జీవమును గూడ లోకసంగ్రహముకొ కర్మలనాచరించుచునే యుండిరట్లునుగూడ శ్రుతి స్మృతులం స్పష్టపడు చున్నది. ఒక్క విషయము మాత్రమిచట ముఖ్యము, గుర్తింపఁదగియున్నది. నిష్కామమగు సత్కర్మాచరణము చిత్తశుద్ధి ద్వారమున మోక్షమున కుపాయమగుచున్నది. కావున మానసికమగు కర్మత్యాగములేని ముముక్షువులు శారీరకమగు కర్మత్యాగమును చేయుట సముచితము కానేరదు. మానసికమగు కర్మత్యాగము సిద్ధించునంతవఱకును ముముక్షువులగు మనుష్యులు ఫలాభిసంధిని విడిచి సర్వకర్మలను గూడ బ్రహ్మార్పణబుద్ధిచే సొనర్చుచు జీవింపఁగోరదగును. దానివలన వారికి క్రమముగా చిత్తశుద్ధియు జ్ఞానమును-ఆత్మసాక్షాత్కారమును-కలుగనేర్చు విషయము. కలిగి అమృతత్వము సిద్ధించునని గ్రహింపనగునది.

"బ్రహ్మ విదులగు జ్ఞానులు కర్మ సొనర్పఁదగునా లేదా" ? అను సంశయము, శ్రీరామ వసిష్ఠ సంవాదమునచే స్పష్టము కాఁగలదు. కావున యోగ వాసిష్ఠమునందున్న నిర్వాణ ప్రకరణమందలి 199 వ సర్గమునందు చెప్పఁబడిన అభిప్రాయము నిచ్చట సంగ్రహించుచున్నాను దానినామూలముగ గ్రహింపఁగోరిన జిజ్ఞాసువులు మూలమునే పరిశీలించునది. అందలి సంగ్రహము నిచట వ్రాయుచున్నాను.

శ్రీరాముఁడు :— జ్ఞానైక నిష్ఠులును, ఆత్మారాములును అగుట వలన జీవన్ముక్తులు-కర్మపరిత్యాగము (సన్న్యాసము) చేయ వలసియున్నదిగదా ! అట్లేల చేయుటలేదు ?

శ్రీ వసిష్ఠుఁడు :— జీవన్ముక్తుఁడగు జ్ఞానికి ఇది త్యజింపదగినది అను దృష్టి (తలంపు) గాని, ఇది గ్రహింపఁదగినది అను

దృష్టిగాని. లేదు. అన్నిటియందునుగూడ బ్రహ్మమాత్ర దృష్టియే (విజ్ఞానమే)కలదు. కావున పనిని విడుచుటచేతఁగాని, పనినొనర్చుట చేతఁగాని వానికిప్రయోజనములేదు. జీవన్ముక్తునకు సన్యాసము చేత గాని, కర్మ నిష్ఠచేతగాని, ప్రయోజనమేదియులేదు. కావున "కర్మ త్యాగము చేయవలసియున్నది గదా" అను సంశయమునకు నచట ప్రసక్తిగలుగదు వర్ణాశ్రమోచితమును, ప్రవాహపతితమును అగు ఏకార్యమెట్లు చేయవలయునో దాని నతఁడట్లే యాచరించును. శ్రీరామా! ఆయువున్నంతవఱకును దేహము స్పందించుచునే యుండును. కావున యథాప్రాప్తమగు సత్కర్మమును నీశరీరము విశ్రాంతగచేయుఁగాక! అట్లు చేయకుండుటచేతఁగాని, అధర్మముగా చేయుటచేతఁగాని ప్రయోజనమేమున్నది? కార్యముసిద్ధించినను, సిద్ధింపకున్నను సమానమగుచు, నిర్వికారమగు బుద్ధితోఁగూడిన మనుజుఁడు-దేనినెట్లుచేసినను ఆపని దోషరహితమే యగును. కొందఱు జీవన్ముక్తులు సంగ రహితమగు బుద్ధితో ప్రాప్తించిన కార్యము నాచరించుచున్నారు. మరికొందఱు జ్ఞానులు గృహస్థాశ్రమ ధర్మములనన్నిటినిగూడ నిర్వర్తించుచున్నారు. ఇంకను కొందఱు రాగరహితులును, సంగరహితులను అగుచు మహారాజ్యము నేలుచున్నారు. ఈ జీవన్ముక్తులు నాలుగు వర్ణములయందును, నాలుగాశ్రమములందును, స్వోచితమగు కర్మలను కావించుచునేయుందురు, ఇట్లు సర్వకర్మ-ఫలములను త్యజించుచున్నను సర్వకర్మలను గావించుచున్నట్లు నటించుచున్న కొందఱు జ్ఞానులు-అజ్ఞానులగు లోకుల దృష్టియందు అజ్ఞానులవలె కాన్పించుచుందురు. మఱి కొందఱు శూన్యవన ప్రదేశములందు ధ్యానపరాయణులై యుందురు. కొందఱు తీర్థములయందును, పుణ్యాశ్రమములయందును, వసించుచుందురు. సర్వత్యాగముగల ఈజీవన్ముక్తులలో కొందఱు సన్యాస విధిచేత వర్ణాశ్రమాచారములను త్యజించియుందురు. ఆత్మ సాక్షిత్కారులగు జీవన్ముక్తుల విషయమున "ఇట్లు చేయవలయును-ఇట్లు చేయఁగూడదు" అను విధి నిషేధములులేవు. కావున

వారెట్లు చేసినను చేయవచ్చును. అల్పజ్ఞానము
కొందఱు మూఢులు ఆత్మసాక్షాత్కారము
లేకున్నను తాముజీవన్ముక్తులమే యనుకొని "మేము దురాచారము
నొనర్చినను అదిమాకు పాపమును కలిగింప"దని గర్వయుక్తులై
సదాచారములను విడిచి దురాచారముల నొనర్చుచు ఉభయ లో
భ్రష్టులగు చున్నారు. (వీరే మెట్ట వేదాంతులు) జీవన్ముక్తుల
సిద్ధులకు సదాచారమువలన పుణ్యముకాని, దురాచారము వల
పాపముగాని, కలుగదని శ్రుతి స్మృతులు చెప్పినదిసత్యమే అ
నను, ఆత్మవేత్తలగు జీవన్ముక్తులు ప్రారబ్ధముననుసరించి కర
చేయవలసియున్నప్పుడు సత్కర్మమునే యాచరింతురుగాని దుష్క
ర్మము నాచరింపరుగదా. జనన మరణములేయగు సంసారము
దాటుటకు (మోక్షమునొందుటకు) వనవాసముగాని, కర్మత్యాగమ
గాని, కర్మగ్రహణముగాని, ఖ్యాతి-లాభము-ఐశ్వర్యము-సిద్ధి
మొదలగునవి గాని కారణములు కానేరవు. కర్మలయందును, వా
ఫలములయందును, కర్తృత్వమునందును, ఆసక్తముకాని (సంబ
ధములేని) శుద్ధమగు సచ్చిదానంద స్వభావమే మోక్షమునకు ము
కారణమై యున్నది. శుభకార్యములను చేయుచు, అశుభ కా
ములను విడుచుచు కర్మియై యుండినను గూడ అసంగ చిత్తుడ
జీవన్ముక్తుడు మరల జనన మరణ రూపమగు సంసారము
పొందడు. కర్మలన్నిటిని సన్యసించినను గూడ విషయము
యందు ఆసక్తిగల శఠుడు (ఆత్మవంచకుడు) సంసారమున
వశపడియే తీరును. ఏలయనిన, వాసనాప్రేరితమగు ఈబుద్ధి-వి
యములను విడిచినను, విషయములయందలి రుచిని విడువదు. రు
తోఁగూడిన బుద్ధి జీవునకనేక దుఃఖపరంపరను కలుగఁజేయ
చుండును. (నిరంతరమగు ఆత్మనిష్ఠలేని యెడల దీనిని విడుచుట
శక్యముకానేరదు.) అదృష్టవశముచేత ఒక్కొక్కనికి ఆత్మదర్శనమ
కొఱకు వేదాంత శ్రవణాదులయందు రుచికలుగును. శ్రవణాదు
చేత నిర్మలత్వమునొందిన ఆచిత్తము-తత్త్వజ్ఞానముచేత ఆత్మ

సాక్షాత్కారమును బొందిదేశకాలవస్తుభేద రహితమును. అనాసక్తమును, అమనస్కమును, నిర్వికారమును అగు బ్రహ్మమేయగుచుండును. ఓరామా! బ్రహ్మమైన చిత్తము చిత్తము కానేరదు. అది సత్త్వరూపమై యుండును. జ్ఞానులు దానిని చిత్తమని చెప్పక సత్త్వమని చెప్పుదురు. సత్త్వరూపమగు చిత్తముతోఁగూడిన నీవు అన్నిటియందును ఆత్మనే చూచు, సమదృష్టిని కలిగి, చిదాకారరూపమును ధరించి, లోకసంగ్రహము కొఱకు రాజ్యపరిపాలనము నొనరించుచు సుఖముగానుండుము."

మీది ఉపదేశమువలన జీవన్ముక్తునకుఁగూడ-అదృష్టబలము చేత-రాజ్యపరిపాలనావిధర్మము విరుద్ధముకాక సంగతమే యనునంశము స్పష్టపడుచున్నది.

మీది విచారణవలన ఫలాసక్తునకు-కర్మనిష్ఠయు-చిత్తశుద్ధి నభిలషించు మనుష్యునకు (ముముక్షువునకు) నిష్కామకర్మయోగనిష్ఠయు-విరక్తుఁడును ముముక్షువును అగు వివిదిషా సన్యాసికిని-విశ్రాంతి నభిలషించిన విద్వత్సన్యాసికిని-కర్మసన్న్యాసమును సముచితమై యున్నవి. సర్వకార్యములను చేయుచున్నను, మనస్సుచేత సర్వకార్యములనువిడిచి-నిరంతరమగు ఆత్మసాక్షాత్కారము కలుగుట వలన, సర్వకర్మలను, తత్ఫలములను, తత్కర్తను, సర్వప్రపంచమును, గూడ బ్రహ్మమాత్రముగాఁజూడగలిగిన జీవన్ముక్తునకు కర్మచేయుట వలనఁగాని, చేయకుండుట వలనఁగాని, ప్రయోజనము లేకుండుటవలన, ఒకప్పుడు లోకుల అదృష్టమువలన లోకసంగ్రహము కొఱకగు ప్రవృత్తిగాని, జీవన్ముక్తి విశ్రాంతి కొఱకగు నివృత్తిగాని, సమంజసమేయగునని పాఠకులు సంభావింతురని తలఁచెదను.

ఇట్లు-ప్రతిపాదితమగు-జ్ఞాన-కర్మసముచ్చయము-సర్వమతస్థులకును గూడ అంగీకారయోగ్యమగునవి తలంచుచున్నాను.

కర్మవిరతుఁడు - తపోవిరతుఁడు-మొదలగువారు పొందఁదగిన స్థానములు-క్రిందిశ్లోకమున తెలుపఁబడినవి.

"యజ్ఞైశ్చ-దేవానాప్నోతి-వైరాజం తపసా పదమ్
బ్రహ్మణః కర్మసన్న్యాసాద్ వైరాగ్యాత్ ప్రకృతౌలయమ్
జ్ఞానాత్ కైవల్యమాప్నోతి పఞ్చైతాగతయః స్మృతాః"

కర్మనిష్ఠుఁడగు మనుష్యుఁడు-యజ్ఞములచేఁ-దేవలోకమును (స్వర్గమును) పొందును, తపశ్శాలియగు పురుషుఁడు (ఉపాసనొనర్చువాఁడు) విరాట్పురుషసంబంధులగు లోకములను (బ్రహ్మ-విష్ణు-శివాదుల లోకములను) పొందును, వివిదిషాసన్న్యాసియగు పురుషుఁడు-కర్మలను సన్యసించి యోగశక్తివలన బ్రహ్మలోకము నొందును. [ఇతఁడు-విదేహముక్తినిగూడ నొందవచ్చును].

విరాగియగు పురుషుఁడు-వైరాగ్యము వలన సర్వమును త్యజించినను, తత్త్వజ్ఞానము లేకుండుట వలన ప్రకృతియందు లయించును,

విద్వత్ సన్న్యాసియగు పురుషుఁడుగాని, జీవన్ముక్తుఁడగు గృహస్థుఁడుగాని వీరిలో నెవ్వఁడైనను జ్ఞానము [ప్రత్యగాత్మ-పరమాత్మలయేకత్వ దర్శనము]వలన-ఇచ్చటనే బ్రహ్మైక్య రూపమగు అమృతత్వము నొందును.

వేదోక్త కర్మనిష్ఠలేని పాపాత్ములు-నిషిద్ధాచరణమునొనర్చి [ధూమాది మార్గముచేత పితృలోకము నొందక] నారక లోకముం నొంది, తిరుగ నీచయోనులయందు పుట్టుచుందురు.

ఈ యుపనిషత్తుయొక్క చివరను చేర్పఁబడిన పట్టికయందు (1) కేవలకర్మనిష్ఠుఁడు (2) నిష్కామ కర్మయోగి (3) కర్మ-ఉపాసనా సముచ్చయ కర్త (4) కర్మ-జ్ఞాన సముచ్చయకర్త (5) వైరాగ్య సన్న్యాసి (6) వివిదిషా సన్న్యాసి (7) విద్వత్ సన్న్యాసి (8) జీవన్ముక్తుఁడు-మొదలగు వారల యొక్క. స్వరూప-ఆచరణ-గమన-ఫలములు వివరింపఁబడి యున్నవి. పాఠకులు దానిని పరిశీలింపఁ గోరెదను.

శాంకర భాష్యావతారిక:—

"ఈశావాస్యమ్" అను ప్రథమ మంత్రమునందు-అనుభవింపఁదగినదిగా చెప్పఁబడిన-ఆత్మయొక్క- తత్త్వము-4,5,6,7,8 సంఖ్యలుగల మంత్రములచేత ముందు వివరీకరింపఁబడును. ఈ యాత్మ తత్త్వమునుండి పరాఙ్ముఖుఁడగు అవిద్వాంసుని నిందించుటకై క్రింది మూఁడవ మంత్రము ప్రారంభింపఁబడుచున్నది.

మూ॥ అసుర్యానామతేలోకా
అన్ధేన తమసాఽఽవృతాః
తాంస్తే ప్రేత్యాభి గచ్ఛన్తి
యేకే చాత్మహనో జనాః॥ 3

గీ॥ అంధతిమిరా వృతము, లసుర్యములు, నగుచు
కర్మ ఫలరూపములగు లోకములు కలవు
ఆత్మహనన మొనర్చు వారయిన జనులు
తనువుడిగి అట్టిలోకమ్ము (జన్మమ్ము)లను వసింతుర॥

పదవిభాగము:— అసుర్యాః, నామ, తే, లోకాః, అన్ధేన, తమసా, అవృతాః, తాన్, తే, ప్రేత్య, అభిగచ్ఛన్తి, యే, కే, చ, ఆత్మహనః, జనాః.

టీ:— అసుర్యానామ=అసురములని ప్రసిద్ధి నొందిన దేవాది జన్మములేవేవికలవో, తే, లోకాః=కర్మఫలములను అనుభవించెడి ఆజన్మములు (ఆలోకములు) అన్ధేన=అదర్శనాత్మకమగు, తమసా=అజ్ఞానమను చీకటిచేత ఆవృతాః=కప్పఁబడియున్నవి. ఆత్మహనః=ఆత్మను గ్రహింపకుండుట వలన ఆత్మహంతలగు, జనాః=జనులు, యేకేచ=ఎవరెవరున్నారో, తే=వారు, ప్రేత్య=మరణమునొంది, తాన్=దేవతలు మొదలుకొని స్థావరముల వఱకునుగల అజన్మములను అభిగచ్ఛన్తి=పొందుచుందురు.

తా॥ అవిద్యాదోషముచేత ఆత్మను గ్రహింపని మనుష్యులు శరీరమును విడిచిన పిమ్మట, అంధతామిస్రముచేత కప్పఁబడినవియు

అసురులకు సంబంధించినవియు, (అజ్ఞులకు సంబంధించినవియు) తమ సంస్కారమునకును, కర్మకును అనురూపములగునవియు, అగు ఉత్తమ-మధ్యమ-అధమ-జన్మములను (లేక లోకములను) పొందుచుందురు.

శాంకర భాష్యార్థము :—

పరమాత్మస్వరూపము అద్వితీయమని తెలియకుండుటవలన భేదదర్శులగు దేవతలుకూడ అసురులే అనబడుచున్నారు. లోక్యన్తే-భుజ్యన్తే-ఇతిలోకాః-అను వ్యుత్పత్తినిబట్టి కర్మఫలముల ననుభవించునవియగు జన్మలే లోకములని చెప్పబడును. ఆజన్మలు కనబడనిదగుటవలన చీకటివంటిదగు అజ్ఞానముచేత ఆవరింపబడి (ఆచ్ఛాదింపబడి)యున్నవి.

అయజ్ఞానముచేత (స్వాత్మనే యెఱుగరు)

వేదమునందు నిషేధింపబడిన అహింసాదిరూపమగు కర్మను గాని, విధింపబడిన దేవతాదిజ్ఞానమునుగాని, కలిగి యుండిన అవిద్వాంసులు ఆత్మనెఱుగకుండుటవలన ఆత్మహంత(కు)లని చెప్పబడుదురు. ఆత్మనెఱుగక మరణించిన యజ్ఞానులందఱునుగూడ తమ తమ శరీరములను విడిచినపిమ్మట వారివారి సంస్కారములకు తగిన చెట్లుమొదలు దేవతల వఱకునుగల ఆయా జన్మలను పొందుచుందురు.

(భాష్యమునందలి పూర్వపక్ష సిద్ధాంతములు-ప్రశ్నోత్తరరూపమున గ్రహింపబడుచున్నవి.)

ప్రశ్న :— అయ్యా! ఆత్మను చంపుకొన్నవారు - ఆత్మహంత(కు)లని చెప్పబడుదురు. ఆత్మయనగా శరీరమేయగును. కావుననే ప్రపంచమునందు తనశరీరమును చంపుకొన్నవారినే ఆత్మహత్యచేసికొనినవారని లోకులుచెప్పుచుందురుగదా. మీరుమాత్రము ఆత్మనుతెలియనివారగుఅవిద్వాంసులను ఆత్మహంత(కు)లని వ్యాఖ్యానించుచున్నారు. కావున మీరుచెప్పినది లోకాభిప్రాయమునకు విరుద్ధముగానున్నది. మంత్రమునకు సరియగు నర్థము చెప్ప

వలసిన యెడల తన శరీరమును చంపుకొనిన ఆత్మహంత(కు)లు అంధకారావృతములగు లోకములకు పోవుచుందురని చెప్పవలసి యున్నది.

ఉత్తరము :— అధ్యాత్మశాస్త్రమునందు అనిత్యమగు శరీరము ఆత్మకాదు. నిత్యమగు ఆత్మ శరీరముకాదు. నిత్యమగు తన యాత్మను తెలియ కుండుటవలనఁగలిగిన భ్రాంతిచేత అవిద్వాంసులగు జనులు నిత్యమగు ఆత్మను తిరస్కరించు చున్నారు. "నాకు జనిలేదు, మృతిలేదు, క్షుత్పిపాసలు లేవు, శోక మోహములులేవు, నేను కర్తనుకాను, నేను-దేహేంద్రియప్రాణమనోబుద్ధి అవిద్యా విలక్షణుఁడను, సచ్చిదానందస్వరూపుఁడను" అనియాత్మను తెలిసికొనక "నాకు జన్మమున్నది, మృతియున్నది, క్షుత్పిపాసలున్నవి, శోక మోహములున్నవి, నేనేకర్తను, దేహేంద్రియ ప్రాణ మనోబుద్ధి రూపుఁడను" అని తనయాత్మను తిరస్కరించుటయే ఆత్మ హత్య అని చెప్పఁబడును.

తన శరీరమును నశింపఁజేయుటయే ఆత్మహత్యయని లోక ప్రసిద్ధమగు నభిప్రాయము— ఈ అధ్యాత్మశాస్త్రమునందు సముచితముకాఁజాలదు. కావున "నేను దుఃఖిని" అను నీవిధమగు అధ్యాసమే (ఒక వస్తువునింకొక వస్తువుగా తలంచుసదియగు భ్రాంతియే) ఆత్మకు తిరస్కారమగు చున్నది. ఈతిరస్కారమే యీ యధ్యాత్మ విద్యయందు ఆత్మహత్యయని చెప్పుటకు సముచితమగును.

ప్రశ్న :— హత్యయనఁగా హింసగదా! నిత్యమగు ఆత్మ హింసింపఁబడదుగదా! హింసింపఁబడని యాత్మకు హత్యయను నదికలదా ?

ప్రశ్న :— నిర్దోషియగు నొకానొక మహాత్ముని ఎవ్వరైనను అన్యాయముగా నిందించిన యెడల లోకులు దానిని "అశస్త్ర వధ" అని చెప్పుదురు. అశస్త్రవధ యనఁగా ఖడ్గాది ఆయుధము లేకుండచంపుట! అనియర్థము. ఇచ్చట-నిందించుట-చంపుటకంటె వేరయినను గూడ "అశస్త్రవధ" అని ఔపచారికముగాఁజెప్పఁబడి

యున్నదిగ్గదా! ఇట్లే-"అజుఁడు, అమరుఁడు" ఇత్యాది అనుభూ
"రూపుఁడగు ఆత్మకు "జన్మగలవాఁడు, మృతిగలవాఁడు," అను నీచ
మగు భ్రాంతిచేతనగు తిరస్కారము, హింసయంటిదే యగుటవ
ఆత్మయందగు అనాత్మత్వ భ్రాంతియే ఇచట ఆత్మహత్యగాఁజెప్పఁ
బడినదని గ్రహింపవలయును. పారమార్థిక దృష్టిచేత-ఈయా
అచ్ఛేద్యము-అదాహ్యము అక్లేద్యము-అశోష్యము-నిత్యము - సర్వ
గతము-స్థాణువు-అచలము-సనాతనము - ఇత్యాదిగాఁజెప్పఁబడిన
గదా! ఇట్లు స్వాత్మహత్యకు నొనర్చుకొనిన (ఆత్మనెఱుఁగని)
యజ్ఞానులు-ఆత్మహనన దోషముచేత-జననమరణ భ్రమణరూ
మగు సంసారము నొందుచుందురు.

ఉవటాచార్య భాష్యము :—

ఎవరు-ఆత్మను-అద్వితీయుఁడని తెలియరో వారు-స్వర్గాదిలోకములను బొంది మరల మరల పుట్టుచు చచ్చుచు నుందురు.

ఈశావాస్య రహస్యము :—

ఆత్మజ్ఞానము నుపేక్షించి భోగలంపటులగుటవలన దేవతలుగూడ అసురులే యగుదురు.

ఒక విధముగానున్న యాత్మ నింకొక విధముగా గ్రహించిన పాపాత్ములు చోరులును-ఆత్మాపహారులును-అగుచున్నారు. కావున స్వాత్మజ్ఞానమును తిరస్కరించుకొనకుండ వర్తింపఁగూడదు.

ఈశావాస్య దీపిక :—

ధనాభిలాషచేత - ఈశ్వరజ్ఞానశూన్యులగు మూఢులు - జ్ఞానమును పొందుట కగిన యోగ్యతగల యీ మనుష్యశరీరమును విడిచి-అవిద్యా-అస్మితా-రాగ-ద్వేషలతోఁగూడిన, అంధతామిస్రమను పేరుగల అహం మమాభిమానముచేత నావరింపబడి-కర్మఫలరూపములగు కుక్క, పంది, మున్నగు దేహవిశేషములను బొందుదురు.

ఈశావాస్య రహస్య వివృతి :—

అసువులనగా ప్రాణములు, వానియందు రమించువారు అసురులు. ప్రాణపోషకులగు దేవాదులు గూడ అసురులే యగుదురు. అట్టి అసురులకు సంబంధించినవియగు, సూకరాది శరీరములుగాని, స్థానములగు నరకాదులుగాని, అసుర్యలని చెప్పఁబడును. విచారశూన్యు లగుటవలన స్వాభావికాజ్ఞానముచేత నావ్రియఁబడిన జీవులు-దేహమే-ఆత్మయను తలంపుచేత కామ్యకర్మపరులై, ఆత్మను తిరస్కరించుటవలన ఆత్మహంతులై యున్నారు. అట్టిమూఢులు అసురములగు యోనులందు పుట్టి చచ్చుచుందురు, వారికి ముక్తి కలుగదు.

అనంతాచార్య కృతమగు ఈశావాస్యభాష్యము :—

కేవల విషయాసక్తులయి ప్రాణపోషణమాత్రపరులగు నజ్ఞానులచేత పొందఁదగిన జన్మములే అసుర్యములని చెప్పఁబడును.

అద్వైతానందలహరి :—

బ్రహ్మలోకము వఱకుగూడ పొందఁదగిన జన్మములన్నియు-అసుర ప్రాకృతికములై యున్నవి.

ఈశావాస్య మంత్రోక్తమగు సర్వత్యాగయోగములేని మూఢుల-ఆజన్మములను బొందుచుందురు.

ఆత్మ పురాణము :—

"సుష్ఠు + రమన్తే-ఇతిసురాః" అను వ్యుత్పత్తి వలన-ఆత్మయందే లెస్సగా రమించువారగు విద్వాంసులు సురలని చెప్పఁబడుదురు. వారికంటె భిన్నులగు అజ్ఞానులు-అసురులని చెప్పఁబడుదురు. వారికి తగినలోకముల-అసుర్యములని చెప్పఁబడును.

విశిష్టాద్వైత భాష్యము :—

మీఁదిమంత్రములచేత-తత్త్వత్రయ(చిదచిదీశ్వర) స్వరూపమును-విద్యాంగమగు కర్మానుష్ఠాన స్వరూపమును-ఉపదేశింపఁబడినవి. కొందఱు-అసుర ప్రకృతులగు మూఢులు ఈ తత్త్వత్రయమును వేఱొక తీరునఁదెలిసికొని, కామ క్రోధ లోభాద్యావిష్టులై శాస్త్రవిధిని విడిచి-కామ్యమగు యజ్ఞాదికర్మను. నిషిద్ధమగు పరదార గమనాది కర్మముగూడ చేయుచుందురు. వారికి నరక లోకప్రాప్తి కలుగక తప్పదని చెప్పుచున్నాఁడు.

అసురప్రకృతులగు మూఢులు కనుభవింపఁదగినవియు, మిక్కిలి గాఢమగు అంధకారముచేత వ్యాపింపఁబడినవియు, అనఁగా వెలుతురులేనివియు అగులోకములు అసుర్యములని ప్రసిద్ధములై యున్నవి. దేవజాతీయులుగాని మనుష్య జాతీయులుగాని,యెవరెవరు బ్రహ్మజ్ఞానవిహీనులగుచున్నారో, జననధర్మము గల వారందఱునుగూడ, ఆత్మఘాతులగుచున్నారు. కావున మరణించిన పిమ్మటవారు భూమి-అంతరిక్షము, స్వర్గము, రౌరవము మొదలగు పేళ్లుగల నారక లోకములను నిరంతరముగాఁబొందుచుందురు.

ద్వైతభాష్యము :—

ఇట్లు - యోగ్యతగలవానికి పరమాత్మ తత్త్వబుద్ధి గలిగించుటకై - శ్రుతిమాత-పరమాత్మ విముఖులగు వారల నిందించుచున్నది.

సూర్యప్రకాశము లేనివియు, నిరతిశయ దుఃఖము గలవియు, నగు లోకములు అసుర్యములని చెప్పఁబడును. అసు యనఁగా విదట విష్ణువు. ఆవిష్ణునందు విముఖులగు మూఢు మహాదుఃఖైక హేతువులగుటవలనను, అసురులచేత పొందఁదగిన వగుట వలనను, అసుర్యములని చెప్పఁబడునవియు- అతినిబిడమగు అంధకారముచేత నావరింపఁబడినవియు, నగు లోకములను పొందు చుందురు. "అన్ధేన తమసా" అను పదములకు-అదర్శనాత్మకమ అజ్ఞానముచేత అనియు. "లోకాః" అను పదమునకు జన్మ లనియు చెప్పఁబడిన అద్వైత భాష్యములు సమీచీనములు కా

ప్రసిద్ధములగు లోకములు-అజ్ఞానావృతములు కావు.

స్వాభిప్రాయము :—

పరమాత్మ-దేశ-కాల-వస్తు-విభాగములేక అఖండ స్వరూపుఁడై యున్నాడు, ఆకాశమువలె-సర్వభూతములయందునుగూడ అంతర్బహిర్మధ్యము లందంతటను వ్యాపించుచు ప్రాణులబుద్ధి గుహలయందు తానే ప్రత్యగాత్మ స్వరూపుఁడై యున్నాడు.

ప్రాణులందఱునుగూడ-పరమార్థ దృష్టిచేత ప్రాకృతికము లగు దేహాదులకంటె వేరయి వానిని ప్రకాశింపఁజేయునవియు, పరిపూర్ణసచ్చిదానంద పరమాత్మకంటె వేరుగానివియు, ఉపాధిభేదముచేత వేరుగానున్నట్లు తోఁచుచున్నను తాత్త్వికదృష్టిచేత ఒక్కటియే అగుచున్నవియు అగు ప్రత్యగాత్మ (స్వరూపు)లే యగుచున్నారు.

అయినను అన్నమయ-ప్రాణమయ-మనోమయ - విజ్ఞానమయ-ఆనందమయ కోశములయందు-అవియే తానను ఆత్మాజ్ఞానము వలనఁగలిగిన అధ్యాసచేత-స్వాత్మలనే తిరస్కరించుచుందురు.

అవిద్యావాసనలచేత అకర్తయగు ఆత్మను కర్తగాను, శోకాది రహితుఁడగు ఆత్మను - శోకాదియుక్తుఁడుగాను, క్షుత్పిపాసాది సంబంధ రహితుఁడగు, ఆత్మను క్షుత్పిపాసాది వంతును గాను, జననమరణాదిశూన్యుఁడగు నాత్మను జననమరణాది యుక్తుఁడుగాను, తలంచుటయే ఆత్మను (తనను) తిరస్కరించు కొనుట యగుచున్నది. "అసన్నేవ స భవతి. అసద్బ్రహ్మేతి వేద చేత్" అను శ్రుతివలన అసత్యములగు దేహాదులే తామనుభావనగల మూఢుఁడు-సంసార ప్రవాహమునందుఁబడి పుట్టుచు చచ్చుచుందురు ఇట్లు-మృత్యువశులగు చుండుటకు-ఆత్మ తిరస్కారమే కారణమగుచున్నది. కావున ఆత్మతిరస్కారమే ఆత్మహననమని యీ తృతీయ మంత్రము నందు గ్గడింపఁబడినది, శరీరమును ఖడ్గాదులచేత నశింపఁజేసి కొనుట ఆత్మహత్యకానేరదు-భ్రాంతిమూలమగు ఆత్మతిరస్కారమున్నంతవఱకును-శరీరములు పుట్టి చచ్చుచునే యుండును. కావున నెవ్వఁడును స్థూల శరీరమును నశింపఁజేసి కొనుటచేత ఆత్మహత్యనొనర్చుకొనుటకు సమర్థుఁడు కాఁజాలఁడు, కావున నాత్మ నెఱుఁగనివారు ఆత్మహంతలనియును, అట్టివారు-అజ్ఞానావృతములగు తమస్సులోకములు అసుర్యములను పొందుచుందురనియును, తెలియఁజేయునదియగు శాంకరభాష్యము-గభీరార్థసమన్వితమగుట వలన చాల సమీచీనమగుచున్నది. అందు మన్త్రార్థములను, లోకరక్షణమును, కొన్ని అద్వైత భాష్యములందును, విశిష్టాద్వైత-ద్వైత-భాష్యముల యందును చెప్పఁబడిన యర్థములు లోక ప్రసిద్ధములగు నర్థములై యుండుట వలన నవియు సమీచీనములే యగును. అయినను నిగూఢములగు నర్థములను బోధించునదియగు శాంకరభాష్యార్థము వానికంటె శ్రేష్ఠమని విజ్ఞులు గ్రహింతురని తలఁచెదను.

ఆత్మజ్ఞానములేని మూఢులు-ఎవ్వరైనను అసురులే యగుదురు. అజ్ఞానమువలన అట్టిమూఢుఁడు - నిరతిశయదుఃఖప్రదము

లును, సూర్యాలోకాది రహితములును, అసురులచేత పొందఁదగి నవియు, అగు లోకములను పొందినను, ఆయాలోకముల యందు గూడ-ఆయాలోకములకు తగినవియు, కర్మఫలరూపములును, అగు జన్మములను పొందకుండ నుండరుగదా।

కావున అట్టిలోకములను పొందుచుండినను-అజ్ఞానావృతము లగు జన్మములను పొందుచుండినను గూడ-పదార్థ నిర్వచనమునందే భేదము కాన్పించుచున్నది గాని యథార్థవిషయమునందు భేదము కాన్పించుట లేదని విజ్ఞులు గ్రహింతురుగాక।

(శాంకర భాష్యావతారిక)

ఆత్మయే-తెలియఁదగినది. ఆత్మహననము వలన-అవిద్వాంసులు-సంసారమును పొందునట్లు-ఆత్మవేత్తలగు విద్వాంసులు-జననమరణములనుండి విడుదల (ముక్తి) నొందుచుందురు. కావున ఆత్మవిదులగు విజ్ఞానులు ఆత్మ హంతలు కారు. ఆత్మయొక్క స్వరూపమును ప్రత్యక్షముగాఁ దెలిసికొనని మనుష్యుఁడు ఆత్మవిదుఁడు కానేరఁడు. కావున క్రింది మంత్రమునందాత్మ తత్త్వమెట్టిదో తెలుపఁబడుచున్నది.

మం॥ అనేజ, దేకం, మనసో౽వీయో।
నైనద్దేవా అప్నువన్ పూర్వమర్షత్
తద్ధావతోఽన్యా నత్యేతి తిష్ఠత్
తస్మిన్నపో మాతరిశ్వా దధాతి ॥

తే॥గీ॥ కంపన వివర్జిత, మది, యేకము, మనస్సు
కంటెను జవియు, నింద్రియ-గతికి మించె
యెల్లకావుల విలిచి బాసిల్లుఁగాన
దేవ సంఘాత మాయాత్మఁ దెలియకుండు॥
ఆది అవిక్రియమై యున్నదయ్యు-ఇంద్రి
యాదులను మీరి చనుచున్నయట్లు తోచు
ఆత్మ-వెలుఁగ, క్రియాత్మకుండయిన మాత
రిశ్వుఁడీ భూతభౌతిక క్రియల జరుపు॥

పదచ్ఛేదము :— అనేజత్ + ఏకమ్, మనసః, జవీయః, న, ఏనత్, దేవా, ఆప్నువన్, పూర్వమ్, అర్షత్, తత్, ధావతః, అన్యాన్, అత్యేతి తిష్ఠత్, తస్మిన్, అపః, మాతరిశ్వా, దధాతి,

టీక :— అనేజత్=(న+ఏజత్) కదలకుండు నదియు, ఏకమ్=సర్వభూతముల యందును, ఒక్కటియే యాయి యున్న దియు, మనసః=సంకల్పాది లక్షణమగు మనస్సు కంటెను, జవీయః=మిక్కిలి వేగముగలదియు, (కనుకనే) పూర్వమ్=మనస్సు కంటె ముందుగానే, అర్షత్=అంతటను పొందియున్నదియు నగు, ఏనత్=ఈ యాత్మను దేవాః=ప్రకాశ స్వరూపములగు ఇంద్రియములు, నాప్ను న్=పొందనివాయెను.తత్=ఆయాత్మ.తిష్ఠత్=చలింప కుండినను గూడ, ధావతః=పరుగెత్తుచున్న అన్యాన్=కర్మేంద్రియ, జ్ఞానేంద్రియములను, అత్యేతి=అతిక్రమించునది వలెనే యున్నది తస్మిన్=ఆయాత్మ స్వరూపము చైతన్య స్వభావమై యుండగా, మాతరిశ్వా=వాయువు, అపః=అప్పులను-అనగా; ప్రాణిచేష్టా రూపములగు కర్మలను, దధాతి=వేరుపఱచు చున్నది, లేక ధరించుచున్నది.

శాంకర భాష్యార్థము :—

ఆత్మ ఎల్లప్పుడునుగూడ ఏకరూపమగు చుండును. కావున స్వరూపావస్థనుండి ప్రమాదమునొంది చలించునది కాదు. రెండవ వస్తువులేక పరిపూర్ణమై యుండుటవలన, నిరుపాధికమగు స్వరూపముచేత నిట్లు చలింప కుండిన దైనను సంకల్ప వికల్పలక్షణమును, అంతఃకరణమును అగు మనస్సనెడి ఉపాధి ననుసరించుట వలన, చలనము మొదలగు వికారములకు ఆశ్రియమై యున్నది.

అదెట్లనిన :— మిక్కిలి వేగముగల మనస్సు-ఆయా స్థలములయందు వ్యాపించుటకు ముందే ఆత్మ-ఆయాస్థలముల యందు నిండి యుండుటవలన మనోవేగము కంటె అత్యధికమగు వేగము గలిగి యున్నది. (కలదానివలె నున్నది) శరీరము లోపలనున్న మనస్సు వెలుపలికెట్లు రాగలదని సంశయము నొంద నక్కరలేదు.

అట్టి శ్రీ-పాండురంగస్వామి [illegible] అష్టభుజ-[illegible]గా శస్త్రములను ధరించుచున్నాఁడు.

అగ్ని [illegible] దహించుట-[illegible]-ప్రకాశమును, [illegible] (మేఘమునకు) [illegible] [illegible] చున్నాఁడు. లేక ధరింపఁజేయు చున్నాఁడు.

[illegible] ఆది [illegible] స్వరూపమును. [illegible] ఆకార [illegible] [illegible] నంశయము. "భీషాస్మాద్వాతః పవతే" అను [illegible] వాయువు [illegible]......... ఇత్యాది శ్రుతుల వలన గ్రహింపవలెను.

ఆనందగిరి టీక :—

ప్రశ్న :— [illegible] [illegible] గదా!

ఉత్త :— [illegible]

ప్రశ్న :— [illegible]

ఉత్త :— [illegible] తెలియఁజేయుటకు కాదు. [illegible]

ప్రశ్న :— [illegible] అను [illegible] [illegible]

ఉత్త :— [illegible]

[illegible] టీక :—

[illegible]

పొందఁదగనివాఁడును, సర్వగతుఁడును, అగు ఆయీశ్వరుని యందున్న అవ్యాకృత కాలమున మొదట నుదయించి-జ్ఞాన-క్రియా-శక్తిరూపుడై యుండి-సర్వకర్మలను ధరించుచు జగత్కారణ మగుచున్నాఁడు.

ఈశావాస్య రహస్యవివృతి :—

ఈ మంత్రమునందు - ఈశ్వర స్వరూపము చెప్పఁబడుచున్నదని గాని యీశ్వరుని కంటె వేరుగానిదగు ఆత్మ స్వరూపము చెప్పఁబడుచున్నదని గాని చెప్ప వచ్చును.

ఆత్మ స్వరూపము—స్వావస్థా ప్రచ్యుతియగు చలనము లేనిది-అనఁగా, బాల్యము మొదలగు నవస్థలుగాని, జాగ్రదాదులగు నవస్థలుగాని, లేక స్వరూపము నుండి దిగజార కుండుటవలన చలింపకుండునది యని యర్థము.

అది-వృద్ధి-అపక్షయము-విపరిణామము-లేనిదై యున్నది.

చంచలమగు మనస్సునకుఁగాని, దేవ శబ్దముచేత వ్యవహరింపఁబడుచున్న యింద్రియములకుఁగాని గోచరించునదికాదు. అనాది-అవినాశి-అసి-సర్వవ్యాపక మగు చుండుటవలన కాల-వాయ్వాదుల నతిక్రమించి పోవుచున్నది వలె నుండును.

దేహాంతర్గతుఁడగు మాతరిశ్వుఁడు-తత్సన్నిధియందే ప్రాణనాది చేష్టలను ధరించుచుండును — లేక క్రియాజన్యములగు కర్మలను స్వాత్మయందు స్థాపించు చుండును. ఈశ్వర సన్నిధి యందతఁడే సూర్యుని ప్రకాశింపఁజేయును, మేఘుని వర్షింపఁజేయును.

వాయువను పేరుగల యీ సూత్రముచేతనే, యీ భూలోకమును, స్వర్గాది పరలోకమును, సర్వభూతములును, సంగ్రథితములై ధరింపఁబడి—క్రియాశక్తి మంతము లగుచున్నవి. "వాయువను పేరుగల యీ సూత్రమును నియమించు వాఁడును-అంతర్యామియు, సర్వాధిపతియు, సర్వనియంతయు, సర్వాధారమును, సర్వలోకములకును- సేతువును, అవ్యక్తమును, అచింత్యమును, అవ్యపదేశ్యమును, షడ్భావ వికార రహితమును, ఏకరూపమును, సర్వధారకమును అగు సత్యవస్తువు బ్రహ్మమే" అని గ్రహించునది.

ఆనందభట్టోపాధ్యాయ కృతమగు ఈశావాస్యభాష్యము :—

నిరుపాధిస్వరూపముచేత-ఆత్మతత్త్వము-చలింపనిదనియు-సోపాధిస్వరూపము చేత మనస్సుకంటె-వేగవత్తరమనియు చెప్పఁబడుచున్నది.

అనంతాచార్యకృతమగు ఈశావాస్యభాష్యము :—

ఈ ఋక్కు-త్రిష్టుప్ ఛందమునకు సంబంధించినది. బ్రహ్మ స్వరూపము-సమాభ్యధిక రహితమని చెప్పుటకై "ఏకమ్" అని చెప్పఁబడినది. లేదా-సర్వ భూతముల యందును విజ్ఞాన ఘనరూపముచేత నేకమై యుండుటవలన "ఏకమ్" అని చెప్పఁబడినది.

బ్రహ్మాది దేవతలుగూడ-బ్రహ్మము నెఱుఁగఁజాలరని చెప్పుటకై-"నైనద్దేవా ఆప్నువన్" అని చెప్పఁబడినది.

వస్త్రమునందు వతుగు పేకలవలె ఏ వాయు సూత్రమునందు కార్యకరణ సమూహమంతయు కూర్చఁబడియున్నదో. ఎవఁడు సూత్రసంజ్ఞుఁడో ఎవఁడీ జగత్తును ధరించుచున్నాఁడో, ఎవఁడు స్వాధిష్ఠానమగు బ్రహ్మమునందు ప్రాణుల కర్మలను అనఁగా (చేష్టాలక్షణములగు కర్మలను లేక సుఖ దుఃఖములను పొందించు నవియగు కర్మలను) ధరించు చున్నాఁడో। యజ్ఞ హోమాదులను స్థాపించు చున్నాఁడో, సమష్టి రూపుఁడును, వ్యష్టిరూపుఁడును, అగు నావాయువును గూడ పరమాత్మయే నియమించు చున్నాఁడని గ్రహింపునది.

అద్వైతా నందలహరి :—

పరమార్థ దృష్టిచేత-చలింపనిదగు నాత్మ స్వరూపము-దేహాత్మ దృష్టిచేత, మనస్సుకంటె మిక్కిలి వేగముగలది వలెను, చలించునది వలెను, తోచుచున్నది.

రూపాదులు లేకుండుటవలన-ఈ యాత్మను, చక్షురాదులగు నింద్రియములు చూడఁజాలవు.

ఆయాత్మ తత్త్వము-మాయాకృతమగు విశ్వరూపముచేత-పరుగెత్తుచున్న, మృత్యు, వాయు-గరుడాదులను గూడ వేగముచేత నతిశయించి పెప్పుచున్నదాని వలె నుండును. ఆ సర్వాధిష్ఠాన బ్రహ్మమునందు సూత్రాత్మయు, కార్య బ్రహ్మమును అగు వాయువు వ్యష్టిజీవులను ధరించుచున్న వాఁడువలె నుండును.

విశిష్టాద్వైత భాష్యము :—

ఇట్లు-సర్వాత్మ్యమని ప్రస్తుతమగు ఈశ్వరతత్త్వముయొక్క (పరబ్రహ్మముయొక్క) అనంత విచిత్ర శక్తియోగమును విచిత్రవంత మగు నఖిలాపము చేత స్ఫురింపఁజేయుచు ఉపదేశించు చున్నాఁడు.

అనేజత్ = పరబ్రహ్మ స్వరూపము - కంపించు నదికాదు. ఏకమ్ = ప్రధాన భూతము-లేక, తనకు వశపడనివాఁడును, సమానుఁడును, అధికుఁడును, అగు రెండవవాఁడు లేనిది. ముక్తులు-బ్రహ్మముతోడి పరమ సామ్యమును బొందినను గూడ బ్రహ్మమునకు అధీనులే యగుదురు, అది-మనస్సుకంటెను వేగవత్తరము.

ప్రశ్న :—. పరబ్రహ్మము - నిష్కంప మనియు, వేగవత్తరమనియు, విరుద్ధముగా నేల చెప్పఁబడినది ?

ఉ :— సర్వవ్యాపక మగుటవలన-వస్తుతః, నిష్కంపమని చెప్పఁబడినది. కావుననే మనస్సునకు గోచరింపని దేశమునందుఁగూడ నెల్లప్పుడును ఉండుటవలన-మనస్సుకంటె జవీయమని ఔపచారికముగాఁజెప్పబడినది.

నైనద్దేవా అప్నువన్-పూర్వమర్షత్=ముందుగానే సర్వ దేవతలను పొందియున్నను గూడ అబ్రహ్మతత్త్వమును హిరణ్య గర్భాదులుకూడ పొందఁజాలకుందురు-బ్రహ్మ స్వరూపము-విభుత్వముచేత నిత్యప్రాప్తమై యున్ననుగూడ, దానిని, కర్మచేత ప్రతిబంధింపఁబడిన జ్ఞానముగల క్షేత్రజ్ఞులు-విద్యాప్రాప్తి కలుగుటకు ముందు స్వబుద్ధిచేత పొందఁజాలరు. "తద్యథా హిరణ్యనిధిం నిహిత మక్షేత్రజ్ఞాః ఉపర్యుపరి సఞ్చరన్తోన విన్దేయుః. ఏవమేవేమాస్సర్వాః ప్రజాః అహర హర్గచ్ఛన్త్య ఏతం బ్రహ్మలోకం నవిన్దన్త్యనృతేన హిప్రత్యూఢాః".

అదెట్లనిన :— తాము నివసించియున్న భూమి క్రిందనే నిక్షేపింపఁబడియున్న హిరణ్యనిధిని (బంగారపురాశిని) తెలియక-కొందఱుమనుష్యులు-ఆ భూమి మీఁదనే సంచరించు చున్నను-ఆ సువర్ణనిధిని గ్రహింపఁజాలనట్లు-తమ హృదయ గుహాలయందే యుండిన దహరాకాశమును బ్రహ్మలోకమును ప్రతిదినమునందును గూడ సుషుప్తికాలమునందు పొందుచున్ననుగూడ మూఢులగు ప్రజలు అనృతముచేత అచ్ఛాదింపఁబడి - తెలియఁజాల కున్నారు. అని-శః యంశము-ఛాందోగ్యోపనిషత్తునందున్న అష్టమ ప్రపాఠకము నందలి తృతీయ ఖండమునఁ జెప్పఁబడినది గదా!

తద్ధావతో-న్యానత్యేతి తిష్ఠత్=పృథివ్యాదుల యందంతటను ఉండుదునే-ఆ బ్రహ్మము-పరుగెత్తుచున్న గరుడాదులనుగూడ నతిక్రమించుచున్నది. (వేగయుక్తమగు గమనముగల వారెంత వఱకు పోవుచుందురో అంతకు మీఁదను గూడ పరబ్రహ్మ ముండునని భావము) తస్మిన్న పోమాతరిశ్వా దధాతి=ఆ వాను దేవుని యందు-అవస్థితుఁడగు మాతరిశ్వుఁడు ధారణమునకు తగిన శక్తి స్యము లేనివాఁడయినను పాథఃపయోధర గ్రహ నక్షత్రాదికమును ధరించుచున్నాఁడు. ఇది మఱియు నద్భుతమగుచున్నది.

సర్వాధార భూతుఁడగు సర్వేశ్వరునిచేత ధరింపఁబడిన వాయువు-అతని శక్తి చేతనే దీని నంతటిని ధరించునని భావము.

విశిష్టాద్వైత పరమగు శ్రీరంగాచార్య భాష్యము :—

నిరాధారమగు ఆకాశము నందొకచోట ఉనికిలేనివాఁడును నిరంతర గమనశీలుఁడును-స్థూలమగు గురుద్రవ్య స్వరూపము లేకుండుట వలన-స్థూల గురుద్రవ్యాంతరములను ధరించుటకు శక్తి గలవాఁడని యూహించుటకుఁగూడ సర్థుఁడు కానివాఁడును, అగు వాయువుకూడ-ఆ బ్రహ్మమునందు-స్థూలములను, గురు ద్రవ్య రూపములను, నిఖిల బ్రహ్మాండకారణములుగా మొదట సృజింపఁ బడినవియునగు కారణజలములను ధరించు చున్నాడు.

ద్వైత భాష్యము :—

పరమాత్మ స్వరూపము—నిర్భయమగుటవలన కంపింపని దగు చున్నది. కాని నిష్క్రియమగుటవలనఁగాదు. ప్రధానమగుట వలన ఏకమగు చున్నది గాని ద్వితీయవస్తువు లేకుండుట వలనఁ గాదు, లెస్సగా తెలిసికొనుటకు వీలుపడని దగుటవలన దేవతలచేతఁ గూడ పొందఁదగనిదని చెప్పఁబడినది కాని సర్వధా అగోచర మగుటవలనఁగాదు. ఆ పరమాత్మ స్వయముగా స్వభావమువలన అన్నిటిని పొందియున్నాఁడు. అచింత్యశక్తి గలవాఁడగుటవలనను సర్వగతుఁడగుట వలనను తాను లెస్సగా నిలిచియున్నను పరుగెత్తు చున్న యితరుల నతిక్రమించు చున్నాఁడు, ఆ పరమాత్మయందు వాయువు- సర్వప్రాణులచేతను కృతములగు కర్మలను సమర్పించు చున్నాఁడు. "నేను కర్తనుకాను హరియేకర్త" సర్వకర్మములను తత్పూజయే-తద్భక్తి-ప్రసాద ఫలకమే-అని అను సంధించుటయే-సమర్పణము,

స్వాభిప్రాయము :—

పరిపూర్ణుఁడగు పరమాత్మయే-ప్రాణుల హృదయముల యందు ప్రత్యగాత్మ స్వరూపుఁడై యున్నవాడువలె నున్నాఁడు. కావున-ఉపనిషత్తులయందు-పరమాత్మయు-ప్రత్యగాత్మయుఁగూడ-కొన్నిచోటులందు, ఆత్మశబ్దముచేత వ్యవహరింపఁబడు చున్నారు.

శ్రీ వేమన భాషా నిలయము

పరమార్థ దృష్టియందు మాత్రము-పరమాత్మ-ప్రత్యగాత్మ [illegible] లగు శుద్ధాత్మలచేత భేదించి యున్నవాఁడుకాఁడు.

కావున-అద్వైత పరములగు భాష్యముల [illegible] పరమాత్మలకు వ్యవహారమునందుఁగల భేదమును పాటింపక వాస్తవిక దృష్టి ననుసరించి ఈ మంత్రమునందు "ఆత్మతత్త్వము" వ్యాఖ్యానింపఁబడుచున్నదని చెప్పఁబడినది. పరమాత్మ-శుద్ధాత్మ-భేద ప్రతిపాదకములగు-విశిష్టాద్వైత-ద్వైత భాష్యముల యందు - పర బ్రహ్మ స్వరూపమగు ఈశ్వర తత్త్వము మాత్రమే మీఁది మంత్రమునఁజెప్పఁబడినట్లు చెప్పఁబడినవి. ఇందలి యభిప్రాయమును పాఠకులిట్లు గుర్తింపఁగోరెదను. నిరుపాధికమగు బ్రహ్మ స్వరూపము-చలింపకున్నను, సోపాధికమగు బ్రహ్మస్వరూపము-మనస్సు కంటెను వేగవత్తరమువలె నున్నది.

పరిచ్ఛిన్నములును, (ఖండములును) స్థూలములును, కార్య రూపములును, అగు వస్తువులన్నిఁటియందునుగూడ-వ్యాపకమును, సూక్ష్మమును, కారణరూపమును, అగు బ్రహ్మ (ఆత్మ) స్వరూపము-వ్యాపించియున్ననుగూడ-చక్షురాదులగు ఇంద్రియములును, బ్రహ్మాదిదేవతలునుగూడ దాని నెఱుంగజాలకున్నారు. అది నిలిచి యున్నను-సర్వగత మగుటవలన ఇంద్రియములను-వాయువును-గరుడాదులను-మనస్సునుగూడ-అతిక్రమించి యున్నదివలెనున్నది.

అది-పరమార్థమున చలింపకున్నను మాయామయ మగు వ్యవహారమున చలించు చున్నట్లున్నది. ఈ యంశము-"అపాణి పాదో జవనో గ్రహీతా" "ఆసీనో దూరంవ్రజతి-శయానో యాతి సర్వతః" అను శ్రుతులచేతఁగూడఁదెలుపఁబడు చున్నది గదా! ఆ బ్రహ్మ స్వరూపమునందే సమష్టి-వ్యష్టి-స్వరూపుఁడును, సూత్రాత్మయు, అగు మాతరిశ్వుఁడు, సర్వకర్మలను అగ్నివి, జలాదులను గూడ ధరించుచున్నాఁడు,

ఇట్లు-సర్వమును ధరించువాఁడగు నా వాయువునుగూడ పర బ్రహ్మమే ధరించి-నియమించు చున్నదని గ్రహించునది.

పరమార్థ దృష్టిచేత-ఇంద్రియములు-మనస్సు-వాయ్వాది భూతములు వానిరూపము-వాని చలనము-మొదలగు నామ రూప కర్మ కలాపమంతయుఁగూడ సత్యము కాదనియు, అది యంతయుఁ గూడ బ్రహ్మస్వరూప మాత్రమే యగుచున్నదనియు గ్రహించునది.

శాంకర భాష్యావతారిక :—

వేద మంత్రములకు జామితాదోషము- అనగా "చెప్పిన యంశమునే మరల చెప్పుట" అను పునరుక్తిదోషములేదు, కావున పూర్వమంత్రమునందలి విషయమే క్రింది మంత్రమున వేరొక విధమున బోధింపఁబడుచున్నది,

మూ॥ తదేజతి, తన్నైజతి, తద్దూరే తద్వన్తికే
తదన్తరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః ౫॥

కం॥ అది-చలియించును-చలియింపదు,
దూరస్థితము-సవిధవర్తియునగు, నయ్యది
ఈ సర్వము లోనున్నది—
దీనికి వెలుపలను గలది-అదియె యగున్॥

పద :— తత్-ఏజతి, తత్-న-ఏజతి-తత్-దూరే-తత్+ఉ-అన్తికే-తత్-అన్తః-అస్య-సర్వస్య-తత్-ఉ-సర్వస్య-అస్య - బాహ్యతః.

టీక — తత్=ఆ యాత్మతత్త్వము, ఏజతి=చలించుచున్నది. తత్=ఆ ఆత్మతత్త్వము-న+ఏజతి=నైజతి=చలించుచున్నదికాదు. తత్=అది, దూరే=దూరమునందును, తత్+ఉ=తదు=అదియే, అన్తికే=సమీపమునందును, తత్=అది, అస్య-సర్వస్య=ఈ జగత్తునకంతకును, అన్తః=లోపలను, తదు=అదియే, అస్య=ఈ, సర్వస్య=సమస్త జగత్తునకును, బాహ్యతః=వెలుపలను (అస్తి=ఉన్నది)

తా॥ అది-చలించును చలింపదు. దూరమునందుండును-దగ్గరనుండును. అదియే ప్రపంచమునకు లోపలను వెలుపలను గూడ నుండును.

శాంకర భాష్యము :—

పరబ్రహ్మ స్వరూపమగు నేయాత్మతత్త్వమిప్పుడు ప్రస్తావింపఁబడినదో, ఆ యాత్మతత్త్వము కదలుచున్నది. అయినను కదలకయే యున్నది. అనఁగా; తాను స్వయముగా అచలమే యగుచున్నను చలించుచున్నది వలెనున్నది, అని యర్థము. ఇంతియే కాదు.

నూరుకోట్ల సంవత్సరముల కైనను - అవిద్వాంసుల చేత పొందఁబడకుండుట వలన-దూరమునందున్నది వలెనున్నది. అదియే విద్వాంసులకు (బ్రహ్మవిదులకు) ఆత్మయగుట వలన మిక్కిలి సమీపమునందే యున్నది వలెనున్నది. వాస్తవిక దృష్టి చేత మాత్రము — అది దూరము నందుఁగాని, సమీపము నందుఁగాని, ఉన్నది కాక-అవిద్వాంసులకును, విద్వాంసులకునుగూడ-ఆత్మయే యగుచున్నది. "య ఆత్మా సర్వాన్తరః" ఏ పరబ్రహ్మము-అన్నిఁటి లోపలను ఉన్నాఁడో అను శ్రుతి వలన-ఈ జగత్తున కంతకును గూడ నిరతిశయ సూక్ష్మమగుటవలన అది-లోపలనున్నది. నామ రూప క్రియాత్మకమగు ఈజగత్తున కంతటికినిగూడ ఆకాశమువలె వ్యాపకమై యుండుటవలన అదియే వెలుపలనుగూడ నున్నది. "ప్రజ్ఞానఘనఏవ" "అది-ప్రకృష్టమగు జ్ఞానముచేత గొప్పదియగు ఒకే స్వరూపము"—

అను శ్రుతి శాసనమువలన-అదియే-సర్వ జగద్రూపము చేతను గూడ నిరంతరమై (తానులేని స్థలములేనిదై) ఉన్నది.

ఉపటాచార్య కృత-ఈశావాస్య భాష్యము :—

నాలుగవ మంత్రమునందు కారణరూపమగు నాత్మ స్వరూపము-నిరూపింపఁ బడినది-ఈ మంత్రమునందు కార్య రూపమగు నాత్మ స్వరూపము-నిరూపింపఁబడు చున్నది.

అదియే-కార్యమగు సర్వజంగమ (ప్రాణి) రూపముచేత నున్నదై-కంపించు చున్నది వలెనున్నది. స్థావర రూపముచేత నున్నదై - కంపింపక యున్నది. అదియే-ఆదిత్య నక్షత్రాది రూపముచేత దూరమునందున్నది. అదియే-వ్యతిరేకారి

రూపముచేత-సమీపము నందుఁగూడ నున్నది. "సర్వం ఖల్విదం బ్రహ్మ" ఇది యంతయు బ్రహ్మమేగదా!" అను దర్శనము-దీని వలన తెలియుచున్నది. అదియే ప్రాణులన్నిటిలోపలను గూడ విజ్ఞాన ఘన రూపముచేత ప్రకాశించు చున్నది. అదియే-ప్రాణులన్నిటికిని వెలుపలను గూడ జడరూపము చేత నున్నది.

"బ్రహ్మ స్వరూపము-చేతనాచేతనరూపము-అనంతము-సర్వగతము, అది కాని వస్తువులేదు" అను నర్థము దీనిచేతఁదెలియఁజేయఁబడుచున్నది.

**ఈశావాస్య రహస్యము :—**

అది-బ్రహ్మ-విష్ణు-శివాత్మకమై-చలించు చున్నది.

ఆకారముతోఁగూడినది మాయామయమైయున్నది. కావుననది - మాయా కల్పితమగు నుపాధిచేత చలించు వట్లుండును. నిరాకారమగు బ్రహ్మ స్వరూపము-వాస్తవమై యున్నది. కావున నది చలించునదికాదు.

అది-అవివేకులకు దూరమునందును వివేకులకు సమీపమునందును నున్నది. కార్య కారణ వస్తువుల కన్నిటికిని గూడ నదియే లోపలను గూడ నున్నది.

విశ్వాతీతమగు బ్రహ్మము-విశ్వాభ్యంతరము నందున్నది. అది సర్వ గతమనియు, మాయాతీత మనియు, నిరూపమనియు, గ్రహించిన విజ్ఞాని-జన్మబంధనము నుండి విముక్తుఁడగును.

**ఈశావాస్య దీపిక :—**

మూర్తమగు అగ్నిజ్యోతి రూపముచేత కంపించుచున్నట్లు తోచుచున్న యీశ్వర స్వరూపము-అమూర్త రూపమగు ఆకాశముచేత కంపింపబడని వలెనే యున్నది. కావున-ఈశ్వర స్వరూపము-మూర్తరూపముకంటెను అమూర్త రూపముకంటెను వేరగుచున్నదని తెలియునది.

**ఈశావాస్య రహస్యవివృతి :—**

ఆత్మ తత్త్వము-తెలియుటకు శక్యముకానిది, అంతర్యామి-వ్యాపకము అని చెప్పఁబడిన నాలుగవ మంత్రముయొక్క అర్థమునే అనువదించి అది-సర్వాత్మకము-నగు ప్రాభవము-అను నంశము నైదవ మంత్రముపపాదించుచున్నది.

జామిత-అనఁగా ఆలస్యము, ఒకే పర్యాయము చెప్పఁబడిన రహస్యము చిత్తమునందు స్థిరపడదను నభిప్రాయముచేత-అనలస యగు శ్రుతి-కరుణామయి యగు తల్లి వలె-పూర్వోక్తమగు మంత్రార్థమునే మరల నుపదేశించు చున్నది.

ఆత్మ తత్త్వము-జంగమమై చలించుచున్నది. స్థావరమై చలింపకున్నది. దూరమందున్నదియు, సమీపమునందున్నదియుఁగూడ నదియే. "పురుష ఏవేదం సర్వమ్ యద్భూతం యచ్చభవ్యమ్" "పుట్టియున్నదియు, పుట్టఁబోవునదియు నగు నీ సర్వ ప్రపంచముఁగూడ-పురుషుఁడే యగుచున్నాఁడు" అను శ్రుతి వలన, "సర్వగతమును, సర్వరూపమును, గూడ బ్రహ్మస్వరూపమే" అగుచున్నదని గ్రహించునది.

అనంతాచార్యకృత-ఈశావాస్య భాష్యము :—

"ఈ ప్రపంచమునకు లోపలను వెలుపలనుగూడ పురుషుఁడే కాంతిమానుఁడై యున్నాఁడు. బ్రహ్మ స్వరూపము-చేతనాచేతనరూపము-అనంతము."

అని యుపాసించు వ్యక్తికి-అర్చిరాదిమార్గము చేతనగు గమనము కలుగక, యిచ్చటనే బ్రహ్మప్రాప్తి కలుగును.

ఈ యంశము ఈక్రింది శ్రుతివలనఁదెలియనగు.

తస్య ప్రాణా ఉత్క్రామన్త్యత్రైవ సమవలీయన్తే బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి.

"ఆత్మ విదుని ప్రాణములు శరీరమును విడిచి లోకాంతరమునకు ఉత్క్రమించవుకావు ఆ ప్రాణము లిచటనే (ప్రకృతియందు)లయించును. అతఁడు ఆత్మజ్ఞుఁడు కాకముందు గూడ బ్రహ్మమే యగు చున్నాఁడు. కావున విద్వాంసుడు బ్రహ్మమును పొందుచున్నాఁడు" అనఁగా బ్రహ్మమే యగు చున్నాఁడు.

అద్వైతానందలహరి :—

బ్రహ్మము-మాయచేతనగు విశ్వరూపముచేత చలించుచున్నదివలె నున్నది. అయినను తత్త్వతః, చలించుటలేదు. భేద భ్రమవలన-దూరము నందున్నదివలెను, సర్వమునకును ఆత్మయగుటచే సమీపమునందున్నది వలెను, ఉన్నది. అదియే జంగమ-స్థావర రూపముచేతను, మూర్తామూర్త రూపముచేతను, స్థూల సూక్ష్మ రూపముచేతను, కార్య కారణ రూపముచేతను, తదితర భేద రూపము చేతను వ్యాపించియున్నది.

విశిష్టాద్వైత భాష్య-వ్యాఖ్యలు.

పూర్వమంత్రోక్తమగు నర్థమునే యింకొక విధమున మరలఁ దెలుపుచున్నాఁడు. సర్వవ్యాప్తమగు పరబ్రహ్మ స్వరూపము-వెనుక చెప్పిన విధమున వేగవత్తరమై కంపించుచున్నదిఁవలె నున్నది. కాని వస్తుతః కంపించుట లేదు. అసుర ప్రకృతిగల పురుషులకు దూరము నందును. దైవ ప్రకృతి గల పురుషులకు సమీపము నందును. ఉన్నది.

"విషయాసక్తచిత్తులై గోవిందుని యందు పరాఙ్ముఖులైన మూఢులకు-దూరము కంటెను దూరము నందున్నది. విషయము లను త్యజించి-తన్మయులై గోవిందుని యందు చిత్తము నిలిపిన వారికి-సమీపము నందున్నది". అని భగవంతుఁడగు శౌనకుఁడు చెప్పియున్నాఁడు గదా!

దూరమందున్న దానివలెను, విజ్ఞులకు సమీపమందున్న దానివలెను, తోచుచున్నను,అది దూరమునందు గాని సమీపము నందుగాని, లేకయే యున్నది. ఈసర్వజగత్తులకును లోపలను, వెలుపలను, వస్తుస్వరూపమునందును గూడ చిన్మాత్రమగు తన స్వరూపముచేత ఆకాశము వలె సర్వ వ్యాపకమై యున్నది. అణువుకంటె అణీయమని చెప్పఁబడుటచేత-ప్రాణులయందు అంతర్యామియగు ప్రత్యగాత్మ స్వరూపముచేతను, "మహతో మహీయాన్" అని చెప్పఁబడుటచేత-ఈ ప్రపంచమునకు వెలుపల అనంతమగు నిజస్వరూపము చేతను వ్యాపించియున్నది. మాయా మయ మగు ప్రపంచము-సత్యమగు బ్రహ్మము నందు కల్పితమై యున్నది. భ్రాంతి కల్పితమగు సర్పమునందు రజ్జువు వలె-అజ్ఞాన కల్పితమగు ప్రపంచమునందుఁ గూడ-బ్రహ్మము-నిజరూపముచేత వ్యాపించియున్నది, తాఁగా;అది-దూరమునందు - సమీపమునందు-లోపల-వెలుపల-వస్తువు నందుఁ గూడ-వేరుగా ఉన్నది కాదు. అది-ఉన్నది మాత్రమే-దీనివలన "సర్వం ఖల్విదం బ్రహ్మ" "ఇది యంతయును గూడ బ్రహ్మమాత్రమే" అను విజ్ఞానము గ్రహింపఁదగి యున్నది.

ప్రశ్న :— ఈ మంత్రము నందు చెప్పఁబడినది— పరబ్రహ్మ లక్షణమా? ప్రత్యగాత్మ లక్షణమా?

ఉ :— ఆ బ్రహ్మ స్వరూపమే జంతువులగు జీవులబుద్ధి గుహలయందు ప్రత్యగాత్మ స్వరూపమై యున్నది, కావున ఈ ప్రత్యగాత్మ స్వరూపము-పర బ్రహ్మ స్వరూపమే యగు చున్నది. కావున- ఈ మంత్రమునందు చెప్పఁబడినది-పరబ్రహ్మ లక్షణమనియను-ప్రత్యగా లక్షణమనినను గూడ విరోధింప కుండుటకు-"ఆత్మ లక్షణ"మని చెప్పుట సమంజసముగా నుండును. ఆత్మశబ్దము-ప్రత్యగాత్మను, పరమాత్మను గూడ బోధించునుగదా!

ఆనందగిరీయమున అవతారిక :—

ఇట్లు చెప్పఁబడిన ఆత్మయొక్క జ్ఞానమునకు ఫలము-విధి-నిషేధముల నతిక్రమించువాఁడగు జీవన్ముక్త స్వభావముచేత నుండుటయే యని క్రింది మంత్రమున తెలియఁజెప్పఁబడుచున్నది.

మూ॥ యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యే వానుపశ్యతి,
సర్వభూతేషు చాత్మానం తతో నవిజుగుప్సతే॥

కం॥ తనయందు నఖిల భూతము
లు, నఖిల భూతములం(దన్ను, లక్షించుచు నుం
డును గావున-ఆ విద్వన్
మనుజుఁడు మాత్రము-జుగుప్స-మది(గనఁడెపుడున్॥

పదచ్ఛేదము :— యః-తు-సర్వాణి-భూతాని-ఆత్మని-ఏవ-అను పశ్యతి-సర్వభూతేషు-చ-ఆత్మానమ్-తతః-న-విజుగుప్సతే.

టీ :— యస్తు = ముముక్షువును విద్వాంసుఁడును అగు ఏ పరివ్రాజకుఁడు-సర్వాణి-సమస్తములయిన, భూతాని = అవ్యక్తము మొదలు స్థావరముల వఱకునుగల వస్తువులను ఆత్మని + ఏవ = ఆత్మయగు తనయందే, అను పశ్యతి = తనకంటె వేరుకానివిగా చూచుచుండునో, సర్వభూతేషు + చ = ఆ భూతము లన్నిటియందును గూడ, -ఆత్మానమ్ = ఆత్మయగు తనను అనుపశ్యతి = చూచు చుండునో-సః = అట్టి విద్వాంసుఁడు-తతః = ఆ దర్శనము వలన, న + విజుగుప్సతే = దయసులేక రోతను కలిగియుండఁడు.

శాంకర భాష్యము :—

ముముక్షువగు పరివ్రాజకుఁడు మాత్రము - అవ్యక్తము మొదలు స్థావరముల వఱకును గల సర్వవస్తువులనుగూడ - ఆత్మ యగు తనయందే చూచు చుండును. అనఁగా ఆత్మకంటె వ్యతి రిక్తములనుగాఁజూడఁడని యర్థము. అట్లే-చేతనాచేతనాత్మకము లగు ఆ భూతము లన్నిటియందునుగూడ ఆత్మనే చూచు చుండును. తనయందు నామరూప భేదములచేత వేరుగా నున్నట్లున్న వస్తువు లన్నియుఁగూడ, తానుగానే యున్న వనియు, ఆ వస్తువుల నిజ స్వరూపము తానే యగుచుండునుగాని వేరుగాదనియు అనుభవము చేతఁదెలిసి కొనుచుండును.

ఆదెట్లనిన :— ఈ శరీరము-కార్యకారణసంఘాతరూపమై యున్నది దీనికి సంబంధించిన సర్వజ్ఞానములకును సాక్షిభూతుఁడును, ఇంద్రియములను ప్రకాశింపఁజేయువాఁడును, కేవలుఁడును, నిర్గుణుఁడును, అగు ఆత్మ-ఈ సంఘాతము లోపల-దీని కంటె వేరుగా నున్నాఁడనియు, "అతఁడే నే"ననియు, ఈ కార్య కారణ సంఘాతముఁగూడ మాయామయమగుట వలనను, దీనికి ప్రత్యేక స్వరూపము లేకుండుటవలనను, ఆయాత్మయే దీనికిఁగూడ స్వరూపమనియు, విద్వాంసుఁడు తెలిసికొనును.

ఇటు కేవలాత్మనగు ఏ నేను-కార్య కారణ సంఘాత రూపమగు నీ శరీరమున కాత్మనై యున్నానో, ఆ నేనే-ఆ స్వరూపము చేతనే-అవ్యక్తము మొదలు-వృక్షములు-పర్వతములు మొదలగు స్థావరముల వఱకునుగల సర్వ భూతములకును గూడ-సత్యమగు ఆత్మనై (స్వరూపమనై) ఉన్నానని-ఏ విజ్ఞాని-ఈ సర్వ లోకములను గూడ-నిర్విశేషమగు (నామ రూపాది భేద రహితమగు) ఆత్మనుగానే స్వానుభవముచేత తెలిసికొనుచుండునో-ఆ విజ్ఞానికి-దయకు నిమిత్తమగు వేరొక వస్తువేదియు లేకుండుట వలన విజుగుప్సను-అనఁగా దయను ' లేక రోతను (రోతమును) కలిగి యుండఁడు.

ఘృణ-(కనికరము)అను నదంతయు-తనకంటె వేఱుగా చూడఁదగిన యింకొక వస్తువును చూచి నప్పుడే కలుగును-తాను నిర్మలుఁడననియు, తానులేని వస్తువు లేకుండుట వలన నిరంతరుఁడననియు, ననుభవముచేఁ దెలిసిన విజ్ఞానికి-"దయ వహింపఁదగిన వస్త్వంతరములే" దను సంశయ ప్రాప్తించుచున్నది. ఈ యంశమునే శ్రుతి యనువదించుచు-"వాఁడు విజుగుప్స నొందఁ"డని చెప్పుచున్నది.

**శంకరాచార్య కృతమగు భాష్యము :—**

చేతనములు-అచేతనములు-అగు భూతము లన్నియుఁగూడ నా యందే యున్నవనియు, నాకంటె వ్యతిరిక్తములుగా, (వేరుగా) లేవనియు, పరబ్రహ్మమగు

తానే సర్వ భూతములయందును ఆత్మయై యున్నాననియు-తెలిసికొనిన యోగికి-సర్వ భూతములును గూడ-పరబ్రహ్మ మాత్రములై-విజ్ఞాన ఘనానందైక్యము వలన ఆత్మ యందుండునవి యగుచున్నవి. కావున-అద్వైతతత్త్వవేత్తయగు యోగి-విచికిత్సను గావింపఁడు. (విచారణ నొనర్పఁడు.)

ఈశావాస్య రహస్యము :—

బ్రహ్మ స్వరూపము-పరమము-శుద్ధము-అని కర్మచేత లభించునది కాదు. కర్మ త్యాగి-పరబ్రహ్మము నొంది-దుఃఖమునుండి విడిపింపఁబడును.

బ్రహ్మ భిన్న-ఆత్మ స్వరూపుఁడగు పరబ్రహ్మమందే యీ సర్వ భూతములను ఆశ్రయించి యున్నవి. కావున నా భూతములన్నియు గూడ నతఁడు తనయందే చూచు చుండును. అతఁడు సర్వభూత గుహాశయుఁడగు ఆత్మనే-ఆసర్వ భూతములయందును చూచుచుండును.

ఇట్టి సర్వ స్వరూప పరిజ్ఞానము వలన నతఁడు సందేహము నొందఁడు.

ఈశావాస్య దీపిక :—

విరక్తుఁడగు ముముక్షువు-"ఈశ్వరుఁడే ఆత్మ స్వరూపుఁడై యున్నాడు. కావున ఆనంద స్వరూపుఁడును, స్వయంజ్యోతియును, ఈశస్వరూపుఁడును, అగు ఆత్మయందే యీ భూతము లన్నియు నున్నవి" అని తెలిసి కొనును. అనగా: "ఈశావాస్యమ్" అను మంత్రమును చదివిన పిమ్మట యీ భూతములన్నియుఁగూడ నాయందే-అధ్యస్తములై (అవిద్యా కల్పితములై) యున్నవని స్వాత్మను సాక్షాత్కరించుకొనును.

ప్రశ్న :— అధ్యస్తములయిన (భ్రాంతికల్పితములయిన) భూతములు-వినశ్వరములును, ఆత్మకంటె మిక్కిలి వేరయినవియు, నగుచున్నవి కాదా ?

ఉత్త :— "ఈ భూతములన్నిటియందును నేనే యున్నాను", కావున ఈ భూతములు నాకంటె వేరుగావు" అని విద్వాంసుఁడు-ఆ భూతముల కన్నింటికిని సత్యమగు స్వరూపము "తాను" గానే చూచుచుండును. కావున సర్వ భూతములును గూడ బ్రహ్మ భిన్నమగు ఆత్మయే యగుచున్నవి. కావున నవి ఆత్మ కంటె వేరు కావని తెలియునది.

ప్రశ్న :— ఈ దర్శనముచేత లభించునది యగు ఫలమేది ?

ఉత్త :— "ప్రత్యగాత్మనగు నేను-చిదేక రూపమును, ఆనందాత్మయు, సర్వాభిన్నమును, అగు పరబ్రహ్మమనే యగు చున్నాను" అను ఏతన్మంత్రోక్తమగు విజ్ఞానము కలిగిన పిమ్మట-ఆ విద్వాంసుఁడు-స్తుతి నిందలులేని వాఁడగును.

ఈశావాస్య రహస్య వివృతి :—

గురూపదేశము కలిగిన పిమ్మట లోక విలక్షణ దృష్టిగల విద్వాని-అధిష్ఠాన రూపమగు నాత్మయందే సర్వభూతములను అవలోకించును. ఆ సర్వ భూతముల యందును గూడ-ఆత్మయే - కారణ రూపముచేత అనుగతమై యున్నట్లు అవలోకించును. లౌకికమగు ద్వైత జ్ఞానము గలవానికే సంశయము గలుగును. ఐకాత్మ్యజ్ఞానకు సంశయము కలుగదు.

అనంత భట్టోపాధ్యాయ కృతమగు లీలావ్యాఖ్య భాష్యము :—

తత్-త్వం పదార్థమును శోధించిన ముముక్షువు, ఇట్లు చూచుట వలన-దేహాదికమును రక్షింపఁగోరఁడు.

అద్వైతానందలహరి :—

అద్వైతతత్త్వమును గుర్తించిన విద్వాని-ట్లూహించును సర్వమువలె ప్రకృతి-మహత్తు-అహంకారము-పంచతన్మాత్రలు-పంచ భూతములు మొదలగున వన్నియుఁ గూడ-అధిష్ఠానమగు ఆత్మయందే అధ్యస్తములవి (భ్రాంతి కల్పితములవి) చూచును. ఆ ప్రకృత్యాదులయందు-అధిష్ఠానమగు నాత్మయే-అఖండరూపముచేత అనుగతమై యున్నదని చక్కఁగా చూచును. కావుననే సర్వత్యాగ సహితమగు అద్వైతైక్య జ్ఞానమును గలిగియుండుటవలన ఆ విద్వాని-ద్వైతము పొందఁడు.

విశిష్టాద్వైతభాష్యము :—

ఈ సర్వమును గూడ బ్రహ్మాత్మకమను నంశము-పూర్వోక్తమగు మంత్రద్వయముచేత తెలుపఁబడినది. ఈ శబ్దము చేతఁ దెలుపఁబడిన ఆత్మ-సర్వాతిశాయి యగు శక్తిగలవాఁడనియు, సర్వమునకును, అంతరాత్ముఁడనియు, సర్వ నియామకుఁడనియు, తెలిసికొనిన బ్రహ్మ విదునకు-తదనుసంధాన ఫలమగు నభ్యుదయము నీ యారవ మంత్రము చెప్పుచున్నది.

"బహు సహస్ర సంఖ్యాకులగు మనుష్యులలో నెవఁడో యొక్కఁడు జ్ఞానసిద్ధికొఱకు-ప్రయత్నించును. అట్లు ప్రయత్నించిన వారిలో నెవఁడో యొక్కఁడు మాత్రమే నన్ను తెలిసి కొనును" అను గీతావచనము చేతఁ దెలుపఁబడిన విధమున-జ్ఞాన విశేష పరిపాక లక్షణముచేత చెప్పఁబడిన మహత్త్వము-ఏయొక్క మనుష్యునకో సంభవించునుగాని యెల్లరకును గూడ సంభవించునది కాదు. అట్టి బ్రహ్మ వేత్త దుర్లభుఁడని చెప్పుటకు మీఁది మంత్రమున "యస్తు" అనుచో నున్న తుశబ్దము-బ్రహ్మ విదుని విశేషించుచున్నది, ముముక్షువగు బ్రహ్మ విదుఁడు మాత్రము పరమాత్మ వ్యతిరిక్తములను, బ్రహ్మాది-స్థావరాంతములును అను సర్వ భూతములను గూడ-వెనుక చెప్పఁబడిన-ఈశశబ్దవాచ్యుఁడును, పరమాత్మయు నగు ఏ కాత్మయందే-తదాధారమగు స్థితిగల వానినిగా అనుసంధానము చేయు చుండును, ఆ భూతములు భూమి-మొద

లగు వానిచేత ధరింపఁబడుచున్నను-అప్పృథివి మొదలగునవ్యక్తాదుల ప్రధానాధారమగు పరమాత్మయందే యుండుట వలన సర్వభూతములకును గూడ ఆధారము పరమాత్మయే యగుచున్నాఁడు. కావున సర్వభూతములును గూడ బ్రహ్మాత్మకములే; అనఁగా బ్రహ్మము ఆధారముగా గల స్థితిగలవియే యని తెలిసి కొనను। మఱియు ఆ భూతములన్నిటి లోపలనుగూడ వానిని నియమించుటకై పరమాత్మ అంతర్యామి రూపమున వ్యాపించి యున్నాఁడని తెలిసి కొనను. కాని ఆ భూతముల యందు పరమాత్మ యున్నాఁడని చెప్పుటవలన పరమాత్మకు సర్వభూతములును ఆధారమై యున్నవని తెలిసికొనఁగూడదు. సర్వభూతములకును ఆశ్రయమగు పరమాత్మకు ఆభూతము లాశ్రయములగు నెడల అన్యోన్యాశ్రయ దోషమును ప్రమాణాంతర విరోధమును కలుగునని తెలియునది.

ఈ యంశము "మయాతతమిదం సర్వం జగదవ్యక్త మూర్తినా। మత్స్థాని సర్వభూతాని నచాహం తేష్వవస్థితః"

"ఇంద్రియ గోచరము కాని రూపముగల నాచేత ఈ జగత్తంతయుఁగూడ వ్యాపింపఁబడి యున్నది. సర్వ భూతములును నా యందున్నవి. నేను వానియందు లేను" అనియు, "భూతభృన్నచ భూతస్థో మమాత్మా భూతభావనః." భూతములను పుట్టించునదియగు నా స్వరూపము-భూతములను భరించు చున్నది. కాని భూతముల యందున్నదికాదు అనియు (భగవద్గీతయందు) స్వయముగా భగవంతుఁడే చెప్పియున్నాఁడు గదా।

కావున-ఈజగత్తంతయుఁగూడ-ఈ జగత్తులోపల నియామకుఁడై యున్న బ్రహ్మమే యాధారముగాఁగల దగుట వలన బ్రహ్మాత్మకమని ధ్యానముచేత నను సంధించుచున్న ముముక్షువు.

ఇట్లు బ్రహ్మాత్మకములుగా అను-సంధింపఁబడిన భూతముల వలన విజుగుప్సను పొందఁడు.

ప్ర :— "విజుగుప్సను పొందడు" అనఁగా నేమి ?

ఉ:— తనయొక్క కర్మకు తగిన ఫలమునిచ్చుట కొఱకు-ఆయా భూతములు-అనఁగా ప్రాణులు-తనకు ఖేదమును గలిగించునవియగు చేష్టలను గలిగియుండినను గూడ-అవి-తదతంర్యామియు నియంతయు అగు పరమాత్మయందు-ఆధారపడియే యున్నవని తెలిసి-అనుసంధించుట వలనను-అవి తమంతతామే తనకు ఖేదమును గలిగించునవి కావేరవని గ్రహించుట వలనను-విజ్ఞానియగు ముముక్షువు ఆ ప్రాణులను నిందింప కుండును, అని యర్థము.

కావున ముముక్షువునకు-"సర్వజగత్తును గూడ బ్రహ్మాత్మకమే" అని యనుసంధించుట అత్యావశ్యకమనునది-మంత్ర తాత్పర్యము. ఈ మంత్రమునకే "ఆత్మన్నేవ-నవిచికిత్సతి" అను పాఠాంతరము లు గూడ నున్నవి-తత్పాతమునందు సప్తమ్యర్థమునందు-ఆత్మన్ శబ్దప్రయోగము-ఛాందసమని తెలియునది. విచికిత్సను హొందఁడు. అనఁగా సంశయమును పొందఁడని యర్థము నెఱుంగునది. భూతములు తనకు ఖేదమును గలిగించునవియను సంశయమును గలిగియుండినయెడల సంసారము వృద్ధినొందును. శత్రువులుగూడ బ్రహ్మాత్మకులే (బ్రహ్మయత్తమగు స్థితిగలవారలే) -అని యనుసంధించువాఁడగు ముముక్షువునకు విచికిత్స కలుగదని తెలియునది.

ద్వైతభాష్యము :—

చేతనములు-అచేతనములు అగు సర్వభూతములను-పరమాత్మయే ఆధారముగాఁగలవనియు, ఆ సర్వభూతములకును గూడ నతఁడే నియామకుఁడనియు, తెలిసికొనిన అధికారికి భయము లేకుండుట వలన నతఁడాత్మను రక్షించుకొనఁగోరఁడు. (ఆధేయము లగు ఘటాదులు-అధారమగు పృధివికంటె భిన్నములగునట్లు-ఆధేయములగు భూతములు ఆధారమగు పరమాత్మకంటె భిన్నములే యని యీ ద్వైతమునందు తెలియునది).

స్వావలిప్రాయము :—

"ఆత్మయందే సర్వవస్తువులును భ్రాంతి కల్పితమై యున్నవి. ఈ భ్రాంతి కల్పితములగు వస్తువులు-ఆత్మ మాత్రములే యగుచున్నవి" అని తెలిసికొనిన ఆత్మవిదుఁడగు జీవన్ముక్తునకుః యేకత్వదర్శనము వలన, దయ-రోత-భయము-శోకము-స్వశరీర గోపన ప్రయత్నము మున్నగునవి కలుగవు. "ద్వితీయాద్వై భయంభవతి" "రెండవ వస్తువువలనఁగదా భయము కలుగును:" అని కదా శ్రుతి వచనము. ఇది-విద్వదనుభవముచేతఁగూడ సిద్ధమై యున్నదిగదా. "భూతములన్నియు-బ్రహ్మాత్మకములు-అని తెలిసిన బ్రహ్మవిదునకు విజుగుప్స కలుగదు," అను నంతవఱకును త్రిమతములకును ఏకీభావము కానఁబడుచున్నది. అయినను-ఈ దర్శనములు-"బ్రహ్మాత్మకములు" అను పదము యొక్క అర్థము నందు మాత్రము భేదాభిప్రాయమును గలిగి యున్నవి.

ద్వైతము :— ఆధేయములగు భూతములు-ఆధారమగు పరమాత్మకంటె భిన్నములై యున్నను-పరమాత్మయందే ఆధారపడి యుండుటవలన బ్రహ్మాత్మకము లగుచున్నవి.

విశిష్టాద్వైతము:— పరమాత్మయందే భూతములన్నియు తదాధారముగ స్థితి గలిగి-శరీరియగు పరమాత్మకు శరీరమై యుండుటవలన బ్రహ్మాత్మకములగుచున్నవి.

అద్వైతము :— ఈ భూతములకు ప్రత్యేక స్వరూపము లేకుండుట వలన నివియన్నియుఁగూడ బ్రహ్మాత్మకము లగుచున్నవి. అద్వైతులచేతఁగూడ భూతముల కాధేయభావమును-పరమాత్మ కాధారభావమును-వ్యావహారిక దృష్టి యందంగీకృతమగుచున్నను-పారమార్థిక దృష్టియందు-వీని కాధారాధేయ భావము-అవిద్యా కల్పితమగుట వలన సర్వ భూతములకును-పరమాత్మకును గూడ ఏకత్వమే సిద్ధాంతీకరింపఁబడుచున్నది. వస్తు సత్త బ్రహ్మసత్త కంటె భిన్నముకాదు. కావున వస్తుతః-భూతములు-బ్రహ్మమాత్రములే యనునది-శ్రుతి-యుక్తి-సిద్ధమేగాక అద్వితీయాత్మ

తత్త్వవిదనుభవసిద్ధము కూడ నగుచున్నదని తత్త్వ దర్శుల తెలియఁగలరు. గీత యందు-"ప్రత్యక్షావగమమ్" అని చెప్పఁబడిన-ఆత్మదర్శనము-స్వర్గాదులవలె శబ్ద ప్రమాణ మాత్రము చేతనే తెలియఁదగినది కాక, ప్రత్యక్షముగానే తెలియఁదగినదని తెలియునది.

శాంకర భాష్యావతరణిక :—

ఇదే యర్థము నింకొక మంత్రముకూడ చెప్పుచున్నది.

మూ॥ యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవాభూత్ విజానతః
తత్ర కో మోహః కశ్శోక ఏకత్వ మను పశ్యతః ॥౭॥

కం॥ ఎందీ సమస్త భూతము
లం దానే యగునొ తగ నెఱుఁగువాని, కతం
డందేకత్వానుభవము
నొందెడు నెడ శోక మోహ యోగము గనునే ॥

(పాఠాంతరము "స్వాత్మ విదుఁడయిన వానికి
స్వాత్మగనే సకల భూతసమితియుఁగా, నం
దాత్మైకత్వముఁజూచు త
దాత్మున కట శోక మోహ ధర్మము గలదే॥)

పదచ్ఛేదము :— యస్మిన్, సర్వాణి, భూతాని, ఆత్మా, ఏవ, అభూత్, విజానతః, తత్ర, కః, మోహః, కః, శోకః, ఏకత్వమ్, అనుపశ్యతః॥ ప్రతి — యస్మిన్=ఏకాలమునందు లేక ఏయాత్మయందు. విజానతః=తెలిసినవానికి, సర్వాణి=సమస్తములైన, భూతాని=భూతములు, ఆత్మైవ=ఆత్మ స్వరూపమే, అభూత్=ఆయెనో తత్ర=ఆకాలమునందు లేక ఆయాత్మయందు ఏకత్వమ్ = ఐక్యమును అనుపశ్యతః = చూచుచున్న వానికి, మోహః=మోహము, కః=ఏది, శోకః=దుఃఖము, కః=ఏది?

తాత్పర్యము :— వెనుక చెప్పఁబడిన విధమున "సర్వ స్వరూపమగు ఆత్మ-ఒక్కటియే" అని తెలిసికొనిన వానికి శోక మోహములు కలుగవు.

శాంకరభాష్యము :—

పరమార్థవస్తువగు ఆత్మనెఱుఁగుటవలన ఏకాలమునందు ఈ సర్వభూతములును గూడ ఆత్మయే యగుచున్నవో, ఆకాలమునందుఁగాని, ఆ యాత్మయందుఁగాని శోకమోహములు కలుగనేరవు. కామ-కర్మ-బీజమగు అజ్ఞానమునకు వశపడిన వారికే శోకమోహములు కలుగును. విశుద్ధమును, ఆకాశోపమమును, అనఁగా సర్వవ్యాపకమును అగు ఆత్మైకత్వమును తెలిసినవానికి శోకమోహములు కలుగవు. "అవిద్యా కార్యములగు శోకమోహములు సంభవింప"వని చెప్పుటవలన ఆత్మజ్ఞుఁడగు విజ్ఞానికి అవిద్యతోఁ గూడ సంసారమంతయుఁగూడ తొలఁగునను నంశము ప్రదర్శింపఁబడినది.

ఆనందగిరి టీక యందలి యభిప్రాయము :—

తాను (ఆత్మ) దుఃఖము చేత స్పృశింపఁబడనివాఁడననియు, నిరతిశయ ఆనంద స్వరూపుఁడననియు తెలిసికొనని వానికి "నాకు ధనములేదు, పుత్రులులేరు నేను దీనుఁడను." అని శోకము కలుగును. కావునవాఁడు పుత్రాదులను కోరును. వానికొఱకు దేవతారాధనము మొదలగు వానిని చేయఁగోరును.

"ఆత్మయొక్కఁడే" అని తెలిసినవానికిట్లు శోకమోహములు సంభవించునవి కావు.

ప్రశ్న :— మీఁది మంత్రమునందు విజ్ఞానికి శోక మోహములు సంభవింపవని మాత్రమే చెప్పఁబడుటవలన కార్యమగు శోకమోహములు నశించినను కారణమగు అవిద్య నివర్తింపదను నర్థము సిద్ధించుటలేదా?

ఉ :— లేదు, సుషుప్తియందు శోకమోహములు లయించుచున్నను మరల జాగ్రదవస్థ యందుదయించుచునే యుండును.

కార్యములగు శోకమోహములకు సంపూర్ణమగు నివృత్తి-కారణమగు అవిద్య-నివర్తింపనిదే కలుగదు. విద్యవలన అవిద్య-నివర్తించుట చేతనే శోకమోహములు నిశ్శేషముగా నివర్తించును.

కావున ఆత్మైక్య విజ్ఞానికి-మూలమగు అవిద్యతోఁగూడియే శోకమోహములు నివర్తించునని తెలియవలయును.

**ఉవటాచార్య కృతమగు ఈశావాస్య భాష్యము :—**

ఇదియంతయుఁగూడ ఆత్మయేయని తెలిసి ధ్యానించుచున్న విజ్ఞానికి చేతనములు-అచేతనములు-అగు సర్వభూతములును గూడ ఆత్మయే యగుచుండును. ఆ యవస్థావిశేషమునందున్న యోగికి శోకమోహములు సంభవించునవి కానేరవు.

**ఈశావాస్య రహస్యము :—**

బ్రహ్మ తత్త్వము నెఱిఁగిన యోగికి-నిర్వికల్పమును, అద్వయమును అగు ఆ బ్రహ్మ స్వరూపమునందున్న వస్తువులన్నియుఁగూడ బ్రహ్మస్వరూపమే యగుచున్నవి. కావున నతఁడు "ఈ విశ్వమంతయుఁగూడ బ్రహ్మ స్వరూప మాత్రమగు నేనే యగుచున్నా"నని స్వయం ప్రకాశమగు నిజస్వరూపమును బొందుచున్నాఁడు. కావున వానికి శోకమోహములతోడి సంబంధము కలుగనేరదు.

మూలావిద్యయు-తత్కార్యములగు శోకమోహాదులును లేనిదియు, సంవిద్రూపమును, పరమాత్మయు అగు ఆత్మయందు శోకాదిసంబంధమెట్లు కలుగును?

**ఈశావాస్య దీపిక :—**

ఈశ్వర స్వరూపమగు ఆనందాత్మ స్వరూపమునందు-మాయాకల్పితములగు రూపములుగల ఈ భూతములన్నియుఁగూడ (ఈశ్వర స్వరూపమగు నిదియంతయుఁగూడ నేనని తెలిసికొనిన విజ్ఞానికి) తమ తమ రూపములను పరిత్యజించి-ఆత్మ స్వరూపమే యగుచుండును.

ఇట్లు "ఈశ్వరుఁడే-ఆత్మయగుచున్నాఁడు" అని తెలిసిన విజ్ఞాతయొక్క-స్వరూపముకూడ ఈశ్వర స్వరూపమే యగుచున్నది. కావున నది-దేశముచేతఁ గాని, కాలముచేతగాని, వస్తువుచేతఁగాని, వేరు పడనిదై యున్నది. భేదరహితమగు జీవాత్మ యందు-ఆవరణ రూపమగు మోహమును విక్షేప రూపమగు శోకమును గలుగ నేరవని తెలియునది.

**ఈశావాస్య రహస్య వివృతి :—**

ఈ మంత్రము ఆత్మవిదుని స్థితియెట్లుండునని యాశంకించి చెప్పుచున్నది. ఏకాలమునందు-ఆత్మసాక్షాత్కారుఁడగు జ్ఞానికి-బ్రహ్మాది-స్థావరాంతములగు భూతము లన్నియుఁగూడ తనకంటె వ్యతిరిక్తములు కాక తానే యగుచుండునో, ఆ కాలమునందు-ఏకాత్మ్యమునను స్యూతముగా ననుభవించుచున్న జీవన్ముక్తునకు ఆవరణ రూపమగు మోహమును విక్షేపరూపమగు శోకమును ఎట్లు కలుగును?

"యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్ కేనకం పశ్యేత్" "ఈజీవాత్మకు-ఎప్పుడు సర్వమును, ఆత్మ స్వరూపమగు తానుగానే ఆయెనో అప్పుడాయాత్మ-

కేవలేశ దేసవి చూచును" బృహ-౬-౫-౧౫, ఇత్యాది శ్రుతి భావనమువలన జీవన్ముక్తుఁడు నిష్క్రియుఁడని తెలియుచున్నది. కావున నతఁడు తూష్ణీంభూతుఁడై యుండునని గ్రహించునది.

అనంతాచార్య కృతమగు ఈశావాస్యభాష్యము :—

'సర్వం ఖల్విదం బ్రహ్మ' "ఇదియంతయుఁగూడ బ్రహ్మమాత్రమే" అను విచారముచేత-ఎవనికి సర్వభూతములును ఆత్మయే యగుచుండునో, సర్వ భూతములయందును ఉన్న ఆత్మ-ఒక్కటియే అను జ్ఞానము గలుగునో, వానికి-అవిద్యయు-దానికార్యములగు మోహమును, శోకమును, గలుగకుండుటవలన-సంపూర్ణమగు సంసార నివృత్తి కలుగును. ఈయంశమునే క్రింది శ్రుతి చెప్పుచున్నది.

"భిద్యతే హృదయ గ్రంథిః।
ఛిద్యన్తే సర్వసంశయాః।
క్షీయన్తే చాస్య కర్మాణి
తస్మిన్ దృష్టే పరావరే॥

(ముండకోపనిషత్తు-౨-౨-౮వ మంత్రము) కార్యకారణ రూపుఁడగు ఈశ్వరు నెఱిఁగిన వానికి, హృదయాశ్రయమగు కామము-వినాశము పొందును. తెలియఁదగిన వస్తువునకు సంబంధించిన సంశయములు విచ్ఛేదము నొందును-సంచితములు-ఆగాములు అగు కర్మములన్నియు క్షయించును. అని యీ మంత్రముచేత పరమాత్మ జ్ఞానమునకు ఫలము చెప్పఁబడినది.

అద్వైతానందలహరి :—

తాను-తురీయుఁడని తెలిసికొనిన నియవస్థయందు విజ్ఞానికి పూర్వోక్తములగు భూతము లన్నియుఁగూడ-ఆత్మయే, అనఁగా, నిర్గుణ నిరాకార పరిపూర్ణమగు పరమాత్మయే, లేక, మాయికమగు ఈశ్వర స్వరూపమే, అగుచుండునో, ఆయవస్థయందు, గురూపదేశము ననుసరించి ఏకత్వమును జూచిన విద్వాంసునకు, మోహమునకును శోకమునకును మూలమగు, అజ్ఞానము నివర్తించుట వలన మోహాది ప్రసక్తియే కలుగునది కానేరదు.

విశిష్టాద్వైత-భాష్యాభిప్రాయము :—

ఈ మంత్రముకూడ-జగత్తు బ్రహ్మాత్మకమనియు, అది బ్రహ్మాత్మకమని యను సంధించువానికి జుగుప్సకలుగదనియు, పూర్వమంత్రమునందు చెప్పఁబడిన యంశమునే భంగ్యంతరమున మరలఁ దెలుపుచున్నది.

సర్వమును బ్రహ్మాత్మకమను నంశము పూర్వ మంత్రము నవైయధికరణ్యముచేత చెప్పఁబడినవి. ఈసప్తమ మంత్రముచేత

నాయంశము సామానాధికరణ్యము చేత చెప్పఁబడుచున్నది.

ఏప్రణిధాన సమయమునందు "ఈశావాస్య మిదంసర్వమ్" అని మొదలుపెట్టి "తతో న విజుగుప్సతే" అను సంతవఱకును ఉపదేశింపఁబడిన-స్వతంత్రుఁడగు పరమాత్మను, పరతంత్రములగు జీవ-జగత్తులను, గూడ విభజించి - తెలిసిన ముముక్షువునకు-ఎప్పుడు-పరమాత్మయే-సర్వభూత శరీరకుఁడుగా ప్రతీతుఁడగుచుండునో, ఆప్రణిధాన సమయమునందు-ఆతత్త్వవేత్తకు-స్వతంత్రాత్మ భ్రమాది లక్షణమగు మోహము సంభవించునది కానేరదు. సర్వమును గూడ పరమాత్మయొక్క విభూతియని తెలియుట వలన వానియందు "నాది" అను నభిప్రాయము కలుగకుండుటచేత, పుత్త్రుఁడు మరణించినను, రాజ్యాదులు హరింపఁబడినను గూడ వానివలన వానికి శోకమేదియు కలుగనేరదు.

భూతములు పరమాత్మకు శరీరములై యున్నవి. కావున పరమాత్మ శరీరియగుచున్నాడు "యస్య-పృథివీ శరీరమ్. యస్యాత్మా శరీరమ్" ఇత్యాది శ్రుతులిందులకుఁ బ్రమాణములై యున్నవి.

ఇట్లు-శరీర-శరీరిభావ రూపమును-అపృథక్ సిద్ధవిశేషణ-విశేష్య భావలక్షణమును, అగు అవినాభావసంబంధముచేత సమ్మిళితుఁడగుట వలన-ఈశ్వరుఁడు-సర్వ భూత రూపుఁడగుచున్నాడు. (శరీరియగు బ్రహ్మము - జగచ్ఛరీరుఁడగుచున్నాఁడు) "నేను మనుష్యుఁడను" ఇత్యాది లోక వేద మర్యాద చేతనగు దేహాత్మభావముచేత-జగద్బ్రహ్మములకు సామానాధి కరణ్యము సంభవించుచున్నది. కావున ఈ ప్రపంచమంతయు నిట్లు-బ్రహ్మాత్మక మగుచున్నదని తెలియునది. ఇదియే సముచితమగు సిద్ధాంతమై యున్నది.

కావున 1బాధచేతను, 2ఉపచారముచేతను, 3స్వరూపైక్యము చేతను జగద్ బ్రహ్మములకు సామానాధి కరణ్యమును దెలుపునవి యగు నితర సిద్ధాంతములు బహిష్కార్యములే యగును.

(1) "సర్వభూతములును ఆత్మయే యగుచుండును" అనగా ఆత్మవ్యతిరిక్తములగు భూతములేవియులేవు. మోడునందు భ్రాం

చేత కనఁబడుచున్న దొంగ, మోడుకంటె వేరుకాకుండుట వలన మోడేయగు చుండును. అట్లే బ్రహ్మము నందు భ్రాంతి చేత కల్పింపఁబడిన జగత్తు బ్రహ్మముకంటె వేరు కాకుండుట వలన బ్రహ్మమే యగుచుండును," అని బాధ సామానాధి కరణ్యముచేత జగత్తు బ్రహ్మాత్మకమని కొందఱు చెప్పుదురు. సర్వలోకమును నర పత్యధీనమగుట వలన "సర్వలోకమును నరపతియే" అని ఔపచారిక మగు సామానాధికరణ్యము చెప్పఁబడునట్లు సర్వభూతములును పరమాత్మాధీనము లగుటవలన "సర్వభూతములును పరమాత్మయే" అని ఔపచారికమగు సామానాధికరణ్యము చెప్పఁబడును. కావున ఇట్లు ఔపచారికమగు సామాన్యాధికరణముచేత జగత్తు బ్రహ్మాత్మక మగు చున్నదని వేఱొక కొందఱు చెప్పుదురు.

కుండ కాన మొదలగు వానికిని మట్టిముద్దకును ఏకత్వము మువలె జగత్తునకును బ్రహ్మమునకును స్వరూపైక్యము నాశ్రయించి ఇట్లు స్వరూపైక్యము చేతనగు సామానాధికరణ్యముచేత జగత్తు బ్రహ్మాత్మకమని మఱికొందఱు చెప్పుచున్నారు.

ఇవన్నియు వేదార్థబాహ్యములే యగుచున్నవి. "నేను విద్వాఁడను, నేను మనుష్యుఁడను" ఇత్యాదుల యందువలె శరీర ఆత్మభావ సంబంధముచేత జగద్ బ్రహ్మములకు సామానాధి కరణ్యము సంభవించు చున్నది. కావున వదియే సిద్ధాంతమని తెలియునది.

ద్వైతభాష్యము :—

"ఏ పరమాత్మయందు సర్వభూతములును ఉన్నవో ఆ పర మాత్మయే ఆ సర్వ భూతముల యందును ఆధారత్వము చేత నున్నాఁడు." అనియు, "ఇట్లు సర్వభూతముల యందును గల పర మాత్మ యొక్కఁడే" అనియు అపరోక్ష జ్ఞానముచేతఁదెలిసి కొనిన వానికి మోహము కలుగదు. ఇట్లు మోహము లేనపుడు శోకము గూడ కలుగదు.

అవతారిక :—

పూర్వమంత్రములచేతఁదెలుపఁబడిన ఆత్మ నిజ రూపము చేత ఎట్టి లక్షణము గలవాఁడయినదియు క్రింది మంత్రము తెలుపు చున్నది.

మూ॥ సపర్య గాచ్ఛుక్ర మకాయ మవ్రణ
మస్నా విరగ్ం శుద్ధ మపాప విద్ధమ్
కవి ర్మనీషీ పరిభూః స్వయంభూ
ర్యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః॥8

శా॥ ఆతండాత్మ స్వయంభువై పరిభువై అస్నావిహం, దవ్రణుం
డై, తా సర్వగుఁడై అకాయుఁడయి పాపావిద్ధుఁడై శుద్ధుడై
జ్యోతిస్స్వ కవియై మనీషియౌ యీశుండై విభాగించి యా
థాతథ్యంబుగ నిత్యవర్షముల కర్థంబుల్ సమర్పించెడిన్॥

పద:— సః-పర్యగాత్-శుక్రమ్ - అకాయమ్-అవ్రణమ్-అస్నావిరమ్-శుద్ధమ్-అపాప విద్ధమ్-కవిః-మనీషీ-పరిభూః-స్వయంభూః-యాథాతథ్యతః-అర్థాన్-వ్యదధాత్-శాశ్వతీభ్యః-సమాభ్యః॥

టీక :— సః=వెనుకను చెప్పఁబడిన ఆత్మ పరి+ఆ గాత్=పర్యగాత్=ఆకాశమువలె-అంతటను వ్యాపించియున్నాఁడు. శుక్రమ్=జ్యోతిష్మంతుడు (దీప్తిమంతుఁడు) అకాయమ్=శరీరము లేనివాఁడు (లింగ శరీరము లేనివాఁడు) అవ్రణమ్=అక్షతుఁడు (గాయము లేనివాఁడు) అస్నావిరమ్=శిరములు (నరములు) లేనివాఁడు. (పైఁది విశేషణద్వయము వలన స్థూల శరీరము లేనివాఁడు) శుద్ధమ్=నిర్మలుఁడు (అవిద్యామల రహితుఁడు) అపాపవిద్ధమ్=ధర్మము-అధర్మము-మొదలగు నదియగు పాపము లేనివాఁడు కవిః-క్రాంతదర్శి మనీషీ=మనస్సును శాసించువాఁడు పరిభూః-అన్నిటికిని మీదుగా నుండువాఁడు స్వయంభూః=స్వయముగానే యుండువాఁడు-ఆ యీశ్వరుఁడు శాశ్వతీభ్యః=నిత్యము లగు సమాభ్యః-సంవత్సరములను పేరుగల ప్రజాపతులకొఱకు

యాథాతథ్యతః (సర్వజ్ఞుఁడగుటవలన) సమస్త భూతములకును వారి వారి కర్మ ననుసరించి, అర్థాన్ = కర్తవ్య పదార్థములను వ్యదధాత్ = విభజించి నిర్మించెను.

తాత్పర్యము :— స్థూల శరీరము, సూక్ష్మశరీరము కారణ శరీరము అను శరీరత్రయము లేనివాఁడును ప్రత్యగాత్మయునగు ఈశ్వరుఁడు సర్వమును చూచుచు, మనస్సును ప్రేరణచేయుచు, సర్వమునకును మీదుగానున్నట్లున్నను అసర్వమును గూడ తానే యగుచు తనకు కారణమగు వేఱొక వస్తువు లేనివాఁడగుచున్నాఁడు.

ఆ యీశ్వరుఁడు సర్వజ్ఞుఁడు; కనుకనే ఆయా భూతముల యొక్క కర్మఫలములకు సాధనములగునట్లు సంవత్సరములను ప్రజాపతులను విభజించి నిలిపెను.

శాంకరభాష్యము :—

ఆత్మ-ఆకాశమువలె వ్యాపియైయున్నాఁడు. కావున బ్రహ్మాండము నంతను పొందియున్నాఁడు. జ్యోతిష్మంతుఁడు అనఁగా దీప్తిమంతుఁడు. అతఁడు లింగ (సూక్ష్మ) శరీరవర్జితుఁడు. అక్షతుఁడు-అస్నావిరుఁడు-స్నావిరము అనఁగా నరములు-అవిలేనివాఁడు అస్నావిరుఁడగును. గాయములు, నరములు స్థూల శరీరమునందే యుండును. ఆత్మకవి యుండవని చెప్పుటవలన స్థూల శరీరాత్మ కాదని చెప్పఁబడినది. అవిద్య కారణ శరీరమని చెప్పఁబడును. ఆత్మ-శుద్ధుఁడని చెప్పఁబడియెను. మలములేనివాఁడు నిర్మలుఁడగుటవలన శుద్ధుఁడని చెప్పఁబడును. ఇచ్చట మలమనఁగా అవిద్యయే యగును.

కావున శుద్ధుఁడనఁగా అవిద్యారహితుఁడను నర్థమేర్పడు చున్నది. అవిద్యయే కారణ శరీరము. కావున శుద్ధుఁడనగా కారణ శరీరము లేనివాఁడను నర్థము సిద్ధించుచున్నది. ధర్మముగూడ పుణ్యఫలోపభోగ్యమగు జన్మమునకు హేతువగుట వలన పాపమని చెప్పఁదగియున్నది. కావున, ఆత్మ అపాపవిద్ధుఁడు అనఁగా ధర్మాధర్మాది పాప వర్జితుఁడు, అని చెప్పఁబడియెను. కవి యనఁగా

క్రాంతదర్శి. అనఁగా భూతభవిష్యద్ వర్తమానముల నెఱిఁగిన సర్వదృక్కు.

"నాఽన్యోఽతోఽస్తి ద్రష్టా"

అతనికంటె భిన్నుఁడగు ద్రష్ట (చూచువాఁడు) లేఁడు. అను శ్రుతి దీనికి ప్రమాణమై యున్నది.

అతఁడే సర్వజ్ఞుఁడగు పీర్వరుఁడగుట వలన మనస్సును శాసించుచున్నాఁడు. అన్నిఁటికిని మీఁదుగా నుండుటవలన "పరిభూః" అని చెప్పఁబడుచున్నాఁడు. ఏ భూతములకు మీఁదుగా నున్నాఁడో, ఆ భూతములును, తానును అగు సర్వమునుగూడ తానే యగుట వలన తనకు కారణమగు వస్తువులేనివాఁడై స్వయంభువని చెప్పఁబడుచున్నాఁడు.

నిత్యముక్తుఁడగు నా యీశ్వరుఁడు సర్వమును దెలిసి యున్నవాఁడు. కావున-ఆయా భూతముల కర్మ ఫలములకు సాధనము లగునట్లు శాశ్వతములును సంవత్సరములను పేరుగలవియు, నగు ప్రజాపతుల కొఱకు కర్తవ్య పదార్థములను విభజించి, విధించి యున్నాఁడు.

మంత్రమునందున్న "శుక్రమ్-అకాయమ్-అవ్రణమ్-అస్నావిరమ్-శుద్ధమ్-పాపవిద్ధమ్ అను పదములు నపుంసక లింగములుగా ప్రయోగింపఁబడినవి. అవియన్నియు పుంలింగములుగా, "శుక్రః" అకాయః, అవ్రణః, అస్నావిరః, శుద్ధః అని మార్పఁబడవలసి యున్నవి. "సః" అని పుంలింగపదముతో నారంభించి "కవిః" ఇత్యాది పుంలింగపదములచేత ఉపసంహారము కావింపఁబడుటవలన, నడుమనున్న విశేషణములు గూడ పుంలింగములుగానే యుండవలయును గదా !

ఉవటాచార్య కృతమగు ఈశావాస్యభాష్యము :—

ఏవఁడిట్లాత్మనుపాసించి-విజ్ఞానానంద స్వభావుఁడును, అశరీరుఁడును, తనుకనే, ప్రణములు-నరములు లేనివాఁడును సత్త్వరజస్తమో గుణములచేత బాధింపఁబడని వాఁడును, క్లేశ-కర్మ-విపాక-ఆశయములచేత స్పృశింపఁబడనివాఁడును అగు

బ్రహ్మమును పొందుచుండునో, ఉపాసకుఁడగువాఁడు - క్రాంతదర్శియగు కవియు, మేధావియు విజ్ఞాన బలముచేత అంతటను ఉండువాఁడును, జ్ఞాన బలముచేత బ్రహ్మభావముచేత స్వయముగా నుండువాఁడును అగుచు చిరకాలము స్వ-స్వామిసంబంధమును విడిచినవియు, చేతనా చేతనములును, అగు అర్థములచేత ఉపభోగము పొందుచున్నాఁడు.

ఈశావాస్య రహస్యము :—

"ఆప్నోతి సకలంకార్యం తస్మాదాత్మేతి గీయతే" "అతఁడు-కార్యము సకలము పొందుచున్నాఁడు. కావున ఆత్మయని చెప్పఁబడును" అని చెప్పఁబడిన విధమున అతఁడు విభాగము లేకుండునట్లు సర్వమును వ్యాపించియున్నాఁడు. అతఁడే శుక్ల జ్యోతి స్స్వరూపుఁడు, నిత్యచిన్మాత్ర విగ్రహుఁడు-సర్వభూత గుహాశయుఁడు, మాయాపాశ వినిర్ముక్తుఁడు, ధర్మాధర్మ వివర్జితుఁడు, మనోనియంత, సర్వసాక్షి, సర్వాత్మకుఁడు, అతఁడే చేయఁదగిన విషయములను ప్రజాపతులకును ప్రాణులకును గూడ వేరు పఱచియిచ్చెను. "అతఁడే నేను అని నిత్యముక్త స్వభావుఁడగు పరమాత్మను దెలిసిన వాఁడు కూడ ముక్తుఁడే యగుచున్నాఁడు (నేను-అతఁడే-అను పదముల కేవల-వాచ్యార్థము-కుదురదు. కావున లక్ష్యార్థమునే గ్రహించునది).

ఈశావాస్య రహస్య వివృతి : —

స్థూల శరీరము కానిది-సూక్ష్మశరీరము కానిది-మాయాసంబంధము లేనిది-పాప పుణ్యములు లేనిది-అగు ఏ బ్రహ్మముకలదో-ఆ నిర్గుణ బ్రహ్మమే-స్వశక్తిని స్వీకరించి-యీశ్వరుఁడై అతీతానాగతములను దెలియుచు, జగత్సర్జనేచ్ఛగలదియై, మనోనియంతయై, అన్నిటికంటెను శ్రేష్ఠమై, స్వయంభువై (కారణము లేనిదై-లేక సర్వరూపమై) యున్నది. ఆ యీశ్వర రూపమగు బ్రహ్మము-అచింత్యశక్తిమంతము. కావున-సంవత్సరములను ప్రజాపతుల కొఱకు చేతనాచేతనరూపము అగు పదార్థములను విభజించి యిచ్చుచున్నది.

మీఁది మంత్రమున కింకొక యర్థము విశ్లేషింపఁగునది :—

ఎవఁడు-"శుక్రమ్" ఇత్యాది విశేషణ విశిష్టమగు బ్రహ్మస్వరూపమును సర్వభావముచేత నెఱుఁగుచున్నాఁడో "బ్రహ్మవిద్-బ్రహ్మైవభవతి" అను శ్రుతి యందు చెప్పఁబడిన విధమున ఆ బ్రహ్మవేత్త, కవియు, మనీషియు, పరిభువును, స్వయంభువును అగు బ్రహ్మమే అగుచు, భోగ్యవిషయములను, అనంతవర్షోప భోగము, కొఱకు స్వయముగానే నిర్మించుచుండును.

మం॥ యస్యానువిత్తః ప్రతిబుద్ధ ఆత్మాఽ
స్మిన్ సన్దేహ్యే గహనే ప్రవిష్టః
స విశ్వకృత్ సహి సర్వస్య కర్తా
తస్య లోకః, స ఉలోక ఏవ

"అనేకములగు ననర్థములచేతను, సంకటములచేతను, వృద్ధిఁబొందియున్న విషమమగు ఈ శరీరము నందు ప్రవేశించి యుండిన ఆత్మ, ఏ బ్రాహ్మణునిచేత, అనుసరించి పొందఁబడి, నేను బ్రహ్మము నగుచున్నానని ప్రత్యగాత్మరూపముచేత సాక్షాత్కరింపఁ జేసికొనఁబడునో, ఆబ్రాహ్మణుఁడు "విశ్వకర్త" అగుచున్నాఁడు. వాడే సర్వమునకును కర్త అగు చున్నాడు. వానికి లోకము, ఆత్మగానున్నది, లోకమును వాఁడును, వేరుగావు. అతఁడే లోకము అనగా; అతనికి సర్వమును గూడ ఆత్మయే యగు చుండును. సర్వమునకునుగూడ వాఁడే ఆత్మయగుచుండును"

అని బృహదారణ్యకమునందు చతుర్థాధ్యాయమునందున్న చతుర్థ బ్రాహ్మణము నందలి ౧౩వ మంత్రమునఁజెప్పఁబడిన విధమున ఆ బ్రహ్మవిదుఁడు బ్రహ్మమే యగు చుండునని తెలియునది.

ఆచార్య కృతమగు ఈశావాస్య భాష్యము :—

రేఫలకారములకు భేదములేకుండుటవలన "శుక్లమ్" అనునది యిచట "శుక్రమ్" అని చెప్పఁబడినది.

శుక్లమనఁగా శుద్ధమని యర్థము-విజ్ఞాన-ఆనంద-స్వభావమగు వస్తువు శుద్ధమని చెప్పఁబడును.

"అకాయమ్" అను దానికి "స్థూల శరీరము లేనిది" అను నర్థమును స్వీకరించిన యెడల "అస్నావిరమ్" "నరములు లేనిది" అని చెప్పినయంశమునే మరల చెప్పినట్లగును.

కావున "అకాయమ్" అను పదమునకు "లింగ (సూక్ష్మ) శరీరము లేనిది" అను నర్థమే స్వీకరింపఁదగి యున్నది.

ఇట్లు శరీరాది రహితుఁడై యున్నను ఆపరమాత్మ-అచింత్య శక్తిమంతుఁడగుట వలన సర్వజ్ఞత్వాది గుణ విశిష్టుఁడగుచు-కర్తవ్య పదార్థములను సర్వకాలములందును నిర్మించుచుండును.

ఉపాసకుఁడే-సర్వజ్ఞత్వాదియుక్తుఁడై కర్తవ్య పదార్థములను నిర్మించుననుట నర్థము-ప్రకరణ లింగ మగుటవలన ఉపేక్షింపఁదగియున్నది.

అద్వైత సందలహరి :—

సంవత్సర మనఁగా ప్రజాపతియే భోగ్య పదార్థములను [illegible] నిజమాయా శక్తిచేత-భోగ్యవస్తురూపుఁడై యున్న పరమాత్మ [illegible] కర్మలకు తగిన విధమున సాంకర్యము లేకుండునట్లు భోగ్య పదార్థములను విభజించి [illegible] సకలం కిచ్చుచుండును.

విశిష్టాద్వైత భాష్యార్థము :—

ఈ మంత్రము పరమాత్మ, ఈశ్వరుఁడు జగత్తు, ఈశిత వ్యము అతఁడు, జగదంతరాత్ముఁడు జగత్తు, దానికంటె భిన్నము, "అతఁడు, సర్వాతిశాయియగు శక్తి గలవాఁడు" అని వెనుక చెప్పఁబడిన విధమున పరమాత్మను గ్రహించిన ముముక్షువునకు తెలియఁదగిన విశేషమును బోధించుట చేత విశేషించు చున్నది.

సర్వభూతముల యందును గూఢ అంతరాత్మయై యున్న బ్రహ్మమును దర్శించిన ముముక్షువు క్రిందఁ దెలుపఁబడిన లక్షణముగల బ్రహ్మస్వరూపమును సమాధిలబ్ధమగు అనుభవముచేత పొందుచుండును.

ఆ బ్రహ్మస్వరూపము, అపకాశ ప్రదాత్మరూపము స్వప్రకాశ రూపము, సర్వ శరీరములును గలదయినను కర్మకృతమగు హేయ శరీరము లేనిది. బ్రహ్మమునకు మాంసమేదోఽస్థి సంభవమగు ప్రాకృతమూర్తి లేకున్నను కల్యాణ తమమును, హిరణ్మయమును ఆదిత్యవర్ణమును, అప్రాకృతమును అగు దివ్యమంగళ విగ్రహ మున్నది. కర్మాధీనమగు శరీరము లేకుండుటవలన వ్రణములు లేనిదై యున్నది. అజ్ఞానాదిదోష గంధములేనిది. షడూర్ములు లేనిది. అజ్ఞానాధులకు, కార్యములును కారణములును గూడ నగు పుణ్య పాపములు లేనిది.

ఏవంరూపమగు పరమాత్మ, ఏ విద్వాంసునకు, ప్రాప్యమును, ప్రాపకమును, ఉపాస్యమును, అగుచుండునో, ఆబ్రహ్మవిదుఁడు "కవిః" ఇత్యాది విశేషణములచేతఁ దెలుపఁబడుచున్నాఁడు.

ఆ బ్రహ్మ విదుఁడు వ్యాసాదులవలె పరతత్త్వమును, తద్గుణములను బోధించు నదియగు ప్రబంధమును నిర్మించువాఁడగు

కవియై యున్నాఁడు లేకయోగాభ్యాస విదురమగు మనస్సుచేఁ దుర్దర్శమగు పరిశుద్ధ జీవాత్మ స్వరూపమునందు అతివిశదమునుఅఁ చ్ఛిన్న ధారా రూపమును అగు స్మృతి రూపజ్ఞాన యోగమున విష్ణు డగు క్రాంతదర్శి యగుచున్నాఁడు. మనస్సును నియమించు నది యగు మనీష (బుద్ధి) గలవాఁడగుచున్నాఁడు. కామాది శత్రువు లను తిరస్కరించుచున్నాఁడు. అన్య నిరపేక్షమగు సత్త గలవాఁ డగుచు నిత్య నిరతిశయ సుఖ స్వరూపమగు స్వాత్మను దర్శించు చున్నాఁడు.

అతఁడు మోక్ష సదుపాయములను మోక్షవిరోధులను వివే చించి విఘ్న నివృత్తి కొఱకు బ్రహ్మప్రాప్తి పర్యంతమును, హృద యము నందు ధరించుచుండును. ఈ మంత్రమునకుఁగల యర్థ మునే, ఇంకొక విధమునఁగూడ గ్రహింప వచ్చును.

మంత్రము నందున్న ప్రథమాంతములగు పదములను పరమాత్మ పరముగను ద్వితీయాంతములగు పదములను సర్వో పాధి వినిర్ముక్తమగు పరిశుద్ధ జీవపరముగను సమన్వయింప వల యును. పరమాత్మ అట్టి పరిశుద్ధ జీవునందంతటను, వ్యాపించి యున్నాఁడు, అతడు సర్వదర్శి. వాఁడే కార్య పదార్థములను ప్రళయము వఱకును యథార్థము గానే ప్రకాశింపఁ జేయు చున్నాఁడు. ఇంద్రజాలికుని వలె మాయికములుగా ప్రకాశింపఁ జేయుటలేదు.

ద్వైత భాష్యము :—

పరమాత్మ శోక రహితము. కావున శుక్రమని చెప్పఁ బడినది. నిత్యమగుట వలనను పూర్ణమగుట వలనను అవ్రణమని చెప్పఁబడినది. పవిత్రమగుట వలన శుద్ధమనియు, సూక్ష్మ (లింగ) దేహము లేకుండుటవలన, అకాయమనియు, స్థూల దేహము లేకుండుటవలన అస్నా విరమనియు శుద్ధమగుట వలన అపాప విద్ధమనియు చెప్పఁబడినది. ఇట్లు పాప మూలములగు స్థూల సూక్ష్మ మాత్మ శరీరములు లేకుండుట వలన పరమాత్మ దేహ నిమిత్త మగు శోకాదికము లేనివాఁడగు చున్నాడు.

ఇట్లు శోకాదిశూన్యుఁడును, రాజాది విలక్షణుఁడును అగు పరబ్రహ్మమును - జ్ఞానియగువాఁడు పొందుచున్నాఁడు. సారూప్యాది లక్షణమగు తద్గతిని పొందుచున్నాఁడు. కావున శోకాది రహితుఁడగుచున్నాడు.

ఇట్లు పరమాత్మ శరీరరహితుఁడై యున్నను సర్వజ్ఞుఁడగుట వలన కవియని చెప్పఁబడుచున్నాఁడు. సర్వమును వశీకరించుట వలన "పరిభువు" అగుచున్నాఁడు. రమా బ్రహ్మాదుల మనస్సులకును, ప్రకృతికిని గూడ నియంత యగుటవలన మనీషి యగుచున్నాడు. తనకు వేరొక యాశ్రయము లేకుండుటవలన "స్వయంభువు" అగుచున్నాఁడు. జడ శరీరము లేకున్నను సద్-జ్ఞాన-ఆనంద శీర్షుఁడును, సద్జ్ఞానానంద దేహుఁడును-సద్-జ్ఞానానంద-పాద-హస్తుఁడును-అగు ఆమహావిష్ణువు-అనాద్యనంత వత్సరములయందు-అబాధిత ప్రత్యక్షాది సిద్ధము లగుచున్న మహదాదులను సృజించుచున్నాఁడు.

ఇట్లు సచ్చిదానంద శరీరుఁడగు-ఆవిష్ణువుయొక్క సారూప్యము నొందిన జ్ఞాని శోకమునుండి విడివడు చుండునని తెలియునది.

స్వాభిప్రాయము :—

ప్రత్యగాత్మ-పరమాత్మ లొక్కటియే యగుటవలన-శ్రీ శంకరులు-వానిభేదమును పాటింపక-దీనిని-ఆత్మపరముగా వ్యాఖ్యానించియున్నారు. తదితరులగు నద్వైత వ్యాఖ్యాతలలో పలువురు దీనిని పరమాత్మపరముగనే వ్యాఖ్యానించిరి. విశిష్టాద్వైతభాష్యమునందు-కొన్ని పదములు శుద్ధ జీవపరములుగను కొన్ని పదములు పరమాత్మ పరములుగను వ్యాఖ్యానింపఁబడినవి. ద్వైతము నందు మాత్రము పదము లన్నియుఁగూడ పరమాత్మ పరములుగానే వ్యాఖ్యానింపఁబడినవి.

ఆత్మ-శబ్దము ప్రత్యగాత్మను-పరమాత్మనుగూడ బోధించునను నంశమును వ్యాఖ్యాత లందఱునుగూడ నంగీకరింతురు.

కావున "ఇందు-తెలుపఁబడినది-ఆత్మలక్షణము" అను నింత మాత్రము నే చెప్పి విరమింతును.

ఓం నమో భగవతే శ్రీరమణాయ।

శాంకర భాష్యావతారిక యందిట్లు సింహావలోకనము చేయఁబడినది.

వేదమునందు-కర్మనిష్ఠ-జ్ఞాననిష్ఠ-అను రెండునిష్ఠలు ప్రతిపాదింపఁబడి యున్నవి. బ్రహ్మ నిష్ఠయే జ్ఞాన నిష్ఠయని చెప్పఁబడును.

"జ్ఞానైక నిష్ఠులగు సన్న్యాసులు-సర్వైషణలను గూడ పరిత్యజించి ఆత్మారాములై యుండవలయును" అను నదియగు జ్ఞాననిష్ఠ-వేద సిద్ధాంతమునందు శ్రేష్ఠమై యున్నది. కావున నది-మొదటిదై యున్నది.

ప్రధానమగు ఆ ప్రథమ సిద్ధాంతమే "ఈశావాస్యమిదమ్" అను ప్రథమ మంత్రముచేత తెలుపఁబడినది.

అజ్ఞులు-జిజీవిషువు అనగా; జీవితమునందు కోరిక గలవారు. కావున "ఈశా-మాగృధః కస్యస్విద్ధనమ్" అని చెప్పఁబడిన యీ జ్ఞాననిష్ఠకు తగిన అర్హత వారికి సంభవము కానేరదు. కావున-ఆ యజ్ఞానుల నుద్దేశించి "కుర్వన్నేవేహకర్మాణి జిజీవిషేత్" అని వేద సిద్ధాంతమునందు ద్వితీయమను కర్మనిష్ఠ తెలుపఁబడినది.

ఇట్లు-ఈ యుపనిషత్తునందున్న ప్రథమ-ద్వితీయమంత్రముల యందు బ్రహ్మ నిష్ఠకును-కర్మనిష్ఠకునుగల విభాగము ప్రదర్శింపఁబడినది.

బ్రాహ్మణ రూపమగు బృహదారణ్యకోపనిషత్తునందుఁ గూడ-మొదట కర్మనిష్ఠయు-తదుపరి-బ్రహ్మ నిష్ఠయు-విభజించి ప్రదర్శింపఁబడి యున్నవి.

అందుఁగల తృతీయా ధ్యాయమునందలి చతుర్థ బ్రాహ్మణమున కర్మనిష్ఠ-ఇట్లు ప్రదర్శితము

"ఆత్మైవేదమగ్ర ఆసీదేక ఏవ సోఽకామయత జాయా మే స్యాదథ ప్రజాయేయాథ విత్తం మే స్యాదథ కర్మ కుర్వీయేత్యేతావాన్ వై కామః"

HYDERABAD DN.

* * *

భార్యాది భేదములుగల యీ సర్వ ప్రపంచమును గూడ యీ జాయాది సృష్టి కంటె పూర్వము—ఈ పెండ్లాము మొదలగు వానిని కోరుటకు నిత్తనమైయున్న వాసనతో (సంస్కారముతో) కూడిన అవిద్య గల ఒకే ఆత్మయై యుండెను.

అవిద్యా వాసనా వాసితమైన ఆయాత్మ-"నాకు కర్మాధి కారమునకు హేతు భూతయగు భార్య కలుగును గాక। తరువాత నేను సంతానమును పుట్టింతును గాక। తదుపరి నాకు ధనము-లభించును గాక। పిమ్మట (అభ్యుదయమునకును మోక్షమునకును ముఖ్యప్రియ విముక్తికిని సాధనమగు) కర్మను (పనిని) చేయుదును గాక।" అని కోరెను-కోరిక-యింతేగదా।

మనుష్య-పితృ-దేవలోకములను పొందుటకు సాధనము లగు జాయాపుత్ర విత్త-కర్మలకంటె వేరగు కామ మేదియు లేకుండుట వలన "కోరిక" అనునది విషయ పరిచ్ఛిన్నమగుట వలన అత్యల్పమై యున్నది. కావున "కామము-ఇంతయే గదా।" అని శ్రుతియందు వినబడుచున్నది.

అవిద్య-ఆత్మ స్వరూపము నావరించి యుండు నపుడు-అట్టి అవిద్యలగల ఆత్మకు సమస్త ప్రవృత్తులకును హేతువగు ఈ కామము పుట్టుచున్నది.

ఇట్టి-అల్పమైన కోరికగల-ఆయాత్మ-భార్యా పుత్రాదుల కంటె శ్రేష్ఠమును పరిపూర్ణమును అగు ఆత్మను (తనను) తెలిసి కొనకుండుట వలన (అవిద్యవలన) ఆ భార్యాదులతోనే కోరుచు-ఆభార్యాదులు లభింపనంత వఱకు-తనను అసంపూర్ణునిగా తలంచు కొనుచుండెను. అట్టి యాత్మకు (ఆయవస్థయందు) సంపూర్ణత లేకున్నను ఒక విధమగు సంపూర్ణత యిట్లగుచున్నది.

అసంపూర్ణమగు ఈ ఆత్మకు సంకల్ప వికల్పాత్మకమగు మనస్సే-ఆత్మ. (స్వరూపము) ఆ మనస్సునకు వాక్కే-భార్య. ఈ వాఙ్మనస్సుల వలన కర్మకొఱకు సంతానమువంటి ప్రాణము పుట్టుచున్నది. కావున ప్రాణమే-సంతానము. ఆ ప్రాణముయొక్క వివిధములగు చేష్టలచేతను జరుగునదియగు కర్మ-మానుష దైవ విత్తములచేత సాధింపఁదగియున్నది. ఆయాత్మకు శరీరమే కర్మ యగు చున్నది. నేత్రము-మానుష విత్తము-శ్రోత్రము-దైవ విత్తము అగుచున్నది. బాహ్యమగు భార్యాదిపంచకము లేకున్నను 1 మనస్సు, 2 వాక్కు. 3 ప్రాణము, 4 నేత్రశ్రోత్రములు, 5 శరీరము అనునవియే 1 తాను, 2 భార్య, 3 సంతానము, 4 ధనము; 5 కర్మ అను పంచక మగుచున్నది. ఈ పంచత్వ సంపదచేత పాఙ్క్తమను పేరుగల యజ్ఞమగుచున్నది.

మనస్సును-ఆత్మగాను, వాక్కును-భార్యగాను, అభిమానించుట మొదలగునవి అజ్ఞానకార్యములే యగును. కావున ఇట్లు తలఁచుచున్న కర్మ నిష్ఠుఁడు-కామియగు నజ్ఞుఁడే యగునను నంశము నిశ్చయముగాఁ దెలియును. ఈ యజ్ఞమునకు ఫలమగు నట్లు హిరణ్య గర్భునిచేత సృజింపఁబడిన సప్తాన్నముల యందుఁ గూడ అవియే తానను ఆత్మభావముతో నుండు నదియగు కర్మ నిష్ఠ-అజ్ఞునకేగాని విజ్ఞునకు సంగతము కానేరదు. తదుపరి బృహదారణ్యకోపనిషత్తు నందున్న షష్ఠాధ్యాయము నందుఁగల చతుర్థ బ్రాహ్మణమున "అన్ధంతమః ప్రవిశన్తి" అను నీమంత్ర మీ యర్థము నందే ప్రదర్శింపఁబడినది. ఇచ్చటనే "కిం ప్రజయా కరిష్యామః" అను మంత్రముచేత-ఆత్మయే లోకముగాఁగల మాకు సంతానముతోఁబనియేమున్నది? అని జాయాద్యేషణలను మూడింటిని గూడ సన్యసించిన ఆత్మ విదులకు కర్మనిష్ఠా ప్రతికూలమగు ఆత్మనిష్ఠయే ప్రదర్శింపఁబడినది.

(ఇట్లు ప్రథమ-ద్వితీయ-మంత్రములయందు ప్రదర్శింపఁబడిన-బ్రహ్మ-కర్మ-నిష్ఠలు-వేద భాగములగు బ్రాహ్మణములకుఁ

గూడ సమ్మతములని ప్రదర్శించి ప్రకరణ విభాగము నొనర్చు చున్నాఁడు.

ఈ యుపనిషత్తునందిట్లు-ప్రథమ-ద్వితీయ మంత్రముల చేత-జ్ఞాన నిష్ఠయు, కర్మనిష్ఠయు, ప్రతిపాదింపఁబడినవి. తరువాత "అసుర్యానామతేలోకాః" అను తృతీయమంత్రముచేత అవిద్వాంసులు (కర్మనిష్ఠులు) నిందింపఁబడిరి. తదుపరి "అనేజదేకమ్" అను మంత్రమునుండి, "సపర్యగాత్" అని వెనుక చెప్పఁబడిన మంత్రము వఱకును గల 5 మంత్రముల చేతను గూడ-ఆత్మ యాథాత్మ్యముపదేశింపఁబడినది. ఇట్లుపదేశింపఁబడిన జ్ఞాననిష్ఠకు-అధికారులు-విద్వాంసులే యగుదురు కాని కాములగు వజ్ఞులు కానేరరు.

శ్వేతాశ్వతర మంత్రోపనిషత్తునందుఁగూడ ఆరవ యధ్యాయమునందు "అత్యాశ్రమిభ్యః పరమం పవిత్రమ్"—

ఇత్యాది మంత్రములచేత జ్ఞాన నిష్ఠా-కర్మనిష్ఠలు విభజింపఁబడి అత్యాశ్రములకే జ్ఞాననిష్ఠ చెప్పఁబడినది. ఉత్తమాశ్రములగు సన్యాసులే అత్యాశ్రములను చెప్పఁబడుదురు గదా!

"అన్ధంతమః ప్రవిశన్తి" అను క్రింది మంత్రము— కర్మ చేయుచు జీవింపఁగోరిన కర్మనిష్ఠులకు విద్యయను ఉపాసనతోఁ గూడిన కర్మనుపదేశించుటకై ప్రవర్తించుచున్నది.

ప్రశ్న :— క్రింది మంత్రము-సకాములగు కర్మనిష్ఠుల నుద్దేశించియే చెప్పఁబడుచున్నది. కాని జ్ఞాన నిష్ఠుల నుద్దేశించి చెప్పఁబడుటలేదని యెట్లు తెలియును?

ఉ :— కామహేతుఁడు కాని వానికి సాధ్యము (సాధింపఁదగిన వస్తువు) సాధనము అను భేదము నుపమర్దించి (తొలఁగించి) "యస్మిన్ సర్వాణి భూతాని" అను మంత్రముచేత-ఏ యేకత్వ ముపదేశింపఁబడినదో-ఆ యేకత్వ విజ్ఞానమునకు-దేవతాది జ్ఞాన రూపమగు వేఱొక ఉపాసనతోఁగాని, శ్రౌతస్మార్తాది రూపమగు కర్మతోఁగాని సముచ్చయము (కలయిక) సంఘటించునది కావే

రదు-మూఢుఁడు కాని వాఁడెవ్వఁడును "తత్రకో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః" అని-ఆత్మయొక్క ఏకత్వము నెఱిఁగియు ఏదో యొక కర్మతోఁగాని ఏదో యొక జ్ఞానాంతరముతోఁగాని, ("విద్య" అని చెప్పఁబడిన ఉపాసనతోఁగాని) కలయికఁగలిగి యుండఁడు గదా!

ఆత్మకంటె వేరగు వస్తువులేదని తెలిసిన ఆత్మజ్ఞానికి అసద్వస్తువునందు-అనఁగా అసత్యములైన-కర్మ-జ్ఞానాంతరముల యందు కోరిక గలుగదు. కోరిక లేనియెడల కర్మనాచరింపఁడు. కావున-ఆత్మైక్య జ్ఞానమునకును కర్మకును సముచ్చయము యుక్తము కానేరదు.

ప్రశ్న :— "క్రింది మంత్రము-అవిద్యా పదము చేత తెలుపఁబడిన కర్మకును, విద్యా పదముచేత తెలుపఁబడిన-ఆత్మ జ్ఞానమునకును, సముచ్చయమును (కలయికను) విధింపఁగోరియే ప్రవర్తించుచున్నది. కావుననే సముచ్చయ. కారులుగాక కేవల కర్మనుగాని, కేవలవిద్యనుగాని, స్వీకరించు మనుష్యులను నిందించు చున్నది. విద్యా పదము-ఆత్మజ్ఞాన పరమేకాని, ఉపాసనా పరము కాదు". అని యేల చెప్పఁగూడదో తెలుపుఁడు?

ఉత్త :— న్యాయమువలనను శాస్త్రమువలనను గూడ దేనికి-దేనితోడ సముచ్చయము సంభవించునో, అదియే క్రింది మంత్రమునందు చెప్పఁబడవలయును, దేవతా విషయముగాఁ జెప్పఁబడిన -దైవ విత్తమగు దేవతా జ్ఞానము (వివిధ దేవతల యొక్కయు ఉపాసనము) కర్మకు సంబంధించినది గానే-బృహ దారణ్యకాదుల యందుపన్యసింపఁబడినది. కాని పరమాత్మ జ్ఞానము-కర్మసంబంధిగా నుపన్యసింపఁబడుటలేదు. విద్య యనఁగా నిచట దేవతా జ్ఞానమను వర్థమునే-అనఁగా ఉపాసననే గ్రహింప వలయును.

"విద్యయా దేవలోకః" అను మంత్రముచేత ఆత్మ జ్ఞానమువలని ఫలముకంటె వేరగు ఫలము విద్యకుఁ (ఉపాసనకు)

గలుగునను సంశయము ప్రసిద్ధమే యగుచున్నది. కావున నిచట నున్న విద్యా శబ్దము దేవతా జ్ఞానమగు ఉపాసననే తెలుపునని తెలియునది.

జీవులు-కర్మచేత పితృలోకమును, విద్యచేత (ఉపాసన చేత) దేవలోకమును (ఆయా దేవతల లోకములను) పొందు చుందురు. దక్షిణ మార్గగాములగు జీవులు దేవలోకమును బొందఁ జాలరు. అని శ్రుతియందు వినఁబడుచున్నది గదా!

వేరువేరగు ఫలములుగల యీ కర్మోపాసనలు శాస్త్ర విహితములై యున్నవి. కావున-కేవల కర్మయు, కేవలోపాస నయుఁగూడ-అజ్ఞులకు కర్తవ్యములే యగును.

వేద శాస్త్ర విహితమగు నదేదియుఁగూడ-చేయఁదగనిది-కాదు. అయినను-కర్మనుగాని, ఉపాసననుగాని, ప్రత్యేకముగా నొనర్చుటకంటె-దేవతాజ్ఞాన రూపమగు నీ ఉపాసనముతోఁగూడిన కర్మ నొనర్చుట-మిక్కిలి శ్రేష్ఠమును-అర్చిరాది మార్గమును పొందించునదియు-అగుచున్నది. కావుననే-విద్యాపద వాచ్యమగు ఉపాసనకును, కర్మకును సముచ్చయమును విధించుతలంపుచేత-శ్రుతి-వాని ప్రత్యేకాచరణమును నిందించుచున్నది.

ఆనందగిరిటీక యందిట్లు చెప్పఁబడినది :—

"విద్యాయాం రతాః" అని క్రింది మంత్రమునందు చెప్పఁబడిన విద్యా పదము-ఉపాసననే తెలుపును.

విద్యా శబ్ద వాచ్యములగు-ప్రాణాద్యుపాసనలు కూడ-ఉపనిషత్తులయందు విధింపఁబడుచున్నవి. కావున-ఉపనిషత్తంతయుఁగూడ బ్రహ్మ విద్యా ప్రతి పాద కమే యగునని చెప్పఁదగదు.

ఉపాసనలకును, బ్రహ్మ విద్యకును గూడ ఫలములు భిన్నములై యుండుట వలన - ఈ యుపాసనలు - బ్రహ్మవిద్యకు - అంగములని కూడ చెప్పఁదగదు. "ఈ యుపాసన-కర్మకు విరుద్ధము కాకపోయినను, బ్రహ్మవిద్యకు విరుద్ధమే యగును. "ఈ శ్రుతియందు-"ఈశావాస్యమిదం సర్వమ్" అను మంత్రముచేత- బ్రహ్మ విద్య యే ప్రారంభింపఁబడినది. "కావున కర్మనిష్ఠా-జ్ఞాననిష్ఠంతే శ్రుతి-సముచ్చయమును విధింపఁదలఁచినది. కావున 11వ మంత్రమునందుగ్గడింపఁ బడిన-సముచ్చయము-జ్ఞాన-కర్మ-నిష్ఠానసముచ్చయమేగాని-కర్మ-ఉపాసనా సముచ్చ యము కాదు" అని భాష్యకారులు పలుకఁదిట చెప్పినది సంగతము కానేరదు.

ఏల యనిన: కర్మగాని, ఉపాసనగాని, కావింపఁబడిన పిమ్మట కొంత కాలమునకు ఫలము లభించును. కావున వానికే సముచ్చయము విధింపఁబడఁదగి యున్నది. జ్ఞాన నిష్ఠయందు-బ్రహ్మాత్మైక్యదర్శన సమకాలమునందే మోహాది నివృత్తి రూపమగు ఫలము కాన్పించుచున్నది. ఈ జ్ఞాననిష్ఠయందు-కర్మోపాసన యందువలె ఫలముతోడి వ్యవధానము లేకుండుట వలన దీనికి-కర్మతోడి సముచ్చయము సముచితము కానేరదు.

కావున "విద్యాంచావిద్యాంచ" అను ౧౧వ మంత్రమునందు-కర్మోపాసనలకే సముచ్చయమును విధింపఁదలఁచిన శ్రుతి-ఈ మంత్రమునందు-వాని ప్రత్యేకాచరణమును నిందించుచున్నది. కావున-క్రింది మంత్రమునందు విద్యాశబ్దముచేత చెప్పఁబడినది, ఉపాసనయేగాని, 'బ్రహ్మవిద్య'కాదని తెలియునది.

మూ॥ అన్ధంతమః ప్రవిశన్తి
యేఽవిద్యా ముపాసతే
తతో భూయ ఇవతమో
య ఉ విద్యాయాం రతాః॥ ౯

అ॥ అంధమయిన తమమునందుఁ జొచ్చెదరవి
ద్యా పరాయణులగు నట్టి వారు
దానికంటె నధికమౌ నంధతమమెకాం
చెదరు విద్యయందె మరిగలారు॥

పాఠాంతరము

గీ॥ గ్రుడ్డి చీకటియందె తొల్కొండ్రు విద్య
యందె సంసక్తులయిన వారకట! దాని
కంటె నధికమౌ గ్రుడ్డి చీకటినె కొంతు
రకటకట! విద్యయందె రక్తి కలవారు॥

పద :— అన్ధమ్ - తమః - ప్రవిశన్తి యే - అవిద్యామ్ ఉపాసతే-తతః-భూయః-ఇవ-తమః-యే-ఉ-విద్యాయామ్ - రతాః.

టీక :— యే=ఎవ్వరు, అవిద్యామ్ = అవిద్యయగు కర్మను-(మాత్రమే)ఉపాసతే=ఉపాసించుచుందురో (తే=వారు) అన్ధమ్=గ్రుడ్డిదియగు (వెలుతురు లేని) తమః=చీకటిని, ప్రవిశన్తి=ప్రవేశించుచుందురు. (కర్మను విడిచి) యే=ఎవ్వరు విద్యాయామ్=విద్యయందే (దేవతోపాసనమునందే). రతాః=

ఆసక్తులై యుందురో (తే=వారు) తతః=వెనుక చెప్పఁబడిన గ్రుడ్డి చీకటికంటె. భూయ+ఇవ=అధికమే యగు. తమః=చీకటిని. ప్రవిశన్తి=ప్రవేశించు చుందురు.

తాత్పర్యము :— అవిద్య నుపాసించువారు-అవిద్య (అజ్ఞానము)నే పొందుదురు. కర్మ వలన చిత్తశుద్ధి నొందక విద్యను (ఉపాసనను, లేక బ్రహ్మవిద్యను) ఉపాసించువారు-అంతకంటెను గూడ అవిద్యను పొందుదురు.

శాంకర భాష్యార్థము :—

అవిద్య-విద్యకు విరోధి. కావున విద్యకంటె వేరగు కర్మయే అవిద్య యని చెప్పఁబడును. అగ్నిహోత్రాదిరూపమగు కర్మను మాత్రమే అనువర్తించు కర్మనిష్ఠులు-జ్ఞానదర్శనము లేని అవిద్యయను చీకటియందు ప్రవేశించుచుందురు. చిత్తశుద్ధికి కారణమగు కర్మను గావింపక-దేవతా జ్ఞాన రూపమగు నుపాసనయగు విద్యయందే అభిరతులగు మనుష్యులుకూడ-కర్మయందు మాత్రమే అభిరతులగువారు పొందు నదియగు గ్రుడ్డి చీకటికంటెను గూడ అధికమే యగు అజ్ఞానమునే పొందుచుందురు.

ఉవటాచార్య భాష్యము :—

స్వర్గము కొఱకు కర్మలనాచరించు జీవులు అజ్ఞాన రూపమగు తమస్సును పొందుచుందురు. చిత్తశుద్ధికి హేతువులగు కర్మలను విడిచి-ఆత్మజ్ఞానమునందే ఆసక్తులగు వారు-అంతకంటెను అజ్ఞాన రూపమగు తమస్సునందు ప్రవేశించుచుందురు.

ఈశావాస్య దీపిక :—

ఒకానొకఁడు "అనేజదేకమ్" ఇత్యాదిగా తెలుపఁబడిన ఆత్మతత్త్వమును తెలియఁడు. సన్న్యాసమునకు యోగ్యుఁడు కాఁడు. అయినను సంసారమునందు మిక్కిలి ప్రీతి గలవాఁడు గూడ కాకుండును. అట్టి శిష్యునకు యోగ్యమగు ధర్మము నుపదేశించుటకు క్రింది మంత్రము ప్రారంభింపఁబడినది. ధనాభిలాషులగు కర్మనిరతులు-జ్యోతిష్టోమాదులగు కర్మల నొనర్చుచుందురు. విద్యయగు దేవతోపాసనమును గాని, ఆత్మ జ్ఞానమునుగాని కలిగియుండరు. అట్టి మూఢులు అహంమమాభిమాన రూపమగు చీకటియందు ప్రవేశించు చుందురు.

ప్రశ్న :— కర్మను విడిచి-దేవతల నుపాసింప వలయునా? లేక "అహంబ్రహ్మాస్మి" అని తెలియుచుండ వలయునా?

ఉక్త :— చిత్తశుద్ధి కలుగనిదే కర్మలను విడువఁగూడదు. వరిశుద్ధ చిత్తులు కాని వారికి సంపూర్ణమగు విరక్తి కలుగదు. అపరిశుద్ధ చిత్తులకు కర్మయందే అధికారమున్నది.

దేవతా జ్ఞానమునందు రక్తులగు ఉపాసకులుగాని, ఆత్మ సాక్షాత్కారము లేకున్నను తత్త్వ జ్ఞానమునందాసక్తి గలిగి "నేనే బ్రహ్మమును" అని నోటితో మాత్రమే పలుకుచుండు మూఢులుగాని, కర్మను విడిచిన యెడల అహంతమాభిమాన రూపమగు సంసారమునే పొందుచుందురు.

చిత్తశుద్ధిలేని ఉపాసనముగాని-ఆత్మజ్ఞానము గాని ప్రయోజనకారి కానేరదు.

ఈశావాస్య రహస్య వివృతి :—

కేవల కర్మోపాసకులు జనన మరణ పరంపరా రూపమగు సంసారమును పొందుచుందురు. సత్ కర్మలవలన చిత్తశుద్ధి కలుగును. శుద్ధచిత్తులు కాకున్నను కర్మను విడిచి దేవతోపాసనమును గావించు మనుష్యులు ఉపాసనా ఫలమగు పుణ్య లోకములను పొందఁజాలక, కేవల కర్మోపాసకుల కంటెనుగూడ అధమమగు గతినే పొందుచుందురు. కావున కేవల కర్మనుగాని దేవతోపాసనమునుగాని సేవింపఁగూడదు.

అద్వైతా నందలహరి :—

ఆత్మ-కర్త కాఁడు, అవిద్యవలన ఆత్మయే జీవుఁడగు చున్నాఁడు. ఈ జీవుఁడు-అవిద్యావాసనల వలన కర్తృత్వాభిమానమును పొంది-కర్మల నొనర్చుచున్నాఁడు. కావున అవిద్యయనఁగా: శ్రౌత-స్మార్త కర్మలే యగుచున్నవి. వేద విహితములగు కర్మలను మాత్రమే కావించువాఁడగు మనుష్యుఁడు పితృలోకము నొందును. ఆలోకమునందు స్వకర్మ పరిమిత మగు సుఖము మాత్రమే లభించును. అంతకంటె నధికమగు సుఖము లభింపదు. పునర్జన్మము తొలఁగదు. రాగ-ద్వేష-దేహాభిమానాదులు నివర్తింపవు. కావున నది అంధతమస్సువంటిదియే యగును.

విద్యా శబ్దమునకు ముఖ్యవృత్తిచేత జ్ఞానమే యర్థమగు చున్నను ఇచ్చట మాత్రము గౌణవృత్తిచేత ఉపాసనమను నర్థమును గ్రహింప వలసియుండును. ఆయుపాసన యందు రక్తులగు జీవులు-ఉపాసనకు ఫలమగు దేవలోకమును పొందుచుందురు: ఇది-విద్యల్లోకమునకు క్రిందనున్నను పితృలోకము కంటె శ్రేష్ఠమై యున్నది. అయినను నిందు లభించునది యగు సుఖముగూడ స్వల్పమే యగుచున్నది. ఈ దేవలోకగాములకుఁగూడ పునర్జన్మము తప్పదు. (భోగ పూర్ణమగు) దేవలోకము నొందఁగలిగితినను దురభిమానము గూడ కలుగుచుండును. కావున-ఈ దేవలోకప్రాప్తికూడ-కర్మఫలము కంటెను గూడ అధికమగు అజ్ఞానముగాఁ తెప్పఁబడినది.

ప్రత్యేక నిందాతాత్పర్యముచేత శ్రుతి యిట్లు చెప్పినదని కొందరు వ్యాఖ్యాతలు తెలిపిన అభిప్రాయము సమీచీనము కానేరదు.

ఏలయనిన :— కర్మ-ఉపాసన-అనునవి రెండునుగూడ వేదమునందు విహితములే యగుచున్నవి. కావున నవి నిందింపఁదగినవి కానేరవు.

అంతనము-కర్మ-ఉపాసనలను రెండింటినిగూడ నాచరించుటవలన (సముచ్చయము వలన) ఫలాతిశయము కలుగు నను నభిప్రాయమున శ్రుతి-ఇట్లు చెప్పినదని గ్రహించుట సమీచీనము కాఁగలదు.

అనంతాచార్య కృతభాష్యము :—

[ఇందొక యర్థము-శంకర భాష్యము ననుసరించి వ్రాయఁబడినది. పిదప నిట్లు చెప్పఁబడినది.]

ఇతరులు మీఁది మంత్రమున కింకొక తీరున వ్యాఖ్య నొనర్చిరి.

అవిద్యయన-కర్మ-కానేరదు. "కుర్వన్నేవేహ" అను మంత్రమునందు-కర్మ-శాస్త్ర విహితమై యున్నది. అవిద్యయనఁగా-మూఁడవ మంత్రము నందు చెప్పఁబడిన నరకమును పొందించునది యగు అన్యథాజ్ఞానమే యగును.

కావున నీమంత్రముయొక్క అర్థము నిట్లు తెలియనగును.

ఎవరు-అన్యథాజ్ఞానము నుపాసింతురో వారు అంధతమో రూపమగు నరకము నందు ప్రవేశింతురు. "అసన్నేవసభవతి అసద్ బ్రహ్మేతివేదచేత్" బ్రహ్మము లేదని తెలిసినవాఁడు-లేనివాఁడే యగును అని పనఁబడు చున్నది గదా!

అంధతమస్సునకు సాధనమగు నీ అన్యథాజ్ఞానముయొక్క నిందయందు (తిరస్కారమునందు) రక్తులు గాక యోగ్యతలేకున్నను ఆత్మస్వరూప జ్ఞానమునందే రక్తులగువారు-అన్యథోపాసకులకంటెను గూడ నధికమగు అన్యథా జ్ఞానమునొంది వారు పొందునది యగు నంధతమో లోకముకంటెనుగూడ అధికమగు అంధతమో లోకమునే పొందుచుందురు.

విశిష్టాద్వైత భాష్యార్థము:—

ఇంతవఱకును కర్మయోగము మొదలగు అంగములు గలదియు, విచిత్రశక్తియుక్తుఁడగు పరమాత్మ విషయముగాఁగలదియు, అగు విద్య-ఉపదేశింపఁబడినది. క్రింది మంత్రములు-కేవల కర్మావలంబులును, కేవల విద్యావలంబులును, అనఁగా బ్రహ్మవిద్యానిష్ఠులును అగు పురుషులను నిందించుచు-వర్ణాశ్రమ ధర్మానుగృహీతమగు విద్యచేతనే మోక్షము లభించునని చెప్పుచున్నవి.

జ్ఞాన విధురమగు కేవల కర్మ నొనర్చువారగు భోగైశ్వర్య ప్రసక్తులు-అతిగాఢమగు అజ్ఞానమునుగాని, లేక త్రివర్గాభిషంగము వలన మూఁడవమంత్రమునందు చెప్పఁబడిన తమోలోకమునుగాని పొందుచుందురు.

ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞ రూపాః
అష్టాదశోక్త మవరం యేషు కర్మ
ఏతచ్ఛ్రేయో యేఽభినన్దన్తి మూఢా
జరామృత్యూ పునరేవాపి యన్తి॥

ము౦ ౧క-౧-౨-౭.

"ఋత్విక్కులు-పదునారుగురు - పత్ని, యజమానుఁడు, అను వారి నాశ్రయించి యున్నది యగు కర్మ-జ్ఞాన వర్జితమై యున్నది. ఈ కర్మలు-వినాశ శీలములును, అస్థిరములును, యజ్ఞ రూపములునునై యున్నవి. ఇట్టి కర్మయే శ్రేయః కారణమని మూఢులభినందించుచుందురు. కావున వారు మాటిమాటికిని జరామరణములను పొందుచు సంచరించు చుందురు".

అని అధర్వణికులు-కేవల కర్మనిరతులకు దుఃఖానువృత్తినే చెప్పుచున్నారుగదా!

స్వాధికారమున కుచితమగు కర్మను పరిత్యజించి (అధికారము లేకున్నను) విద్యయందే (బ్రహ్మవిద్యయందే) రక్తులగు వారుకూడ కర్మమాత్ర నిష్ఠాప్రాప్యమగు అంధతమస్సు కంటె అధికమగు అజ్ఞానమునే పొందుదురు. అతమస్సు-ఇంతటిదని గ్రహించుటకు వీలుకాదను వంశమును-ఇవశబ్దముస్ఫురింపఁజేయుచున్నది.

ద్వైతభాష్యార్థము :—

పరమాత్మయగు విష్ణువుయొక్క యథార్థ స్వరూపమును విడిచి-వేఱొకటియగు నిర్గుణత్వాద్యాకారమును ధ్యానించు మనుష్యులు-తృతీయ మంత్రమున చెప్పఁబడిన అంధతమస్సును పొందుదురు. ఇందు సంశయములేదు. ఇట్లు ధ్యానము చేయు వ్యక్తులు అన్యథోపాసకు లగుచున్నారు.

యథార్థజ్ఞానమగు విద్యయందే రక్తులై అన్యథోపాసకు లగు మిథ్యాజ్ఞానులను నిందింపని వారుకూడ అంతకంటెను కొంచెము అధికమగు తమస్సునే నిశ్చయముగా పొందుదురు.

కావున దోషరహితుఁడగు నారాయణుని స్వరూపము యొక్క జ్ఞానము-మిథ్యాజ్ఞానియొక్క నింద-అను రెండింటినిగూడ తెలిసికొనిన వారే సజ్జనులు.

స్వాభిప్రాయము :—

కేవల కర్మవలనఁగాని కేవల విద్యవలనఁగాని అనర్థము తొలఁగదు. కర్మవలన చిత్తశుద్ధి నొందిన పురుషునకే ఏకాగ్రతచేత సాధింపఁదగిన ఉపాసనయందుఁగాని, ఆత్మ విద్యయందుఁగాని, అధికారము కలుగును. కావున-కేవల కర్మఠులకును-కేవలోపాసకులకును, (యోగ్యతలేని) కేవలాత్మ జ్ఞానులకునుగూడ-సంసారబంధము కలుగక తప్పదు. కావున కర్మనుపాసించిన వారు గాని, దేవతోపాసకులుగాని, చిత్తశుద్ధిలేని పరోక్షశాబ్ద బ్రహ్మ జ్ఞానులుగాని, జనన మరణ రూపమగు అంధతమస్సును పొందక తప్పదు. కావున-ఈ మంత్రము-కర్మ-దేవతా జ్ఞానముల ప్రత్యేకాచరణమునుగాని-కర్మ-శాబ్దికాత్మజ్ఞానముల ప్రత్యేకాచరణమును గాని, నిందించుటకు ప్రవర్తించు చున్నదని చెప్పుట సమీచీనమని తలఁచు చున్నాను. నిష్కామమగు సత్కర్మాచరణము వలన చిత్తశుద్ధినొంది-విషయముల యందున్న దోషములను గుర్తించి విరక్తినొందిన యోగ్యులకు మాత్రము కేవలమగు ఆత్మ విద్య-సంసారబంధ హేతువు కానేరదు. కావున ఆత్మ విద్య యొక్క-ప్రత్యేకనిష్ఠ-యోగ్యతగల వ్యక్తి విషయమున నిందార్హము కాకుండుటయేకాక-అదియే - ఆవశ్యక మగునని తెలియునది. కైవల్యము-జ్ఞానమువలననే లభించును. గాని కర్మవలనఁగాని-ఉపాసన వలనఁగాని తదితరములు వేనివలనను గూడ లభింపదుగదా!

ఓం నమో భగవతే రమణాయ శ్రీ భారతీ దేవ్యైనమః.

శ్రీ శాంకర భాష్యావతారిక :—

క్రింది మంత్రము విద్యా (ఉపాసన) కర్మ-సముచ్చయమునకు కారణమగు విద్యా విద్యల అవాంతర ఫల భేదమును దెలుపుచున్నది.

మూ॥ అన్యదేవాహుర్విద్యయాఽన్యదాహు రవిద్యయా
ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్తద్ వి (వ్యా) చచక్షిరే॥౧౦

కం॥ తెలిపిరి సుధీరు లాచా
ర్యులు మా; కవివింటి, మే మెఱుగుదుము, విద్యా
ఫల మొక్కటియు, అవిద్యా
ఫల మొకటియు, అనెడితఫ్ విభాగవచనముల్॥

పదవిభాగము :— అన్యత్-ఏవ-ఆహుః-విద్యయా-అన్యత్ ఆహుః-అవిద్యయా-ఇతి-శుశ్రుమః-ధీరాణామ్-యే-నః-తద్ - విచ చక్షిరే॥

టీ :— యే=ఎవరు, తత్=అకర్మను-జ్ఞానమును, నః= మాకొఱకు, విచచక్షిరే = వ్యాఖ్యానించిచెప్పిరో, తే = వారు, విద్యయా=జ్ఞానముచేతను (ఉపాసనచేతను) అన్యదేవఫలమ్= భిన్నమగు ఫలమునే, అహుః=చెప్పిరి, అవిద్యయా=కర్మచేతను అన్యదేవ=వేరొక ఫలమునే, అహుః=చెప్పిరి. ఇతి=ఇట్లు, ధీరాణామ్=ధీరులయిన పండితులయొక్క, వచనమ్=వాక్యమును, శుశ్రుమః=వినియున్నాము.

తా :— ఏ యాచార్యులు-మాకు జ్ఞాన-కర్మలను చెప్పి యుండిరో, వారే-"దేవతా విజ్ఞానముచేత దేవ లోకము కలుగు" ననియు, "కర్మచేత పితృ లోకము కలుగు"ననియు, ఇట్లు-కర్మ-జ్ఞానములకు రెండింటికివి గల ఫలములు-వేఱుఱు యున్నవనియు, చెప్పుచున్నారు. సుజ్ఞానులగు ఆయాచార్యులు తెలిపిన వాక్యమును మేము విని యున్నాము.

శాంకర భాష్యము :—

"విద్యయా-దేవలోకః-విద్యయా తదారోహన్తి."

"కర్మణా పితృలోకః."

అను శ్రుతులవలన-విద్య యనఁగా, "ఉపాసన" యను వర్థము సిద్ధించుచున్నది, దేవతా విజ్ఞాన రూపమగు ఉపాసనముచేత

దేవలోకమును, అవిద్యారూపమగు కర్మచేత పితృలోకమును, కలుగు నను నీయభిప్రాయము-ఆచార్య పరంపరాగతమై యున్నది.

శంకరాచార్య భాష్యము నందిట్లున్నది :—

విద్యాశబ్దవాచ్యమగు ఆత్మజ్ఞానము వలని ఫలమును అవిద్యాశబ్దవాచ్యమగు-కర్మవలని ఫలమును వేర్వేరగుచున్నవి.

ఈశావాస్య దీపిక-ఇట్లు చెప్పుచున్నది :—

పూర్వ :— అయ్యా! "అన్ధంతమః" అను మంత్రమున విద్యావిద్యలు రెండును నిందింపఁబడినవి. కావున రెండును నిష్ఫలములే యగునా?

ఉ :— కావు. వానికి భిన్నములగు ఫలములు కలవు. విద్యాఫలమగు దేవయానము చేత ఆత్మప్రాప్తి-అవిద్యా కర్మ ఫలమగు పితృయానముకంటె వితరమే యగును. ఇట్లు-విద్యా విద్యలు-సఫలములే యగుచున్నను భిన్నములై యున్నవి. మంత్రమునందున్న ఏవశబ్దము విద్యాకర్మలకు అంగాంగి భావమును నిషేధించుచున్నదని తెలియునది.

అనంతాచార్య కృతభాష్యము :—

విద్యచేత-అనఁగా, ఆత్మయాథాత్మ్య జ్ఞానముచేత-మోక్షైక దేశలక్షణమగు ఫలమును (మోక్షమునందొక భాగమును) అవిద్యచేత-అనఁగా, అన్యథాజ్ఞానమిందచేత మోక్షైక దేశలక్షణమగు ఫలమును కలుగును." అని జ్ఞానవృద్ధులు మాకు చెప్పఁగా వినుచున్నాము.

అద్వైతానందలహరి :—

కేవలమగు విద్యచేత-కేవలమగు కర్మయొక్క ఫలముకంటెను-కర్మ సముచ్చితమగు ఉపాసన యొక్క ఫలముకంటెను గూడ వేరగు ఫలము కలుగునని విద్వాంసులు చెప్పుచున్నారు.

కేవలమగు విద్య (ఉపాసన) వలన పునరావృత్తి కోఁగూడిన దేవలోకము కలుగును. అది విద్యుల్లోకమునకు క్రింద నున్నది. కేవల కర్మ ఫలము-పితృలోక ప్రాప్తియు, కేవలోపాసన ఫలము దేవలోక ప్రాప్తియు-అగుచుండునని శ్రుతియందు వినఁబడుచున్నది.

విశిష్టాద్వైతభాష్యము :—

[శ్రీ వేదాంత దేశిక-కూరనారాయణముని-వ్యాఖ్యా సంగృహీతము.] బ్రహ్మ జ్ఞానములేని కేవల కర్మవలనను, కర్మ నిరపేక్షమగు కేవల విద్య వలనను అనఁగా జ్ఞానమువలనను మోక్షము సిద్ధించునది కానేరదు అని పూర్వాచార్యులు మాకు తెలిపిరి. పరమాత్మ ధ్యానపరులగు వారి వాక్కులను మేము విని యున్నాము.

ప్రణిపాతాదులచేత. సమీపించిన మాకా యాచార్యులు మోక్షసాధనమును విభజించి యుపదేశించిరి. కావున ఈ యభిప్రాయము పూర్వ పూర్వ సంప్రదాయ సిద్ధమై యున్నది.

శ్రీ రంగాచార్య భాష్యమునందలి యభిప్రాయము :—.

"ముముక్షువు-కర్మనంగముగాను, విద్యనంగిగాను ఆచరింపవలయును. కర్మను-జ్ఞానమును ప్రత్యేకముగా ననుష్ఠించుట సముచితముకాదు" అని చెప్పుటకు-కేవల కర్మను-కేవల విద్యను ప్రత్యేకముగా నుపాసించు వ్యక్తులకు విపరీతమగు ఫలము లభించునని "అన్ధంతమః" అను పూర్వమంత్రమునందు ప్రతిపాదింపఁబడినది. ఈ మంత్రమునందు వానిచేత లభించునదియగు ఫలభేదము న్రతిపాదింపఁబడుచున్నది.

జ్ఞాన రూపమగు పరవిద్యచేత లభించునదియగు ఫలము అవిద్యా శబ్దితమగు కర్మయోగముచేత సాధింపఁదగిన ఫలముకంటె వేరై యున్నది. అవిద్యయని చెప్పఁబడిన కర్మచేత లభించు నదియగు ఫలము విద్యచేత సాధింపఁదగిన ఫలముకంటె వేరై యున్నది. పూర్వ పూర్వ బ్రహ్మ విద్యాసంప్రదాయ పరంపరా ప్రాప్తమగు నీయర్థమును బ్రహ్మవిదులగు నాచార్యుల వలన విని యున్నాము. కావున నీయర్థము పరమార్థభూతమే యగుచున్నది.

ఫలాభి సంధితోఁగూడిన కేవల కర్మ నాచరించుట వలన పుత్రపశ్వాది రూపమును, స్వర్గాదిరూపమును అగుచు ప్రాకృత భోగైశ్వర్య లక్షణమగు ఫలము లభించును. ఫలాభి సంధిని విడిచి కేవలమగు కర్మనాచరించుట వలన జ్ఞానము పుట్టుటకు విరోధియగు పుణ్య-పాపబంధము మాత్రమే నివర్తించును. కేవల విద్యానుష్ఠానము వలన-అమృత శబ్దితమగు బ్రహ్మ ప్రాప్తి కలుగును. కావున-అవిద్యచేత లభించు నదియగు ఫలము-విద్యచేత లభించు నదియగు ఫలము కంటెను, విద్యచేత లభించు నదియగు ఫలము-అవిద్యచేత లభించు నదియగు ఫలముకంటెను భిన్నములగుచున్నవి.

మోక్ష విరోధియగు ఫలమునకు కారణమగుచు-ఫలాభి సంధితోఁగూడిన కేవల కర్మ-గుడ్డిచీకటిని పొందుటయను మహా నర్థమునకు హేతువగుటవలన ముముక్షువుచేత ఆదరింపఁదగినది కాదు. జ్ఞాన విరోధులగు పుణ్యపాపములను మాత్రమే నివర్తించు నదియగు ఫలాభి సంధిరహిత కేవల కర్మకూడ-బ్రహ్మప్రాప్తికి హేతువు కాకుండుట వలన మోక్షమును సాధించునది కాఁజాల కున్నది. ఇట్లు ద్వివిధమగు కర్మయుఁగూడ మోక్ష సాధనము కాకుండుటవలన ముముక్షువుల కుపాదేయము కానేరదు. కేవల మగు విద్యకూడ జ్ఞానోత్పత్తికి విరోధులగు పుణ్య-పాపకర్మల యొక్క నివృత్తి కలుగకుండుట వలన-జ్ఞానమును పుట్టింపఁజాలదు. జ్ఞానము కలుగనియెడల బ్రహ్మప్రాప్తి రూపమగు మోక్షము సిద్ధింపదు. కావున-కేవల విద్యకూడ ముముక్షువునకు ప్రయోజన కారికాఁజాలదు. కావున-విద్యా కర్మలను ప్రత్యేకముగా నాచ రించుట యుక్తముకాదు. అనునది దీనితాత్పర్యమని గ్రహించునది.

ద్వైతభాష్యము :—

తత్త్వజ్ఞానము - మిధ్యాజ్ఞానులనింద-అను రెండును మోక్ష సాధనములని మా కుపదేశించిన ధీరులే యిట్లు చెప్పియున్నారు. "యథార్థ (తత్త్వ) జ్ఞానముచేత-మోక్షమునందొకభాగమునే పొందు దురు. మిధ్యాజ్ఞానము యొక్క నిందచేత - వేఱొక భాగమునే పొందుదురు."

ప్వాలిపార్తీయము :—

విద్యా శబ్దము-ఉపాసనను-బ్రహ్మవిద్యనుగూడ తెలుపును. కర్మోపాసన, జ్ఞానఫలములు భిన్నములై యున్నవి. కేవల కర్మ వలన పితృలోకమును-ఉపాసనవలన దేవలోకమును. ప్రతిషిద్ధ కర్మవలన-అధోగతియును, జ్ఞానమువలన పునరావృత్తి రహితమగు మోక్షమును లభించుననను సంశయము— సర్వ వేదాచార్య సమ్మతమై యున్నది. కేవల కర్మవలన పునరావృత్తి కలుగును. కేవ లో

పాసనవలన దేవలోకము కలిగినను దానినుండి పునరావృత్తి కలుగునని కొన్ని వ్యాఖ్యలు చెప్పుచున్నవి. దేవతో పాసనతో గూడిన కర్మ-సముచ్చితకర్మ అని చెప్పబడును. ఈ సముచ్చిత కర్మవలన దేవయానమనెడి అర్చిరాది మార్గముచేత కార్య బ్రహ్మ లోక ప్రాప్తి కలుగును. అనగా; సూక్ష్మభూత సముదాయ స్వరూపమై యుండు హిరణ్య గర్భలోకమున కరిగి తత్సారూప్యము నొందుటయే సిద్ధించును. గాని నిరతిశయానంద స్వరూప బ్రహ్మ ప్రాప్తి-సంభవింపదు. కావున సముచ్చిత కర్మకూడ-పరమ పురుషార్థమునకు ముఖ్య సాధనముకాదు: కాని క్రమముక్తికి సాధకమగును. ఆత్మ జ్ఞానమువలన ఈ మనుష్య లోకము నందే-జీవన్ముక్తి కలుగును. కావున మోక్షమునకు ముఖ్యసాధనము బ్రహ్మ జ్ఞాన మొక్కటియే యగును. కాని కర్మ సహితమగు జ్ఞానము మోక్ష ప్రాప్తికి-ఆవశ్యకము కాదు.

కావున శ్రీ శంకరులు-కర్మోపాసనలకేగాని కర్మ-జ్ఞానములకు సముచ్చయము నంగీకరింపరు. కావున వారు విద్యాశబ్దమునకు ఇచ్చట ఉపాసనార్థమునే స్వీకరించిరి. శ్రీరామానుజాచార్యులవారును-మధ్వాచార్యులవారును కర్మ-జ్ఞానములకు సముచ్చయము నంగీకరింతురు. కావున విద్యాశబ్దమునకు-బ్రహ్మ జ్ఞానమను నర్థమునే స్వీకరించిరి. శ్రీ శంకర మతాను యాయులలో కొందఱు-ఉపాసనార్థమును బ్రహ్మజ్ఞానార్థమును గూడ స్వీకరించి-మీఁది మంత్రమును సమన్వయించి యున్నారు.

మూ॥ విద్యాంచా విద్యాంచ యస్తద్వేదోభయంసహ
అవిద్యయామృత్యుంతీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే॥ ౧౧

కం॥ వేద్యములగు నీవిద్యా
విద్యల గురుతించి-యెవఁడు వీని నొనర్చున్
చోద్యమ్ముగ నాపురుషుఁడ
విద్యను మృతిఁగడచి-పడయు విద్యనమృతమున్॥

పదవిభాగము :— విద్యాం-చ-అవిద్యాం-చ-యః-తద్-వేద-ఉభయం-సహ-అవిద్యయా-మృత్యుం-తీర్త్వా-విద్యయా-అమృతమ్-అశ్నుతే.

ప్రతిపదార్థము :— యః=ఎవ్వఁడు, విద్యాంచ-దేవతాజ్ఞానమను ఉపాసనను, అవిద్యాంచ=కర్మను, తద్, ఉభయం, సహ=ఆరెండింటిని గూడ (ఒకఁడే యాచరింప వలయునని) వేద=తెలిసికొనుచున్నాఁడో, (వాఁడు) అవిద్యయా=కర్మచేత మృత్యుమ్=మరణమును తీర్త్వా=అతిక్రమించి విద్యయా=దేవతాజ్ఞానమను ఉపాసనచేత, అమృతమ్=దేవతాత్మ భావమును అశ్నుతే=పొందుచున్నాఁడు.

తాత్పర్యము :— కర్మోపాసనలు రెండునుగూడ ఒకఁడే యాచరింపఁదగునని తెలిసికొని యా రెండింటినిగూడ నాచరించు మనుష్యుఁడు-కర్మచేత భయరూపమగు మృత్యువు నతిక్రమించి ఉపాసనచేత-దేవతాస్వరూప భావము నొందును.

శాంకరభాష్యము :—

కర్మ ఫలమును-ఉపాసన ఫలమును భిన్నములు. కావున దేవతాజ్ఞాన-కర్మములను రెండింటినిగూడ నాచరించుచున్న సముచ్చయ కారికే-ఏక పురుషార్థ సంబంధము క్రమముగా కలుగును. కర్మోపాసన సముచ్చయ కారియగు పురుషుఁడు అగ్నిహోత్రాది కర్మచేత-స్వాభావికమగు మృత్యువు, మృత్యుశబ్దవాచ్యమగు కర్మజ్ఞానము, అను రెండింటినిగూడ నతిక్రమించి, విద్యయని చెప్పఁబడిన దేవతోపాసనముచేత దేవతాత్మ భావము నొందును. దేవతాస్వరూపము నొందుటయే అమృతము నొందుటయని యిచ్చట నెఱుఁగునది.

(ఇది-సత్యముగు మోక్షముకాకున్నను-పునరావృత్తి-కలుగకుండునట్లు క్రమముక్తికి హేతు వగుటవలన అమృతముగాఁ జెప్పఁబడినది.)

ఉవటాచార్య భాష్యము :—

ఆత్మజ్ఞానమును, దాని కంగమగు కర్మను, తెలిసికొని-కర్మ-జ్ఞాన కాండముల నేకీకరించిన పురుషుఁడు-కర్మకాండముచేత మృత్యువునుదాటి, కృతకృత్యుఁడై-బ్రహ్మ పరిజ్ఞానముచేత మోక్షము నొందును.

ఈశావాస్య రహస్యము :—

కర్మోపాసనల నొక్కటిగాఁ జేసిన పండితుఁడు, కర్మచేత మృత్యువును దాటి-విద్యచేత, బ్రహ్మలోక నివాసియగు హిరణ్య గర్భ స్వరూపము నొందును, హిరణ్యగర్భుని బొందిన యుపాసకుఁడు, హిరణ్య గర్భునితోఁగూడ పర బ్రహ్మము నొందును. (ఇదియే క్రమముక్తి యని చెప్పఁబడును)

ఈశావాస్య దీపిక :—

"విద్యా-కర్మలు, సఫలములు" అని వెనుక మంత్రమున నిరూపించి ఇప్పుడు కర్మకును-దేవతాజ్ఞానమునకును-లేక కర్మకును శాబ్దమగు బ్రహ్మజ్ఞానమునకును సముచ్చయమును జెప్పుచున్నాఁడు.

కర్మ-దేవతాజ్ఞాన సముచ్చయ కర్త-అమృతము నఁగా బ్రహ్మలోకము నొందును. అథవా-వైరాగ్యము కలిగినను, కర్మను పరిత్యజించుటకు శక్తిలేని అంతరాళావస్థగల పురుషుఁడు-కర్మనుపాయముగాను-బ్రహ్మజ్ఞానము నుపేయముగాను మేళగించును.

అట్టివాఁడు-ఆత్మజ్ఞానమును కలిగించుటకు ప్రతి బంధకమును, దుఃఖ కారణమును, స్వాభావికమును, అగు కర్మ జ్ఞానమును మృత్యువు నతిక్రమించి "అహం బ్రహ్మాస్మి" అను విద్యచేత అనఁగా: సాక్షాత్కారముచేత-బ్రహ్మ స్వరూపుఁడగును.

ఈశావాస్య రహస్య వివృతి :—

కర్మోపాసనలు సముచ్చితములై ఫలము నిచ్చునని తెలిసికొనిన పురుషుఁడు కర్మచేత-స్వాభావికమగు అజ్ఞానమను మృత్యువునుత్తరించి-దేవతోపాసనముచేత దేవతాత్మభావమను అమృతము నొందును. అథవా, కర్మ ఫలమును, ఉపాసన ఫలమును, ప్రదర్శించి-ఆత్మజ్ఞానముచేతనే కృతకృత్యత కలుగునని శ్రుతి యుపపాదించు చున్నదని కూడ చెప్పవచ్చును. అదెట్లనిన :— కర్మ-ఆత్మజ్ఞానము-అను వానిని పూర్వాపరాధికార భేదముచేత క్రమముగా మేళగించి యనుసరింప వచ్చునని తెలిసికొని అట్లాచరించిన పురుషుఁడు-శారీరకమగు కర్మచేతను మానసిక కర్మయగు ఉపాసనచేతను స్వరూపమును మరచుటకు కారణమును-ఏకాగ్రత లేనిదియు నగు చిత్తమాలిన్యమను మృత్యువు నతిక్రమించి-ఆత్మ జ్ఞానముచేత మోక్షము నొందును.

( ఉపాసన-మానసిక కర్మయగుటవలన కర్మయందే చేరియున్నదని గ్రహింపునది)

ఆనంద భట్టోపాధ్యాయ కృత భాష్యము :—

దేవతాజ్ఞానము-కర్మ-అనునవి యొక పురుషునిచేత అనుష్ఠేయములని తెలిసికొని యట్లాచరించిన పురుషుఁడు భోగమునందలి రాగమువలన చేయఁబడునది

యగు కర్మము-స్వాభావికమగు జ్ఞానమును-అతిక్రమించి-వేదాంత ప్రోక్తమగు దేవతా జ్ఞానముచేత దేవతాత్మ భావము నొందును.

అనంతాచార్య కృతభాష్యము :—

సముచ్చయమును చెప్పుచున్నాఁడు: విద్య యనఁగా ఆత్మజ్ఞానము; అవిద్య యనఁగా; కర్మ-లేక అన్యథా జ్ఞానసంబంధము. ఈ రెంటినిఁగూడ ఒక్కఁడే యనుష్ఠింపఁదగినవని తెలిసికొనినవాఁడు ఈశ్వరార్పణబుద్ధిచేత నొనర్పఁబడిన అగ్నిహోత్రాదికర్మచేత మారకమగు అంతఃకరణమలమును (మృత్యువును) తొలఁగించుకొని అంతఃకరణ శుద్ధిచేత కృత కృత్యుఁడై-ఆత్మజ్ఞానముచేత అమృతత్వము నొందును.

యత్సాంఖ్యైః ప్రాప్యతేస్థానంతద్యోగైరపి గమ్యతే।
ఏకంసాంఖ్యంచయోగంచయః పశ్యతి సపశ్యతి॥

(ఇందుసాంఖ్య-యోగములు జ్ఞాన కర్మపరములు)

“జ్ఞానముచేత ప్రాప్యమగు స్థానము-కర్మయోగముచేతఁగూడ పొందఁబడును. సాంఖ్య-యోగములను అనఁగా జ్ఞానమును-కర్మను ఒకటిగా చూచువాఁడే చూచువాఁడగును” అని భగవంతునిచేత గీత యందుగ్గడింపఁబడినది గదా!

[విశిష్టాద్వైతపరమగు-వేదాంతదేశిక కూర నారాయణముని-భాష్యార్థ సంగ్రహము.] బ్రహ్మోపాసన రూపమగు విద్య-అవిద్యకు-అంగభూతమును, కర్మాత్మకమును, అగు అవిద్య-అను రెండింటిని గూడ యథావస్థిత విద్యోపదేశ యుక్తుఁడగు-ఏ ముముక్షువు అంగాంగి భావముచేత సహానుష్ఠేయములని తెలియునో, ఆ ముముక్షువు-విద్యకంగముగా చోదితమగు ఫలాభి సంధిరహిత కర్మచేత-జ్ఞాన సంకోచరూపమును-మృత్యుహేతువును,విద్యోత్పత్తికి ప్రతిబంధక భూతమును, పుణ్య పాప రూపమును, అగు ప్రాచీన కర్మను-మిగత లేకుండునట్లుల్లంఘించి-పరమాత్మోపాసన రూపమగు విద్యచేత-మోక్షమునొందును.

శ్రీరంగాచార్య భాష్యము :—

ఫలాభిసంధి రహితమగు నట్లాచరింపఁబడిన వర్ణాశ్రమ విహితమగు కర్మ-విద్యోత్పత్తికి విరోధియు, పుణ్య పాప రూపమును, అగు ప్రాచీన కర్మయను మృత్యువును తొలఁగించును.

కావున ప్రాచీన కర్మరూపమృత్యునిబర్హణము-ఫలాభి సంధి రహితనిత్య నైమిత్తిక కర్మఫలమై యున్నది. అమృత శబ్దిత

మగు బ్రహ్మ ప్రాప్తి-విద్యాఫల మగుచున్నది. ఫలాసక్తి రహిత మగు కర్మవలన ప్రాచీన కర్మనివృత్తి కలుగనిదే విద్యజనింపదు. విద్య కలుగని యెడల బ్రహ్మప్రాప్తి కలుగదు. కావున విద్యా కర్మలకు-అనగా కర్మకును విద్యకును అంగాంగి భావముచేత నగు సముచ్చయము యుక్తమే యగును.

ద్వైతభాష్యార్థ సంగ్రహము :—

విష్ణుయాథార్థ్యజ్ఞానమును, మిథ్యాజ్ఞాననిందను గూడ ఏక పురుషార్థ సాధనములుగా తెలిసికొనిన వాడు, దుఃఖాజ్ఞాన స్వరూపుడగు మిథ్యా జ్ఞానియొక్క నిందచేత దుఃఖాజ్ఞానాద్య నిష్టమును దాటి, విష్ణుయాథార్థ్యజ్ఞానముచేత సుఖజ్ఞానాది రూపమగు మోక్ష ఫలమును బొందును.

పురుషార్థము-అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి, అని ద్వివిధమగు చున్నది. దుఃఖము అజ్ఞానము మొదలగునది-అనిష్టప్రాప్తి. స్వరూపానందానుభవము-ఇష్టప్రాప్తి. మిథ్యాజ్ఞానులను నిందించుట చేత అనిష్టము పోవుచున్నది. విష్ణు యాథార్థ్యజ్ఞానముచేత ఇష్టము కలుగుచున్నది. కావున-ఈ రెండును చేయ వలయునని యీ శ్రుతుల యందు చెప్పబడినది.

స్వాభిప్రాయము :—

ఈ మంత్రమునందు-విద్య-అవిద్య తనువానికి - సహోచర ణము విధింపబడినది.

విద్యా విద్యా సముచ్చయకారి యగు పురుషుడు అవిద్య చేత-మృత్యువును తరించి-విద్యచేత అమృతత్వము నొందునని చెప్పబడినది.

విద్య-అవిద్య-మృత్యువు-అమృతము-అనుపదములకు గల అర్థమును తెలుపుట యందు భాష్యకర్తలును-వ్యాఖ్యాతలును భేదించియున్నారు.

క్రింది పదములకు వారొసగిన యర్థములను క్రింద ప్రదర్శించు చున్నాను.

(౧) విద్య=1 జ్ఞానము, 2 ఆత్మజ్ఞానము, 3 బ్రహ్మజ్ఞానము, 4 విష్ణు యాథాత్మ్యజ్ఞానము, 5 దేవతా జ్ఞానము (ఉపాసన) 6 శాబ్దమగు పరోక్షజ్ఞానము, (శాస్త్రముచేత మాత్రమే తెలిసికొనుట)

(౨) అవిద్య=1 అజ్ఞానము, 2 ఫలాసక్తితోఁగూడిన కర్మ, 3 ఫలాసక్తిని విడిచిన కర్మ, 4 మిథ్యాజ్ఞానినింద.

(౩) మృత్యువు=1 మరణము, 2 స్వాభావికమగు అజ్ఞానము, 3 కర్మ జ్ఞానము, 4 అంతఃకరణ మాలిన్యము, 5 పుణ్య పాప రూపమగు ప్రాచీన కర్మ, 6 దుఃఖ-అజ్ఞానాది అనిష్టము.

(౪) అమృతము=1 మోక్షము, (మృతి లేకుండుట) 2 బ్రహ్మ స్వరూపము నొందుట, (ఐక్యము) 3 దేవతా స్వరూప ప్రాప్తి, (సా రూ ప్య ము) 4 బ్రహ్మ లోక ప్రాప్తి (హిరణ్యగర్భప్రాప్తి) విద్యా-పదముచేత-దేవతాజ్ఞానము-బ్రహ్మజ్ఞానము-కూడ తెలుపఁబడును. దేవతాజ్ఞానమనఁగా-ఉపాసన. ఏతన్మంత్రముచేత-శ్రీశంకర భగవత్పాదులవారు కర్మ-దేవతా జ్ఞానములకు సముచ్చయమును దెలిపిరి. కర్మ-దేవతా జ్ఞాన-సముచ్చయము వలన బ్రహ్మ లోక ప్రాప్తియు-కర్మ-(అ) పరోక్షజ్ఞాన సముచ్చయము వలన బ్రహ్మ ప్రాప్తియు-ఈశావాస్య దీపికచేత తెలుపఁబడినవి.

పూర్వాపరాధికార భేదముచేత-కర్మను - ఆత్మజ్ఞానమును మేళగించి-మోక్షము నొందవచ్చునని ఈశావాస్య రహస్య వివృతి తెలుపుచున్నది. కర్మ-ఉపాసనలచేత-దేవతాత్మ భావము కలుగునని ఇతరములగు అద్వైతభాష్యములు చెప్పుచున్నవి.

ఫలాసక్తి రహితమగు కర్మకును-పరమాత్మోపాసన రూపమగు విద్యకును-సముచ్చయము నంగీకరించి ఫలాసక్తి రహితమగు కర్మచేత-పుణ్య పాప రూపమగు ప్రాచీనకర్మ నశింపఁజేయఁబడు

నవియు, విద్యచేత బ్రహ్మప్రాప్తి కలుగుననియు-విశిష్టాద్వైత భాష్యములు చెప్పుచున్నవి.

మిథ్యాజ్ఞాని నింద-విష్ణు స్వరూపజ్ఞానము-అను వాని సముచ్చయము చేత-సుఖజ్ఞానాది రూపమగు మోక్షము కలుగునని ద్వైత భాష్యము చెప్పుచున్నది. అద్వైత భాష్యములను-విశిష్టాద్వైత వ్యాఖ్యలనుగూడ-అవిద్యా శబ్దమునకు "కర్మ" అను నర్థమునే తెలుపుచున్నవి.

అవిద్యా-విద్యా పదములకుఁగల యర్థములేమైనను—

1 వీని ఫలములు-భిన్నములను సంశమును, 2 అవిద్యా ఫలమగు చిత్తశుద్ధి కలవానికే విద్యాఫలము గలుగునను సంశమును, 3 విద్యా విద్యల సముచ్చయమునుగూడ వ్యాఖ్యాత లందఱును అంగీకరించి యున్నారు.

స్వాభిప్రాయమును మూడు వాక్యములలోఁదెల్పుదును.

ఫలాభిసంధి సహితకర్మ-దేవతోపాసనముల సముచ్చయము వలన దేవతాత్మ భావ ప్రాప్తి కలుగును. వీరు కల్పాంతమునందు ముక్తులగుదురు.

ఫలాభిసంధి రహితకర్మ-శాబ్ద బ్రహ్మ విద్యల సముచ్చయము వలన బ్రహ్మలోక ప్రాప్తి కలుగును. వీరికి పునర్జన్మ కలుగదు.

ఫలాభిసంధి రహితకర్మ-అపరోక్ష బ్రహ్మ జ్ఞానముల సముచ్చయము కొందఱియందు సంభవింపవచ్చును, తత్సముచ్చయ కారికి జీవన్ముక్తి-విదేహ ముక్తులు కలుగును. ఇచట మోక్ష ప్రాప్తికి-జ్ఞానమే సాధనముగాని ఫలాభిసంధి రహితమైనను గూడ కర్మ సాధనము గానేరదు.

అయినను అపరోక్ష బ్రహ్మసాక్షాత్కార రూపమగు విద్యకును కర్మకును సముచ్చయము ప్రారబ్ధబలము వలనఁగాని, లోకానుగ్రహ దృష్టివలనఁగాని జనకాదులయందు వలె కొందఱు జ్ఞానులయందు సంభవింప వచ్చును గదా!

అవతారిక:— వ్యాకృతోపాసనమునకును-అవ్యాకృతోపాసనమునకును-సముచ్చయమును-అనఁగా: సహాచరణమును విధించు నభిప్రాయముచేత, శ్రుతి-వానిని వేరువేరుగా నాచరించుటను నిందించుచున్నది.

[వాకృత మనఁగా కార్యము-అవ్యాకృతమనఁగా-కారణమగు మాయా ప్రకృతి.]

మూ॥ అన్ధంతమః ప్రవిశన్తి యేఽసంభూతిముపాసతే
తతో భూయఇవతమో య ఉ సంభూత్యాం రతాః॥ ౧౨

గీ॥ మనుజులెవ్వా రసంభూతి మగ్నులగుదు
రంధతమమునఁ బ్రొచ్చెద-రట్టివారు
సంభవమునందె రతులైన-జనులు దాని
కంటె నధికంబగు తమంబుఁగాంచుచుంద్రు॥

పద :— అన్ధమ్-తమః-ప్రవిశన్తి-యే - అసంభూతిమ్-ఉపాసతే-తతః-భూయః-ఇవ-తమః-యే-ఉ-సంభూత్యామ్-రతాః॥

యే=ఎవ్వరు, అసంభూతిమ్=ఈశ్వరోపాధియగుమాయను ఉపాసతే=ఉపాసించెదరో, తే=వారు, అన్ధమ్=తమః అజ్ఞానమను గ్రుడ్డి చీకటిని, ప్రవిశన్తి=ప్రవేశించుచుందురు, యే=ఎవరు, సంభూత్యామ్=హిరణ్యగర్భుఁడను పేరుగల కార్యబ్రహ్మమునందు, రతాః ఆసక్తులగుచుందురో, తే=వారు, తతః-దానికంటె, భూయః=అధికమైన, తమఇవ(ఏవ)=అజ్ఞానమను చీకటినే, ప్రవిశన్తి=ప్రవేశించుచుందురు.

తాత్పర్యము :— ప్రపంచకారణమగు ప్రకృతిని సేవించువారు పరమాత్మ దర్శనములేని అజ్ఞానతిమిరమును పొందుదురు. అట్టి మాయా ప్రకృతివలన పుట్టిన కార్యరూపమగు హిరణ్యగర్భాదిస్వరూపమును సేవించువారు దీనికంటెను అధికమగు అజ్ఞానాంధకారమును పొందుచుందురు.

శాంకరభాష్యము :—

కార్యముయొక్క పుట్టుక-సంభవమనియు,సంభూతియనియు, చెప్పఁబడును. దానికంటె వేరగుచున్న ప్రకృతికి పుట్టుకలేకుండుట వలన అసంభూతియని చెప్పఁబడును. ఇదియే అవిద్యయనియు, అవ్యాకృతమనియు చెప్పఁబడుచున్న కారణమగుచున్నది. అదర్శ నాత్మక మగుటవలన (కానుపింప కుండుట వలన) అవ్యాకృత మనియు, కామ-కర్మ-బీజభూత మగుటవలన ప్రకృతియనియు, చెప్పఁబడునదియగు మాయ నుపాసించినవారు తదను రూపమును, అదర్శనాత్మకమును, అగు అజ్ఞానమను అంధకారమునందే ప్రవే శించు చుందురు. హిరణ్యగర్భుఁడను పేరుగల కార్య బ్రహ్మము నందే రక్తులగువారు దానికంటెను గూడ నధికమగు గాఢాంధ కారమునందే ప్రవేశింతురు.

ఆనందగిరిటీక :—

చిత్ తంత్రియగు మాయ-పరమేశ్వరున కుపాధి యగు చున్నది. "మాయాంతు ప్రకృతిం విద్యాత్-మాయినంతు మహేశ్వ రమ్" "ప్రకృతినిమాయనుగాతెలియునది.మహేశ్వరుని-మాయిగా-అనఁగా, ఆమాయ-ఉపాధిగాఁగల వానినిగా, తెలియ వలయును"

అపిశ్వేతాశ్వతర శ్రుతి ప్రసిద్ధమగు మాయయే-యిచట అసంభూతియని చెప్పఁబడినది, గాని-బ్రహ్మము అసంభూతియని చెప్పఁబడుటలేదు. నిర్వికారుఁడగు బ్రహ్మము-ప్రకృతి యగుట కుదురదు. కావున అసంభూతి యనఁగా బ్రహ్మమని చెప్పుటకు వీలు పడదు. అసంభూతి పదమునకు బ్రహ్మమను నర్థమును చెప్పుచు-జగద్రూపమగు కార్యమును తత్పరిణామమునుగాఁ దెలుపు నదియును, "భాస్కరాభి మతమును" అగు పరిణామ వాదమును మేము "తత్త్వాలోకము" అను గ్రంథమునందు ఖండించి యున్నాము.

ప్రకృతిలయము అను మోక్షమునందుఁగూడ సుషుప్తి యందువలె, సాంసారిక దుఃఖానుభవ ముండునదికాదు. కావున

సుషుప్తినివలె ప్రకృతిలయమును గూడ పురుషుఁడు వాంఛింప వచ్చును. కర్మ నుపాసించు వానికివలె ప్రకృతి నుపాసించు వానికిని గూడ పరమేశ్వరుఁడే ఫలము నిచ్చును. "ప్రకృతి, జడ పదార్థము. కావున ఫలము నీయఁజాలదు. కావున ప్రకృతి ఉపాసింపఁదగినది కాదు." అనునది సుచోద్యముకాక కుచోద్యమే యగును.

శంకరాచార్య కృతభాష్యము :—

ఈ మంత్రము-దుపాసన మంత్రము. ''జీవులు-జలబుద్బుదములవంటివారు. విజ్ఞానము (బుద్ధి) మదశక్తి వంటిది. మృతి నొందినవానికి పునర్జన్మములేదు. శరీరమును గ్రహింపకుండుటవలన మాకు ముక్తి సిద్ధించుచునే యున్నది. పాప పుణ్య యుక్తుఁడగు ప్రజ్ఞానాత్ముఁడు ఎవ్వఁడును లేఁడు'' జీవుఁడు శరీరము తోడనే పుట్టి శరీరము తోడనే నశించుచున్నాఁడు'' అను 'లోకాయతిక' మార్గము నుపాసించు వారు అజ్ఞాన రూపమగు తిమిరమునందు ప్రవేశింతురు.

''ఆత్మయే ఉన్నది. దానికంటె వేరయిన కర్మాదిక మేదియును లేదు'' అని కర్మ పరాఙ్ముఖులై-చిత్తశుద్ధి లేకున్నను గూడ-ఆత్మ జ్ఞాన మాత్రమునందే రక్తులగువారు గూడ-లోకాయతికాదులు పొందునదియగు అంధకారముకంటె అధిక మగు అంధకారమునే పొందుచుందురు.

బ్రహ్మానందకృత—ఈశావాస్య రహస్యము :—

సంస్కారమువలన నైష్కర్మ్యమునొంది మాయ నుపాసించుచున్న మనుష్యులు విరక్తులైయున్నను అంధతమస్సునే పొందుదురు.

అసంభూతి యనఁగా మాయా తత్త్వమని యర్థము. ఆమాయా తత్త్వము నందియే దేహులందఱును గూడ సంసారమును బడయుచున్నారు.

ఆమాయా బీజముయొక్క కార్యమును, సప్తదశాత్మక లింగమును (పదునేడు చిహ్నములు గలదియు) అగు సూత్రాత్మయే (హిరణ్యగర్భుఁడే) సంభూతియని చెప్పఁబడును. అట్టి సంభూతియందు సక్తులగువారు కూడ-అంతకంటెను ప్రబల మగు తమస్సునందే ప్రవేశించుచుందురు.

ఈ కార్య-కారణములకంటె వేరగు ఆత్మను తెలిసినవారే ముక్తి నొందుదురు.

ఈశావాస్యరహస్య వివృతి :—

పూర్వోక్తమగు ఆత్మ తత్త్వమును సరిగా తెలియఁగనివాఁడు-ఈషణలను త్యజింప కుండుటవలన సన్న్యాసమున కర్హుఁడు కాఁజాలఁడు. కొంచెము తెలిసి యుండుటవలన సంసారమునందుఁగూడ-మిక్కిలి యాసక్తి గలవాఁడును కాకుండును. అట్టి మధ్యావస్థగల పురుషునకు చిత్తైకాగ్రతకొఱకు ఉపాసనా సముచ్చయమును విధింపఁదలచి మీఁదిమంత్రము-ప్రత్యేకమగు ఉపాసనలకుఁగల ఫల భేదమును దెలిపి తరువాతి మంత్రమునందు ఉపాసనా సముచ్చయమును దెలుపుచున్నది. కాఁగా ఈ మంత్రము ప్రత్యేకోపాసనను నిందించుచున్నదనిగాని, ఆత్మ

జ్ఞానేతరములగు ఉపాసనలు సంసరణ హేతువులని ప్రదర్శించి ఆత్మజ్ఞానమే శ్రేష్ఠ మని చెప్పుచున్నదనిగాని చెప్పనగును.

కారణరూపమును, అవ్యాకృతమును, అగు ప్రకృతి నుపాసించు మను ష్యులు ప్రకృతియందు లయింతురు. కార్య రూపమగు హిరణ్యగర్భునియందు రక్తు లగు మనుష్యులు కూడ స్వరూప జ్ఞానము లేకుండుటవలన పునర్జనన మరణ హేతువులగు అణిమాది సిద్ధులను బొందుచుందురు.

అనంతాచార్యకృత భాష్యము :—

మీఁది మంత్రమునకు పూర్వోక్తమగు నర్థమును చెప్పుచు-ఈ యాచార్యుఁడు వేఱొక యర్థమును గూడ నిట్లు తెలుపుచున్నాఁడు.

[ఈ యభిప్రాయమును నవ్యులు-జాగరూకులై పరిశీలించునది.]

“జగత్తు స్వభావము వలననే పుట్టి వృద్ధినొంది నశించుచుండును. పర మేశ్వరుని వలన జగత్సంభవాదులు కలుగుటలేదు” అని అసంభూతి నుపాసించు ప్రాణులు అంధ తమస్సును పొందుదురు.

“యతో వా ఇమాని భూతాని జాయన్తే యేన జాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసం విశన్తి” “భూతముల సృష్టి స్థితిలయములు పరమాత్మ (యందే) వలననే కలుగు చున్నవి.”

అను శ్రుతికి విరుద్ధమగు విధమున నాస్తికులిట్లు చెప్పుచుందురని భగవద్గీత చెప్పుచున్నది.

అసత్య మప్రతిష్ఠంతే జగదాహురనీశ్వరమ్
అపరస్పర సంభూతం కిమన్యత్ కామహైతుకమ్ 16అ. 8 శ్లో.

“వేదములు-వేదోక్తములగు ధర్మములు-తత్ఫలములగు లోకములు-మొద లగునవన్నియుఁగూడ మిథ్య. జగద్వైచిత్రికి ధర్మాధర్మములు నిమిత్తములుకావు. వస్తు స్వభావము వలననే సుఖ దుఃఖాది వైచిత్ర్యము కలుగుచుండును. జగత్తునకు ఈశ్వరుఁడు కారణము కాఁడు; కామ ప్రేరణముచేత నగు స్త్రీ పురుష సంయోగము వలననే జగత్తు పుట్టినది. కావున కామమే జగత్కర్త. (జగత్తునకంతకును కార ణము) ప్రత్యక్షమగు కారణమును విడిచి అప్రత్యక్షమగు ధర్మాదులనుగాని, ఈశ్వ రునిగాని, కారణముగా కల్పించుట అయుక్తము.”

మఱికొందఱు దుర్వాదు లిట్లు చెప్పుదురు.

“యమ నియమాది సంబంధ యుక్తుఁడగు విజ్ఞానాత్మ యెవ్వఁడును లేఁడు. జీవులు జల బుద్బుదములవలె పుట్టి నశించుచుందురు. విజ్ఞాన మనునది మదశక్తి వంటిది. కావున మృతినొందిన వానికి సంభూతి-అనఁగా మరల పుట్టుక-లేదు. కావున శరీర నాశమే “ముక్తి.”

[ఇదియే చార్వాక సిద్ధాంతము.]

ఈ విధమున నుపాసించు మూఢు లంధతమస్సు నొందుదురు.

వీరి దుష్ప్రవృత్తియు, దానివలని ఫలమును, భగవద్గీత యందలి పదునారవ యధ్యాయమునందలి 8 శ్లోకమునుండి 20వ శ్లోకము వఱకును గల యభిప్రాయముల వలన పాఠకులు గ్రహించునది.

"పరదేవత వలన ప్రపంచ సంభవము కలుగు చున్నది. కావున సంభూతి యనఁగా పరదేవతయే యగును" అని తలఁచి 1) సత్కర్మవలననే, 2) స్వబుద్ధి మాలిన్యము, 3) నశించునని తెలియక-కర్మపరాఙ్ముఖులై-ఆత్మకంటె వేరుగా కర్మ లేదనియు, కర్మకాండకును, జ్ఞాన కాండకును, సంబంధము లేదనియు, అభిప్రాయపడి-చిత్తశుద్ధి లేకున్నను గూడ ఆత్మజ్ఞానమునందే ఆసక్తి లగు వారుకూడ మొదటివారు పొందునదియగు అంధతమస్సుకంటె అధికమగు అందతమస్సునే పొందుదురు.

అద్వైతానందలహరి :—

కార్యప్రపంచ మాత్రము నందగు వైరాగ్యము వలన కారణరూపమును, మాయాశబలమును, అగు అవ్యాకృతమును మాత్రమే ఉపాసించువారు అంధతమస్సునందే ప్రవేశింతురు.

ఆ యవ్యాకృత ప్రాప్తిరూపమగు ప్రకృతిలయము నందుఁగూడ సుషుప్తి యందువలె అనాయాస రూపమగు సుఖాతిశయముండుట వలన-అప్రకృతిలయము గూడ-ఉపాసింపఁదగినదియు-కోరఁదగినదియు అగుచున్నది.

కార్య బ్రహ్మ రూపమగు సంభూతియందు మాత్రమే ఆసక్తులై-కర్మంబు నన్వయించి-తదుపాసకులగు కర్మ సన్యాసులు-ప్రకృతిలయముకంటెను గూడ అధికమును, స్వప్నము వంటిదియు, అణిమా ద్యైశ్వర్య రూపమును, అగు తమస్సు నొందుదురు.

శ్రీ విశిష్టాద్వైత భాష్యము :—

శ్రీ కూర నారాయణముని విరచితము :—

1 ఏతమి తః ప్రేత్యాభి సమ్భవితాస్మి ఛాం-ఉప. 3-4-14

"శరీరమును విడిచి పరమాత్మను బొందుదుము"

2 బ్రహ్మలోక మభిసమ్భవామి, ఛాం. 8-13-1.

మీది ఉపనిషద్వాక్యములయందు "సమ్భవితాస్మి" "సమ్భవామి" అను చోనున్న సంభూతి శబ్దము-బ్రహ్మప్రాప్తి రూపమగు అను

భూతిని చెప్పుచున్నది. కాని యిచ్చట నున్న సంభూతిశబ్దము. సమాధి రూపమగు అనుభూతిని చెప్పుచున్నదని గ్రహించునది.

"సమ్భూతించ-వినాశంచ" అను పదు నాలుగవ మంత్రము ఈ పండ్రెండవ మంత్రమునందు చెప్పఁబడిన అసంభూతినే వినాశ శబ్దముచేత ననువదించుచున్నది. కావున ఈ యసంభూతిశబ్దము సమాధి రూపమగు సంభూతికంటె వేరయినదియు, సమాధికి అంగభూతమయినదియు,అగు నిషిద్ధ ధర్మవినాశమునే (నిషిద్ధనివృత్తినే) చెప్పుచున్నదని తెలియవలయును. అసంభూతియందు మాత్రమే- అనఁగా: మానము-దంభము-హింస-స్తేయము (దొంగతనము) మొదలగు యోగవిరుద్ధ ధర్మముల యొక్క నివృత్తి మాత్రము నందే నిష్ఠ గలిగి యుండు విద్యాధికారులు-అంధతమస్సు నొందుదురు. సమాధి రూపమగు సంభూతియందు మాత్రమే ఆసక్తులగు మనుష్యులు అంతకంటెను బహుళమగు తమస్సునే పొందుదురు.

శ్రీ రంగాచార్య కృతము :—

సంభూతియనఁగా సంభవము = పుట్టుక. దాని యొక్క నివృత్తి-అసంభూతియని చెప్పఁబడును. కావున-అసంభూతియనఁగా విగ్రహ (శరీర) పరిగ్రహ నివృత్తియను నర్థము సిద్ధించుచున్నది, కాఁగా విగ్రహ పరిగ్రహనివృత్తిని మాత్రమే ఉపాసించు పురుషులు గాఢమగు అజ్ఞానమునందే ప్రవేశించు చుందురు.

"సహ వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతి రస్తి, అశరీరం వావసన్తం నప్రియాప్రియే స్పృశతః." ఛాం-ఉప. 8-12-1.

"శరీరమునందు ఆత్మత్వాభిమానము కలిగియుండెడి పురుషునికి-బాహ్యవిషయ సంయోగ వియోగములవలనఁగలుగు ప్రవాహము వంటి ప్రియాప్రియములు నశించునవికావు." తనరూపము-అశరీరమను విజ్ఞానముచేత అవివేకము నుడిగిన పురుషుని ప్రియాప్రియములు స్పృశింపవు".

["నేను" అనునది "శరీరమే" అని తలఁచిన మూఢునకు సుఖ-దుఃఖములు కలుగును. నేను-ఆత్మనుగాని, శరీరమను కానని తెలిసిన వివేకికి-సుఖ దుఃఖములు కలుగవు.]

అని శ్రుతియందు వివఁబడిన విధమున శరీరస్వీకారము ననుసరించు సంతవఱకును సుఖ దుఃఖముల ననుసరించుట కూడ తప్పనిదే యగును. శరీర పరిగ్రహానువృత్తి కూడ ప్రకృతి సంబంధ మందునంత వఱకును తప్పనిదే యగును. కావున నాకు శరీర పరిగ్రహనివృత్తి-నిశ్శేషముగా కలుగ వలయునని-అసంభూతిని మాత్రమే యుపాసించుచున్న పురుషులు-శరీర పరిగ్రహ నివృత్తియను కైవల్యమును పొందఁగలిగినను తరువాత భగవత్ప్రాప్తి రూపమగు పరమపురుషార్థమును బొందుటకు వీలు పడకుండుటవలన మోక్షమునకు ప్రతి బంధకమగు మహా తమస్సునే పొందువారగుదురు. భోగమునకుపకరణమగు శరీరములేని యెడల భోగము లభింపదని-శరీర పరిగ్రహమునందే ఆసక్తులై-సంభూతిని అనఁగా పునర్జన్మమునే అభిలషించు ప్రాణులు-అసంభూతి నుపాసించు పురుషులు పొందునదియగు తమస్సుకంటె అధికమగు తమస్సునే (అజ్ఞానమునే) పొందుదురు.

ఇందలి తాత్పర్యము నిట్లు గ్రహింపవలయును :—

"దేహేంద్రియాదులగు ఉపకరణములులేనియెడల భోగానుభవము కలుగదు, ఆనంద రూపమగు భోగమే సర్వాపేక్షితమై యున్నది. ప్రాణులన్నియుఁగూడ-ఆనంద భోగము కొఱకే గదా ప్రవర్తించుచున్నవి; దుఃఖము లేకుండ నుండుట-ఇష్టమైనదియే యగుచున్నను-ఆనందమువలె ఇష్టతమము కానేరదు. కావున ఆనంద భోగమునకు ఉపకరణమగు దేహాది పరిగ్రహమే నాకు కలుగుఁగాక;

అని నిశ్చయించి-సంభూతిని మాత్రమే ఉపాసించువారగు మనుష్యులకు-భోగైశ్వర్య రూపమగు పురుషార్థము లభించినను, అది-దుఃఖములేకుండ నుండుటయను కైవల్యము కంటె అల్పమై యున్నది. మఱియు-ఈభోగాదికము-అస్థిరమును, తొలఁగించుకొనుటకు వీలుపడక మాటి మాటికిని కలుగుచుండు పెద్దదగు దుఃఖముతోఁగూడి యుండునదియు, భగవత్ప్రాప్తి రూప పరమ పురుషార్థము నడ్డగించునదియు, అగుచున్నది. కావున సంభూత్యు

పాసకులు (పునర్జన్మోపాసకులు) అసంభూత్యుపాసకులు (జనన మరణ రూప సంసార నివృత్తిని కోరువారు) పొందు నదియగు కైవల్యము (నిర్దుఃఖమాత్రావస్థానము) కంటెను గూడ అధికమగు అజ్ఞానమును బొందుచుందురు."

స్వాభిప్రాయమున కైవల్య-మోక్ష-పదార్థ నిరూపణము.

కైవల్యము-దుఃఖనివృత్తి మాత్రరూపము, పరమ పురుషార్థమగు మోక్షము-భగవత్ ప్రాప్తిరూపము. కావున-శరీర పరిగ్రహముకంటె, శరీర పరిగ్రహ రహితమగు కైవల్యమును-కైవల్యముకంటె భగవత్ప్రాప్తి రూపమగు మోక్షమును-శ్రేష్ఠము" అనునది శ్రీ రంగాచార్యా శయమై యున్నది. అద్వైతాభిప్రాయమున కైవల్యము-శరీర పరిగ్రహ నివృత్తి మాత్రమే గాక-బ్రహ్మైక్య రూపమగుచున్నది. "బ్రహ్మవిదుఁడు-బ్రహ్మమే" అనుశ్రుతి దీనికిఁబ్రమాణమై యున్నది. కావున కైవల్యమును మోక్షమును భిన్నములు కానేరవు. కైవల్యమే-మోక్షము, మోక్షమే-కైవల్యము.

ద్వైతభాష్యము :—

విష్ణువునకు సంహార కర్తృత్వము నంగీకరించి జగత్సృష్టి కర్తృత్వము నంగీకరింపనివారు-అసంభూత్యు పాసకులని చెప్పఁబడుదురు. జగత్సృష్టి కర్తృత్వమును మాత్రమే అంగీకరించి-సంహార కర్తృత్వము నంగీకరింపని వారు సంభూత్యుపాసకులని చెప్పఁబడుదురు.

విష్ణువు జగత్సృష్టి కర్త కాదని యుపాసించు అసంభూత్యుపాసకులు ఘోరమగు తమస్సునందు ప్రవేశింతురు. "విష్ణువు-జగత్కర్తయే కాని జగత్సంహార కర్త కాదు" అని తలంచుచున్న సంభూత్యుపాసకులు-సృష్టికర్తృత్వము నంగీకరింపని అసంభూత్యుపాసకులు పొందు నదియగు తమస్సు కంటెను అధికమే యగు ఘోర తమస్సునందు ప్రవేశింతురు.

స్వాభిప్రాయము :—

"పర బ్రహ్మము-జగత్కారణము కాదు. ప్రపంచమునకు మూలము-ప్రకృతి, అది-దృశ్యములగు నామ రూపములు గలది కాదు. ఈప్రకృతి-స్థూలములగు పంచభూతములకంటెను, సూక్ష్మము

లగు తన్మాత్రలకంటెను (సూక్ష్మభూతముల కంటెను) అహంకారము కంటెను, మహత్ తత్త్వము కంటెను-వేరయియున్నది. అదియే మహత్తు-అహంకారము-పంచ తన్మాత్రలు-పంచ భూతములు-సర్వజగత్తులు అను వీని కన్నిటికిని కారణ మగుచున్నది. ప్రకృతియందు లయించిన వారికి సుఖ దుఃఖములు కలుగవు" అను విజ్ఞానము గలిగి "అసంభూతి" అని చెప్పఁబడిన ప్రకృతి నుపాసించిన వారికి సుషుప్తి సదృశమగు ప్రకృతిలయము కలుగును. కాని యీ ప్రకృతిలయులకు సృష్టి ప్రారంభమున పునర్జన్మకల్గును. (బ్రహ్మైక్యము కలుగదు),

సంభూతి పదముచేత-తెలుపఁబడిన-సిద్ధులను-అనఁగా-అణిమాదులను, సంగీతము-కవిత్వము-మున్నగు కళలను, భూత భవిష్యద్ వర్తమాన రహస్యములను, భోగైశ్వర్యములను, ఉపాసించిన వానికి-ఆజన్మమునందుఁగాని, తరువాతి జన్మములయందుఁగాని, ఆయా సిద్ధులు లభించును. కాని శాశ్వతానంద రూపమగు అమృత పదవి లభింపదు.

కావున సత్యజ్ఞానాభిలాషియగు పురుషుఁడు-ప్రకృతినిగాని-సిద్ధులనుగాని-ఉపాసింపక-బ్రహ్మనిష్ఠుఁడు కావలయును. సిద్ధులు కొన్ని తనకు లభించినను ముముక్షువు వానియందు రాగమును గలిగి యుండక-ఉపనిషద్విద్యా-శ్రవణ-మనన-ధ్యానముల యందే ప్రవర్తింప వలయును-ఆచరణమనఁగా నిదియే. దీని చేతనే పునరావృత్తి రహితమగు ముక్తి లభించును.

అవ :— సంభూత్యసంభూత్యుపాసనలకు సముచ్చయ కారణమగు అవయవ ఫలభేదమును-క్రింది మంత్రము చెప్పుచున్నది.

మూ॥ అన్య దేవాహుః సమ్భవాదన్యదాహురసమ్భవాత్ ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యేనస్త ద్విచచక్షిరే (వ్యాచచక్షిరే)॥ ౧౩

కం॥ శుంభన్మతి వినియుంటిమి
గంభీరోక్తుల సుధీర గణములు తెలుపన్
సంభూతికొక ఫలమ్ము, న
సంభూతికి వొకఫలమ్ము, సంభవములుగన్॥

పద :— అన్యత్ - ఏవ - ఆహుః - సమ్భవాత్-అన్యత్-ఆహుః-అసమ్భవాత్-ఇతి-శుశ్రుమ-ధీరాణామ్-యే-నః-తద్ విచ చక్షిరే.

టీ :— యే=ఎవ్వరు, నః-మాకొఱకు, తత్=అవ్యాకృత వ్యాకృతోపాసన ఫలమును,విచచక్షిరే=చెప్పిరో.(తే=వారు) సమ్భవాత్=కార్యబ్రిహ్మోపాసననుండి, అన్యదేవ=వేరొక ఫలమునే, ఆహుః=చెప్పిరి, అసమ్భవాత్=అవ్యాకృతోపాసననుండి, అన్యదేవ=వేరొక ఫలమునే, ఆహుః=చెప్పిరి, ఇతి=ఈ ప్రకారముగా, ధీరాణామ్=ధీరుల వచనము నం, శుశ్రుమః=వింటిమి.

తాత్పర్యము :— అసంభూత్యుపాసనమువలన ప్రకృతిలయమును, సంభూత్యుపాసనమువలన అణిమాద్యైశ్వర్య ప్రాప్తియు, కలుగునని ధీరులు మాకు చెప్పియున్నారు.

శ్రీ శాంకరభాష్యము :—

వ్యాకృతావ్యాకృతోపాసన ఫలమును వ్యాఖ్యానించిన ధీరులు చెప్పిన వాక్యములను వినియున్నాము. కార్య బ్రహ్మోపాసనవలన అణిమాద్యైశ్వర్యము, అవ్యాకృతోపాసనమువలన ప్రకృతిలయము అను ఫలములు కలుగునని పౌరాణికులచేత చెప్పఁబడినది.

(తదితరములగు అద్వైత వ్యాఖ్య లన్నియు నిట్లే చెప్పుచున్నవి. కావున వందలి విషయమును ప్రదర్శింపను.)

విశిష్టాద్వైత భాష్యము :—

అట్లయిన యెడల మోక్షసాధనమేది? అనిన చెప్పుచున్నది.

కేవల సంభవము కంటెను కేవల-అసంభవము కంటెను గూడ-మోక్షసాధనము-వేరుగా మున్నదని ఉపనిషత్తులు వాకొనుచున్నవి.

అందు శ్రీ రంగాచార్య భాష్యము :—

సంభూత్యుపాసనముచేత సాధింపఁదగిన విగ్రహ పరిగ్రహ రూపమగు అవాంతర ఫలముకంటెను, అసంభూత్యుపాసనముచేత సాధింపఁదగిన అవాంతర ఫలమగు కైవల్య రూపమగు పరమ ఫలముకంటెను, గూడ-భోగైశ్వర్య లక్షణమును, కేవలాత్మాను భవలక్షణమును, అగు పరమఫలము భిన్నమే యగు చున్నదని పెద్దలు చెప్పఁగా విని యున్నాము.

ద్వైతభాష్యము :—

"సమ్భవతి+అనేన" ఇతి=సమ్భవః=సృష్టికర్తా. "పర మాత్మ-సృష్టికర్త మాత్రమే" అని తెలిసి కొనినవారు-మోక్షము నందొక భాగమునే పొందుదురు. సృష్టికర్తృత్వముకంటె వేరగు సంహారకర్తృత్వము-అసంభవమని చెప్పఁబడును. కావున, "పర మాత్మ-సంహారకర్త మాత్రమే" అని తెలిసికొనినవారు మోక్షము నందొక భాగమునే పొందుదురు. మోక్షసాధనమును మాకుఁదెలి పిన జ్ఞానులవలన నిట్లు వినియున్నాము.

స్వాభిప్రాయము :—

సంభూత్యుపాసనము-అసంభూత్యుపాసనము - అను ఉపా సనలు కలవు. అందు-అసంభూత్యుపాసనమువలన కలుగు ఫల మును-సంభూత్యుపాసనమువలనఁగలుగు ఫలమును-భిన్నములు. అను సంశము నందఱు భాష్యకర్తలును, వ్యాఖ్యాతలును గూడ నంగీకరించి యున్నారు.

"పీనియందొక దాని నాచరించుట-అధిక ప్రయోజన కారి, కా"దను సంశమును "రెండింటిని గూడ నాచరించుట-అధిక ప్రయో జనకారి" అనుసంశమును గూడ-అందఱు నంగీకరించి వ్యాఖ్యా నించి యున్నారు. కాని సంభూతి-అసంభూతి అను పదముల అర్థ నిర్వచనమునందును, తత్ఫల కథనము నందును-కొంత భిన్నాభి ప్రాయము కలదు. కావున వాని యర్థముల నిచట విశదీక రింతును.

(౧) అసంభూత్యుపాసనము :— 1 మాయా ప్రకృతిని సేవించుట, 2 ప్రాణులకు పునర్జన్మలేదని తలఁచుట, 3 జగత్తు పరమేశ్వరుని వలన సంభవము గలదికాదనియు, స్వభావము వలననే పుట్టినదనియు, తలఁచుట. 4 సమాధికంగభూతమగు విషిద్ధ ధర్మ వినాశము నొనర్చుట, 5 విగ్రహ పరిగ్రహ నివృత్తి మాత్రము నుపాసించుట, 6 విష్ణువునకు జగత్ సృష్టి కర్తృత్వము నంగీకరింపకుండుట.

(౨) సంభూత్యుపాసనము :— 1 కార్య బ్రహ్మమగు హిరణ్యగర్భుని సేవించుట, 2 ఆత్మజ్ఞాన మాత్రమునే సేవించుట 3 సమాధి రూపమగు అనుభూతి మాత్రమునే సేవించుట, 4 పునర్జన్మమును మాత్రమే అభిలషించుట, 5 పరమేశ్వరుఁడు జగత్స్రష్టయే కాని సంహర్త కాఁడని (సంహార కర్తృత్వాది గుణములు లేనివాఁడని) భావించుట.

అసంభూత్యుపాసనము-సంభూత్యుపాసనము అను వానికి మీఁది తీరున నర్థములు ప్రవచింపఁబడినవి.

అసంభూత్యుపాసనవలన విఫలములు 1 అంధతమఃప్రాప్తి 2 ప్రకృతిలయము 3 శరీర పరిగ్రహ నివృత్తి.

1 అంధతమః ప్రాప్తి-అనఁగా, నరకప్రాప్తి-మృగపక్ష్యాది జన్మప్రాప్తి-అజ్ఞానప్రాప్తి-ఇత్యాద్యర్థములు చెప్పఁబడినవి.

సంభూత్యుపాసనమువలని ఫలములు :— 1 అధికమగు అంధతమఃప్రాప్తి-అజ్ఞానప్రాప్తి-నరకప్రాప్తి. 1 సంసార ప్రాప్తి, 2 అణిమాది సిద్ధిప్రాప్తి, 3 పునర్జన్మాదిప్రాప్తి.

అంధతమఃప్రాప్తి అను పదమునకు అజ్ఞానప్రాప్తి అను సామాన్యార్థమును వ్యాఖ్యాతలందఱును స్వీకరించుచున్నారు. కావున విశేషార్థమును విడిచిన యెడల ఫలకథనమునందుఁ గూడ-వీరికి ఏకాభిప్రాయము కలదని సిద్ధాంతీకరింప వచ్చును. 1 ప్రకృతి లయము, 2 అణిమాది సిద్ధులు, 3 పునర్జన్మాదులు మొదలగునవి అన్నియుఁగూడ అజ్ఞాన రూపములగు ఫలములే యగుచున్నవిగదా!

అవతారిక :— ప్రత్యేకములగు సంభూత్యసంభూత్యు పాసనముల వలని ఫలములు భిన్నములును, అల్పప్రయోజన కారులును, అగుచుండును. కావున నీక్రింది మంత్రము ఈ యుపాసనలు రెంటియొక్కయు సముచ్చయము-ఏక పురుషార్థ సాధకమగుటవలన అదియే-ఆచరణీయమని తెలుపుచున్నది.

మూ॥

(అ) సమ్భూతించ వినాశంచ యస్త ద్వేదోభయం సహ
వినాశేన మృత్యుం తీర్త్వాఽసమ్భూత్యామృత మశ్నుతే॥౧౪॥

కం॥ సంభవ, మసంభవము, నను
భంభ దుపాసనల నెఱుఁగు-సుజ్ఞోత్తముఁడా
సంభవమున మృతిదాటి-అ
సంభవమున-అమృతయోగ సంపన్నుఁడగున్॥

పద :— సమ్భూతిమ్-చ-వినాశమ్-చ-యః-తద్-వేద-ఉభయమ్-సహ-వినాశేన-మృత్యుమ్-తీర్త్వా-అసమ్భూత్యా - అమృతమ్-అశ్నుతే.

టీక :— యః=ఎవ్వఁడు, అసమ్భూతిమ్ = అసంభూతిని-అనఁగా అవ్యాకృతమనఁబడు ప్రకృతిని, వినాశమ్+చ=సంభూతిని అనఁగా బ్రహ్మ మొదలు తృణము వఱకునుగల కార్యబ్రహ్మమునుగూడ, తత్=అ. ఉభయమ్=రెండింటిని, సహ=ఒక్కఁడే ఉపాసింపఁదగినవని, వేద=తెలిసికొనునో,(సః=వాఁడు) వినాశేన=కార్యబ్రహ్మోపాసనముచేత, మృత్యుమ్=మ ర ణ మును అనఁగా, అధర్మాది దోషమును, తీర్త్వా=అతిక్రమించి, అసమ్భూత్యా = అవ్యాకృతోపాసనముచేత, అమృతమ్=ప్రకృతిలయమును, అశ్నుతే=పొందును.

తాత్ప :— అసంభూతిని-సంభూతిని తెలిసికొని రెండింటిని గూడ ఉపాసించుచుండు నతఁడు-సంభూత్యుపాసనమువలన అణిమాద్యైశ్వర్యములనొంది, వానివలన అధర్మాది మృత్యువు నతిక్రమించి-అసంభూత్యుపాసనముచేత ప్రకృతిలయము నొందును.

శాంకరభాష్యము :—

అసంభూతియగు ప్రకృతిని, సంభూతియగు హిరణ్యగర్భుని గూడ నుపాసించవలయును.

"వినాశో ధర్మః యస్యకార్యస్య సతేన ధర్మిణాఽభేదే నోచ్యతే వినాశ ఇతి"

వినాశమను ధర్మము కార్యమునకే కలదు. వినాశ ధర్మము గల ధర్మియగు కార్యము "వినాశి" అని చెప్పఁబడును. అయినను "వినాశము" అనుధర్మము ధర్మియగు కార్యముతో భిన్నము కాని దిగా నిచటఁజెప్పఁబడినది. కావున "వినాశమనఁగా వినాశధర్మము గల కార్యబ్రహ్మము" అను నర్థము నిచట గ్రహింప వలయును.

ఇట్లు-సంభూత్యసంభూతుల నుపాసించువాఁడు సంభూత్యు పాసనముచేత-అనఁగా కార్యమగు హిరణ్యగర్భునియొక్క ఉపాస నముచేత-అనైశ్వర్యము-అధర్మము-కామము మొదలగు దోష జాతమును (మృత్యువును) దాటి, అసంభూత్యుపాసనముచేత- అనఁగా, అవ్యాకృతోపాసనముచేత ప్రకృతియందు లయించును, "సంభూతించ" అనుచోట-అవర్ణము లోపించినదని తెలియునది. అట్లు లోపింపలేదనిన యెడల శ్రుత్యభిమతమగు ప్రకృతి లయ మను ఫలమును జెప్పుటకు విరోధము సంభవించును. కావున "సంభూతించ వినాశంచ" అనుటకు బదులు "అసంభూతించ, వినా శంచ" అను అర్థమునే స్వీకరింప వలయును.

ఆనందగిరి :—

ఇట్లు విస్తరించి చెప్పఁబడిన యర్థజాతమును సంక్షేపించుచు ముగించు చున్నాఁడు.

శరీర పాటవమును, గోభూ హిరణ్యాది సంపత్తియు, 'మానుషవిత్త'మని చెప్పఁబడును. దేవతా జ్ఞానము 'దైవ విత్త'మని చెప్పబడును.

శాంకరభాష్యము :—

ఇట్లు మానుషవిత్త సాధ్యమును, దైవవిత్తసాధ్యమును, అగు ఫలము-ప్రకృతిలయముతో ముగియుచున్నది. సంసారగతి- ఇంత వఱకే యున్నది.

దీని తరువాత "ఆత్మైవాభూద్ విజానతః" అని వెనుక చెప్పఁబడిన సర్వాత్మభావమే-సర్వైషణా సన్న్యాస పూర్వకమగు జ్ఞాన నిష్ఠకు ఫలమగుచున్నది.

ఇట్లు-ప్రవృత్తి-నివృత్తి-లక్షణమగు వేదార్థమిందు ప్రకాశింపఁజేయఁబడినది.

అదెట్లనిన :— శుక్ల యజుర్వేదమునందు విధి-నిషేధ రూపమును, ప్రవృత్తిలక్షణమును-అగు వేదార్థమునంతను ప్రకాశింపఁజేయుటకు ప్రవర్గ్యాంతమగు బ్రాహ్మణము ప్రవర్తించినది,

తరువాత :— అపరబ్రహ్మ (దేవతా) విషయమగు విద్యతోఁగూడ—ఎవఁడు నిషేకము మొదలు శ్మశానము వఱకును గల కర్మను గావించుచు జీవింపఁగోరునో ఆకర్మ-విద్యా-సముచ్చయకారి నుద్దేశించి "విద్యాంచా విద్యాంచ యస్తద్ వేదోభయం సహ అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే" అని యీ వేదమునందే యున్న బృహదారణ్యకము నందుఁగూడ సముచ్చిత కర్మ కర్తయగు మనుష్యునకు ఫలాధిక్యము చెప్పఁబడినది గదా!

[కేవలకర్మకంటె-సముచ్చితకర్మయు అనఁగా; ఉపాసనతోఁ గూడిన కర్మయు, సముచ్చిత కర్మకంటె-బ్రహ్మ జ్ఞానమును, వేరనియు-శ్రేష్ఠములనియు-దీనివలనఁదెలియుచున్నది.]

ఉవటాచార్య కృత-ఈశావాస్య రహస్యము :—

సమస్త జగత్తుయొక్కయు సంభవమునకు ముఖ్యకారణమగు పరబ్రహ్మము-"సంభూతి" అనిచెప్పఁబడును. వినాశధర్మముగల దగుటచేత వినాశియగు శరీరము "వినాశము" అని చెప్పఁబడినది.

సంభూతియగు పరబ్రహ్మమును-వినాశియగు శరీరమును-గూడ తెలిసికొని తత్సముచ్చయ కర్తయగు యోగి-శరీర గ్రహణముచేత జ్ఞానోత్పత్తి హేతువులగు కర్మల నొనర్చును. కావున-అయోగి వినాశముగల శరీరముచేత మృత్యువు నతిక్రమించును. సంభూతియగు ఆత్మజ్ఞానముచేత (అనఁగా విజ్ఞానముచేత) అమృతత్వము నొందును.

బ్రహ్మానంద కృత-ఈశావాస్య రహస్యము :—

[శ్లోకరూపమగు నీవ్యాఖ్యయందు అవర్ణలోపము లేకుండ-యథాశ్రిత పాఠము ననుసరించి అర్థము చెప్పఁబడినది.]

సంభూతియనఁగా కార్యరూపమగు హిరణ్యగర్భుఁడు.

వినాశమనఁగా కారణ స్వరూపమగు మాయాబీజము.

ఏమాయా ప్రకృతియందు కార్యము-వినాశము నొందునో ఆ మాయా ప్రకృతి-వినాశమని చెప్పఁబడును.

కార్యమగు హిరణ్యగర్భ స్వరూపమునకును-కారణమగు ప్రకృతికిని-ఐక్యము నెఱింగినవాఁడు-వినాశమగు ప్రకృతి నుపాసించుటచేత మృత్యువు నతిక్రమించి-సంభూతియగు హిరణ్యగర్భు నుపాసించుటచేత-అమృతత్వము నొందును.

అనఁగా: మాయా ప్రకృత్యుపాసనముచేత స్వాభావికమగు అజ్ఞానము నతిక్రమించి-హిరణ్యగర్భోపాసనమను సంభూత్యుపాసనముచేత బ్రహ్మలోకము నొంది - తరువాత కార్య-కారణ విముక్తమగు పరబ్రహ్మము నెఱిఁగి-తదుపరి ముక్తినొందును.

ఈశావాస్యరహస్య వివృతి :—

ప్రకృతియందు లయించుట ఆపేక్షికమగు అమృతభావ మగుచున్నది. మనుష్యులకంటె అధికమగు జీవనము కలవారగుటచేత దేవతలమరులని చెప్పఁబడినట్లు-ప్రకృతిలయముకూడ-చిరకాల ముండునది యగుటవలన అమృతస్థితిగాఁ జెప్పఁబడినది. ఇది కైవల్య రూపమగు అమృతముకాదని తెలియునది.

అనంతభట్టోపాధ్యాయ కృత-భాష్యము :—

ప్రకృతిలయ రూపమగు నమృతభావము నొందినవారికి సృష్టిప్రారంభము నందు మరల సంసారప్రాప్తి కలుగును. 9వ మంత్రము నుండి 14వ మంత్రము వఱకును గల విషయము-ఉపాసనమునకు సంబంధించి యున్నది. తదితర మంత్రములయందున్న విషయము నిర్గుణతత్త్వమునకు సంబంధించియున్నది.

అద్వైతానందలహరి :—

అసంభూతియగు అవ్యాకృతమును, వినాశియగు కార్య బ్రహ్మమును గూడ నొకేమారు-ఉపాసించువాఁడు-కార్యోపాసనముచేత-అనైశ్వర్యమును గడచి, కారణోపాసనముచేత-ఆపేక్షికమగు ప్రకృతిలయమను మోక్షము నొందును. ఇవి సాంసారిక ఫలములయందు విశిష్టమై యున్నవి. కాని అవిద్య-నివర్తింపకుండుటవలన-సత్యమగు మోక్షము కానేరదు.

విశిష్టాద్వైతభాష్యము :— (శ్రీ కూరనారాయణముని విరచితము)

సంభూతిని-అనఁగా సమాధి రూపమగు బ్రహ్మానుభూతిని, వినాశమును-అనఁగా మాన, దంభ, హింసా, స్తేయ, బహిర్ముఖేంద్రియవృత్తి -ప్రభృతులగు యోగ విరోధులయొక్క వర్జనమును (యోగ ప్రతి కూలములగు దుష్ట ధర్మములను విడుచుటను)

రెంటింటినిగూడ-అంగాంగి భావముచేత నుపాసించుచున్న విద్వాంసుఁడు-వినాశముచేత-అనఁగా విరోధి నివృత్తిరూపమగు యోగాంగమును సేవించుటచేత-మృత్యువును-అనఁగా, సమాధి విరోధియగు పాపమును-తొలఁగించుకొని, సంభూతియను సమాధిచేత బ్రహ్మప్రాప్తి రూపమగు సంభూతియను అమృతమునే పొందును.

ఈ మంత్రమునందు వినాశశబ్దముచేత చెప్పఁబడిన దంభాది వినాశము - బృహదారణ్యకమునందు, "తస్మాద్ బ్రాహ్మణః పాణ్డిత్యం నిర్విద్యబాల్యేనతిష్ఠాసేత్" అని బాల్యశబ్దముచేత చెప్పఁబడి-ఆబాల్యమే-విద్యకంగముగా విధింపఁబడి యున్నది.

ఇందు శాంకరభాష్యము-సంభూతి శబ్దమునకు సృష్టియను నర్థమును-వినాశ శబ్దమునకు ప్రళయమను నర్థమును వివక్షించుచు "కార్యమగు హిరణ్యగర్భునియొక్కయు-ఉపాసనము-విధింపఁబడుచున్నది" అని చెప్పుచున్నది. అట్లగునెడల మృత్యువు నతిక్రమించుట-అమృతత్వము నొందుట-అను ఫలములను జెప్పుట సముచితము కానేరదు. కావున శాంకర వ్యాఖ్యానముపపన్నము కానేరదని తెలియునది.

శ్రీ రంగాచార్యభాష్యము :—

ఈ మంత్రమును పదునొకండవదని మాధ్యందినులును, పదునాలుగవదని కాణ్వులును చెప్పుచున్నారు.

ఏపురుషుఁడు-సంభూత్యుపాసన ఫలమగు విగ్రహ స్వీకారమను సంభూతిని, శరీర పరిగ్రహ నివృత్తి రూప ఫలమగు అసంభూతిని, కూడ సముచ్చయముచేత నుపాసించునో-ఆపురుషుఁడు-వినాశముచేత-అనఁగా; అసంభూత్యుపాసనముచేత సిద్ధించునదియగు కర్మాధీన ప్రాకృత శరీర పరిగ్రహ యోగ్యతా నివృత్తిచేత-మృత్యువును-అనఁగా-బ్రహ్మప్రాప్తికి ప్రతిబంధకమగు ప్రకృతి సంబంధమును, విశేషముగా నతిక్రమించి - సంభూతిచేత-అనఁగా సంభూత్యుపాసనముచేత సిద్ధించునదియు, కర్మవశము కానిదియు

అగు-అప్రాకృత (దివ్య) శరీర పరిగ్రహ యోగ్యతాసిద్ధిచేత-అమృతమ్=పరమ పురుషార్థమగు పరబ్రహ్మమును, అనుభవించును.

దివ్య శరీరమును స్వీకరింపకుండ-నిత్యకైంకర్య ప్రాప్తి పర్యవసాయియగు పరబ్రహ్మానుభవము-సంభవించునది కానేరదు. కావున కేవలమగు అసంభూత్యుపాసనముచేత లభించునది యగు శరీర పరిగ్రహ నివృత్తిరూప కైవల్యము-ప్రయోజనవంతము కాఁజాలదు.

అసంభూత్యుపాసనముచేత-ప్రాకృతశరీర స్వీకార యోగ్యత వివర్తించును. సంభూత్యుపాసనముచేత-దుఃఖాదిదోష గంధ రహిత దివ్య శరీర-పరిగ్రహ యోగ్యత సిద్ధించును. కావున-ఉపాసనములు రెండును ఆవశ్యకములే యగును.

వీనిని వేర్వేరుగా నాచరించుటవలన పరమ పురుషార్థము లభింపదు. సముచ్చయము చేతనే మోక్షము లభించును.

శ్రీమధ్వాచార్య కృత-ద్వైత భాష్యము :—

కావున-సంభూత్యసంభూతులను జో డిం చి-ఈశ్వరుఁడు "సృష్టికర్త, సర్వసంహారకర్త, సర్వగుణాత్మకుఁడు" అని తెలిసికొనిన విద్వాంసుఁడు ఆ యీశ్వరునియందున్న సంహార కర్తృత్వ జ్ఞానమువలన దుఃఖము, అజ్ఞానము, మొదలగు అనిష్ట ఫలమును తొలఁగించుకొని - దేహబంధము నుండి విముక్తి నొందును. ఇది-మోక్షమునందు-ఒకభాగము. ఆ పరమాత్మ యందున్న సుఖ-జ్ఞానాది-సర్వకర్తృత్వ జ్ఞానమువలన-సుఖజ్ఞానాది రూపమగు మోక్ష భాగము నొందును. ఇది మోక్షమునందు వేరొక భాగము.

ద్వైతభాష్య వ్యాఖ్యయగు రఘునాథీయము :—

సంభూతి=ఈశ్వరుని యందున్న సుఖజ్ఞానాది సర్వకర్తృత్వము, వినాశము=అతనియందున్న సర్వ సంహార కర్తృత్వము, ఈ రెండింటినిగూర్చ, ఏకపురుషార్థ సాధనములుగాఁ దెలిసికొనిన యధికారి "పరమేశ్వరుఁడు-వినాశకర్త" అని యుపాసించుటచేత, మృత్యువును, అనఁగాః మృత్యుకారణమగు దేహాది బంధమును

విడిచి, సంభూతిచేత-అనఁగా; "ఆ పరమేశ్వరుఁడే-సుఖ-జ్ఞానాది సర్వకర్త" అని యుపాసించుటచేత, అమృతమును, అనఁగా; సుఖ-జ్ఞానాది రూపమగు ఆనందానుభూతిని, పొందును.

కనుక "విష్ణువునందు జ్ఞానేచ్ఛాది గుణములున్నను-ఆనందాది గుణములులేవు" అని తలంచి భాగహానిని కల్పింపఁగూడదు. ముక్తినొందిన పురుషులకు-పరమాత్మతోడి, సామ్యమును గాని, అభేదమునుగాని తలంపఁగూడదు. బ్రహ్మాదులకుఁగూడ పరమాత్మ తోడి సామ్యమును చెప్పఁగూడదు.

"మనుష్యులు మొదలు-బ్రహ్మదేవుని వఱకునుగల జీవులకు, సంసారము నందును, ముక్తియందును, గూడ-తారతమ్యము =నీచోచ్చభావము-సత్యమైయున్నది. విష్ణువు-పరమాత్మ-అతఁడే సర్వోత్తముఁడు" అని లెస్సగాఁదెలిసికొనిన పురుషుఁడు-పరమ పురుషార్థమగు మోక్షమును పొందును. ఈ యంశమంతయు కూర్మ పురాణము నందున్నది. కావున "జనార్దనుఁడగు విష్ణువు-సర్వదోష వినిర్ముక్తుఁడు; సర్వగుణపూర్ణుఁడు" అని బాగుగాఁ దెలియ వలయును.

స్వాభిప్రాయము :—

మీఁద ప్రదర్శితములగు అర్థములు-ఆయామత కర్తల యభిప్రాయములను స్పష్టీకరించు చున్నవి. గంభీరాత్మకములగు శ్రుతి మంత్రములయందు-మీఁది యర్థములలో-ఏయర్థమునుగూడ-సమీచీనము కాదని చెప్పుట-సమీచీనము-కానేరదు. కాని, వాని యందు శ్రీ రంగాచార్యుల యర్థ నిర్వచనము-ప్రతిభా పరిపూర్ణమును, మనోహరమును, సహృదయ హృదయాహ్లాద సంధాయకమును, అగునని తలఁచు చున్నాను-విమర్శకులగు ఆస్తికులు-ఆయా వ్యాఖ్యాతలచేతఁదెలుపఁబడిన యర్థములయందు, తమకురుచించిన యభిప్రాయమును స్వీకరించుచు - తదితర మతాభిప్రాయముల యందలి విజ్ఞానమునుగూడ సహన బుద్ధితో పరిశీలించుట-సముచిత

మార్గమని తలంచుచున్నాను. అర్థములేమయినను, సంభూతి-అసంభూతి-అను నీయుపాసనలను రెండింటిని గూడ-సముచ్చయముచేత-ఆచరింపవలయునను నంశమును-వ్యాఖ్యాతలందఱును గూడ నంగీకరించి యున్నారు. కావున విజ్ఞులు ఈ యుపాసనలు రెండింటిని గూడ కలిపి సమాచరింప వలసి యున్నది.

ఇది-నా యభిప్రాయము :—

సంభూతియనఁగా, సంభవముగల కార్యప్రపంచముగాని హిరణ్యగర్భాది సగుణ బ్రహ్మముగాని యనుచున్నది.

అసంభూతి యనఁగా, సంభవము కలఁగనిదియు, సంభూతికి కారణమగుచున్నదియు, అగు మాయా ప్రకృతియగుచున్నది. వీనిని రెండింటిని గూడ నుపాసింప వలయును. అందు-సంభూత్యుపాసనమువలన-అణిమాదులగు నైశ్వర్యములు లభించు నను నంశము-ఉపాసకులకు ప్రత్యక్షసిద్ధమై యున్నది.

అసంభూతియగు ప్రకృతి నుపాసించు పురుషులకు-ప్రకృతి లయము సిద్ధించును. ప్రకృతిలయులగు ప్రాణులు-కల్పాంతమగు వఱకును గూడ-నిద్రయందువలె-సుఖ-దుఃఖ-జ్ఞాన-రహితులై-ప్రకృతి యందుందురు. వీరు నిర్గుణసచ్చిదానంద బ్రహ్మస్వరూపులు-కాకున్నను ఉపాసకులందఱియందును వీరే శ్రేష్ఠులగుచున్నారు.

ఉపాసన వలన గలుగు-సిద్ధులన్నింటియందును గూడ అణిమాదులచేనగు సుఖమున్నను, అహంకారము-గర్వము-దైన్యము-మొదలగు వానిచేనగు దుఃఖము కూడ-కలుగక తప్పదు. దీని యందట్టి సుఖ దుఃఖములు లేకుండుటవలన-ఉపాసన ఫలములన్నిటియందును గూడ-ఈ ప్రకృతిలయమే-శ్రేష్ఠమని చెప్పఁదగి యున్నది.

[బౌద్ధులు-ప్రకృతిలయులగుదురని తెలియు చున్నది.]

ఉపాసనలకుఁగల ఫలముల యందీ ప్రకృతిలయము-శ్రేష్ఠమే అయినను-స్వాత్మజ్ఞానము లేకుండుటవలన సృష్టి ప్రారంభము నందీ ప్రకృతిలయులు గూడ పునర్జన్మము నొందక తప్పదు.

కేవల సంభూతినిగాని, కేవలమగు అసంభూతినిగాని, ఉపాసించుట వలనఁగలుగు ఫలముకంటె-ఈ రెండింటినిగూడ జోడించి ఉపాసించుట వలన గలుగు ఫలము అధికమగును. కావున సంభూతిని, అసంభూతిని, గూడ సేవించువారగు ఉపాసకులు-సంభూత్యుపాసనము వలన పాండిత్యాది రూపమగు ఐశ్వర్యము నొంది-చిత్తమాలిన్య రూపమగు మృత్యువు నతిక్రమించి-శుద్ధులై, అసంభూత్యుపాసనము వలన-ప్రకృతిలయమను అమృత స్థితియందు విదేహియందువలె చిరకాలము శోకరహితులై యుందురని తెలియునది.

సత్కర్మలవలన చిత్త శుద్ధినొంది-ఉపాసనలవలన-ఏకాగ్రత నొందిన మనీషులకు-ఆత్మజ్ఞానముచేతనే నముపలభ్యమును, బ్రహ్మానంద రూపమును, అగు అమృతస్థితి ఒక్కటియే-పునరావృత్తి లేనిదై యున్నది. "ప్రత్యగాత్మ-పరమాత్మైక్య రూపమగునది-ఈ పదవు అన్నిటికంటెను శ్రేష్ఠము." అని విజ్ఞానముచేత గ్రహించిన ముముక్షువులు వేదాంత శ్రవణ-మనన-ధ్యాన సమాధుల నొనర్పుటయే ముఖ్యమని భావింతురు. కావున ఆత్మజ్ఞానమే-మోక్షమునకు సాక్షాత్సాధనమని తెలియునది.

"బోధోఽన్య సాధనేభ్యో హి సాక్షాన్మోక్షైకసాధనమ్
పాకస్య వహ్నివద్ జ్ఞానం వినామోక్షోనసిద్ధ్యతి"

"తదితర సాధనము లన్నిటికంటెను గూడ బ్రహ్మాత్మజ్ఞానమే-మోక్షమునకు సాక్షాత్సాధనమై యున్నది. తదితర సాధనములున్నను గూడ ప్రధానమగు అగ్నిలేని యెడల వంట-సిద్ధింపని విధమున-తదితర సాధనములున్ననుగూడ-ఆత్మజ్ఞానము లేనియెడల మోక్షము సిద్ధించునది కానేరదు."

అని ఆత్మబోధ ప్రకరణమున శ్రీ శంకరులు నుడివి యున్నారు గదా!

ఓం నమోభగవతే రమణాయ-శ్రీ భారతీ దేవ్యైనమః,

ఈశావాస్యోపనిషత్తు

శాంకర భాష్యావతరణిక :—

(హిరణ్యగర్భలోక ప్రాప్తి రూపమగు) దేవలోక ప్రాప్తి రూపమగు అమృతత్వము ఏ మార్గముచేత పొందఁబడునో, దానిని శ్రుతి చెప్పుచున్నది.

మూ॥ హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖమ్
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥౧౫॥

కం॥ అమల హిరణ్మయమగు పా
త్రిమునను గప్పితివి-సత్పరబ్రిహ్మ ద్వా
ర, మదితెఱవు మీక్షింపఁగ,
ద్యుమణీః సద్ ధర్మసంయుతుఁడనగు నాకున్॥

పదవిభాగము :— హిరణ్మయేన - పాత్రేణ - సత్యస్య-అపిహితమ్ - ముఖమ్ - తత్ - త్వమ్-పూషన్-అపావృణు-సత్య ధర్మాయ-దృష్టయే.

ప్రతి :— హిరణ్మయేన=జ్యోతిర్మయమైన, పాత్రేణ= పాత్రిముచేత (గిన్నెచేత) సత్యస్య = సూర్యమండలమునందున్న బ్రిహ్మముయొక్క, ముఖమ్ = ద్వారము, అపిహితమ్=కప్పఁ బడినది. పూషన్=ఓ సూర్యుఁడా! త్వమ్=నీవు, సత్యధర్మాయ= సత్యమగు ఉపాసనాధర్మముగల నాకొఱకు, దృష్టయే=సత్యమగు నీస్వరూపమును చూచుట కొఱకు, తత్=అకలశమును, అపా వృణు=తెరువుము!

తాత్పర్యము :— కర్మోపాసనలను రెండింటిని గూడ నాచరించు పురుషుఁడు అంతకాలము సమీపించునపుడు తనకై అమృత ద్వారమును ప్రార్థించుచున్నాడు.

ఓ సూర్యుఁడా! నీమండలమునందున్న సత్య స్వరూపము యొక్క ద్వారము జ్యోతిర్మయమగు కలశముచేత కప్పఁబడి యున్నది. వర్ణాశ్రిమ ధర్మముల ననుష్ఠించుచు, సత్య స్వరూపము నుపాసించుటచేత సత్యధర్ముఁడనగు నేను-నీసత్య స్వరూపమును పొందుటకై ఆ ద్వారమును తెరువుము.

[సూర్యమండలము నందున్న అధి దైవమగు నీబ్రహ్మ స్వరూపము లీలా విగ్రహమేగాని నిర్గుణ బ్రహ్మస్వరూపము కాదని తెలియునది.]

శాంకరభాష్యము :—

ఆదిత్యమండలాభిమానియగు పురుషుఁడు సత్యమగు బ్రహ్మమై యున్నాఁడు. ఈ పురుష స్వరూపము-అధి దైవమని చెప్పఁబడును. సత్యమగు ఆదిత్యమండలము నందున్న పురుషుని-(అధిదైవమును) ఈ మనుష్యుని కుడికంటి యందున్న పురుషుని-(అధ్యాత్మమును) ఈ ఉభయమును గూడ సత్యమగు బ్రహ్మము నగా ఉపాసించువాఁడును, యథోక్తములయిన కర్మల ననుష్ఠించు వాఁడును, అగుటవలన కర్మోపాసనా సముచ్చయ కర్తయగు మనుష్యుఁడు-అంతకాలము సమీపించునపుడు సత్యమగు నాత్మను [అధి దైవమును] పొందుటకు ద్వారమును యాచించు చున్నాఁడు.

హిరణ్మయమువంటి (బంగారు రంగుగల) జ్యోతిర్మయ పాత్రముచేత ఆదిత్య మండలమునందున్న బ్రహ్మముయొక్క ముఖము (ద్వారము) మూత పెట్టఁబడి యున్నది.

ఓ పూషా! సత్య స్వరూపుఁడవగు నిన్ను ఉపాసించుట వలన సత్యమగు ధర్మముగల నాకొఱకు, లేక శాస్త్రోక్తమగు ధర్మము ననుష్ఠించుచున్న నాకొఱకు, సత్యమగు నీ స్వరూపము నొందుటకు జ్యోతిర్మయమగు నాపాత్రమును తొలఁగించి ద్వారమును తెరువుము.

బ్రహ్మానంద భాష్యము :—

సత్యలోకమునకు ఆత్మయు, సూత్రాత్ముఁడును, సనాతనుఁడును, అగు బ్రహ్మమును పొందుటకు సాధనమగు ద్వారమును ప్రార్థించుటకీమంత్రము ప్రవర్తించుచున్నది.

ఓ భాస్కరా! దీధితిసమూహమును నిరాకరించి-నాకు సత్యలోకమునకు ద్వారము నిమ్ము.

[ఇది బ్రహ్మలోకమే యగునుకాని బ్రహ్మ స్వరూపము కాదు.]

ఈశావాస్యదీపిక :—

మీఁద చెప్పఁబడిన-కర్మోపాసనల చేతను - సంభూత్యసంభూత్యుపాసనల

చేతనుగూడ-కార్యకారణాత్ముఁడును-ఆదిత్య మండల స్థితుఁడును అగు పురుషుఁడు పొందఁదగియున్నాఁడు. కావున తత్ప్రార్థనా మంత్రములు ప్రవర్తింపఁజేయఁబడు చున్నవి. పూషన్ = పుష్టిని కలిగించు వాఁడా!

ఈశావాస్య రహస్య వివృతి :—

“వింప్తి రశ్మయో రపాన్ యత్ప్రస్థితాః”, తేన = పాత్రేణ = ఏ సూర్యబింబము నందున్న కిరణములు జలములనుపానము చేయునో, ఆ బింబమే-పాత్రమని చెప్పఁబడినది. ఆ పాత్రముచేత అధి దైవమగు బ్రహ్మ స్వరూపము కప్పఁబడినది.

అనంతాచార్య భాష్యము :—

ఈశ్వర సాక్షాత్కారము శ్రవణాది మాత్రముచేతనే కలుగునదికాదు. అట్లే మోక్షముగూడ-సాక్షాత్కార మాత్రముచేతనే సిద్ధించునదికాదు. భగవదనుగ్రహము వలన-సాక్షాత్కారము కలుగును. భగవదనుగ్రహము వలననే మోక్షముకూడ కలుగును. కావున శ్రవణాదికమును గావించిన వ్యక్తి కూడ సాక్షాత్కారము కొఱకును, సాక్షాత్కారము నొందినవ్యక్తి కూడ మోక్షము కొఱకును, భగవంతుని ప్రార్థింప వలయును. ఈ యంశము కఠోపనిషత్తునందిట్లు చెప్పఁబడినది.

“నాఽయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహునా శ్రుతేన
యమేవైష వృణుతే తేన లభ్యః
తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్”

ఈ ఆత్మ-ప్రవచనముచేతఁగాని, మేధస్సు చేతఁగాని, గొప్ప పాండిత్యము చేతఁగాని, లభింపఁడు. భక్తుఁడగు ముముక్షువు వానిని వరించిన యెడల వాఁడు లభించును. వీనికి తన రూపమును వాఁడే చక్కఁగా చూపును.” ఆ ప్రార్థన ప్రకారము క్రింది మంత్రముల యందు తెలుపఁబడుచున్నది.

ఓ సూర్యుఁడా! సత్యస్వరూపుఁడును, పురుషోత్తముఁడును, అగు భగవంతుని యొక్క లీలా విగ్రహ స్వరూపము (అధి దైవము)-జ్యోతిర్మయమగు నీ బింబము చేత కప్పఁబడినది. దానిని తెరువుము.

అద్వైతానందలహరి :—

ఉభయాత్మకుఁడగు పురుషుని స్వరూపము-అధ్యాత్మము-అధిదైవము అని ద్వివిధమై యున్నది. అధ్యాత్మము-అక్షిపాత్రముచేతను అధిదైవము-సూర్య మండలము చేతను ఆచ్ఛాదింపఁబడియున్నది. మనుష్యుని దక్షిణ నేత్రమును సూర్య బింబమును ఇచ్చట హిరణ్మయ పాత్రముగాఁజెప్పఁబడినవి.

"యథా మాహారజనం వాసో యథేన్ద్రగోపః (బృహ)"

"లింగ శరీరాత్మకమైన పురుషునియొక్క స్వరూపము-ఎఱ్ఱని వస్త్రమువలెను, ఆర్ద్ర పురుగువలెను, అగ్నిజ్వాలవలెను, మెఱుపువలెను, అగుచున్నది."

అను శ్రుతిచేత చెప్పఁబడిన లక్షణముగల పురుష స్వరూపము యొక్క దర్శన ద్వారమగు ముఖము-మీఁద చెప్పఁబడిన-వేతిపాత్రము చేతను-సూర్యమండల పాత్రముచేతను కప్పఁబడియున్నది. కావున సూర్యమండలాభిమానియగు ఓ దేవా!

ఆ పురుష స్వరూపము నుపాసించుచున్న నేను నిన్ను చూచుట కొఱకు దానిని తొలఁగింపుము.

[ఈ శరీరము నందున్న విజ్ఞానమయుఁడు-అధ్యాత్మ పురుషుఁడును, ఆసూర్యమండలమునందున్న జ్యోతిర్మయుఁడు-అధి దైవ పురుషుఁడును, అగుచున్నారు. అధ్యాత్మమగు పురుషుఁడును-అధిదైవమగు పురుషుఁడును-ఒక్కఁడే యగుచున్నాఁడు. ఈ పురుషుఁడు జ్యోతిర్మయుఁడగు పురుషుఁడే యగును, కాని సచ్చిదానంద పరమాత్మ కాఁడని తెలియవలయును.]

శ్రీ విశిష్టాద్వైత భాష్యము :— [శ్రీ వేదాంత దేశికులు] ఉపాసకుఁడు-సమాధి ప్రతి బంధ నివృత్తి కొఱకు భగవంతుని ప్రార్థించుచున్నాఁడు.

రజోమయమును, కర్మాధీనమును, అగు భోగ్యవర్గము-హిరణ్మయ సదృశమై యున్నది. అది-పరమాత్మ విషయకమగు వృత్తిని నిరోధించుటచేత సత్యమగు జీవునియొక్క ముఖము అనఁగా మనస్సును-అచ్ఛాదించుచున్నది. ఆశ్రితపోషణ స్వభావుఁడవగు పరమాత్మా! జీవునకు ధర్మభూతమగు పూర్వోక్త బ్రహ్మానుభవ దర్శనము కొఱకు-జీవునికి ముఖము వంటిదగు మనస్సును-తిరోధానములేని దానినిగా నొనరింపుము.

[శ్రీ కూరనారాయణముని వ్యాఖ్య].

ఆదిత్య మండలాంతర్యామీ! ఆశ్రిత పోషణ స్వభావా! పర

మాత్మా! "ప్రకృతి" యున్నగువానివలె స్వరూప వికార రహితుఁ
దగు జీవాత్మయొక్క ముఖస్థానీయమగు మనస్సు-హృదయము
నందున్న పరమాత్మవగు నీయందు నెలకొల్పఁబడిన స్వవృత్తి
యొక్క నిరోధమును గలదై యున్నది. హృషీకేశుఁడవగు నీవు-
జీవునకు ధర్మభూతమగు నిన్ను సందర్శించుట కొఱకు-సత్య పద
వాచ్యుఁడగు ఆ జీవునియొక్క మనస్సును-కర్మాధీనమగు భోగ్య
వర్గముచేత-తిరోధానము నొందకుండునట్లు కావింపుము.

అందు శ్రీ రంగాచార్య భాష్యము :—

ఈ మంత్రమును-దీని తరువాతనున్న మంత్రములును-
ఉపాసింపఁదగిన పరమ పురుషునుద్దేశించి-ఉపాసకుఁడు కావింపఁ
దగిన ప్రార్థనమును తెలుపుచున్నవి.

ఇందు సత్యశబ్దముచేత పరబ్రహ్మమే చెప్పఁబడు చున్నది,
కాని వేదాంత దేశికాదులచేతఁజెప్పఁబడిన జీవుఁడుకాడు.

ప్రకృతియను నామాంతరముగల మాయవలన పుట్టిన
భోగ్యాదిజడరూపమును, దానికంటెవేరగు విశుద్ధ జ్ఞానానంద లక్షణ
చిద్రూపమును, (జీవరూపమును) అగు వస్తుజాతము-సూక్ష్మ-చిద
చిత్తులు-శరీరముగాఁగల పరమాత్మకు ఆవరణదశభూతమై,స్పృహ
ణీయమగుటచేత-హిరణ్మయ పాత్రముగాఁజెప్పఁబడినది.

హిరణ్య వికార భూత తిరోధాయక పాత్రమువంటి జడ-
జీవ-వస్తుజాతముచేత - సత్యమగు పరబ్రహ్మమవగు నీయొక్క
ముఖము-అనగా; ప్రాప్తి ద్వారమగు-జ్ఞాన మార్గలక్షణమగు సత్
దర్శనము-అచ్ఛాదింపఁబడినది. ఆదిత్య శరీరక - తన్మండలాంత
ర్వర్తివగు భగవానుఁడా! నీవు-మాకు సమీచీనమగు నీదర్శనము
యొక్క ప్రవృత్తి సిద్ధికొఱకు-సద్దర్శన లక్షణమగు భవత్ప్రాప్తి
ద్వారమును-అడ్డులేని దానినిగాఁజేయుము. అనఁగా; సద్దర్శనమును
వారించుచు, అసద్ దర్శనమునందు ప్రవర్తింపఁజేయుటకు హేతు
వగు రాగమును తొలఁగింపుము" అనిభావము.

భగవత్ప్రాప్తి విరోధి-బాహ్యవిషయ నివృత్తియు-భగవత్ ప్రాప్తి [హేతు] జ్ఞానమార్గ ప్రవృత్తియు-అను నీరెండును-భగవదధీనములై యుండుటవలన-వానికొఱకు భగవంతుఁడే యిచట ప్రార్థింపఁదగి యున్నాఁడు. ఈ యంశమును భగవంతుఁడు-స్వయముగానే తన గీతయందుపదేశించి యున్నాఁడు.

"దైవీ హ్యేషాగుణమయీ మమ మాయా దురత్యయా
మామేవ యేప్రపద్యన్తే మాయా మేతాం తరన్తి తే"
[గీ 7 అ. 14 శ్లో.]

"సత్వ-రజస్తమో గుణాత్మికయగు ఈ నామాయ-తరించుటకు శక్యముగానిదై యున్నది. ఎవ్వరు నన్ను సాక్షాత్కరింపఁజేసికొందురో, వారీమాయను తరించెదరు".

ద్వైతభాష్యము :— [శ్రీ మదానందతీర్థ భగవత్పాదాచార్య విరచితము.] మీఁది మంత్రములయందు ప్రతిపాదింపఁబడిన మోక్షము-భగవత్ ప్రసాదము వలననే కలుగవలసియున్నది, కావున భగవదనుగ్రహమునకు కారణము కాఁదగు భగవత్ ప్రార్థనము-క్రింది మంత్ర పంచకమునందు ప్రతిపాదింపఁబడుచున్నది.

హిరణ్మయపాత్రమగు సూర్యమండలముచేత-సత్య స్వరూపుఁడగు విష్ణునియొక్క ముఖము-కప్పఁబడి యున్నది. పూర్ణుఁడవగు పరమాత్మా! నీవు-సత్య స్వరూపుఁడవగు నిన్ను ధరించుచున్న భక్తుఁడ నగు నాకొఱకు-ఆమండలమును తెఱచి. నీసందర్శనమునొసఁగుము.

అందు జయతీర్థ భిక్షు విరచిత భాష్య వివరణ సంగ్రహము :—
అధికార యుక్తుఁడగు శిష్యునికొఱకు-ఇట్లు పరమాత్మ స్వరూపమును నిరూపించి-పరమాత్మ సాక్షాత్కారము-మోక్షసాధనమని పూర్వగ్రంథమునందు తెలుపఁబడినది. ఆ యీశ్వర సాక్షాత్కారము కూడ శ్రవణాది మాత్రమున కలుగునది కాదు. మోక్షముకూడ-సాక్షాత్కార మంత్రమున కలుగునదికాదు. ఈశ్వర సాక్షాత్కారమును-తదుపరి మోక్షమునుగూడ భగవత్ప్రసాదము వలననే కలుగును. కావున శ్రవణాదికము నొనర్చిన వ్యక్తికూడ-సాక్షాత్కారముకొఱకును, సాక్షాత్కా-

రము నొందిన వ్యక్తి కూడ - మోక్షము కొఱకును - భగవంతునెట్లు ప్రార్థింప వలయునో తత్ ప్రకారము ప్రదర్శించుటకు "హిరణ్మయేన పాత్రేణ" ఇత్యాది మంత్రములు ప్రదర్శింపఁబడుచున్నవి. బంగారు కలశమువలె ప్రకాశించుచున్న సూర్యమండలము చేత - ఆమండలమునందున్న, సత్యస్య = విష్ణువుయొక్క, ముఖమ్ = సమస్త శరీరమును, ఆచ్ఛాదింపఁబడియున్నది......

"ఇచ్చట - పూర్ణత్వమువలన పరమాత్మయే "పూషన్" అని చెప్పఁబడెను, గాని సూర్యుఁడు చెప్పఁబడులేదు" అని గ్రహింపవలయును.

వ్యాఖ్యప్రాయము :—

ఆయా మతములు - ఏతన్మంత్రమునందలి - పదముల నిట్లు వ్యాఖ్యానించు చున్నవి.

అద్వైతము, హిరణ్మయ పాత్రము = సూర్యమండలము :—

సత్యమగు పురుషుఁడు = సూర్యమండల స్థితుఁడును, కల్యాణ విగ్రహుఁడును, (పరమాత్మయొక్క లీలా విగ్రహమును) అగు అపర (కార్య) బ్రహ్మము
(కొందఱి మతమున - హిరణ్యగర్భుఁడు)

ముఖము = ద్వారము.
పూష = సూర్యుఁడు.

విశిష్టాద్వైతము :— (వేదాంత దేశిక - కూరనారాయణముని - మతమునందు)

హిరణ్మయ పాత్రము = రాగ హేతువగుటచేత హిరణ్మయమునకు (బంగారమువలె) సదృశమగునదియు, పరమాత్మయందు లగ్నమగు మనోవృత్తిని నిరోధించునదియు, కర్మకు వశపడినదియు, అగు భోగ్య విషయవర్గము.
సత్యపురుషుఁడు = శుద్ధజీవుఁడు.
ముఖము = ముఖమువంటి జీవునిమనస్సు.
పూష = ఆదిత్యాంతర్యామియగు పరమాత్మ - ఆశ్రిత పోషణ స్వభావుఁడు.

(అందు శ్రీ రంగాచార్య మతమునందు) :—
హిరణ్మయపాత్రము = ప్రాణులచేత కోరఁదగిన - జడ - జీవ - వర్గము.
సత్య పురుషుఁడు = పరమాత్మ.
ముఖము = జ్ఞానమార్గ లక్షణమగు భగవత్ ప్రాప్తి ద్వారము.
పూష = ఆదిత్యుఁడు శరీరముగాఁగలిగి ఆదిత్యమండలమునందుండు భగవంతుఁడు.

ద్వైతము :—

హిరణ్మయపాత్రము = సువర్ణమువలె ప్రకాశించునదియు, భూమియందున్న రసములనుపానముచేయుటచేత పాత్రమని చెప్పఁబడునదియునగు సూర్య మండలము. సత్యపురుషుఁడు = షడ్గుణపూర్ణుఁడగు పరమాత్మ, ముఖము = పరమాత్మ యొక్క శరీరము, పూష = పూర్ణుఁడగు పరమాత్మ.

స్వాభిప్రాయమున తత్త్వ విమర్శ :—

అవ్యక్తములగు పృథివ్యాది పంచభూతములయొక్క సారాంశము పరమార్థ సత్యము కాకున్నను, కొన్ని కారణముల వలన సత్యమని బృహదారణ్యకమునందు చెప్పఁబడినది. మఱియు నందిట్లు చెప్పఁబడినది. "ఈ యాదిత్యమండలమునందు అవ్యక్త భూత సారాంశమగుటచేత-సత్యమగు సూర్యభగవానుఁడును, ఈ దేహమునందున్న దక్షిణ నేత్రమునందుఁగల విజ్ఞాన స్వరూపుఁడగు జీవుఁడును-ఒకరియందొకఁడుంచఁబడి యున్నారు. అది యెట్లనఁగా: ఆ సూర్యుఁడు కిరణములచేత-ఆధ్యాత్మరూపమగు నేత్రమునందును, ఈ జీవుఁడు ప్రాణములచేత అధిదైవ స్వరూపమగు సూర్యుని యందును, ఉంచఁబడి యున్నారు. ఇట్లు తెలిసికొని నిరంతరమును గూడ నుపాసించు జీవుఁడు-ఎప్పుడీ శరీరమును విడువఁగోరునో-అప్పుడు ఈ చాక్షుష పురుష స్వరూపుఁడగు ఆ సూర్యుఁడు-తనకిరణముల నుపసంహరించుకొని-కేవల తటస్థమగు రూపముతో నుండును. అప్పుడీ విజ్ఞానమయ జీవుఁడు-ఈ మండలమును చంద్రమండలమునువలె సులభముగా చూడఁగలుగును. ఇట్లు-ఆదిత్యపురుష - అక్షిపురుషుల నొకటిగాఁదెలిసికొని యుపాసించు మనుష్యుని సూర్యకిరణములు బాధింపఁజాలవు"

* * * *

[బృహ-సప్తమాధ్యాయ పంచమబ్రాహ్మణము. ౧ ]

మీఁదివాక్యములవలన-ఆదిత్యమండలాంతర్గతుఁడగు పురుషుఁడును, అక్షియందున్న పురుషుఁడును-సత్యమును-ఏకమును అగు ఆత్మయొక్క సంస్థాన విశేషములగు అంశములై యున్నారు.

కావున-ఉపాసకుని కుడికంటి యందున్న విజ్ఞానమయ పురుషుఁడును-ఆదిత్యమండలము నందున్న పురుషుఁడును ఒక్కఁడే యగుచున్నారు. ఈ రూపము-సాకారమై యున్నను-సూక్ష్మమును-శ్రేష్ఠమును, నిర్మలమును, తేజోమయమును, ప్రాప్యమును-అగుచుండును.

శుక్ల యజుర్వేదీయమగు బృహదారణ్యకోపనిషత్తునందున్న విద్యల (ఉపాసనల) యందు "అక్షి పురుషవిద్య" అను నుపాసన యందీ యంశమును పాఠకులు పరిశీలించునది. ఈ మంత్రముచేత ఆదిత్యమండలమునందు పరమాత్మయొక్క లీలావిగ్రహ రూపుఁడగు ఆదిత్యపురుషునియొక్క, (సూర్యదేవునియొక్క, లేక హిరణ్యగర్భునియొక్క), దివ్య సందర్శనము కోరఁబడు చున్నదని అద్వైత పరములగు కొన్ని వ్యాఖ్యలు చెప్పుచున్నవి. ఈ సూర్యమండలముకూడ-సత్యలోకమగు బ్రహ్మలోకమునకు ద్వారమై యున్నది. కావున కొన్ని యద్వైతవ్యాఖ్యలు-బ్రహ్మలోకమునకు ద్వారము యాచింపఁబడుచున్నదని చెప్పుటకూడ-సమీచీనమే యగుచున్నది. "ఉపాసకుఁడు అర్చిరాది లోకములనుండి-సూర్య లోకమున కరిగి అచ్చటినుండి సత్యలోకమని చెప్పఁబడునది యగు బ్రహ్మలోకమును పొందును" అని శ్రుతులయందు సిద్ధాంతీకరింపఁబడినదిగదా!

విశిష్టాద్వైత భాష్యములు :— సూక్ష్మ - చిదచిత్తులు శరీరముగాఁగలదియు, సవితృ మండల మధ్యవర్తియు, పరమాత్మయు అగు నారాయణునియొక్క దివ్యకల్యాణ విగ్రహముయొక్క సందర్శనమే-ఇచట కోరఁబడు చున్నదని చెప్పుచున్నవి.

ఈ విగ్రహము - అప్రాకృతమును - దివ్యమును-అకారయుక్తమును - అగుచున్నది. అద్వైత భాష్యములయందు ప్రతిపాదింపఁబడిన ఆదిత్యమండలస్థిత-పురుషరూపముకూడ-కల్యాణతమమును, అప్రాకృతమును, దివ్యమును-అగుచు సాకారమే యగుచున్నది.

ద్వైతమునందుఁగూడ - సూర్య మండలము నందున్న శ్రీ విష్ణుని దివ్యమంగళ విగ్రహ సందర్శనముకొఱకు శ్రీ విష్ణువే ప్రార్థింపఁబడుచున్నట్లు చెప్పఁబడినది.

ఇట్లు-ఈ మంత్రముచేత-సందర్శింపఁగోరఁబడిన పురుష స్వరూపము - సగుణము -సాకారము-సూర్యమండల స్థితము-అగు

చుండుటవలన-తత్సందర్శనమును గోరునట్టియగు [illegible]ములకు గూడ నిచట ఏకత్వము-సిద్ధించినది.

అయినను-అద్వైత సరణియందు, కర్మ-ఉపాసనా-సముచ్చయ-కర్త చేత-అంతకాలమునందు ప్రార్థింపఁబడిన-సగుణ[illegible] సాకారమును-అగు-ఈ పురుషస్వరూపము (ఈ మంత్రమునందు సత్యమని చెప్పఁబడినను,) పారమార్థికమగు సత్య బ్రహ్మ స్వరూపము కాదు. ఉపాసకుఁడీ మంత్రముచేత సాకారమగు సగుణ బ్రహ్మస్వరూపమునే సందర్శింపఁగోరుచున్నాఁడనునది-అద్వైతాభిప్రాయమై యున్నది. ద్వైత-విశిష్టాద్వైతములయందు-ఈ పురుష స్వరూపమే-పారమార్థికమగు సత్య స్వరూపమగుచున్నది.

ఈ మతద్వయమునకు సందర్శింపఁదగిన స్వరూపము-శ్రీ విష్ణుని కళ్యాణ విగ్రహమే యగుటవలన-ఆదర్శనములు-ఇట్లు చెప్పుట సమంజసమే యగును. అద్వైతమునకు ముఖ్యగమ్యమగు స్వరూపము-సాకారమును,దృశ్యమును, అగుదేవతాస్వరూపముకాదు. అది-సజాతీయ, విజాతీయ, స్వగత, భేదరహితమగు సచ్చిదానంద భూమ (నిర్గుణ-బ్రహ్మ) స్వరూపమై యున్నది. అది-స్వాత్మయే యగును, ఉపాసకుల కీయంశము-అనుభవముచేత నెఱుఁగఁబడదు. కావుననే ఉపాసకులకు-లోకాంతరగమనమును, సాకార పురుషుని-సాలోక్య-సామీప్య-సారూప్య-సాయుజ్య-సంపదయు, లభించును. బ్రహ్మాత్మైకత్వజ్ఞానైక నిష్ఠులకు లోకాంతర గమనము సంభవించునది కాదు, ఆవశ్యకమును కాదు. అతఁడు బ్రహ్మమాత్రమే యగుచుండునని తెలియునది.

మూ॥ పూషన్నేకర్షే, యమ, సూర్య, ప్రాజాపత్య,

వ్యూహ రశ్మీన్ సమూహ తేజో యత్తే,

రూపంకల్యాణ తమం తత్తే పశ్యామి

యోఽసావసౌపురుషస్సోఽహ మస్మి॥ ౧౬

శా॥ ఓ యేకర్షి! ప్రజాపతి ప్రియసుతా! ఓసూర్యా! ఓయీ యమా!
ఓయీపూష! స్వరశ్ములన్ దిగిచి-నీజ్యోతిన్ సమూహింపు, నీ
నాయానంబినుమంతలే, కపుడు కల్యాణాధిక శ్రేయమౌ
నీయా రూపముఁగాంతు, "ఆ పురుషుఁడే నేనౌచు నున్నా"
నహో!

పద :— పూషన్-ఏకర్షే-యమ-సూర్య-ప్రాజాపత్య-వ్యూహ-రశ్మీన్-సమూహ-తేజః - యత్-తే-రూపమ్ - కల్యాణతమమ్-తత్-తే-పశ్యామి-యః-అసౌ-పురుషః-సః-అహమ్-అస్మి.

ప్రతి :— పూషన్=ఓ జగత్పోషకా! ఏకర్షే=ఒక్కడవై సంచరించు వాఁడవగు రవీ, యమ=సర్వమును శిక్షించు వాఁడవగు అర్యమా, సూర్య=సూర్యుఁడా, ప్రాజాపత్య=ప్రజాపతి పుత్రా, రశ్మీన్=కిరణములను, వ్యూహ=తొలఁగింపుము. తేజః=కాంతిని, సమూహ=ఉపసంహరింపుము, తే=నీయొక్క, యత్=ఏ, రూపమ్=రూపము, కల్యాణతమమ్=మిక్కిలి శుభమైనదో, తత్=ఆరూపమును, తే=నీయొక్క [ప్రసాదమువలన] పశ్యామి=చూచెదను, అసౌ=నీమండలమునందున్న యీ పురుషుఁడు, యః=ఎవఁడో, సః+అసౌ+పురుషః=ఆయీపురుషుఁడు అహమ్=నేను, అస్మి=అగుచున్నాను.

శాంకరభాష్యము :— జగత్తును పోషించుటవలన పూషవు, తిరుగుటవలన ఏకర్షివి, సర్వమును నియమించుట వలన యముఁడవు, కిరణములను-ప్రాణములను-జలములను-స్వీకరించుట వలన సూర్యుఁడవు, ప్రజాపతియొక్క సంతతియగుటవలన ప్రాజాపత్యుఁడవు అగుచున్న సూర్య భగవానుఁడా! నీ కిరణములను తొలఁగింపుము. తపింపఁజేయునది యగు నీతేజస్సు నుపసంహరించి-ఒక్కటిగాఁజేయుము.

నీ యనుగ్రహము వలన-అత్యంత శోభనమగు నీరూపమును చూచెదను. భూః, భువః, సువః, అను వ్యాహృతులచేత చెప్ప బడుచున్న పాదములు, బాహువులు, శిరస్సు, అను అవయవ

ములు గలిగి పురుషాకారమును గలిగి యుండుటవలనఁగాని ప్రాణ, బుద్ధి, స్వరూపముచేత జగత్తు నందంతటను పూర్ణుఁడై యుండుట వలనఁగాని, శరీరమను పురమునందు శయనించుటవలనఁగాని, పురుషుఁడని చెప్పఁబడుచు "ఈ యాదిత్య మండలమునందున్న ఏయీ పురుషుఁడున్నాడో, ఆపురుషుఁడు నేనగుచున్నాను." కావున నిన్ను నేనుభృత్యునివలె యాచించువాఁడనుగాను" అని మంత్రము నందు ప్రార్థింపఁబడియెను.

[ఇందు చెప్పఁబడిన పురుషుఁడు-సాకారమును, సగుణమును, అగు కార్యబ్రహ్మమే యగుచున్నాఁడు. ఉపాసకులు సందర్శింపఁదగినది-సాకారమగు దివ్యమంగళ విగ్రహమే యగును గదా!]

ఈశావాస్య దీపిక :—

“ప్రసిద్ధమును-స్వయంజ్యోతి స్వభావమును-కల్యాణతమమును అగుచు-ఆదిత్యమండలమునందు పరోక్షముగానున్న పురుషుఁడే ‘నేను’ అను జ్ఞానమునకు-ఆలంబనముగా గలవాఁడనై యున్నాను” అని అర్థము.

ఈశావాస్య రహస్య వివృతి :—

“స యశ్చాయం పురుషే, యశ్చాసావాదిత్యే, స ఏకః”

“ఈ జీవునియందున్న పురుషుఁడును-ఆదిత్యునియందున్న పురుషుఁడును ఒక్కఁడే”

అనంతాచార్య భాష్యము :—

ఏకర్షే = ముఖ్యజ్ఞానమా! ఋషే! = పండితులచేత తెలియఁదగినవాఁడా! “ప్రాజాపత్య” అనఁగా హిరణ్యగర్భుఁడు-అతనికి వేదము నుపదేశించుటచేత ప్రియమైన వాఁడా!

“సూర్యమండలాది ప్రతీకముల యందున్న పురుషుఁడవగు నీవును, నా హృదయము నందున్న పురుషుఁడును-ఒక్కఁడే యగుచున్నాడు. కావున జ్యోతి రూపుఁడవగు నిన్ను సందర్శింప గోరుచున్నాను” అని భావము.

విశిష్టాద్వైతభాష్యమున - కూర నారాయణముని వ్యాఖ్య :— ఈ మంత్రముకూడ-తిరుగ అదృష్టిచేతనే చూడఁదగిన బ్రహ్మ స్వరూపమునే విశేషించుచు-తద్దర్శనమును, తత్సాధనమును, ప్రార్థించుచున్నది.

ఆశ్రితులను పోషించువాఁడవును, అద్వితీయుఁడవును, అతీంద్రియములగు అర్థములను జూచువాఁడవును, సర్వాంతర్యామి

వియు, సూర్యుఁడవును, అనఁగా, స్వభక్తులబుద్ధులను లెస్సగా ప్రేరణచేయువాఁడవును, ప్రజలకు పతివియు, లేక ప్రజాపతియగు చతుర్ముఖునియొక్క సుతులగు ప్రాజాపత్యుల కంతర్యామివియు, అగు పరమాత్మా! భవదీయ దివ్యరూప దర్శనమున కుపయోగింపని ఉగ్రములగు నీకిరణములను తొలగింపుము. దర్శనౌపయికమును, ప్రభాత్మకమును, సౌమ్యమును, అగు తేజమ్మును సమూహీకరింపుము. (ఒక్కచోఁజేర్పుము) "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" ఇత్యాది శ్రుతులయందు ప్రసిద్ధమగుచు సౌందర్యాది గుణాతిశయము చేత ప్రియతమమును, కల్యాణతమమును, అనఁగా శుభాశ్రయభూతమును, అగు నీదివ్య రూపమును-అర్జునాదులవలె నేను చూడ వలసియున్నది.

ఈశ్రుతియందు, "సోఽహమస్మి" అనుచోట-అహం గ్రహముచేత-అంతర్యామియే (పరమాత్మయే) అనుసంధింపఁబడు చున్నాఁడు.అసౌ-"అసౌ-వీఁడు-వీఁడు"-అని రెండుమారులుచెప్పుట ఆదరార్థమని తెలియవలయును. లేదా, ఈ శబ్దములను వేరుపఱచి-యత్-తత్-అను శబ్దములతో-ఇట్లన్వయింప వలయును. "యః-అసౌ-పురుషః-సోఽసౌ-అహమస్మి"

ఇచ్చట-అహంశబ్దము-జీవద్వారమున తదంతర్యామియగు పరమాత్మనే చెప్పునని తెలియునది. కాఁగా-ఈపురుషుఁడు-ఎవఁడో ఆయీపురుషుఁడు-నాయందు అంతర్యామియగు పరమాత్మయై యున్నాఁడు. అనునర్థమును గ్రహించునది.

శ్రీరంగాచార్య భాష్యము నందీయంశము మిక్కిలి విపులీకరింపఁబడి యున్నది. విశేషములును గలవు. జిజ్ఞాసువులు దానిని పరిశీలించునది. గ్రంథవిస్తర భీతిచేత నందలి విశేషము లిచట చేర్పఁబడుట లేదని విన్నవించుచున్నాను. కాని అందున్న వానిలో ఒక్కవిశేషమును మాత్రము సంగ్రహముగాఁబ్రదర్శింతును.

"య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే" (బృహ 1-6-6), ఇత్యాది శ్రుతులయందు చెప్పఁబడిన స్వరూ

పముగల-ఆదిత్య మండలాంతర్వర్తియగు ఏ పురుషుఁడుకలఁడో వాఁడే నేను-అగుచున్నాను: "తదాత్మకుఁడను" అనఁగా, "అతఁడే ఆత్మగాఁగలవాఁడను" అగుచున్నాను. అనునర్థము నెఱుఁగు నది-పరమాత్మకు శరీరమగు జీవుఁడు పరమాత్మకంటె వేరయి నను, తదాత్మకుఁడగుట "విరుద్ధము కానేరదు".

ద్వైతభాష్యము :—

(16) పూర్ణుఁడవును, ప్రధాన జ్ఞానముగలవాఁడవగుటచేత "ఏకర్షి" అనిచెప్పఁబడిన వాఁడవును, లేక "ఏకర్షి" అనునామము గల మునియందు అంతర్యామివై యున్నవాఁడవును, సూర్యాంతర్గతుఁడవై, సూర్యశబ్దవాచ్యుఁడవైనవాఁడవును, బ్రహ్మదేవుని చేతనుగూడ పొందఁదగిన వాఁడవగుటచేత ప్రాజాపత్యనామమ్మును ధరించిన వాఁడవును, అగు పరమాత్మా! నీవు మాయొక్క స్వరూప జ్ఞానమును విస్తరింపఁజేయుము. తేజస్సును-అనఁగా బాహ్య జ్ఞానమును-విస్తరింపఁజేయుము. అత్యంతమంగళకరమగు ఏరూపము నీకు కలదో-ఆరూపమును నీయనుగ్రహముచేత నేను చూచెదను.

(17) యః-అసౌ=ప్రసిద్ధుఁడగు ఏ పరమాత్మ-అసౌ=ప్రాణమునందుఉన్న. పురుషః-పరమాత్మయోనః=ఆపరమాత్మయే హేయుఁడుకానందున అహం శబ్ద వాచ్యుఁడును, సదా ఉండు వాఁడును, జ్ఞాన విషయుఁడును, అగుటచేత అస్మిశబ్దవాచ్యుఁడును. అగుచు-ఉపాసకుల యందున్నాఁడు.

ప్రసిద్ధుఁడగు ఏ పరమాత్మ - ప్రాణమునందున్నాఁడో: ఏ పరమాత్మ-అహమస్మి శబ్దవాచ్యుఁడై ఉపాసకుల యందున్నాఁడో: ఏపరమాత్మ-పూషాది శబ్దవాచ్యుఁడై పూషాదులయందున్నాఁడో, ఆపరమాత్మ-అధిష్ఠానభేద ప్రయుక్తమగు భేదముగలవాఁడు గాక-ఒక్కఁడే యగుచున్నాఁడు. (ప్రాణాది ప్రతీకముల యందును, నాయందును, అంతర్యామియగు "పరమాత్మ-ఒక్కఁడే" అని తాత్పర్యము.)

స్వాభిప్రాయము :—

ఉపాసక జీవునియందున్న విజ్ఞానమయ పురుషుఁడును-సూర్యమండలమునందున్న జ్యోతిర్మయ పురుషుఁడును-ఒక్కఁడే యగుచున్నాఁడు. కావున, "నీవే నేనగుచున్నాను" అని చెప్పఁబడినది. ఈ విజ్ఞానమయుఁడును, జ్యోతిర్మయుఁడును, అగు పురుషుఁడు-పరమాత్మయగు నిర్గుణ బ్రహ్మము కాఁడనియు, సగుణ బ్రహ్మమనియు, గ్రహించునది. ఉపాసకులు-సగుణ బ్రహ్మమగు దేవతయొక్క సాలోక్యమును (దేవతయున్న లోకమునందుండుటను) సామీప్యమును (దేవతయొక్క సన్నిధియందుండుటను) సారూప్యమును (దేవతతో సమానమగు రూపమును గలిగి యుండుటను) పొందుదురు. ఆత్మ జ్ఞానులగు బ్రహ్మనిష్ఠురే-నిర్గుణ బ్రహ్మ స్వరూపులై యుందురు. అద్వైతము-సాలోక్య-సామీప్య, సారూప్య, సాయుజ్య రూపములగు మోక్షములను వ్యావహారిక సత్యములుగా నంగీకరించును బ్రహ్మ స్వరూపస్థితిని-పారమార్థిక సత్యమగు మోక్షముగా నిరూపించును. బ్రహ్మ-విష్ణు-శివాది రూపములు పరమాత్మయగు నిర్గుణబ్రహ్మము యొక్క-దివ్యములగు సగుణ బ్రహ్మ స్వరూపము లగుచున్నవి. కావున ఆయా దేవతలయొక్క సాలోక్య-సామీప్య-సారూప్య-సాయుజ్యము లగు ముక్తులు - క్రమముగా పరమాత్మయగు నిర్గుణ బ్రహ్మ స్వరూపస్థితిని సంఘటించుటవలన, క్రమముక్తి హేతువులగునవి-ఉపాసకులకు-ఉపాస్యములే యగునని తెలియునది.

మూ॥ వాయు రనిలమమృత మథేదం భస్మాన్తగ్ం శరీరమ్
ఓం క్రతోస్మర, కృతగ్ంస్మర, క్రతోస్మర, కృతగ్ంస్మర॥౧౭॥

గీ॥ ప్రాణ మమృతానిలప్రాప్తిఁబడయుఁగాత!
మేనుహుతమయి భస్మాంత మౌనుగాత!
ఓం క్రతూ! నన్ను స్మరియించు చుండుమయ్య!
యేనొనర్చిన కృతివిస్మరింపుమయ్య!

పదవిభాగము :— వాయుః-అనిలమ్-అమృతమ్-అథ-ఇదమ్ - భస్మాన్తమ్ - శరీరమ్-ఓమ్-క్రతోస్మర-కృతమ్-స్మర-క్రతో-స్మర-కృతమ్-స్మర.

ప్రతి :— వాయుః = ప్రాణవాయువు, అమృతమ్= మరణ రహితుఁడగు, అనిలమ్ = సర్వాత్మకుఁడగు వాయువును (సూత్రాత్మను) పొందుఁగాక। అథ=పిమ్మట, ఇదమ్=ఈ శరీరమ్=స్థూలశరీరము, భస్మాన్తమ్=భస్మమే అంతముగాఁగలది. (బూడిదెగా చేయఁబడినది) అగుఁగాక। ఓమ్=ఓంకారవాచ్యుఁడవగు అగ్నీ, క్రతో=సంకల్పాత్మకా। స్మర=నన్ను స్మరింపుము, కృతమ్=నేనొనర్చిన ఉపాసనాదికమును, స్మర = స్మరింపుము (మఱియు, క్రతోస్మర, కృతంస్మర, సంకల్పాత్మకా....స్మరింపుము.

తాత్పర్యము :— శరీరమునందున్న ప్రాణము సర్వాత్మకమగు ప్రాణమునొందునుగాక। ఈ శరీరము-బూడిదయగుఁగాక। సంకల్పాత్ముఁడవగు అగ్నిదేవా। నన్నును, నేనొనర్చిన-ఉపాసనాదికమును మఱవకుము.

శాంకరభాష్యము :—

ఇప్పుడు మరణించుచున్న (శరీరమును విడుచుచున్న) నాయొక్క ప్రాణము ఆధ్యాత్మ విభాగమును విడిచి-అధిదైవతాత్మయు, సర్వాత్మకుఁడును, అమృతుఁడును, అగు సూత్రాత్మను పొందునుగాక అనిభావము. మీఁది మంత్రమున లేకున్నను, "ఈ లింగశరీరము-జ్ఞాన-కర్మలచేత సంస్కరింపఁబడినదై ఈ స్థూల శరీరమునుండి ఉత్క్రమించును (మీదికి వెళ్లును) గాక।" అను నభిప్రాయముకూడ మార్గయాచన సామర్థ్యమువలన లభించునని గ్రహించునది. తరువాత "ఈ శరీరము-అగ్నియందు హుతమై భస్మమే అంతముగాఁగలది యగుఁగాక।" అని యర్థము. ఉపాసన ననుసరించి "ఓం ప్రతీకాత్మకుఁడగుటవలన-సర్వాత్మకుఁడగు అగ్ని-బ్రహ్మముకంటె అభిన్నుఁడు" అను నభిప్రాయమున-ఓంకారముచేత చెప్పఁబడు చున్నాఁడు.

"ఓ సంకల్పాత్మకుఁడగు అగ్నీ! నావిషయమును స్మరింపఁదగిన కాలము వచ్చినది. కావున నేనింతవఱకును చేసిన యుపాసనమును స్మరింపుము. నేను బాల్యమునుండియు చేసిన కర్మను గూడ స్మరింపుము" అని చెప్పఁబడినది-ఇందు రెండవమారు చెప్పినది ఆదరము కొఱకు.

ఉవటాచార్య కృతభాష్యము :—

ఇట్లు బ్రహ్మోపాసనము నొనర్చిన యోగికి-శరీర పాతోత్తర కాలమునందేమగునో దాని నీమంత్రము చెప్పుచున్నది. వాయువనగా నిచట-ఏకాదశేంద్రియములు-పంచభూతములు-జీవాత్మ [11+5+1=17] అను సప్త దశలింగమగు సూక్ష్మ శరీరమని గ్రహించునది.

ఈశావాస్య దీపిక :—

హిరణ్మయేన-అను మంత్రమునుండి-తుది వఱకునుగల మంత్రములను-కర్మోపాసనా సముచ్చయ కర్తయగు పురుషుఁడు నిత్యమును పఠించుచు-ధ్యానింపవలయును.

ఓమ్ = ఓంకారముచేత తెలుపఁదగిన-ఈశ్వరునికంటె-అభిన్నుఁడవగునో ఆదిత్యుఁడా!

ఈశావాస్య రహస్య వివృతి :—

ఈ మంత్రము-బ్రహ్మవేత్తకు సంబంధించినదికాదు. బ్రహ్మవిదుని ప్రాణములుత్క్రమించునవి కావు. అతఁడు దేవతాంతరములను ప్రార్థింపవలసినది లేదు. కావున లోకాంతర గమన యోగ్యుఁడగు యోగియే అంత్యకాలమునందిట్లు దేవతా ప్రార్థనము నొనర్చునని తెలియునది.

"యం యం వాఽపి స్మరన్" అను గీతాశ్లోకముయొక్క అర్థమునిచట భావించునది.

అనంతాచార్య కృతము :—

పదునేడు లింగములుగల ప్రాణము-అధ్యాత్మ పరిచ్ఛేదమును విడిచి అధిదైవత రూపుఁడును, సర్వాత్ముఁడును, సూత్రాత్మయు, అగు ముఖ్యప్రాణము పొందునుగాక! విజ్ఞాన-"వాయుర్వైగౌతమః" అను బృహదారణ్యక శ్రుతిని పరిశీలించునది.

ఆనందభట్టోపాధ్యాయ కృతము :—

సప్త దశావయవమగు ప్రాణము - అమృతమును, అధి దైవతమును, వ్య ప్రకృతియు, హిరణ్యగర్భాఖ్యమును, అగు (సమష్టి) ప్రాణము నొందుఁగాక!

ఈ మంత్రమునందు యోగికి-ఉద్భూతమును-సర్వవేదసారమును, సర్వవేదమయమును, అగు అక్షరము-చెప్పఁబడుచున్నది. (అవతి, అగ్నే ఇత్యా-ఓమ్) రక్షించునది, కావున "ఓమ్" అని చెప్పఁబడును, లేక పొందునది, కావున ఓమ్ అని చెప్పఁబడును. ఈ ప్రణవాక్షరమునకు బ్రహ్మ-ఋషి.

ఛందస్సు-గాయత్రిము.
పరమాత్మ-దేవత.
శక్తి బ్రహ్మరంధ్రమునందు-వినియోగము.

యాగహోమాదులయందును, శాంతి పౌష్టిక కర్మలయందును, తదితర కామ్యనైమిత్తికాది సర్వకర్మలయందును గూడ-ఓంకారమునకు వినియోగమున్నది.

పరబ్రహ్మమునకు
"ఓమ్"
అని పేరున్నది.

'ఓం తత్ బ్రహ్మ' అనిగదా! శ్రుతి నిర్దేశము. అపర (కార్య) బ్రహ్మమునకుఁగూడ-ఓంకారమే-వాచకము. తనయందున్న అకార - ఉకార-మకార-అర్ధమాత్రలచేత (క్రమముగా) బ్రహ్మ-విష్ణు-శివ-పరబ్రహ్మములను బోధించునది యగు నీ ఓంకారమే-అంతకాలమునందు-ఉత్తారకమని తెలియునది.

అద్వైతానందలహరి :—

ప్రాణమనఁగా లింగశరీరము-లేక సూక్ష్మశరీరమను వర్థమును గ్రహించునది. క్రతో := సంకల్పాత్మకమగు మనస్సా! ఓమ్ = ఓంకారవాచ్యుఁడగు పరమేశ్వరుని, స్మర = స్మరింపుము. ప్రమాదము నొందకుము.

"యాన్తే మతిస్సాగతిః" అంతకాలమునందు-ఏబుద్ధి కలుగునో, అదియేగతి కలుగును. కావున "ఓమనస్సా! నీవుకావించిన ఉపాసనమును, సుకృతమును స్మరింపుము" అని భావము.

విశిష్టాద్వైతభాష్యము :— (వేదాంత దేశిక విరచితము)

తరువాత నీమంత్రమునందు పరిశుద్ధాత్మస్వరూపము మాత్రమే చెప్పఁబడుచున్నది.

పరిశుద్ధాత్మ-విద్యాకర్మల ననుసరించి - బహు దేశములకు వెళ్ళుచుండుటవలన వాయువును. విలయనము లేకుండుట వలనను. ఎక్కడనుగూడ వ్యవస్థితత్వము లేకుండుట వలననుగూడ-అనిలమును, దేహసంతాపము మృతినొందుచున్నను, స్వయముగా మృతి లేనివాడగుటవలన అమృతమును. ఛాందోగ్యమునందు ప్రజాపతి చెప్పిన విధమున పాపములేనివాఁడును, జరలేనివాఁడును, విమృత్యుఁడును, విశోకుఁడును, విజిఘత్సుఁడును, అపిపాసుఁడును, సత్యకాముఁడును, సత్యసంకల్పుఁడును అగుచున్నాఁడు.

శ్రుతి-ఇట్లు-ఆత్మకుఁగల అమృతత్వమును దెలిపి-క్షేత్రజ్ఞుఁ

డగు వీనియొక్క శరీరము అవశ్యమును మరణించునని చెప్పు చున్నది.

అథ=తరువాత, వీనికంటె భిన్నమగు శరీరము భస్మమే అంతముగాఁగలది-లేక, అథ=అత్మ-ఉత్క్రమించిన పిమ్మట-శరీరము-భస్మాంతమగుచున్నది.

అనఁగా :— దహింపఁబడుచున్నది, లేక ఖననాదికము చేయఁబడుచున్నది. అను నర్థమును గ్రహించునది.....

ఇట్లు-చిత్తును (పరిశుద్ధ జీవుని) అచిత్తును (జడమగు శరీరమును) దెలిపి-ప్రేరణ చేయువాఁడగు నీశ్వరుని ప్రణవముచేత "ఓమ్" అని ధ్యానించుచున్నది. [ఈమంత్రముచేత-ఉపాసకుఁడు పరమాత్మను ధ్యానింప వలయును.]

తరువాత నీమంత్రము-జ్ఞానయజ్ఞ గోచరుఁడును, క్రతు రూపియు, అగు భగవంతుని అభిముఖముగాఁజేసికొని ప్రార్థించు చున్నది. "ఓకత్రూ! (జ్యోతిష్టోమాది క్రియాత్మకా!) భక్తి స్వరూపా! అనుగ్రహ సహితమగు బుద్ధిచేత నన్ను స్మరింపుము. నేనొనర్చిన అనుకూల కర్మను స్వల్పముగానైనను అనుసంధించి-నన్ను రక్షింపుము, లేక, ఇంతవఱకును నీవొనర్చిన అనుకూల్యమును స్మరించి-నీవే శేషమును పూరింపుము."

ఇందు-ప్రత్యగాత్మ "వాయుః" అని పుంలింగముచేత నువ క్రమింపఁబడినది. కావున అనిలమ్, అమృతమ్, అను పదద్వయమును గూడ పుంలింగముగల దానిని గానే మార్పు నొందింప వలయును.

కూరనారాయణమునివ్యాఖ్య :—

శరీరమును-శుద్ధాత్మను-వేరుపఱచి - వివిక్తుఁడగు ఆత్మను (పరిశుద్ధ జీవుని) అకారవాచ్యుఁడగు పరమ పురుషుని యందు "ఓమ్" అని సమర్పించుచున్నాడు. [విశిష్టాద్వైత పరమగు శ్రీ రంగాచార్యభాష్యమును గూడ వివేకులు పరిశీలింపఁగోరెదను. అందును విశిష్టములగు అనేకాంశములు కలవు.]

ద్వైతభాష్యము :—

వాయురనిల మమృత మథేదం భస్మాన్తగ్ం శరీరమ్ ॥౧౭॥

ఈ శరీరము-విభూతియే అవసానముగాఁగలది. అయినను తదంతర్గతుఁడగు పరమాత్మకు మరణాది దోషములేదు.

ఎలయనిన :— పరబ్రహ్మమే ఆశ్రయముగాఁగల వాయు దేవుఁడుకూడ-అమృతుఁడై యుండునపుడు-శ్రీ పరమాత్మ అమృతుఁడని వేరుగా చెప్పనవసరము లేదుగదా!

ఓం క్రతోస్మర కృతగ్ం స్మర ॥౧౮॥.

ఓమ్=తత్త్వాది గుణపూర్ణుఁడవగుటచేత ఓంకార శబ్ద వాచ్యుఁడవును, క్రతో=జ్ఞానరూపుఁడవును అగు పరమాత్మా! స్మర = అనుగ్రహింపుము, కృతమ్=నాచేత నొనర్పఁబడిన ధ్యానాది కర్మను, స్మర=స్మరింపుము, ఆకర్మను స్మరించి-నాయందు అనుగ్రహము నుంచుటకు ఉన్ముఖుఁడవు కమ్ము,

స్వాభిప్రాయము :—

"లింగ శరీరమునకుపలక్షణముగా గ్రహింపఁబడిన ప్రాణము-ఈ మంత్రమునందు వాయుశబ్దముచేత-చెప్పఁబడినది" అని అద్వైతభాష్యములు చెప్పుచున్నవి. వాయు శబ్దమునకు ప్రాణమే ముఖ్యార్థమై యున్నది.

విశిష్టాద్వైతమున - వాయు-అనిల-అమృతశబ్దములకు పరిశుద్ధాత్మ-అర్థముగాఁజెప్పఁబడియెను, ద్వైతమున-వాయు-శబ్దము చేత-వాయుదేవుఁడు చెప్పఁబడుచున్నాఁడు. ఈ మంత్రము-అంత కాలమున స్మరింపవలసినదను నంశము సర్వాభిమతమను నంశమును విజ్ఞులు గ్రహింతురుగాక! త్రిభాష్యములయందును, "వాయురనిలమమృతమ్" అను పదములకు క్రింది తీరున వర్థములు చెప్పఁబడినవి.

అద్వైతము :— ప్రాణము-సూత్రాత్మను పొందునుగాక.

విశిష్ట :— పరిశుద్ధాత్మ వాయువు-అనిలము-అమృతము-అగుచున్నాఁడు.

ద్వైతము :— వాయువుకూడ అమృతుఁడే.

శ్రీ శాంకరభాష్యావతరణిక :—

తిరుగవింకొక మంత్రముచేత (ఉపాసకుఁడు) మార్గమును యాచించుచున్నాఁడు.

మూ॥ అగ్నేనయ సుపథారాయే
అస్మాన్విశ్వానిదేవ వయునాని విద్వాన్
యుయోధ్యస్మజ్జుహురాణ మేనో
భూయిష్ఠాంతే నమఉక్తింవిధేమ ॥౧౮॥

గీ॥ దక్షిణ భోగమ్ముకై సుపథమ్ముచేతఁ
దీసికొని పొమ్ము మమ్మగ్నిదేవ! సర్వ
కర్మవిద్యుఁడవు-కుటిలమౌ కలుష మడఁపు,
మొనఁగుదుము నీకు బహు నమస్సూక్తిఁగొనుము!

పదవిభాగము :— అగ్నే-నయ-సుపథా-రాయే-అస్మాన్-విశ్వాని-దేవ-వయునాని-విద్వాన్-యుయోధి-అస్మత్-జుహురాణమ్ ఏనః-భూయిష్ఠామ్-తే-నమఉక్తిమ్-విధేమ ॥౧౮॥.

ప్రతి :— అగ్నే=ఓయగ్నీ! దేవా=ఓదేవా! (నీవు) విశ్వాని-సమస్తములయిన, వయునాని = మాకర్మలను, లేక ప్రజ్ఞానములను, విద్వాన్=తెలిసికొనిన వాఁడవై, రాయే=ధనము కొఱకు (కర్మఫలోపభోగముకొఱకు), అస్మాన్=మమ్ములను, సుపథా=మంచిమార్గముచేత, నయ=పొందింపుము, అస్మత్= మానుండి, జుహురాణమ్=వంచనరూపమగు, ఏనః=పాపమును, యుయోధి=తొలఁగింపుము, తే=నీకొఱకు, భూయిష్ఠామ్=అధికమయిన, నమఉక్తిమ్=నమస్కార వాక్యమును, విధేమ=చేయుదుము.

తాత్పర్యము :— ఓ యగ్నిదేవా! నీవు సకల కర్మలన్యు జ్ఞానములను, తెలిసిన వాఁడవు. నీవు ఫలోప భోగముకొఱకు మమ్మొలను శోభనమగు మార్గముచేత కొనిపొమ్ము. వంచనాత్మకమగు పాపబుద్ధిని మానుండి తొలఁగింపుము. నీకు పరిచర,

నొనర్పఁజాలము, పరికరా నమస్కారమునుగూడ క్రియాపూర్వక ముగా నొనర్చుటకు శక్తులముకాము. అధికమగు నమోవాక్య మును మాత్రమే సమర్పింతుము.

శాంకరభాష్యము :—

ఓయగ్నీ! ఓదేవా! దక్షిణమార్గమను, ధూమాదిమార్గము-జనన మరణములచేత-రాకపోకలు గలిగియున్నది. ఈ మార్గము చేత సంచరించుచున్న నేను నిర్విణ్ణుఁడనై యున్నాను. కావున నే మొనర్చిన కర్మలను లేక ప్రజ్ఞానములను తెలిసికొని గమనాగమన వర్జితమగు శోభనమార్గముచేత-అనఁగా-ఉత్తరమార్గమను దేవ యాన మార్గముచేత-ధనముకొఱకు-అనఁగా; కర్మఫలము ననుభవించుటకొఱకు, నన్ను గొనిపొమ్ము.

మఱియు, మానుండి వంచనాత్మకమగు పాపమును తొలఁగింపుము. పాపము నశించుటచేత మేము పరిశుద్ధులమై యిష్టము నొందెదము. కాని మే మిప్పుడు నీకు బహుతరమగు పరిచర్య నొనర్చుటకు శక్తులముకాము. నీకు నమస్కారమాత్రము చేతనే పరిచర్య నొనర్చెదము.

ఆనందగిరి టీక :—

శ్రీ శంకరులు ఇట్లు మంత్రములను పదశః వ్యాఖ్యానించి, సంక్షేపముగా విచారణము నారంభించుచున్నారు.

శాంకరభాష్యము :— (ఆనందగిరీయ సమ్మిశ్రితము.)

"అవిద్యయా మృత్యుంతీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే"

"వినాశేన మృత్యుంతీర్త్వా సంభూత్యాఽమృత మశ్నుతే"

అను వాక్యములనువిని కొందఱు మేమొనర్చిన యర్థము నందు సంశయము నొందుచున్నారు. ఆసంశయమును నిరాకరించుటకు సంక్షేపమగు విచారణమును చేయుచున్నాము.

[ఈ విచారము-ప్రశ్నోత్తర రూపమున తెలుపఁబడుచున్నది. ]

ప్రశ్న :— అయ్యా! మీదివాక్యములను వ్యాఖ్యానించుచు మీరు "విద్య" అనఁగా దేవతోపాసనమనియు, "అమృత"మనఁగా ఆపేక్షికమగు మోక్షమనియు, (గౌణములగు) అర్థములను తెలిపి

యున్నారు. "విద్య" అనఁగా "పరమాత్మ విద్య" అనియు, అమృతమనఁగా "ప్రధానమగు మోక్ష"మనియు, ముఖ్యములగు నర్థముల నేల చెప్పఁగూడదో తెలుపుదురా?

ఉ :— పరమాత్మ విద్యకును, కర్మకును, విరోధ ముండుటవలన సముచ్చయము కలుగఁజాలదు. ఉపాసనకును, కర్మకును, విరోధము లేకుండుట వలన-వానికి సముచ్చయము సిద్ధించును. కర్మోపాసనల నాచరించువానికి ముఖ్యమగు అమృతత్వము కలుగదు. కావున నిట్లు చెప్పవలసి వచ్చినది.

ప్రశ్న :— మీరుచెప్పినది బాగుగానేయున్నది. కాని మీరు చెప్పినట్లు బ్రహ్మవిద్యా-కర్మలకు విరోధము మాత్రము-శాస్త్రమువలన తెలియఁబడుటలేదు. కర్మానుష్ఠానమును-బ్రహ్మ విద్యయుఁగూడ-శాస్త్ర ప్రమాణముచేత తెలియఁబడుచున్నట్లు, వానికిఁగల విరోధముగాని, అవిరోధముగాని, శాస్త్రప్రమాణము చేతనే తెలియఁబడవలయును, కాని తర్కమాత్రము చేతనే నిరూపింపఁబడునవి కాఁగూడదు గదా।

అదెట్లనిన :— భూతముల నన్నిటిని హింసింపఁగూడదు. అను శాస్త్రవచనము-"యజ్ఞమునందుమాత్రము పశువునుహింసింప వలయును" అను శాస్త్రవచనముచేత-బాధింపఁబడునట్లు, విద్యావిద్యల సముచ్చయముకూడ-వేరొక శాస్త్రముచేత-బాధింపఁబడ వలయును. అట్లు బాధింపఁబడుటలేదు. కావున బ్రహ్మ విద్యా-కర్మలకు సముచ్చయమే-యుక్తమగును.

భగవత్పాదుల ఉత్తరము :— "దూరమేతే విపరీతే విషూచీ అవిద్యాయాచ విద్యేతి"

"వివిధములగు గతులుగల విద్యావిద్యలు మిక్కిలి విరుద్ధములు" అను కఠశ్రుతియందు విద్యావిద్యలకుగల విరోధము వినఁబడుచున్నది. కావున బ్రహ్మ విద్యా-కర్మల సముచ్చయము-శాస్త్ర ప్రమాణము గలదికాదు.

ప్రశ్న :— "అవిద్యయా" అను నీమంత్రము యొక్క పూర్వార్థము నందే "విద్యాంచావిద్యాంచ యస్తద్వేదోభయం సహ" అని "విద్యావిద్యల సముచ్చయము" చెప్పఁబడుటవలన విచట మాత్రము వానికి విరోధములేదు" అనియేల చెప్పఁగూడదు?

ఉత్త :— కర్మయొక్క-హేతు, స్వరూప, ఫలములను, (బ్రహ్మ) విద్యయొక్క హేతు-స్వరూప, ఫలములను, విరుద్ధములై యున్నవి. కావున వానికి సముచ్చయము-చెప్పఁగూడదు. మఱియు ముఖ్య బ్రహ్మ విద్యకును-అవిద్యకును సహసంభవముండదు. కావునను సముచ్చయ విధి-సిద్ధించునది కానేరదు.

ప్రశ్న :— ఒకే సమయమున విద్యావిద్యలకు సంభవము లేకున్నను, ఒకే యాశ్రయమునందు-ఒకదాని తరువాత నింకొకటి క్రమముగా కలుగఁగూడదా?

ఉత్త :— మొదట - అవిద్యయు, తరువాత విద్యయు, సంభవించునను వెడల నీయంశము నంగీకరింతుము. కాని మొదట విద్యయు, తరువాత అవిద్యయు, సంభవించునవి కానేరవు.

ఏ యాశ్రయమునందు విద్యకలిగిన పిమ్మట అవిద్య నశించునో, ఆయాశ్రయమునందు తిరుగ అవిద్య కలుగదు.

అదెట్లనిన :— (మహానసము మొదలగు) ఏ యాశ్రయమునందు-అగ్ని-వేడిగానున్నదను విజ్ఞానము కలుగునో, ఆ యాశ్రయమునందు - అగ్ని - చల్లగానున్నదను, అవిద్యయొక్క ఉత్పత్తిగాని సంశయముగాని మరల కలుగదు గదా! దీని యందున్న 7వమంత్రమునందు "ఏ విజ్ఞానికి-ఈభూతములన్నియుఁ గూడ తానే ఆగుచుండునో, వానికి-ఆభూతములును, తానును, ఒక్కటియే-అను ఏకత్వ సాక్షాత్కారము-కలుగును. కావున ఆ బ్రహ్మవిదునకు శోకమోహములు కలుగవు" అని విజ్ఞానికి అవిద్యా కార్యములగు శోకమోహాదుల అసంభవము-వినఁబడుచున్నది. కావున బ్రహ్మ విద్యావిష్టునియందు అవిద్య-సంభవించునదికాదు.

ప్రశ్న :— విద్య కలిగిన పిమ్మట తిరుగ అవిద్య-కలుగక పోవిండు. కర్మమాత్రము కలుగవచ్చును. విద్వాంసుఁడు కూడ-విజ్ఞాన గ్రంథ వ్యాఖ్యానము-భిక్షాటనము-మొదలగు కర్మలను గావించుచుండుటను మనము చూచుచున్నాము గదా!

ఉత్త :— అవిద్య-సంభవింపనప్పుడు - తదుపాదానమగు కర్మకూడ-సంభవించునది కాదని చెప్పుదుము. అయినను క్రింది యంశమును శ్రద్ధగావినుము.

నీవు-ఏకర్మకు - జ్ఞానముతోడి సముచ్చయమును చెప్పుచున్నావో, అకర్మ-చోదనా ప్రయుక్తము గదా! (ప్రేరణచేత జరుపఁబడునది) బ్రహ్మాత్మైక్యమును సాక్షాత్తుగా ననుభవించుచున్న మహాపురుషునకు కోరికయుండదు. కావున అట్టి విజ్ఞానికి మాత్రము చోదన (ప్రేరణ) సంభవింపదు.

సమస్త చోదనలును గూడ కామికే సంబంధించియున్నవి.

శ్లో॥ అకామినః క్రియా కాచిద్ దృశ్యతే నేహ కస్యచిత్
యద్యద్ధి కురుతేజన్తు స్తత్తత్కామస్య చేష్టితమ్॥

"అకామియగు నొకానొక పురుషున కీసంసారమునందు చేయఁదగిన కర్మ-ఏదియు కానుపించునదికాదు. ఈ జంతువు-ఏదిచేసినను కామముచేతనే చేయుచున్నాఁడు" అను స్మృతి వచనముకూడ నీయంశమును నిరూపించుచున్నది గదా!

విజ్ఞాన వ్యాఖ్యానము, భిక్షాటనము, మొదలగు ఏకర్మనతఁడొనర్చుచున్నాఁడో, అది-చోదనా ప్రయుక్తము (బ్రహ్మవిష్ణు నుద్దేశించి-విధింపఁబడినది.)

అకర్మకూడ-అవిద్వాంసుని శరీరము నిలుచుటకు హేతువగు-అత్యల్పమగు అవిద్య నాశ్రయించియున్న (పొందిన) కర్మశేషమువలనఁగలుగుచున్నది.

ఆ బ్రహ్మవిదునకు ప్రాణ-శరీరములతోడి సంయోగమందు వర్తమానమగు-అత్యల్పమగు నాకర్మ-ఆభాసరూపముతో నుండును.

భగవద్గీతయందు చెప్పఁబడిన విధమున "నైవకించిత్ కరోమి" "నేనేమియు చేయుటలేదు" అను నమభవ జ్ఞానము వలనను, కర్మభ్రాంతికి కారణమగు-అవిద్య-కలుగకుండుటవలనను, అవిద్వాంసుఁడు-అభిమానాది కర్మనుగూడ తనయందున్న దానినిగా తలంపఁడు.

ప్రశ్న :— అయ్యా! మీరు మంత్రము లందుఁగల అమృతశబ్దమునకు ముఖ్యమగు అమృతత్వము నర్థముగాఁ జెప్పకుండుటకును, విద్యాశబ్దమునకు-పరమాత్మ విద్య నర్థముగాఁజెప్పకుండుటకును, కారణములను చెప్పినారుకారు.

ఉ:—ఇదిగో చెప్పుచున్నాము. వినుఁడు! అమృత శబ్దమునకు బ్రహ్మాత్మైక్య రూపమగు ముఖ్య-అమృతత్వమును-అర్థముగాఁ జెప్పినయెడల "హిరణ్మయేన" ఇత్యాదిమంత్రములచేత ద్వార-మార్గాదియాచనము కుదురదు. "బ్రహ్మవిదుఁడు-బ్రహ్మమే. అతని ప్రాణములు-ఉత్క్రమించునవి = అనఁగా, మీఁదికి వెడలునవి కావు. అతఁడిచ్చటనే బ్రహ్మస్వరూపుఁడగుచున్నాఁడు" అని శ్రుతియందుఁజెప్పబడియున్నది. కావుననే బ్రహ్మవిదునకు ద్వార మార్గాది యాచనము-ఉపపన్నముకాదు. విద్యాశబ్దముచేత-బ్రహ్మ విద్యను గ్రహించిన యెడలను గూడ, ద్వారమార్గాది యాచనము-అనుపపన్నమే యగును. కావుననే - ఇచట చెప్పఁబడిన అమృతత్వము-ఆపేక్షికమే కాని ముఖ్యమగునది కాదనియు, "కర్మోపాసనలకేగాని, కర్మ-బ్రహ్మవిద్యలకు సముచ్చయము కలుగదు" అనియు, "ఇంతకుముందు మేము వ్యాఖ్యానించినదే సమీచీనమగు మంత్రార్థము" అనియు, చెప్పుచు ఉపరమించుచున్నాము—

["కావుననే విద్యామృత శబ్దములకు ముఖ్యార్థబాధవలన-"గౌణార్థగ్రహణమే-ఇచ్చట యుక్తమగును. వేఱొక యర్థము-సంగతము కానేరదు" అని శంకర భగవత్పాదుల భావము.]

ఓం నమో భగవతే రమణాయ.

శ్రీ కూరనారాయణముని వ్యాఖ్యాసహిత-విశిష్టాద్వైతభాష్య సంగ్రహము :— "అగ్ని" అను శబ్దముచేత నిచట చెప్పఁబడు చున్నవాఁడు-భగవంతుఁడే. కావున-అగ్నియగు పరమాత్మను-ఇష్ట ప్రాప్తికొఱకును-అనిష్ట నివృత్తికొఱకును-ప్రార్థించుచున్నాఁడు.

"యస్యాగ్నిశ్శరీరమ్" "ఎవనికి-అగ్ని-శరీరమో" అని అంతర్యామి బ్రాహ్మణము చెప్పుటవలన-పరమాత్మ-అగ్నియే-శరీరముగాఁగలవాఁడగుచున్నాఁడు. కావున మంత్రార్థము విశ్లేషింపఁగు నది.

అగ్నే! = అగ్నిశరీరక! లేక అగ్రనయనాది గుణయుక్త! సుపథా = ప్రతిషేధ కర్మయొక్క స్పర్శలేనిదగు యజ్ఞముచేయించుట, వేదము నేర్పుట, మొదలగు ఉపాయముచేత-రాయే = విద్యకొఱకు శరీరమును రక్షించుటకును, నిన్ను పూజించుటకును, తగిన ధనముకొఱకు-లేక-అలౌకికమగు జ్ఞాన ధనముకొఱకు-అస్మాన్ = మమ్ములను నయ = ప్రవర్తింపఁజేయుము.

అథవా, సుపథా = అర్చిరాదిమార్గముచేత-అగ్ని-పగలు-శుక్ల పక్షము-ఉత్తరాయణము-సంవత్సరము-వాయువు-సూర్యుఁడు - చంద్రుఁడు-విద్యుల్లోకపురుషుఁడు-వరుణుఁడు-ఇంద్రుఁడు - ప్రజాపతి-అను ఆతివాహిక పురుషుల ద్వారమున, రాయే = అలౌకిక సుస్థిరధన స్వరూపుఁడవును, పరమాత్మవును, అగు నిన్ను పొందుట కొఱకు-అస్మాన్ = వేరొక భావముగాని, ప్రయోజనముగాని, గతిగాని, లేని మమ్ములను-నయ = పొందింపుము.

దేవ! = విచిత్రమగు జగత్తును సృజించుట-విలువుట-సంహరించుట-ఆజగత్తులోపల ప్రవేశించుట-నియమించుట-స్వాశ్రితులను బంధమునుండి విడిపించుట-మొదలగు క్రీడలతోఁగూడిన వాఁడా!

విశ్వాని-వయునాని = ఆయాపురుషుల యోగ్యతకు తగిన చతుర్విధ పురుషార్థోపాయముల నన్నిటిని, విద్వాన్ = తెలిసిన

వాఁడవగు నీవు-అవిద్యాంసములమగు మమ్ము తీసికొని వెళ్లుటకు సమర్థుఁడవై యున్నావు. జుహురాణమ్=కుటిలమగు-అనఁగా బంధ నాత్మకమగు, లేక-బాధించునదియగు, ఏనః=చేయరాని దానిని చేయుట - చేయవలసిన దానిని చేయకుండుట - అనుపాపమును, అస్మత్=మానుండి, యుయోధి=వేరుచేయుము. భూయిష్ఠామ్-తే-నమఉక్తి మ్-విధేమ= "నీకంటె వేరొకగతిలేదు" ఇత్యాది(గా) గుణములచేతను, ఆవృత్తి చేతను-నీకొఱకు అధికమైన, నమస్కార వాక్యముమ చేయుదుము. "మేము నీకొఱకు మానసికము-కాయి కము-అగు నమస్కారమును గావింపకున్నను నమశ్శబ్దమాత్రము చేతనే మమ్మనుగ్రహింపుము" అని "నమఉక్తిమ్" అనుచోనున్న ఉక్తిశబ్దముయొక్క అభిప్రాయము నెఱుంగునది.

విశిష్టాద్వైతపరమగు శ్రీ రంగాచార్యభాష్య సంగ్రహము :—

ఈ మంత్రమును కాణ్వులు పదునెనిమిదవ దానినిగాను, మాధ్యందినులు పదునారవ దానినిగాను పఠించుచున్నారు.

అగ్నే=అగ్నిశరీరక! స్వరూప-సత్తా-స్వభావ-ప్రయోజక మగు అపృథక్ సిద్ధసంబంధముచేత-అగ్ని విశిష్టుఁడవగు భగవం తుఁడా!

"యోఽగ్నౌతిష్ఠన్నగ్నేరన్తరో, యమగ్నిర్న వేద, యస్యాగ్ని శ్శరీరమ్, యోఽగ్నిమన్తరోయమయత్యేషతే అన్తర్యామ్యమృ తః." బృ-౫-7-౫.

అనునంతర్యామి బ్రాహ్మణమువలన-భగవంతుఁడు-అగ్ని శరీరముగాఁగలవాఁడని తెలియుచున్నది. కావున అగ్నికూడ భగ వంతునికి శరీరమగుచున్నది.

అర్చిరాది మార్గమున-అగ్నియే-ప్రథమ-అతివాహికుఁడు. కావున-అగ్నిద్వారమున-తనను తీసికొని వెళ్లవలసినదని విజ్ఞాప నము చేయుటకు భగవంతుఁడిట్లు సంబోధింపఁబడియెనని తెలియు నది. భోగైశ్వర్యము-ధూమాదిమార్గముచేత పొందింపఁబడును. కైవల్యము-ఐశ్వర్య రూపముకాదు. కావున అర్చిరాది మార్గము

చేత పొందింపఁదగిన "భగవత్ప్రాప్తి" అను ధనము-పరమ పురుషార్థ రూపమగు ముక్త్యైశ్వర్యమే యగును.

ద్వైతభాష్యము :—

అంగమును అనఁగా దేహమును నడపుటవలన-అగ్నిశబ్ద వాచ్యుఁడవై, అగ్నియందు విద్యమానుఁడవగు పరమాత్మా! మమ్ములను మంచి మార్గముచేత - మోక్షధనముకొఱకు-తీసికొనిపొమ్ము. ఓ పరమాత్మా! సంపూర్ణములైన జ్ఞానములను తెలిసిన నీవు మమ్ములను-అల్పులనుగాఁజేయుచున్న పాపమును మానుండి విడిపింపుము. మేము-నీకొఱకు "నమస్కారము" అను వాక్యమును చేయుదుము. ("నమస్కారము" అని పలుకుదుము)

పూర్ణశక్తి చిదానన్ద శ్రీ తేజః స్పష్టమూర్తయే
మహాత్మ్యధిక మిత్రాయ నమోనారాయణాయతే॥

ఇది-శ్రీ మన్మధ్వభాష్యమునందు, పరమంగళ చరణ శ్లోకము.

స్వాభిప్రాయము :—

[ఏతన్మంత్ర విషయమున త్రిమతములకునుగల ఏకత్వ-వైలక్షణ్యములు] మీఁది మంత్రముయొక్క అర్థమును-ఆయా మతములిట్లు చెప్పుచున్నవి.

అద్వైతము :— మార్గయాచనము కావింపఁబడుచున్నది. అగ్నిదేవత-ప్రార్థింపఁబడుచున్నాఁడు. అర్చిరాది మార్గముచేత-దేవలోకప్రాప్తి, లేక హిరణ్యగర్భాదిలోకప్రాప్తి, కలుగును. ముఖ్యమగు మోక్షము-అనఁగా; బ్రహ్మైక్యము కలుగునది కాదు.

విశిష్టాద్వైతము :— మార్గము-యాచింపఁబడుచున్నది. అగ్నిశరీరకుఁడగు పరమాత్మ-ప్రార్థింపఁబడుచున్నాఁడు-అర్చిరాది మార్గముచేత-పరమాత్మ ప్రాప్తి కలుగును-ఇదియే ముఖ్యమగు అమృతత్వము.

ద్వైతము :— మార్గము యాచింపఁబడుచున్నది. అగ్నియందున్న పరమాత్మ-ప్రార్థింపఁబడుచున్నాఁడు. ఈ మార్గముచేత మోక్షము లభించును.

బృహదారణ్యకమునందుఁగూడ-దేవతాది విజ్ఞానమగు ఉపా
సన నాశ్రయించిన ఉపాసకులకు ఈ మంత్రములచేతనే మార్గ
సూచనము వినఁబడుచున్నది. కావున - హిరణ్మయేన - అను
మంత్రమునుండి-అగ్నే, అను పీమంత్రమువఱకుగల మంత్ర
ములు-మార్గయాచనమునందే ప్రవర్తించు చున్నవని చెప్ప
నగును. ప్రార్థన సౌనర్ధ్యవియగు ఈ మంత్రములు-ఈశా
వాస్యోపనిషత్తునందున్నట్లే - బృహదారణ్యకోపనిషత్తునందుఁగూడ
నున్నవి. ఉపాసకులగు భక్తులు-మరణకాలమునందు-మీది మం
త్రములను - అర్థయుక్తములుగా భావించి-ధ్యానింప వలయును.
"ఈశావాస్య మిదం సర్వమ్" అను విజ్ఞానముయొక్క అను భూతి
రూపుఁడగు బ్రహ్మవేత్తకు-ఉపాస్యమగు దేవత-లేదు.

ఉపాసకుఁడు - ఉపాస్యము-ఉపాసనము - అను త్రిపుటి-
ఉపాసకుఁడగు జీవునకును-ఉపాస్యమగు దేవతకును భేదమున్న
ప్పుడు మాత్రమే సిద్ధించును. అభేద విజ్ఞాన రూపమగు అద్వైత
స్థితియందు - విగళిత వేద్యాంతరమగు - ఆనందమేయగు - అను
భూతియే యగు - ఆత్మకు - ప్రార్థింపఁదగిన వస్తువు లేదు.
"జీవుఁడు-జగత్తు-పరమాత్మ-అను వానితత్త్వములను - ఈసర్వ
మతములను విచారించి-నిరూపించుచున్నవి. చిదచిదీశ్వరత్రయ-
విచారణ-నిరూపణ-స్థితి "అహమ్" (నేను) అను తలంపు కలుగు
చుండునంతవఱకే-కలుగుచుండును. పూర్ణమును-అద్వితీయమును-
సత్యమును-జ్ఞానమును-ఆనందమును-అగు అఖండ భూమ స్వరూ
పమునందు విగళితాహంకారుఁడగు బ్రహ్మ విష్ఠునకు-కర్తవ్య
ముండదు" అని భగవంతుఁడగు అస్మద్గురుదేవుఁడు రమణమహర్షి-
ప్రవచనమును స్మరించుచు-ఈ యంశమును-విరమింతును.

ఓమ్—తత్—సత్.

స్వాళిపాప్రియమునందు-పరిశిష్టము :—

ఉపనిషత్తులందు, జీవులకు-గమ్యములగు మార్గములు 4 తెలుపఁబడినవి. అవి యేవనిన :— (1) ధూమాదిమార్గము, (2) అర్చిరాది మార్గము, (3) బ్రహ్మైక్యము. (ఇది మార్గము కాదు. బ్రహ్మైక్యమునొందిన పురుషుని ప్రాణములకు-ఉత్క్రమణములేదు), (4) లోకాంతర గమనములేని అధోమార్గము అనునవి.

(1) ధూమాదిమార్గమున గమనాగమనములు :— కేవల కర్మనిష్ఠులగు జీవులు-మొదట-ధూమాభిమాని దేవతా స్థానమున కభిముఖులై - అందుఁబ్రవేశింతురు. అధూమాభిమాని దేవతా స్థానమునుండి రాత్రివి - రాత్రినుండి కృష్ణపక్షాభిమాని దేవతా స్థానమును బొందుదురు. దానినుండి-దక్షిణాయన దేవతాస్థానమును పొంది-తత్సారూప్యము నొందుదురు. అక్కడినుండి-వీరు సంవత్సరాభిమాని దేవతాలోకమునకు వెళ్లరు. కర్మాధికారులగు వీరు-దక్షిణాయన దేవతా సహాయముచేత పితృలోకము నొంది-పితృదేవతలగుదురు. అక్కడినుండి ఆకాశమునుబొంది-అక్కడినుండి చంద్రలోకమునందుఁబ్రవేశింతురు. అచ్చట సోమశరీరులై యుండి సుకృత ఫలము ననుభవించెదరు. ఆసుకృతఫలము-క్షయించిన తరువాత-వారికిఁగల సోమశరీరము ద్రవీభవించును. అప్పుడు వారి సూక్ష్మశరీరము-చంద్రలోకమునందు లభించిన సోమశరీరమును విడిచి-పునర్జన్మము కొఱకు పూర్వమార్గముచేత ఆకాశమునందుఁ బ్రవేశించును. ఆకాశశరీరుఁడగు జీవుఁడు-వాయులోకమునందుచేరి వాయుశరీరుఁడగును. ఆ వాయు స్వరూపమే-ధూమ రూపముగా పరిణామము నొందును. ఆ ధూమరూపమ్మే-జలమును ధరించెడి అభ్రరూపముగా నగును. ఆ యభ్రమే - మేఘమగును. మేఘరూపుఁడగు జీవుఁడు-వర్షరూపమున భూమియందుఁబ్రవేశించును. భూమియందుచేరిన జీవుఁడు-ప్రాక్తన కర్మవాసనల ననుసరించి-ధాన్య విశేష రూపమునొంది - అన్నమై-ఒకానొక జంతువుచేత

భక్షింపఁబడి-ఆ జంతువునందు-రేతస్సగును. తదుపరి, ఆజంతువు-ఆరేతస్సును-స్త్రీ గర్భమునందు విడుచును. అప్పుడీ జీవుఁడు జనకుఁడగు ప్రాణియొక్క శరీరముతో సమానమగు ఆకారము గల శరీరము గలవాఁడగుచుండును. అజ్ఞులగు ప్రాణులు-ఆశరీర మునే "ప్రాణి" అని తలంచుచుందురు. ఇట్లు 1ద్యు, 2పర్జన్య, 3పృథివీ, 4పురుష, 5యోషిద్, ద్వారమున జీవునకు జన్మము కలుగుచుండును. బృహదారణ్యకము నందును, ఛాందోగ్యము నందును, ఈ ద్యు-పర్జన-పృథివీ-పురుష-యోషిత్తులు-అయిదును, పంచాగ్నులుగా చెప్పఁబడినవి. "పంచాగ్ని విద్య" అను నుపాసనయందు నిరూపింపఁబడిన యీ రహస్య విషయమును ప్రపంచము నందలి విజ్ఞానులు - ఈ యుపనిషత్తుల వలననే మొదట-తెలియఁగలిగిరి. విశేషించి తెలియఁగోరువారు-ఛాందోగ్యోపనిషత్తు నందలి పంచమాధ్యాయమును పరిశీలించునది. ఈ యంశమును నవీన శాస్త్రజ్ఞులు కూడ-సిద్ధాంతీకరించియే యున్నారు.

-: 2 అర్చిరాది మార్గమున గమనాగమనములు (రాకపోకలు) :-

"సగుణ బ్రహ్మోపాసకులు-లింగశరీరముతోఁగూడుకొని-అగ్నిలోకమునందుఁబ్రవేశింతురు. అగ్నిలోకమునందుఁబ్రవేశించిన జీవులు-అర్చిస్స్వరూపులై యుందురు. తరువాత-వారు-అహరభిమాని దేవతా స్థానమునొంది, తత్స్వరూపులగుదురు. అచ్చటినుండి వారు - శుక్లపక్షాభిమాని దేవతా స్థానమునొంది-అక్కడనుండి-ఉత్తరాయణమాసముల నొందుదురు. ఆమాసములనుండి-సంవత్సరాభిమాని దేవతా స్థానము నొందుదురు. దానినుండి-దేవలోకము నొంది, దేవతలగుదురు. దేవలోకమునుండి-వాయులోకమునొంది దానినుండి-ఆదిత్యలోకమునొంది-ఆదిత్యునికి సమానమగురూపము గలవారగుచుందురు. పిమ్మట-ఆదిత్య లోకాభిమానినుండి-చంద్రలోకమును, చంద్రలోకాభిమాని సహాయమున నటనుండి విద్యుల్లోకమును, బొందుదురు, అచ్చట నీజీవులు-విద్యుదభిమాని దేవతతో సమానమగురూపము గలవారగుచుందురు-హిరణ్యగర్భునికి సమాన

[ధూమ్రాది మార్గమున] సామాన్య కర్మఫలమును పితృలోకము నందును, శుక్ల[illegible]ముచే, చంద్రలోకమునందును, అనుభవించును. [అర్చిరాది] మార్గమున-స్వర్గము నొందును.] దుష్కర్మజ్ఞాది [illegible] పునర్జన్మ-కలుగును. "పంచాగ్నివిద్య" అను [illegible] యంశమును పరిశీలించునది.

బృహ-6అ-2బ్రా.]

(2) (నిష్కామ) కర్మయోగి :— 1 ఫలాసక్తిరహితుఁడు, 2 సత్కర్మల నొనర్చును, 3 అర్చిరాది మార్గములేక బ్రహ్మైక్యము, 4 సాధకుఁడగు కర్మయోగి చిత్తశుద్ధి నొందును, అతఁడు పుణ్యలోకము నొంది-శుచులగు వారియింటఁగాని, శ్రీమంతుల యింటఁగాని, జన్మించును. జ్ఞాన సిద్ధుఁడగు కర్మయోగి (సర్వత్యాగి) జీవన్ముక్తి-విదేహముక్తులనొందును.

(3) కర్మ - ఉపాసన - సముచ్చయకర్త :— 1 భక్తుఁడు 2 సత్కర్మను-దేవతాజ్ఞానమును గలిగియుండును. 3 అర్చిరాది మార్గము, 4 దేవలోకమునుగాని, విరాట్పురుష సంబంధి లోకములనుగాని, బ్రహ్మ లోకమునుగాని, ప్రకృతి లయమునుగాని, పొందును. ఫలాసక్తునకు పునరావృత్తి కలుగును. ఫలాసక్తి రహితునకు పునరావృత్తి కలుగదు; క్రమముక్తి కలుగును.

[సకామ కర్మకును - ఆత్మ జ్ఞానమునకును - సముచ్చయము సంభవింపదు. క్రిందను జ్ఞాన శబ్దముచేత-పరోక్షజ్ఞానము అనఁగా, వేదాంత వాక్యార్థ మాత్రజ్ఞానము-గ్రహింపఁబడినదని పాఠకులు గ్రహింపఁగోరెదను.]

(4) కర్మజ్ఞాన-సముచ్చయకర్త:— 1 ఫలాసక్తి యుక్తుఁడు 2 సత్ కర్మలనొనర్చును, వేదాంతవిద్య నభ్యసించును, 3.అర్చిరాది మార్గము, 4 పుణ్యలోకముల నొందును. యోగ భ్రష్టుఁడగు వితఁడు పుణ్యానుభవమొందిన పిమ్మట-సత్కులమునందుజన్మించి-చిత్తశుద్ధినొంది - ఫలాసక్తిని వీడి - వేదాంత విచార-ధ్యాన-పరాయణుఁడై తరువాతి జన్మములందు ముక్తి నొందును.

(5) వైరాగ్యసన్యాసి :— 1 ఫలవిరక్తుఁడు, 2 సర్వమును త్యజించును, కాని తన్ను (ఆత్మను) తెలిసికొనఁడు, 3 ప్రకృతి యందు లయించును. (బ్రహ్మైక్యమువలె-ఇదికూడ-మార్గముకాదు) 4 శూన్య స్వరూపునివలె సుఖ దుఃఖ రహితుఁడై యుండును. కల్పాదియందు తిరుగ జన్మించును. అసంభూతియగు ప్రకృతి నుపాసించు బౌద్ధాదులుకూడ ప్రకృతిలయులగుదురని తెలియునది.

(6) వివిదిషాసన్యాసి :— సాధకుఁడు, 2 సర్వమును సన్యసించి-శ్రవణ-మనన-ధ్యానములనొనర్చును. 3 యోగాభ్యాసము చేత-బ్రహ్మరంధ్రద్వారమున ప్రాణములను విడుచును. 4 అర్చిరాది మార్గముచేత-బ్రహ్మలోకమునకు వెళ్లును. ఇందు సిద్ధుఁడగు వతఁడు జీవన్ముక్తి-విదేహ ముక్తులనొందును. (ఇందు వేదాంత జ్ఞానముగాని, విరాగముగాని, యోగాభ్యాసముగాని, లేనిసన్యాసి-అధోగతి నొందును. "తలలు బోడులైన తలఁపులు బోడులా?" అని వేషధారియగు సన్యాసి-నిందింపఁబడునుగదా।)

(7) విద్వత్సన్యాసి :— 1 కాయిక, మానసిక భోగ-త్యాగయుక్తుఁడు, 2 ఆత్మ సాక్షాత్కారము నొందిన పిమ్మట-విశ్రాంతికొఱకును, జీవన్ముక్తి సుఖముకొఱకును, వాసనా నాశము కొఱకును, సర్వమును సన్యసించి-బ్రహ్మనిష్ఠ యందుండును. 3 మార్గగమనము లేదు-ఇతని ప్రాణాదులిచ్చటనే బ్రహ్మము నందు లయించును, 4 జీవన్ముక్తి-విదేహముక్తులు కలుగును-విధి-విషేధములులేవు.

(8) జీవన్ముక్తుఁడు :— 1 సర్వత్యాగ యుక్తుఁడు, 2 బ్రహ్మ చర్యాదులగు నాశ్రమములయందు దేని యందున్నట్లు కన్పించినను అతఁడా యాశ్రమమునందున్నవాఁడుకాక, బ్రహ్మము నందే యుండును. 3 మార్గగమనములేదు, బ్రహ్మ విదుఁడగు నితఁడు బ్రహ్మమే యగుచున్నాడు, 4 విదేహముక్తి కలుగును. విధి విషేధములు లేవు.

[బ్రహ్మనిష్ఠులగు-విద్వత్సన్యాసికిని, సర్వత్యాగయుక్తుఁ

డగు జీవన్ముక్తునికిని, విధి-నిషేధములులేవు, తదితరులకు విధి-నిషేధములున్నవి.]

వివేదనము :— కేవల కర్మనిష్ఠులయొక్కయు, ఉపాసకులయొక్కయు, ప్రాణములవలె అకాముఁడు-నిష్కాముఁడు-ఆప్తకాముఁడు-ఆత్మకాముఁడు, అగు బ్రహ్మనిష్ఠునియొక్క-ప్రాణములు-లోకాంతరములకు వెడలునవికావు. బ్రహ్మస్వరూపుఁడగు నతఁడిచ్చటనే బ్రహ్మమునొంది-జీవన్ముక్తుఁడగు బ్రాహ్మణుఁడగుచున్నాఁడు.

[బ్రహ్మము నొందినవాఁడువలె నగుచున్నాడు.]

బ్రహ్మవిదులగు బ్రాహ్మణుల-జీవించియుండఁగానే పంచకోశములనుండియు విడిపింపఁబడి - ప్రారబ్ధ శరీరము-పతనము నొందునపుడు ముఖ్యమగు విదేహమోక్షము నొందుచున్నారు. తదితరుల-విద్యా-కర్మలను, పూర్వప్రజ్ఞనుగూడ - తమతోఁగొని పోవుచున్నారు. ఈ యంశములను సమగ్రముగాఁదెలియఁగోరిన జిజ్ఞాసువుల-బృహదారణ్యకోపనిషత్తునందలి చతుర్థ బ్రాహ్మణము నందుఁగల 1వ మంత్రమునుండి "తమేవధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః" "ఆత్మనే విశేషముగాఁదెలిసి-ధీరుఁడగు బ్రాహ్మణుఁడు-బ్రహ్మనిష్ఠుడై యుండునది."

"వివిధములగు శబ్దములను (శాస్త్రములను, కళలను) అభ్యసింపఁగూడదు. అట్లభ్యసించుట వాక్కునకు శ్రమను గలిగించుటయేగాని, ప్రయోజనకంతముకాదు" అను 23వ మంత్రము వఱకునుగల పరమార్థమును పరిశీలించునది. పరమాత్మను సూక్ష్మమగు మనస్సుచేతనే చూడవలయును-పరబ్రహ్మమునందు-భేదమును చూచువానికి మరణమునుండి మరణము కల్గును. కావున విజ్ఞాని "ఈశావాస్యమిదంసర్వమ్" అను అభేదజ్ఞానమునే-శమాది సాధనములచేత - అనుసంధింప వలయును. కావున-బుద్ధిమంతులగు మానవులు-దారపుత్రాదులను విడిచి, కాషాయాంబరాది సన్యాసి చిహ్నములను ధరించి-దురాచారముల నొనర్చుచు-వ్యర్థ

ముగా కాలమును గడుపక విశ్వసించి-వరించి-వేదాంతములచేత-అనఁగా ఉపనిషత్తుల చేతను, ఉపనిషద్ బ్రహ్మవిదుఁడగు ఆచార్యుని సదుపదేశముచేతను, సంపూర్ణఁగు తత్త్వార్థమును చిరకాలము సేవించి-వినిన యర్థమును-యుక్తులచేత విచారించి-ధరించి-లెస్సగా ధ్యానించి-అనాయాస లభ్యమును, నిరంతరమును, అగు నిర్వికల్పసమాధియందు-సచ్చిదానంద బ్రహ్మ సాక్షాత్కారము నొంది-మనుష్యజన్మమును సార్థక మొనర్చు కొనవలయును. ఈ ముఖ్యమార్గము ననుసరింపఁజాలని వ్యక్తులు - తమ తమ, అధి కారము ననుసరించి-మీఁది పట్టికయందు తెలుపఁబడిన మార్గము లలో-తమకు తగినమార్గము ననుసరించి-గమ్యస్థానము నొంద వలయును.

శ్రీరమణ భగవానునిచేత ప్రవచింపఁబడిన ఉపదేశ సారమునందలి క్రింది గేయము నుదాహరించుచు-ఈ యంశమును ముగింతును.

"భేద భావనాత్ సోఽహమిత్య సౌ
భావనాఽభిదా పావనీ మతా"

హరిః-ఓమ్-పూర్ణమదః..............పూర్ణమేవావ శిష్యతే-

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

గద్యము :— ఇది-శ్రీమహర్షి, భగవద్, రమణాంతే వాసి-తదుపదిష్టాక్షరోపాసక, శ్రీమదన్న పూర్ణాంబికా, శ్రీ వేంకట రామమూర్తి బుధవరేణ్య, ద్వితీయ తనూజ—సాహిత్య విద్యో భయ భాషా ప్రవీణ, కవిశేఖర. పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి—

విరచిత :— (1) ఆంధ్రపద్యానువాద, (2) త్రిమతసంబంధి వివిధ భాష్య-వ్యాఖ్యార్థ, (3) తద్విమర్శనసమ్మిళిత-స్వాభి ప్రాయ రూప-తత్త్వార్థ ప్రదర్శనీ వ్యాఖ్యాన-సంకలితమును, శుక్లయజుర్వేద స్థిత-వాజసనేయ సంహితాంతర్గతమును, అగు ఈశావాస్యోపనిషత్తు.

ఓమ్—తత్—సత్,

శ్రీరామ చంద్రార్పితమస్తు.

VEMANA

## సవరణలు :—

| తప్పు | ఒప్పు | పేజీ | పంక్తి |
|---|---|---|---|
| ([illegible]క్తమ్మకాని) | (జ్ఞానయుక్తముకాని) | 21 | 26 |
| [illegible]క్తమగు | జ్ఞాన సహితమగు | 21 | 27 |
| [illegible] కర్మవిషయము | సముచ్చితకర్మవిషయము | 21 | 30 |
| వైదిక కర్మయు | సముచ్చితకర్మయుఁ | 21 | 31 |
| రుచిలోఁ | రుచితోఁ | 38 | 24 |
| యుపనిషతు | యుపనిషత్తు | 40 | 21 |
| అహింసాది | హింసాది | 42 | 13 |
| ప్రశ్న | ఉత్తరము | 43 | 24 |
| గర్వుఁడను | గర్వుఁడను | 51 | 25 |
| తెసి | తెలిసి | 69 | 7 |
| పాఠాంతములు గూడ నున్నవి | పాఠాంతరము గూడ నున్నది. | 70 | 11 |
| సర్వలోకమును | (2) సర్వలోకమును | 77 | 5 |
| కుండ | (3) కుండ | 77 | 12 |
| యాధాతథ్యంబుగ | యాథాతథ్యంబుగ | 78 | 12 |
| శరీరాత్మ | శరీరము-ఆత్మ | 79 | 19 |
| సీర్వరు | సీశ్వరు | 80 | 6 |
| విదురమగు | విధురమగు | 84 | 1 |
| అత్యాశ్రమములను | అత్యాశ్రిములని | 89 | 16 |
| ఆమూనం | ఆయూసం | 140 | 9 |
| పాదములు-బాహువులు-శిరస్సు | శిరస్సు-బాహువులు-పాదములు— | 140 | 28 |
| నంగీకరించును | నంగీకరించును. | 144 | 14 |

శ్రీ వేదవ్యాస ప్రెస్ — విజయనగరము — 1958.